శోభన భారతి
ఫాల్గుణము.

సంపుటము-30
సంచిక-3.



నందన
ఫాల్గునము

భారతి

సంపుటము 30
సంచిక 3

ద్వైరాజ్యము

శ్రీ దిగుమర్తి సీతారామస్వామి

★

సనత్కుమారుడు

అలసిన మ్రోళ్లు నీరవములైన కులాయము లాఃతత్సలా
శలులన ఘూర్ణిత ప్రచుర శైశిర వాయువులై హిమాగమా
కుంజవన వీధులొప్ప గరకున్నెరతుమ్మల సంజ నీడలన్
బలికెడు నూరు పిచ్చుకలు పాటలుగా జలిరేపి కీరుతుల్

ఆకురాల్చిన మ్రోడుల నాకసమ్ము
జూపు హేమంతమే ముముక్షువుల ఋతువు
పాయ విచ్చిన యేటిశిప్పల సమాధి
పరుల పదధూళి దలదాల్చి బ్రతుకు గనుము!

విరహిత గమ్యమా విషయ వృత్త పథమ్మునయందు తృష్ణయున్
జరయును దోడుగాగ పయనంబొనరింపగ నేల—అస్థిరం

జరములు విశ్రమించెడి శ్మశానములందు శివారవ శ్రవో
జ్వరకర చూళికా శ్రుతి బిశాచికలాడగ మృత్యువించునో?

పురూరవుడు

ఊర్ధ్వమూల మధశ్శాఖ ముపనిషత్తులందు వినిపించు సంసార మందగించి
నట్లు విజ్ఞానమునసాగి యవనిదాకు నట్టి గెడ్డాలతబిసికి స్వాగతమ్ము!
తరుణ రక్తికి వస్తు సౌందర్యమునకు పాయరానట్టి జీవత్ ప్రపంచమందు
చావు కైపును గ్రొత్త యుత్సాహ మొసగు నలసరతివేళ దంతక్షతార్ద్రిమగుచు
ఆకు రాలిచినంత నేమాయె వెంటనంటి నన లెత్తు చివురుల నాగరాదు—
విషయముల కేది గమ్యమో ఋషులు నేటి తిప్పలం దంగనలకడ దెలిసికొనిరి.

ఉపనిషత్తుల మానవు నుద్ధరింప ఋషులు సూపిన మార్గముల్ కృత్రిమములు
అపునరుక్తచిచుంబిప నలముకొనెడు తరుణి కన్నుల సుగమ సత్యముస్ఫురించు॥

చైత్రవనమందు నన్నివృక్షములు పూయ నన్ని పుల్గులు పాడవు నటులె మేన
జవులు పండవు నిండిన జడులకంచు మధు వినోదములే వాడు మానుకొనును!

పేద పరచిన శుష్క నిర్వేద కళల దాపసులు వ్రాసినట్టి గ్రంథముల కన్న
నచ్చరలతోడి గార్హస్థ్య మధికరించు వారిగాథలు నగ్నతత్త్వము దిశించు॥

సూక్త దర్శన మహిమకే సొగసిపోక రమణులందును దమమూర్తి ప్రతిఫలింప
గరగి గర్వించు శ్యావాశ్వ కౌశికాదిరసిక ఋషులకు హృదయ పూర్వకనమస్సు!



లాలిపాటలు - మేలుకొలుపులు

★

"కృష్ణశ్రీ"

నిద్రపోవడమూ, మేలుకోవడమూ అన్నవి మన జీవితంలో అతి సరళములైన క్రియలు. వీటి చుట్టూ అలిసిన గేయాలే లాలిపాటలూ, మేలుకొలుపులూను. లాలిపాటలూ, జోలపాటలూ శిశువులనుద్దేశించి వారికోసము పాడేపాటలు. 'అనాగరకు'లైన కొండజాతుల దగ్గరనుంచి 'మహానాగరకు'లైన ఆంగ్లేయులవరకూ లాలిపాటలు వాడుకలో నున్నవి. కనుక వీటిశక్తి సార్వజనీనమని తెలుస్తుంది. సాహిత్యార్థము సెంతమాత్రమూ ఎరగని లేతశిశువుల నుద్దేశించుటనుబట్టి గేయవాఙ్మయ నిశ్రేణిలో లాలిపాటలూ, జోలపాటలూ మొదటిమెట్టు కావలెను, అయినవి కూడాను. వీటిలో సాహిత్యార్థము గౌణము. సంగీతమూ, చివ్వరి స్వరాలు మాత్రమే ప్రధానము. ఈపాటలు బిడ్డలకు విశ్రాంతి నివ్వడానికి నిర్మించినవి కనుక శ్రుతి లలితములగు మాటలనే వీటిలో ఉపయోగిస్తారు.

'లాలి' 'జోల'అనే మాటల్ని గమనిస్తే 'లాలి' పాటలు ఏడుస్తున్న బిడ్డల్ని లాలించడానికీ, 'జోల' పాటలు పసిబిడ్డల్ని నిద్రకి జోకొట్టడానికీ పాడతారేమోనని అనుమానము కలుగుతుంది. కాని దీనిని నమ్మడానికి ఇంతకంటె ఎక్కువ సాక్ష్యము లేదేమో. నాకు చూడగా లాలిపాటలే నిద్రజోగొట్టడానికీ, జోలపాటలు తొట్టెలో బిడ్డనుంచి ఊపుతూ పదిమందీ ఉల్లాసముగా వినోదించడానికీ వాడతారేమో అనిపిస్తుంది. ఏమంటే, 'జోజో' అనే శబ్దాలకంటె 'లా' 'లీ' అనే శబ్దాలే మృదువైనవీ స్వరాలమాధుర్యాన్ని రెట్టించేవీని. ఇంగ్లీషులో కూడా 'లా', 'లీ', శబ్దాలే "లల్లబి"లలో వినబడతాయి. వీటి లాలిత్యాని కింతకంటె పెద్దసాక్ష్యమేమి కావాలీ? నిద్రజోగొట్టవలిసివప్పుడు 'జోజో'ల కంటె లాలిత్యము ఎక్కువగా కలిగిన 'లాలీ'లే ఎక్కువ ఉపయోగిస్తాయి. కనక 'లాలి' పాటలే నిద్ర జోకొట్టే పాటలనీ, 'జోల'పాటలు అన్ని విధాలా 'లాలి'పాటల లాగే వున్నా, బిడ్డల నిద్రకికంటె తల్లుల వినోదానికి పనికి వచ్చేవేననీ అభిప్రాయపడుతున్నాను.

ఈ అభిప్రాయాన్ని బలపరిచే సాక్ష్యము కూడా కొంత ఉంది చిత్తగించండి. జోలపాటల్ని, లాలిపాటల్ని పాడేటప్పుడు చరణము పూర్తికాగానే 'జో, జో' అనీ, 'లా, లీ' అనీ చివరవచ్చే అక్షర శబ్దాల్ని 'రీ' 'సా' అనే (శంకరాభరణ) స్వరాలతో చేర్చి, లాగి పాడతారు. స్వరం అన్నది (స్వతో రంజయతీతి స్వరం) ఏ ఒక్కటయినా తనంతట తానే రంజించగలదు. అయితే మరి ఈ 'రీ సా'లలో విశేష మేమిటి? అని ఆలోచిస్తే చిత్రమైన సంగతులు స్ఫురిస్తున్నాయి. సప్త స్వరాల్లో నూ 'స' అన్నది మొదటేదీ, వాటి కన్నిటికీ కారణమూను. 'స' నించి పై 'స' కి ఆరోహిస్తూన్నప్పుడు స్వరాలస్థాయి వరుసగా హెచ్చుతుంది. 'స' అన్నది శాంతంగా, కలతలేని నిద్రవలె, నదీ గర్భమున నావప్రయాణమువలె, నిశ్శబ్ద నిశీథమువలె, ప్రశాంతత్వమును ధ్వనిస్తుంది. 'రి', 'స' కంటె కొంచెము ఎత్తు; 'స' యొక్క ప్రశాంతత్వము పోయి, కలత ప్రారంభమైనది. 'గ' లో

కలత మరింత ఎక్కువౌతుంది. 'మ' తో మెలకువ వచ్చినట్లే 'ప' తో మెలకువ వస్తుంది. మళ్ళీ 'ధ' 'ని' లు మెలకువకంటె ఎక్కువ కలత కలిగిస్తూ పై 'స' దగ్గరకు వెళ్లేసరికి పూర్తిగా తెలివి వచ్చిన ప్రశాంతత్వము ఏర్పడుతుంది. ఈ ఊహ గగవకుసు మాన్వేషణము కాదు. పాట పాడేవారు సామాన్యంగా రాగాన్ని 'స' ప్రారంభించి 'సా'తోనే పూర్తి చేస్తారు. 'స' దగ్గరనుంచి మొదలుపెట్టి, తిరిగి 'స'కి చేరితేనేగాని సంతుష్టీ, కాంతీ చేకూరదు. ఇక లాలిపాటలవల్ల బిడ్డని నిద్ర జోకొట్టడమంటే 'స' యొక్క ప్రశాంతిని బిడ్డకి అందించడమే. దీనికి ఒకటేమార్గం, 'సా' అనే స్వరాన్నే జారుగా, నిరంతరంగా, నెమ్మదిగా వినిపించడమే. అయితే ఒక్క 'సా'నే పాడి వినిపించడమువల్ల ఈ పని జరగదు. అందుకే నవరోజు రాగముతో బిడ్డని నిమిరి, చరణము కొసని, 'లా'ని 'రీ'తో కలిపి కొంతసేపు నిలుపుతారు. ఈ స్వరం విన్నప్పుడు, బిడ్డల నరాలు చువ్వి సమంచేసినట్లై, దీని తరువాత 'లీ' అనే అక్షరంతో 'సా'ని విని తృప్తిపడి సళ్ళిపోతాయి. 'లాలీ' అనడంలో 'రీ,సా' స్వరాలు రెండూ బిడ్డని పదిలంగా నిద్రలోకి దింపయత్నిస్తాయి. ఇలాగ నాలుగైదు చరణాలు పాడేసరికి పసిబిడ్డ నరాలు ప్రశాంతమైన 'సా'తో మేళవించి నిద్రలో మునుగుతాయి. 'రీసా' అనే స్వరాలు 'జో,జో' అనే సమానాక్షర శబ్దాలతో కంటె 'లాలీ' అనే భేదాక్షర శబ్దాల్తో చక్కగా అమిరిపోతాయి. 'లా' లోని ఆకారందీర్ఘము, తనవలెనే కలతని ఇముడ్చుకున్న 'రీ'తోనూ, 'లీ'లోని ఇకారదీర్ఘము తనవలెనే ప్రశాంతమైన 'సా'తోనూ కలిసిపోతాయి. చూడండి దీనికి సాక్ష్యము. ఇది సీతమ్మకి లాలి.

నవరోజ రాగము - ఖండజాతి ఏకతాళము.

లాలిబం| గరుబొమ్మలాలిమా| య. మ్మ.
సా స పా| స స సా స| సా రి స స్థీ పా| ని స రి గా రి
లాలిము | ద్దుల సు. మ్మ | లాలిసీ. | త. మ్మా.
రీ గ మా | ప మ గ రి స | సా రి స ని | సని ని ద ప
—లాలీ
రీ సా.

మొదటిభాగములోని 'సససా'ల మెత్తని స్పర్శా, చివ్వరి 'రీ సా'ల లలిత అవరోహణమూ నరాలను సళ్లించడానికి చాలా సహాయకారులు కనక నే నిద్ర జో కొట్టడాని కుపయోగించేది 'లాలి' పాటలు మాత్రమే నేమో అన్నాను.

అయితే లాలిపాటలూ జోలపాటలూ కూడా పిల్లల్ని తొట్టిలో పెట్టి ఊచుతూపాడే వేమొత్తానికి. రెండింటికీ పోలికలున్నాయి. ప్రహ్లాద విజయమనే యక్షగానంలోని లాలి కరుణాపాంగ లాలిధవళాంగ లాలిశయనభుజంగ లాలిసత్సంగ — లాలీ
అనే లాలిపాట అన్నమాచార్యులవారి

✓'జో అచ్యుతానంద జోజో ముకుంద
రార పరమానంద రామగోవింద' జో. జో.

అనే జోలపాటలాగే అయిదేసి అక్షరాలుగల నాలుగు ఆవృత్తాలపాదాలతో నడుస్తూ నవరోజు రాగములోనే వుంది. వీటివరసలూ, రాగాలూ, పాడే రీతులూ ఒక్కటే అవడమువల్ల జోలలకీ, లాలిపాటలకీ అభేదమనే ఎంచి రెండింటినీ సమంగా వాడుతున్నా రనవచ్చును.

ఆనందభైరవి రాగములో కూడా లాలిపాటలున్నాయి. ఇవి 'శ్రీరంగ రంగరంగా, మా యన్న కావేటి రంగరంగా' అన్న పాట వరసలో వుంటాయి. చూడండి.

/ "లాలనుచు పాడరమ్మా,
ఈ బిడ్డ లక్ష్మీవిలాసుడమ్మా
పాదమున చక్రమమ్మా,
ఈ బిడ్డ వేదాంత వేద్యుడమ్మా
వేణువాదంబుతోను,
ఈ బిడ్డ వేదములు పాడునమ్మా."

ఇలాటి పాటల వరసని బట్టే "కస్తూరి రంగ రంగా" అన్న పాట కూడా జోలపాటగా పాడడము మొదలు పెట్టివుంటారు. ఆ అలవాటుకూడా ఉంది ఇప్పుడు.

శ్రీ రాగములో పాడే లాలిపాటలుకూడా వున్నాయి. శ్రీ ఇల్లిందల సరస్వతీదేవిగారు ఆనంద భైరవి, శ్రీ రాగాలలో జోలపాట లున్నాయని రాశారు. ఈ దినుసు నిచ్చినది శ్రీ రాగములోదే

శ్రీరాగం. చతురశ్ర జాతి ఏకతాళము

రా.మ| లా| లీ| మే.ఘ.| శ్యామ| లా...| లీ.| ..
పనపని| పరీ,| రీ;| గరిరీస| నిపా| గరిరిస| పని| పా;;||
రా మ| ర.స.| వయనా| దశరథ| తనయా| లా...|
లీ| ..||
రీరీ| గరిరిస| పనిపా| పనినిస| నిసనరి| గరిరిస| పా;|;;||

శ్రీరాగము కూడా చాలాకాలమునుంచీ వాడుకలో ఉండిఉంటుంది. ఏమంటే, పైన చెప్పిన ఆనందభైరవి రాగపు లాలిపాటనిబట్టి ఆనందభైరవి రాగపు కృష్ణజననపు పాటని కూడా ఆ పనికే ఉపయోగించినట్లే, ఈ శ్రీరాగపు పాటని పురస్కరించుకొని, శ్రీరాగములో పాడే ద్విపదల్ని ఎన్నటినో జోలపాటలుగా విశాఖమండలపు తల్లులు పాడుతున్నారు. ఇవి 'పాత పాటలు' అనే పేరుతో శ్రీ చేటమళ్ల కామేశ్వరరావుగారు తొలిసారి ప్రచురించారు. తరవాత భారతిలోనూ, గృహలక్ష్మి లోనూ ఈ పాటలు చాలా వచ్చాయి వీటికి జోజో అనిగాని, లాలీ అనిగాని వుండదు చివర.

ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రము వారు ప్రసారించిన పాటలో ఒకదానిలో

లాలిలో అమ్మాయి రాణిలాగుంది
లాలెమ్మ గుర్రాలు లంకల్ల మేసు
అమ్మాయి గుర్రాలు పల్లాలు మేసు.

అని వుంది. దీనినిబట్టి 'లాలి' అనేమాట ఉయ్యాలకి వాడడము పాత అలవాటే అని తెలుస్తోంది.

మన్నారు దాసవిలాసములో
"జో జో జో బాణాసురారి,
జో జో జో చాణూరవైరి
జో జో జో జగదాధార
జో జో జో నందకుమార"

అన్న జోలలున్నాయి. ఇవి భాగవతములోని—
'జో జో కమలదళేక్షణ
జో జో మృగరాజమధ్య జో జో కృష్ణా'

అన్న కందపద్యపు జోలలవలె చిహ్నమాత్రములేగాని వాడుకలోకి రావాలని ఉద్దేశించినవి కావనిపిస్తున్నది. ఇక పైన ఇచ్చిన ఉదాహరణాలన్నీ వాడుకలోని వా? అని అడిగితే అవీ కావు. కొన్ని నేటికీ పాడుతున్నారు, అవి లాలిపాటలే. యక్షగానాల్లోనించి ఉదాహరించినవి, అసలు లాలిపాటలకు కనీసము అనుకరణములేనా అవుతాయి. యక్షగానాలు అటుపండిత కవనాన్నీ, ఇటుజానపదకవనాన్నీ జోడించి రాణించిన రచనలు. వాటిలో వున్నాయి కనక లాలిపాటలు యక్షగానాలికి పూర్వంనుంచీ వాడుకలో ఉండి వుండాలని నిశ్చయం.

లాలిపాటలు కొన్ని ప్రశస్తిపాటలు

'ఫాలలోచన వీరభద్రావతారా
కాలకాలగిరీశ కంధి తూణీరా' అనీ,
'సామగాన లోలునకు చారుతిలకపాలునకును
మామక స్వాంత కమలధామ శేషాద్రిపతికి' అనీ,
'లాలిగరుడ తురంగలాలి ధిమిధింగా
లాలిపీతాసంగ లాలి వేదాంగా' అనీ,

నామకీర్తన చేస్తాయి; మరికొన్ని సేవలు. అవి
'యిరవుతోడ మంచుదువ్వి పైకిరా చేను
కర్పూరధూపాన పొగ కాపులేసేను' అనీ
'అందముగ జాంబవతి చందనము పుయ్యా
పొందుగా కాళింది పువ్వులందియ్యా' అనీ

సేవలను వర్ణిస్తాయి మరికొన్ని మహత్తులు:
'శ్రీవిల్లిపుత్తూర నావిర్భవించీ
భావములరంగ తిరుప్పావు రచియించీ'

అని లీలను వర్ణిస్తాయి. కృష్ణజననము ఇలాంటిదే. వీటిలో చూచాయగా జీవితఘట్టాలు బింబిస్తూ ఉంటాయి. జోలలు కూడా సరిగ్గా ఇలాంటివే. 'తొలుత బ్రహ్మాండంబు తొట్టి గావించీ' అనే పాటలో సేవలూ, 'సుదతి దేవకీదేవి సుతుడవై పుట్టీ, వదలకను కంసుని వడివి మెడబట్టి' అన్నే పాటలో లీలలూ కనబడతాయి. స్తోత్రాలు 'జో అచ్యుతానంద జోజో ముకుందా' అనీ, 'జో దేవకీ తనయ జో రమా హృదయ' అనీ ఈ రెండు రకాల పాటల్లోనూ వున్నాయి.

మేలుకొలుపులు

లాలిపాటలకీ మేలుకొలుపులకీ సామ్యమూ వుందీ, భేదమూ వుంది. అవి నిద్ర జోకొట్టడానికైతే ఇవి నిద్ర లేవగొట్టడానికి. అవి క్రింది వడ్డ

మును తరుచు వినిపిస్తూ చివ్వరి 'లాలీ'లలో 'రీసా'లను వినిపించి వరాలను నిద్రలోకి అవరోహింపజేస్తే, ఇవి 'మేలుకో' అన్న చివ్వరమాటతో ఆరోహణ స్వరాల్ని వరసగా వినిపించి శరీరాన్ని మెలకువలోకి ఆరోహింపజేస్తాయి (మేలుకో అని వచ్చినప్పుడల్లా స్వరాలు ఆరోహణ స్వరాలే.) అవి నవరోజులలో, శ్రీరాగములో, ఆనందభైరవిలో వుంటే ఇవి అన్నీ భూపాలలో వుంటాయి. త్యాగరాజు 'మేలుకోవయ్యా' అన్న కీర్తనని 'బౌళి' రాగములో పాడేడు. 'బౌళి'కీ 'భూపాల'కీ పోలికలు బాగా వున్నాయి. 'భూపాల' జానపద రాగము, 'బౌళి' పండిత గాయకుల రాగము.

లాలిపాటల్ని పిల్లల్ని నిద్ర జోకొట్టడములో ఉపయోగిస్తారు. కాని మేలుకొలుపుల్ని నిద్రలేపడాని కుపయోగించరు. అయితే మేలుకోవలిసిన సమయంలో, అంటే తెల్లవారుగట్ల పిల్లలే కాక, పెద్దలు వినడానికి కూడా పాడతారు. ఈ పాటలు చల్ల చెయ్యడానికో, మామూలుపని చేసుకోడానికో లేచిన గృహిణులు తమ ఏకాకిత్వాన్ని పూటు చేసుకోడానికి పాడుకుంటారు. సప్తాహములు జరిపిస్తున్నవారు ప్రభాతసేవలో పాడతారు. మేలుకొలుపులలో.

✓ "బంగారు చెంబులో పన్నీరుపట్టుక
పణతి రుక్మిణివచ్చె మేలుకో,
దంతకాష్ఠము బూని తామరసాక్షి సు
దంత వచ్చినాది మేలుకో॥" అని సేవలూ,
వాసుదేవ భక్త వరజన పోషక
వసుదేవ నందన లేరా
కంస సంహార ఖగరాజ గమనుడ
కరిరాజ వరదుడ లేరా॥

అని స్తుతులూ చేసే దాసభావమూ,

"ఘోరమయిన సంసారబాధ గడ
తేర లేరు జనులు మేలుకో
దారిజూపి వారి దరిజేర్చుకున్న నె
వ్వారు దిక్కు స్వామి మేలుకో,॥" అని

సలహాలూ,

"వేళ గాదు యిక వేకువజామయ్యె
శ్రీకాళహస్తీశ మేలుకో॥" అని హెచ్చ

రికలూ చేసే సఖ్యభావమూ,

"పైటకొంగు నీ ప్రక్కలో పడ్డాది
పిల్ల చాలా యేడ్చులేరా,
పసిబిడ్డ తల్లిని పరుగెత్తిపోవాలి
పాలు చేపొచ్చింది లేరా॥" అని ప్రియురాలివలె బ్రతిమాలు మధురభావమూ మాత్రమే కాక,

"పొద్దున్నె నీకును మరి వెన్న పెరుగులు
చల్దులు కలిపేను లేరా॥" అనే యశోదకు గల మాతృభావమూ,

"తొల్లి జేసిన కర్మవశమున
కల్లదేహము గాంచినందుకు
యెల్లవిధముల నాత్మకనుగొని
యుల్లమలరగనూ॥ జీవా మేలుకో॥"

అనే అభేదత్వభావమూ కూడా కనపడతాయి. లాలిపాటలలో లాగే మేలుకొలుపులలో కూడా సేవలూ, లీలలూ, మహాత్మ్యలూ వుండడము పరిపాటే కాని మేలుకొలుపులలో మధురభావము కొత్త. చక్కగా వున్నాయి ఈ పాదాలు వినండి:

తెల్లవారవచ్చె పల్లవాధరనీదు
ఫుల్లము రంజిల్ల మేలుకో
గొల్లల ఇండ్లలో వెన్న లారగించ
వేళాయె శ్రీకృష్ణ మేలుకో
తెల్లవారవచ్చెనూ॥
పూతన చనుదాలు పుక్కిటగొనిదాని
పాతక మణచాలి మేలుకో
ఘాతుక దానవుల నూతనపు చిన్నెల
ఖ్యాతిగ దునుమాడ మేలుకో...
తెల్లవారవచ్చెనూ॥
రేపల్లెవాడలో గోపకామినులకు
తాపములణచాలి మేలుకో
కూరిమితో కంసుని కొలువుకూటంబున
కూలదన్నవలె మేలుకో
నీపాదపద్మములు నరులకు చూపించి
పరము నందించంగ మేలుకో,

ఇంకొక్క విశేషము చెప్పాలంటే 'పరమేశ్వరుని విభూతిని మేలుకొల్పులు చెప్పినట్లు, లాలిపాటలు చెప్పవు' అనాలి. యుక్తమే కదా? నిద్ర జోగొట్టేటప్పుడు పాటలు నిద్రపట్టించడముతో ఆగి

పోవాలి. మేలుకొలుపులకూ హద్దులేదు. ఎంత పురాణము వర్ణించినా మేలుకొల్పడానికే. ఈ మేలుకొల్పులు స్వామికి చెప్పితే, ఆయన ఎంతసేపైనా వింటాడూ, రచయితి ఉత్సాహానికి కూడా అట విడుపు!

ఈ పాటల ఛందో విశేషాలు చిత్రంగా వుంటాయి.

'లాలి లా|లీ లాలి| లాలమ్మ| లాలి|
లాలనుచు| పాడరే| బాలయే|సుతకూ|

అన్న పాటా,

శ్రీరంగ| రంగరం| గా|
మా యన్న|
కావేటి రంగరం గా|

అన్న పాటా 'కిట తకిట' అని ఐదేసి అక్షరాల అవృతిములతో నడుస్తాయి. పైదానిలో చరణానికి నాలు గావృతాలూ, దిగువదానిలో మూడూ ఒకటీ మూడూ, మొత్తం ఏడు ఆవృతాలూ ఉన్నాయి. రెండింటికీ తాళము ఒకటే ఖండజాతి ఏకతాళము. 'రామ లాలీ మేఘశ్యామ లాలీ' అన్న పాటా ఏకతాళమేగాని దానిలో ఆవృతానికి నాలుగేసీ అక్షరాలు; ఐదు కాదు. అయిదక్షరాల ఆవృతాలూ, నాలుగక్షరాల ఆవృతాలూ అయినవి. ఆ వృతముయొక్క కాల ప్రమాణాన్ని అయిదు నుంచి నాలుగుకి తగ్గించినప్పుడే పాట అనవసరముగా దురితమైపోయింది. మూడేసి అక్షరాల ఆవృతములు లాలిపాటలలో పాడితే పాట మరీ దురితమైపోయి దాని ఆశయానికే భంగము వస్తుంది. అందుకనే గాబోలు అవి ఎవరూ వాడలేదు.

ఇక మేలుకొలుపులు గమనించండి.

గోపీమ|నోహర| గోవర్ధ| నోద్ధార
నాపాలి| యదువీర| లేరా|...॥

మూడేసి అక్షరాల ఎనిమిది ఆవృతాలు! నిద్రపుచ్చేటప్పుడు దురితమైపోతుందనుకున్న గతి మేల్కొలిపేటప్పుడు పనికివస్తోంది! మేలుకొల్పులు చాలా మట్టుకు ఈ గతిలోనే వుంటాయి. ఇది సీసపద్యపు వికృతిలాగ కనపడుతుందిగాని, సీసపద్యపు తొలి గణాలకి నాలుగూ, ఐదూ మాత్రల గణాలు వాడితే ఈ పాటలో మూడేసి అక్షరాల ఆవృతాలేవాడాలి. రెండూ ఒకటి కానేకావు. మేలుకొలుపులు మరికొన్ని

మేలుకొనవే చంద్రశేఖర
మేలుకొనవే ఇంద్రవందిత
మేలుకొనవే ఫాలలోచన
నీలకంఠ హరా.

అని ముత్యాలసరాల్లో కనబడతాయి. ఇది మూడూ నాలుగూ చేరి ఏడేసి అక్షరాల ఆవృతాలలో నడుస్తోంది. గతి మామూలు మేలుకొలుపులకంటె మందమైపోయింది! రెండు మూళ్లు ఆరు అక్షరాల బిగువు ఒక్క అక్షరము జాస్తిగా చేర్చగానే సళ్లింది.

మేలుకొలుపులలో రచయితల పేర్లు కూడా ఇమిడి కనబడడముతో వాటి 'రచన' చక్కగా ధ్వనిస్తుంది. లాలిపాటలూ, పిల్లల ఆటగేయాలూ ఎవరు రాశారన్న ప్రశ్న పుట్టదు. కాని మేలుకొలుపులు అవసరముకోసము ఆవిర్భవించినవి కావు, పూని రచించినవి. అందుకే రచయితపేరు! తత్వపు మేలుకొలుపు 'జీవా మేలుకో' అన్నది రచించి వాతడు 'వెంకట శివదాసు'. ఇతని భాష పండితుల భాషే. యతులూ ప్రాసలు చక్కగా వేసినాడు. 'వెంకట సుబ్బయ్య' మామూలు వరసనే స్వీకరించాడు. పాట సాఫీగా నడిచిపోడానికి 'చెంతజేరినాము' 'పాషేరు' అన్న శిష్టవ్యవహారిక పదాలు (వీటికి కవి ప్రయోగాలున్నాయి) స్వీకరించాడు. నాకు దొరికిన లాలిపాటల్లో ఒక్కగా నొక్క పాటలో 'రావిపాటి పార్థసారథి దాసు' పేరు కనబడింది. ఇది ఇటీవలి పాటే అయివుంటుందని అభిప్రాయపడుతున్నాను.

విక్రమ చోళుడు

[క్రీ. శ. ౧౧౧౮-౧౧౩౫]

★

శ్రీ భావరాజు వెంకటకృష్ణారావు

పశ్చిమ చాళుక్యుల వేంగీభూమి యాక్రమణ శ. ౧౦౪౦ యగు విలంబి సంవత్సరారంభమున క్రీ. శ. ౧౧౧౮ నందు ప్రారంభమయ్యెనని నిర్ణయింప వచ్చును. కృష్ణానదికి యుత్తరపుటొడ్డున గల సీమను కొల్లిపాక రాజధానిగా మహాసామన్తాధిపతి, మహా దండనాయక మహాప్రధాని అనంత పాలయ పరిపాలించుచుండెను. త్రిభువన మల్లుడు వేంగిపై దండ యాత్ర సాగించి యా దేశము నాక్రమించుటకు అనంతపాల దండనాథుని నియోగించెను. అతని సేనా సమూహమందు తెనుగువారు మహామాండలికులు, దుర్జయవంశజు లనేకులుండిరి. వారిలో ముఖ్యులు కోడూరు, ఆమనగల్లు, పంకిస, కొల్లిపాక మొదలగు పురవరేశ్వరులు పెక్కండ్రు ఉండిరి. ఆంధ్రదేశమున ఆనాటి సామంత, మహామండలిక లోకమంతు కుంతల చాళుక్యులకు సాహాయ్యపడిన వా రనేకులు గలరు. సుక్షత్రియ మాండలిక వంశజులందరు అనంతపాల దండనాథునికి తోడ్పడియుండిరట్లు ఊహింప వచ్చును. అనంతపాల దండనాథుడు కృష్ణకుత్తరపు టొడ్డున గల దేశము నాక్రమించుకొని కొండపల్లి దుర్గ మున మూలస్థాన మేర్పరచుకొని వేంగీదేశము నాక్రమించుకొనెను. అప్పటికి రెండు మూడేండ్లుగా ఎత్తిపోతల చింతలూరి భీమరసువంటి చరులు చేసిన ప్రయత్నముల ఫలితముగ మహామాండలిక, మహా సామంతులు కుంతలరాజ సేనలకు ఆదరముతో స్వాగతమిచ్చి వేంగిని త్రిభువనమల్లునికి సులభముగ వశపఱచిరి. వేంగి యాక్రమణ క్రీ. శ. యగు ౧౧౧౮ ముగియు నాటికి సమాప్తమయ్యెను. దండ నాయక అనంతపాలయను, త్రిభువన మల్లుడు మహా ప్రచండ దండనాయక బిరుదముతో వేంగీ ౧౪ వేల రాజ్యమునకు పాలకునిగా నియమించెను. ఈ విష యము గుంటూరుజిల్లా బాపట్లతాలూకా, కొమ్మూరు గ్రామమున వేంచేసియున్న చెన్నకేశవ స్వామి వారి యాలయమునయున్న చాలుక్య విక్రమ వర్షములు ౪౩ అను విళంబిసంవత్సర పుష్య శుద్ధ పంచమి సోమ వారము ఉత్తరాయణ సంక్రాంతి పుణ్యకాలమున వేయించిన శిలాశాసనమునుబట్టి తెలియుచున్నది.1 అందలి తిథి మొదలయినవి ౨౪ డిశెంబరు, ౧౧౧౮ కు సరిపోవుచున్నవి.2 దండనాయక అనంతపాలయ మహాప్రధాని మహాదేవరసునియొక్క కుమారుడు. మహా దేవర దండనాయకుడు చాళుక్యకుల మూల స్తంభమని ప్రస్తుతికెక్కెను. అనంతపాల దండనాయకుని పితా మహుడు భీమదండనాయకుడు. అనంతపాలయకు నారాయణ, వామన, లక్కనయను (a) వారలు సోద రులు. వారిది విప్రవంశము. కుంతలేశ్వరులకు అనంత పాల దండనాయకుని పూర్వులు ఆప్తభృత్యులై, మహా ప్రధానులై చమూపతులై గణుతికెక్కిరి. అనంత పాల చమూపతికి అతనికంటె పెద్దది పద్మలదేవి యను తోబుట్టు వుండెను. ఆమె భర్త కృష్ణరాజ దండ నాథుడు. అతడు గణేశ్వరచమూపతికి ప్రపౌత్రుడు, పద్మనాభదండనాథునికి పౌత్రుడు కృష్ణరాజ చమూ పతికి గోవిందదండనాయకుడు, లక్ష్మణదండాధిపుడు

1. S. I. I. Vol. IX. Part 1. No.

2. ఇందలి తిథివారము సంక్రమణ కాలము తప్పుగా పడియున్నవి.

3. S. I. I. Vol. IX. Part I. No. 213. ఈ శాసనము త్రిపురాంతకమునందున్నది.

(a) S. I. I. Vol. IX, Part I. No. 220. కొల్లూరు శాసనము.

అను ఇరువురు తనయులు. వారందరు కుంతలసేనావాహినియందు సేనానులు. వారి చరిత్రయే ఆరవ విక్రమాదిత్యు డంధ్రదేశము నాక్రమించుకొని పరిపాలించిన కాలమునాటి చరిత్రము.

మహాప్రచండదండ నాయక అనంతపాలయ ఇంచుమించుగా క్రీ. శ. ౧౧౧౮ మొదలుకొని, ౧౧౨౬ వఱకును పరిపాలించెను. అతనితరువాత అతని మేనల్లుడు గోవింద దండనాథుడు ౧౧౩౫ వఱకు పరిపాలించెను. అనంతపాలచమూపతి వేంగీ పదారువేల రాజ్యమును పాలించుచుండిన కాలమున పండితత్రయము వారిలో రెండవవాడగు శ్రీపతి పండితారాధ్యుడు విజయవాడయందు నివసించి యుండెను.[1] శ్రీపతి పండితారాధ్యుని శైవాచారము గర్హించి విజయవాడ జను లాతనిని వెలివెట్టి, అగ్ని నీయక పోయిరట. అంతట నా పండితుడు కుపితుడై మల్లేశ్వరమహాదేవుని కరుణ బడసి అగ్నిని చీనాంబరమందు మూటగట్టికొనిపోయి యొక శమీవృక్ష శాఖయందు వ్రేలాడగట్టెనట. అగ్ని యావిధముగా బంధింపబడుటవలన బెజవాడ పౌరులకు అగ్ని లేకపోయెనట. నగరమువా రప్పుడు గత్యంతరము గానక, కొండపల్లి కరిగి యచ్చటనున్న అనంతపాల దండనాథునితో మొఱవెట్టుకొనిరట! అనంతపాలయ్య శ్రీపతి పండితుని భక్తుడు! అతని మహిమను, శివభక్తిమహాత్మ్యమును, పరమమాహేశ్వరత్వమును ఎఱిగినవాడగుటవలన పండితుని తన కొలువుకు రాబనిచి విజవాడ పురముఖ్యులచేత క్షమ వేడుకొనజేసి పండితుని యనుగ్రహమును బడయజేసెనట.[2] అప్పుడు పౌరులందరు మల్లేశ్వర మహాదేవునికి పూజలుచేసి అర్చించి అగ్నిని మరల సంపాదించుకొనిరట! ఈ వృత్తాంతమునుబట్టి జూడ శ్రీపతి పండితుడు క్రీ. శ. ౧౧,౧౨ శతాబ్దముల సంధికాలమున (౧౦౭౦-౧౧౪౦ సంవత్సరముల నడిమికాలమున జీవించియుండెనని యూహింపవచ్చును.

పశ్చిమచాళుక్యసేనాని, అనంతపాల చమూపతి వేంగీదేశము నాక్రమించుకొని పరిపాలించు చుండిన యీ సంక్షుభితకాలమందు నిరవద్యపుర (నేటి నిడుదవోలు) చాళుక్యవంశజుడు, విష్ణువర్ధనుడు, అది మంచి తరుణమని తలచి సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మహారాజను అభిషేకనామముతో రాజచాళుక్య బిరుదు చిహ్నములతో వేంగీశ్వరుడుగా నభిషేకించుకొనెను.[3] అతని రాజమహేంద్రవరశాసనమునుబట్టి లెక్కించినపుడు అతనిపట్టాభిషేకము శ. ౧౦౪౭ అను విశ్వావసు సంవత్సరమున (క్రీ. శ. ౧౧౨౫) జరిగినట్లు కనబడును.[4] ఆనాటికి త్రిభువనమల్లుని దండనాయకులు ఇంచుక ప్రమత్తులై యుండినట్లు తోచును; అదియును గాక త్రిభువనమల్లుని చరమకాలమది. ఆ చక్రవర్తి వార్థకదశయందుండెను. ఆ మరుచటి సంవత్సర మా చక్రవర్తి మరణించెను. దూరమున కల్యాణ కటకమున నడచుచుండిన రాజకీయపరిస్థితులు కారణముగా విష్ణువర్ధనమహారాజు బలవంతుడై వేంగీశ్వరు డయ్యెను. అతని విజయరాజ్యవర్షములను దెలుపు శాసనములు నాలుగైదు దాక్షారామ భీమేశ్వరుని గుడియందు గలవు.[5] ఇంచుమించుగా నాలుగు సంవత్సరము లాతడు వేంగీశ్వరుడై యంధ్రభూమి నేలినట్లగపడును.[6] ఆ విష్ణువర్ధనునకు గోదావరి కెగువనున్న మలయమణ్డలము నేలుచుండిన మహామండలేశ్వర నారప

1.

2. తతః శ్రీ పండితారాధ్య నామ్నా భక్తోత్తమేన చ శివభక్తా ఏవ నూనం దేవపిశా భోఽధికా ఇతి చీనాంబరేఽగ్నిం సంస్థాప్య శమీ శాఖాశాఖయా బద్ధే, మల్లీశ్వరః ప్రీతః ప్రత్యక్షః సమజాయత ఈదృగ్విధం మహాదేవం భక్తవత్సల మవ్యయం మల్లేశ్వరం సమారాధ్య రేజిరే పృథివీ భుజః॥

S. I. I. Vol. X No. 22 బెజవాడ పల్లిదేవ భూపాలుని శిలాశాసనము.

3. *A. R. E.* 1912, *Vol* 66; *A. R. No.* 41 *1/1912*. — ఈ శాసనము నాధారముగ గొని ఈ యూహ చేయవచ్చును.

4. పూర్వోక్త ప్రమాణము.

5. *S. I. I. Vol. IV. No.* 1177, 1193, 1195, 1196; ఈతని శిలాశాసనములు చాళుక్య భీమవరము, పాలకొలను, నిడుదవోలు జుత్తిగ మొదలగున తావులందు గానబడును.

6. *S. II. M. No. 1177.*

రాజు విశేషముగ సాయపడి, "చాళుక్యరాజ్య సముద్ధరు"డని, చాళుక్య నారాయణ శ్రీ రాజ్యైక దురంధరుడని ప్రఖ్యాతిగాంచెను.

విష్ణువర్ధనుని తిరుగుబాటు ఒకవంక సాగుచుండ, దక్షిణమున చాళుక్య చోళచక్రవర్తి విక్రమచోళుడు తన చేతులనుండి వేంగీమహీమహారాజ్యము జారిపోవుచుండుట చూచుచు నిస్పృహతో నుండలేదు. అతడు వేంగినుండి దండనాయక అనంతపాల యను అతని సేనలను తఱిమివైచి విష్ణువర్ధనుని బలిమివాటించి అదిమియుంచుటకు ప్రయత్నములు సేయుచుండెను. దక్షిణాంధ్రమున త్రిశతోత్తరషట్సహస్రావనినాథుడగు వెలనాంటి రెండవగొంకరాజును అతని సహాయులను దప్ప విక్రమచోళునకు సహాయముచేయువా రెవ్వరును గానరాకుండిరి. అట్టిసమయమున సమస్తసేనాపతి వెలనాటి రెండవ గొంకరాజునకు సాయపడుటకు విక్రమచోళుడు ఒక మహాసైన్యమును సిద్ధపఱచి, పరాక్రమపాండ్యుడను మహాసామంతుని సేనానిగా నభిషేకించి వేంగికి బనిచెను.1 అది యెప్పుడు జరిగెనో సరిగా నిర్ణయించుటకు సాధ్యముగాదు, కాని యించుమించుగా నది క్రీ. శ. ౧౧౨౬ సంవత్సరమున జరిగియుండెనని మాత్రము నిస్సంశయముగా తలపవచ్చును.

అదియునుగాక కులోత్తుంగ చోడుడు మరణించిన వెనుక విక్రమచోడుడు పట్టాభిషిక్తుడైన వెంటనే, త్రిభువనమల్లుడు ఆంధ్రదేశముమీదికి మహాప్రచండదండనాయక అనంతపాల మహాప్రధానిని బంపియుండెను. ఆ వృత్తాంతము క్రీ. శ. ౧౧౧౮ సంవత్సరమున చివరభాగమున జరిగిన ట్లూహింపవచ్చును. చోళమండల దండయాత్ర విజయవంతముగా సాగెను. ఆనాడు జరిగినదానిని కవితాధోరణిలో బిల్హణకవి విక్రమాంకచరితమందు చారిత్రకదృష్టితో వర్ణించినాడు. విక్రమాదిత్యుడు స్వయముగ సేనలను నడిపించుకొనిపోయి కాంచీపురమును ముట్టడించెను. వెల్లడియుద్ధమున విక్రమచోళు డోడిపోయి వెన్నిచ్చి పాఱెను. కాంచీపురమంతట స్వాధీనమయ్యెను. ఆ చోళరాజధానియందు త్రిభువనమల్లుడు కొంతకాలము సుఖసంకథావినోదగోష్ఠిని యుండి నిజరాజధాని యగు జయంతపురమునకు మఱలిపోయెను.2 కుంతలేశుడు కాంచీపురమును విడిచిపోవుటకు కారణము విక్రమచోళుడు మహాసైన్యములు గూర్చుకొని కాంచీపురము మీదికి సంగరాటోపమున నడచియుండుట. అదియునుగాక పెక్కండ్రు మహామాండలిక సామంతనృపాలురు త్రిభువనమల్లునికి చోళరాజ్యాక్రమణ దుస్సహమును, దుర్భరమును జేసిన ట్లూహింపవచ్చును. ఆ కాలమున, అనగా క్రీ.శ. ౧౧౧౯ మొదలుకొని ౧౧౨౬ వఱకు గల కాలమున చోళమండలమునందు కుంతలేశ్వరునకు చోళభూపతికిని జయాపజయములు సమముగా నడచెను. అనేక సమరసంఘట్టములు జరిగెను. మహామండలేశ్వర మధురాంతక పొత్తపిచోడమహారాజను పట్టాభిషేకనామము గల విమలాదిత్యుడను తెనుగు చోడభూపతి తన్నేలిన చాళుక్యచోడ చక్రవర్తి విక్రమచోళుని విక్రమభుజములు వర్ధింపను విజయము చేకూరుటకును నందలూరు సౌమ్యనాథ మహాదేవరకు అంగరంగ భోగములకు, పూజలకు, నైవేద్యమునకు, దీపములకు నొక మహాగ్రామమును దానము చేసెను.

ఆ శాసనము శ. ౧౦౪౭ కు సరియైన విశ్వావసు సంవత్సరమునాటిది; అది విక్రమచోళుని విజయరాజ్యవర్షము ౮ వ ఏటిది. అది క్రీ. శ. ౧౦౨౫-౨౬ సంవత్సరములకు సరిపోవును.3 అంతకు పూర్వము చక్రవర్తి మూడవయేట శ. ౧౦౪౨ అగు శార్వరి సంవత్సరమున (క్రీ. శ. ౧౧౨౦-౨౧) విక్రమచోళ చక్రవర్తికి సంగ్రామములందు విజయము చేకూరను మహామండలేశ్వర బేతరసు సౌమ్యనాథేశ్వర మహాదేవునికి కొన్ని దానములు చేసెను.4 ఈ బేతరసు తెనుగుచోడుడు, పొత్తపి రాజధానిగా పొత్తపినాటిని యేలినవాడు

---

1. తిరువాన్కూరు ఆర్కియాలజికలు సీరీసు. *Vol. I. P. 18.*

2. విక్రమాంక దేవచరిత. ౧౬-వ సర్గ; బూలరు పండితుడు ప్రకటించిన గ్రంథమందలి ఉపోద్ఘాతము పుట 44 (43—48)

3. *A. R. No. 579 No. 907.* నందలూరు, కడపజిల్లా.

4. *A. R. No. 583 No. 907.* నందలూరు, కడపజిల్లా.

కావలయును. మహామండలేశ్వర విమలాదిత్యుడు శేల రసు కుమారుడుగా గన్పట్టును.

పై నుదహరించిన శార్వరి, విశ్వావసు సంవత్సరము (౧౧౨౦-౧౧౨౫) ల నడుమ, చోళమండలమున విక్రమచోళుడును అంధ్రభూమిని ఆతని సమస్త సేనాపతి మహామండలేశ్వర వెలనాంటి రెండవ గొంకరాజును కుంతలసేనానులను నిర్జింపచాలకుండిరి. వారి అపజయ పరంపరలకు దోడు మహాప్రచండ దండనాయక, మహాప్రధానం అనంతపాల చమూపతి సహాయమున సర్వలోకాశ్రయవిష్ణువర్ధనుడు తానే వేంగీశ్వరుడైనట్లు తిరుగుబాటొనరించి పాలింపసాగెను. దక్షిణమున చోళమండలముమీదికి అనంతపాలయదండనాథుడు తన మేనల్లుని మహాదండనాయక గోవిందరాజుని కొండపల్లి మున్నూటి విషయాధీశుని బంపియుండెను. విక్రమచోళునికిని గోవింద దండాధీశునికి నడుమ మహాసంగ్రామములు నడచినట్లు గన్పడును. చివరకు విక్రమచోళు డోడిపోయెను. ఆతని సిబ్బందిని, ధనకనక వస్తువాహన సంపత్తిని మదగజములను సకలైశ్వర్యములు వశపఱచుకొని గోవిందదండాధిపుడు వేంగికి మరలి వచ్చెను. ఆనాటి కడపటి సంఘట్టనము శ. ౧౦౪౭ కు సరియైన విశ్వావసు సంవత్సరాంతమున క్రీ. శ. ౧౧౨౬ ప్రారంభమున జరిగియుండును. ఆ మరుచటి సంవత్సరము పరాభవ నిజ జ్యేష్ఠ ఆషాఢ అమావాస్య సూర్యగ్రహణ కాలము (౨౪ వ జూను ౧౧౨౬) నాటికి పూర్వము గోవిందరాజు త్రిపురాంతకమునకుబోయి అచ్చట తన మేనమామ అనంతపాలయను గలసుకొనెను. అనంతపాలయ తన మేనల్లుని 'మామన గంధవారణ' మని బిరుదిచ్చి బహూకరించెను. చోళచక్రవర్తిని పరాభవించి కొని వచ్చిన ఏనుగులను మొదలయిన ధనచయమును అనంతపాలయకు సమర్పించెను. అంతకుబూర్వము గోవిందరాజు వెలనాంటి రెండవ గొంకరాజును జననాథపురముచెంత ఘోర సంగ్రామమున నోడించెను.1 ఆరీతిగా, దిగ్విజయముచేసి వచ్చిన వైభవముతో, మామయు మేనల్లుడును, త్రిపురాంతక మహాదేవునికి చావలమడుగు గ్రామమును, సర్వకర పరిహారముగా దేవభోగముచేసి ధారవోసిరి.2

దక్షిణమున విక్రమచోళుడును ఉత్తరమున వెలనాంటి గొంకరాజును ఒక్కసారిగా పరాజితులైనను, త్రిభువనమల్లుని ఆక్రమణమునుండి, పారతంత్ర్యము నుండి ఆంధ్రదేశమునకు విముక్తి కలిగించుటకు ఉభయులను ప్రయత్నములుగాని సన్నాహములుగాని విరమించి యుండలేదు. ఇంతలో త్రిభువనమల్లుడు వ్యాధిగ్రస్తుడగుటయు నా పరాభవసంవత్సర మాఘ మాసమునాటికి (ఫిబ్రవరి ౧౧౨౬) మరణించుటయు సంభవించెను.3 చక్రవర్తి మరణించినా డన్నవార్త చెవిసోకినంతనే అనంతపాలయ దండనాథాది ప్రధానులు, సేనానులు ప్రెగ్గడలు మొదలయినవారు కుంతల రాజధానికి బోయియుందురు. ఆ విరామసమయమున వెలనాంటిగొంకరాజు విజృంభించి కుంతల సేనానుల నోడించుటకు బూనుకొనెను. సరిగా ఆవేళకు చోళ మండలమునుండి విక్రమచోళ చక్రవర్తి పనుపున పరాక్రమ పాండ్యుడు ఏతెంచి గొంకరాజును గలసుకొనెను. అప్పటినుండి గొంకభూపతికి విజయము చేకూరు టారంభ మయ్యెను. ఆ విజయసూచకమైన విషయము చేబ్రోలునందు మహామండలేశ్వర నంబయ పెట్టిన శిలాశాసనమున ధృవపడుచున్నది.4 నంబిరాజు తన యేలిక విక్రమచోళుని చక్రవర్తి విజయరాజ్య వర్షము అగు శ. ౧౦౪౯ కు సరియైన ప్లవంగ సంవత్సర జ్యేష్ఠపూర్ణిమనాడు చంద్రగ్రహణ నిమిత్తమందు ౨౪ మే ౧౧౨౭ చేబ్రోల మహాసేనునికి అఖండ వర్తి దీపదానము సమర్పించెను. అంతటనుండి విక్రమచోళ చక్రవర్తి విజయరాజ్యవర్షములతో శాసనములు మహామండలేశ్వరులు కొందరు నిర్భయముగా వేయింపసాగిరి. అంతకుపూర్వము వెలనాంటి గొంకరాజే భయపడెను.

త్రిభువన మల్లుని మరణకాలమునాటికి కుంతల సేనానులు, వేంగిని విడిచి కళ్యాణకటకము

1. *S. I. I. Vol. IX. Part. I, No. 212, 213.*

2. పూర్వోక్త ప్రమాణం.

3. ఎపిగ్రాఫియాకర్నాటికి సుంజగానూరు శిలాశాసనమునుబట్టి జనవరి ౧౧౨౬ వరకు అతడు జీవించియుండిన ట్లగపడును.

4. *EP. Ind. Vol. VI. pp. 226. pp.*

నను బోయియుండిరని యూహించితిమి[1]. ఆనాడు, వెలనాంటి రెండవ గొంకరాజైన కులోత్తుంగచోడ గొంకరాజును, రాజమహేంద్రవరపు విష్ణువర్ధనుడును వేంగికి ప్రభువులగుటకు తీవ్రముగ దూపడిరి. కులోత్తుంగచోడ గొంకరాజు చాళుక్యచోళ చక్రవర్తి విక్రమచోళుని సంపూర్ణాధికారము ఆంధ్రదేశమునందు సుస్థిరము చేయవలెనని సంకల్పించుకొనియుండెను. అతనిబోలిన మహావీరుడు సేనాని ఆహవకార్యధురంధరుడు ఆంధ్ర చోళ కర్ణాటదేశములందు ఇంకొకడు లేడనిన అతిశయోక్తికాజేరదు. విష్ణువర్ధను సంతటి పరాక్రమశాలిగాడు. అదిగాక, చాళుక్య రాజవంశములు పెక్కులుండుటవలన వారిలో వారికి ఐకమత్యము కుదురకపోయెను. వెనుక, రెండువందల సంవత్సరములవాడు, రాజ్యచ్యుతుడై వెళ్లగొట్టబడి కొంతకాలము ప్రవాసమునుండి చివరకు పిఠాపుర రాజ్యమును సంపాదించుకొనిన కంతిక బేతరాజు వంశమున బుట్టిన మల్లపరాజు కొడుకు విజయాదిత్యుడు కూడ వేంగీశ్వరుడనని ప్రకటించుకొని శ. ౧౦౪౯ వ మాఘశుక్ల దశమి శనివారమునాడు (అందులకు సరియైన తేది ౧౪ వ జనవరి ౧౧౨౭ సంవత్సరమున) పిఠాపురమందు కుంతీమాధవ దేవరసాన్నిధ్యమున పట్టాభిషిక్తుడయ్యెను. విజయాదిత్యనాములలో ఆ వంశమందు అతడు మూడవవాడు.

విజయాదిత్యునికి బలవంతుడైన క్షత్రియ సామంత మాండలిక ప్రభువులు తోడునీడలై నిలువబడి అనన్యమైన సాహాయ్యము చేసిరి. విజయాదిత్యుడు లేత వయసువాడుగా గన్పట్టును. అతనికి మొదటినుండియు కుడిభుజమువలె, బాసటయై నిలచి పట్టాభిషిక్తుని చేసిన వాడాతని మేనమామ, కొలనుమాండలిక భీమరాజు. కొలనుమాండలికులు హైహయ వంశజులు వారి రాజధాని కొల్లేటి సరసులోనున్న జలదుర్గము, కొలనుపురము లేక కొల్లేటికోట విజయాదిత్యుని జనని చందలదేవి కొలనుమాండలిక బ్రహ్మరాజు కుమార్తె. కొలను విషయమునకే సగరలేక సాగరవిషయ మని పేరు[2]. చందలదేవి అగ్రజుడు కొలనిమాండలి భీముడు. విజయాదిత్యునికి సహాయులైన ముఖ్యులలో రెండవవాడు మహామాండలిక పాలకేశి, అతడు మార్జవాడి, లేక మరదవాడి సీమకధ్యక్షుడు. కర్నూలు జిల్లాలోని మార్కాపురం తాలూకాకు, దానికి నాలుగు వైపులను వ్యాపించియున్న సీమకు ప్రాచీనకాలమున మార్జవాడి లేక మరదవాడి అని పేరు. మహామాండలిక పాలకేశి, విజయాదిత్య మహారాజునకు కూతునిచ్చిన మామ—ఆ మహారాజు కుమార్తె విశాలాక్షి, గంగాదేవి, విజయాదిత్యుని పట్టపుదేవి.

కులోత్తుంగ చోడగొంకరాజు బహుళసంఖ్యాకములైన మహాసైన్యములను గూర్చుకొని దేశమందు నల్దెసల విస్తరించియున్న శత్రువులను మార్కొనుటకు సిద్ధపడెను. త్రిభువనమల్లుని మరణానంతరము మూడు నాలుగేండ్లవఱకును (క్రీ. శ. ౧౧౨౬—౧౧౩౦) అతని తనయుడు భూలోకమల్లుని రాజ్యము స్థిరపడియుండని కారణమున గాబోలు కుంతల సేనానులు వేంగీదేశమునందు క్షోభ్యము గలిగించుకొనజాలకుండిరి. అంతలోపల కులోత్తుంగ చోడగొంకరాజు తన సేనను మూడునాలుగు భాగములుగా విభజించి శత్రుమాండలికులను పరిమార్చుటకు నియోగించెను. విజయాదిత్యునికి సాయముచేయ మారదవాడినుండి ప్రచండ సైన్యముతో నేతెంచుచుండిన మహామండలేశ్వర పాలకేశి నెదిరించి వెనుకకు త్రోలుటకు, ధాన్యవాటీపురాధీశ్వరుడును, తనకు మేనల్లుడును, కోట బింజమహాతిరాజు పుత్రుడునగు మహామండలేశ్వర కోట చోడయరాజును బంపెను.[3] మరియొక సైన్యమిచ్చి తన కుమారుని వీర రాజేంద్రచోడుని, కొలని మాండలిక భీముని మహోగ్ర వీరుని ఎదిరింపబనిచెను. తాను స్వయముగా మిగిలిన కుంతల సేనల సహాయమును జూచుకొని చాళుక్యచోళ చక్రవర్తి నెదిరించి శ్రీ పిఠాపురము విజయాదిత్య మహారాజు మార్కొన నిశ్చయించెను. కులోత్తుంగ చోడ గొంకరాజును సమరకార్యమున ఎదుర్కొనజాలననియెంచి, రాజమహేంద్రవరమున సర్వలోకాశ్రయ విష్ణువర్ధనుడు, శరణుజొచ్చెను. [4] ఆ వృత్తాం

---

1 మల్లపదేవుని పిఠాపుర శాసనము. *Ep. Ind. Vol. IV. p* 226 శ్లోకం. ౩౬.

2. పై వృత్తాంతములన్నియు పిఠాపురం మల్లపదేవుల శిలాశాసనమందు తెలుపబడియున్నవి. *Ep. Ind Vol. IV. pp.* 226 *ff.* శ్లో ౩౧—౩౬.

3. *S. I. I. Vol. IV.* 1242.

4. ఆ సంవత్సరము తరువాతి విష్ణువర్ధనుని ప్రశంస గొంకరాజు శత్రువుగా ఎచ్చటను గానరాదు.

విక్రమచోళుడు, రెండవ కులోత్తుంగుని వేంగీశ్వరునిగా నభిషేకించి యాంధ్రదేశమున నిలిపినది కొలను మాండలిక భీమనాయకునివంటి బలవంతులైన మహామండలేశ్వరుల విద్రోహము మరల తలయెత్తకుండనీయుట ఉద్దేశమైయుండవచ్చును. చాళుక్య చోళులు విక్రమచోళుని నాటనుండి చోళచాళుక్యులయిరి. అంతకు పూర్వమునుండియు చోళమండలాభిమానము గలిగి, ఆంధ్రాభిమానమును విడనాడి, యెప్పటికప్పుడు చోళదేశాభిమానమును నిస్సంశయముగా వెలిబుచ్చుచుండిన చోళచాళుక్యులపై రాజభక్తి సన్నగిల్లుచుండెను. అదిలో విష్ణువర్ధనుడు, తరువాత పీఠాపుర విజయాదిత్యుడు చివరకు కొలని మాండలిక భీమనాయకుడును తిరుగుబాటుచేసి యంధ్రదేశమున నంధ్రక్షత్రియ రాజవంశమును నెలకొల్పుటయే ఉద్దేశముగా కనుపట్టుచున్నది. కాని ఆ ప్రయత్నములన్నియు విఫలములయ్యెను. చోళచాళుక్యుల పాలనము మహామండలేశ్వర కులోత్తుంగ గొంకరాజు యొక్క రాజభక్తి కారణముగ సుస్థిరమయ్యెను.

విక్రమచోళుడు నయనిధి. కావున నాతడు కొలను భీమనాయకుని శిరఃచ్ఛేదమయిన తరువాత, నాతని వంశములోనికి కాటమనాయనికి కొలను మండలమును, "జలధివలయితమైన సరసీపురిని" ద్వారకను బోలినదానితో సహా మరలనిచ్చి యందు మహామండలికునిగా యప్పటియట్లు నిలిపెను. కాటమనాయకుడు 'వంశపరంపరాగతమైన మండలమును' స్థిరతరముగా బడసెనని కులోత్తుంగచోడుని బెల్లూరి తామ్రశాసనము వలన దెలియవచ్చుచున్నది.1 ఈకొలను కాటమనాయకుడు భీమునికి తమ్ముడు గావచ్చును. ఈ యూహకు గారణములు రెండుగలవు. మాండలిక కొలను భీముని రావణునితోడను, వెలనాంటి వీరరాజేంద్ర చోడుని రాఘవుని తోడను బోల్చుట యొకటి. అంబుధివంటిదని కొలనును బోల్చుట యొకటి. కాటమనాయకుడు కొలను మండలరాజ్యము "పరంపరాగత"మైనదని తెలుపుకొనుటయు తండ్రి పేరు చెప్పుకొనకుండుటయు మూడవది. రావణసంహారమున విభీషణుడు రాఘవునకు తోడ్పడినట్లు వెలనాంటి వీరరాజేంద్రునకు కాటమనాయకుడు సాయపడియుండవచ్చును. ఆ కారణమువలన పరంపరాగతమైన కొలని మండలరాజ్యమును విక్రమచోళుని ప్రసాదాతిశయమున కాటమనాయకుడు సంపాదించుకొని యుండును. మాండలిక కాటమనాయకు డంతటినుండి దండనాయక కాటమనాయకుడయ్యెను. కొలను మాండలిక కాటమనాయకుడు కొల్లేటికోట (సరసీపురమును) విడచిపెట్టి, పద్మినీపురమను గణపవరమును రాజధానిని చేసుకొనెను. రెండవ కులోత్తుంగ చోడుని అనుగ్రహమున బడసి శ. ౧౦౬౫ సంవత్సరమున మేష సంక్రమణ పుణ్యకాలమందు దండనాయక కాటయ బ్రాహ్మణులకు పెక్కండ్రకు అత్తిలినాంటిలోని మండదొర గ్రామమును అగ్రహారముచేసి సర్వకర పరిహారముగా దారబోసెను.2 అందులను క్రీ. శ. ౧౧౪౩ మార్చి ౨౪ సరియైన తేది.

కొలనిమండలిక భీముడు జయింపబడినను ఆతనికి సహాయార్థముగావచ్చి, ఆతనికి తోడ్పడి, ఆంధ్రదేశము వెలనాంటి కులోత్తుంగచోడ గొంకరాజునకు పూర్తిగా వశపడనీయకుండ అనుగమనకును ప్రతిఘటించి కర్ణాట, కుంతలసేనానులు తలపడుచుండిరి. కర్ణాట కుంతల లాట సురాట త్రికలింగాధిపతులందరు ఏకమై ఆంధ్రభూమి చాళుక్య చోళచక్రవర్తికి స్వాధీనముగాకుండ ఎదురొడ్డిరి. వారినెల్లరి జయించి, చాళుక్యరాజ్యభవనమునకు మూలస్తంభమై నిలువ వలసిన భారము పూర్తిగా కులోత్తుంగ చోడ గొంకరాజుపై బడెను. గోదావరికి యీశాన్యముగానున్న వేంగీదేశభాగము పూర్తిగా కుంతలసేనానుల వశమందుండెను. కుంతల కర్ణాటసేనలు దండనాయక గోవిందరాజ, దండనాయలక్ష్మణరసులు ఆనాడు వేంగికి రాజధానియైన జననాథపురమునం దుండిరి. వారినికూడ ఆంధ్రదేశమునుండి వెడలనడచుటకు గొంకరాజు నిరంతరము ప్రయత్నించుచుండెను. గోవిందరాజు లక్ష్మణరసులు దండనాయక కేచినయ్య, సిద్ధియయ్యలు మొదలయిన కర్ణాటసేనానులు క్రీ. శ. ౧౧౩౩ జాను నెలాంతంవరకును జననాథపురమునుండి గొంకరాజుతో తలపడుటకు సిద్ధముగనుండినట్లు దాక్షారామ శాసనములు1 తెలుపుచున్నవి. అదేటి దక్షిణాయన పుణ్యకాలమందు వారు భీమనాథునికి దీపదానములు చేసియుండిరి.

దండనాయక గోవిందరాజ, దండనాథ లక్ష్మణరసులు మహాసామంతాధిపతి, మహాప్రచండ దండ

1, 2. రెండవ కులోత్తుంగ చోడదేవుని నాటి కాటదండాధీపుని బెల్లూరు తామ్రశాసనము. *Ind. Art. Vol. XIV. pp. 53. ff.*

S. I. I. IV No. S. 1094, 1099.

నాయక అనంతపాలయ సేనానికి మేనల్లుండ్రు, మేన మామకు జోడయినవాడు గోవిందరాజు.

ఒకవంక కొలనిమాండలిక భీమునితోడి యుద్ధము అతిభీకరముగ సాగుచుండినవేళ, గొంకరాజు సేనాని యొకడు చతుర్థకులజుడు, మహామండలేశ్వర ఒంగేటి మార్గమున నంబిరాజు శ. ౧౦౫౩ సంవత్సర వైశాఖ పూర్ణిమకు సరియైన క్రీ. శ. ౧౧౩౧ ఏప్రిలునాటికి, కర్ణాటసేనానులను, జననాథపురమునుండి వెడలనడచి దిగ్విజయసూచకముగ కొబోలు భీమేశ్వర మహాదేవునికి వ్యతీపాతనిమిత్తమున ఒక అఖండవర్తి లోహదండు దివి యను సమర్పించెను.[1]

ఆ వేది తరువాత నెప్పుడో మరల జననాథపుర మును, తత్పరిసరప్రాంతమును, కర్ణాట సేనానుల వశ మయ్యెను. అవిఘ్నముగా రెండుసంవత్సరములు సంపూర్ణ విజయ మెవ్వరికిని లభింపక గోదావరి కెనువభాగము భీకరమైన రణక్షేత్రముగా పరిణమించెను. చివరకు శ. ౧౦౫౫ ఆషాఢమాసమున దక్షిణాయన సంక్రాంతి పుణ్యకాలపర్యంతము కర్ణాట సేనానులు జననాథ పురము నాక్రమించుకొని యుండినట్లు దాక్షారామ శాసనములు తెలుపుచున్నవి.2 ఆ సంవత్సరము దక్షి ణాయనపుణ్యకాలమందు (క్రీ. శ. ౧౧౩౩ జూను)

---

(1) S. I. I. Vol. IV. No. 1127.

2. S!! Vol. IV. No. S. 1094, 1109, 1158.

2. S. I. I. Vol. V. No 68. ఇందు గల రాక్షస సంవత్సరము శ. ౧౦౫౬ కు సరిపోవును. పుష్య పౌర్ణమాస్య శనివారమునాడు చంద్రగ్రహణము బట్టెనుగాని, పుష్య అమావాస్యనాడు గ్రహణము పట్టలేదు. అదిగాక పుష్య అమావాస్య ఆదివార మగు చున్నది. శాసనలేఖకుడు పుష్య పౌర్ణమాస్య అనుటకు పుష్యమమావాస్యయనియు, చంద్రగ్రహణమనియు రాతిపై చెక్కినట్లుఊహింపవచ్చును. ఇది లేఖకునిపొర బాటు కావలయును. ఈ శాసనమునం దిట్టి ప్రమాద ములు నాలుగైదువఱకు గలవు. చాళుక్య విక్రమ సంవ త్సరము ౫౯ అనుటకు "౯" అని చెక్కినాడు. కాక తాళీయముగా నది భూలోకమల్లుని ౯వ సంవత్సర మయినది.

కర్ణాట దండనాథులు హరీతగోత్రజుడైన దండనాయక సిద్ధిరాజు కొడుకు కేశిరాజు, కాశ్యపగోత్రజుడైన గోవిందరాజుల సిద్ధినయ్య మొదలయినవారలు ప్రస్థాన సన్నాహముతో నుండి శ్రీ భీమేశ్వర మహాదేవరకు అఖండవర్తిదీవియలను సమర్పించిరి.

క్రీ. శ. ౧౧౩౩ జూను తరువాత, తీవ్రముగ ఘోరయుద్ధములు గొంకరాజు సైన్యములకును దండ నాథ గోవిందరాజు లక్ష్మణరస దండనాథులకును సాగెను. పెక్కుతావులం దుభయసైన్యములును తలపడి పోరాడుచుండెను. ఆ యుద్ధములన్నియు సమయుద్ధ ములుగానో, లేక జయాపజయములు సమముగనో పరిణమించిన ట్లూహించుటకు కారణములు గలవు. ఆ మహాసంగ్రామములు ఇంచుమించుగా శ. ౧౦౫౬ అను రాక్షస సంవత్సరాంతమువఱకు సాగుచుండినట్లు చాళుక్య భీమవరమునందున్న (రాజనారాయణ లేక మండనారాయణ) గుడిమంటపములోని యొక శిలా శాసనము సాక్ష్యమిచ్చుచున్నది.1 ఆ శాసనమునుబట్టి శ్రీమన్మహాప్రధానం దండనాయక లక్ష్మణరసరు "చక్రవర్తిభూలోకమల్ల (ముమ్మడి సోమేశ్వర) దేవ రకు శ్రీ బలాయు రారోగ్యైశ్వర్యాభివృద్ధిగాను, శ్రీభుజములు వర్ధింపను, ధర్మార్థతత్పరులుగాను వేంగి నాంటిలోపల చాళుక్య భీమాపురమున మండయగుడి శ్రీ కేశవదేవరకు, హవిర్బలియర్చనలకు దొమ్మర భూమిలోపల వసదియ బీకు నాలుగుపుట్లభూమి సర్వ కరపరిహారముగా ధారవోసెను. రాక్షససంవత్సరము భూలోకమల్లుని కడపటి రాజ్యవర్షము. శాసన వాక్య రచనాధోరణియు, మరియు "శ్రీభుజములువర్ధింపను" అన్న నుడియు, తనకు తిరుచక్రవర్తి విజయము చేకూరుటకు దండనాయక లక్ష్మణరసరు శ్రీ కేశవ దేవరకు దానముచేసినట్లున్నది. ఈ శాసనమే కుంతల చాళుక్యసేనానుల కడపటిశాసనము. ఈ సంవత్సర మందే కర్ణాటభూమియందు భూలోకమల్లుడును, చోళ రాజ్యమందు విక్రమచోళ చక్రవర్తియు దివంగతు లైరి. విక్రమచోళుడు రాక్షస సంవత్సరము సగము గడచినవెనుక మరణించుటచేత నాతనికుమారుడు విష్ణు వర్ధనుడైన రెండవ కులోత్తుంగ చోడదేవుడు ఆంధ్ర భూమిని సంరక్షించు భారము మహామండలేశ్వర వెల నాంటి కులోత్తుంగ గొంకరాజుపై బెట్టి, చోళ రాజ్యము సంరక్షించుకొఱకు కాంచీపురమునకు బోయెను. (సశేషం)

జోసఫ్ స్టాలిన్



స్టాలిన్ డిసెంబరు 21, 1879 సంవత్సరంలో రష్యా జార్జియా రాష్ట్రంలో టిఫ్లిస్ మండలంలో గోరీ అనే పట్టణంలో జన్మించాడు. అసలు పేరు జోసెఫ్ వెస్సారియోనెవిచ్ జుగాష్విల్లీ. తండ్రి వెస్సారియన్ జుగాష్విల్లీ. తల్లిపేరు ఎకాటరీనా. తల్లి తండ్రులిద్దరు జార్జియా రాష్ట్రపు పల్లెలవారే. పితృ పితామహులది డిడిలో అన్న పల్లె. తండ్రి వృత్తి చర్మకారవృత్తి.

స్టాలిన్ 1888లో ఆ పట్టణంలోని ప్రాథమిక విద్యాశాలలో ప్రవేశించాడు 1894కు అక్కడి చదువు పూర్తి చేసుకొని, చర్చి విద్యాలయం "సెమినరీ"లో ప్రవేశించాడు. కాని అక్కడ చేరిన కొత్తలోనే,పదిహేనేళ్ళ ఈడునే, స్టాలిన్‌పై మార్క్సు ఎంగెల్సు రచనల ప్రభావం పనిచేయసాగింది. అక్కడి కార్మికోద్యమంలో స్టాలిన్ కేంద్రస్థానం ఆక్రమించాడు.

స్టాలిన్ విప్లవప్రచార చర్యలు జార్ ప్రభుత్వం ఆరాలోకి వచ్చాయి. స్టాలిన్‌ను అరెస్టు చేసి, ముందు ఎనిమిదిమాసాలు, జైలులో వేశారు. ఆ ఎనిమిది మాసాల అనంతరం సైబీరియాకు పంపించారు. ఆనాటినుంచీ 17 ఏళ్ల పర్యంతం స్టాలిన్ జీవితం ఎక్కువ భాగం, అడపాతడపా జైళ్లలోనూ, రెండు మూడేళ్ల చొప్పున సైబీరియా అజ్ఞాతవాసాలలోను, వాట్లనుంచి తప్పించుకొని పోలీసులకు పట్టుపడకుండా నిగూఢంగా ప్రజలలో ఉంటూ, పార్టీని బలపరుచుకొంటూ, రహస్య విప్లవపక్ష నిర్మాణాత్మక కృషి నిర్వహణలోనూ గడచాయి. ఎంతటి అజ్ఞాతవసంలో ఉంటూ ఉన్నప్పుడు కూడా, విప్లవ పత్రికలను నడుపుతూ, బాహాట చర్యలవ ప్రచ్ఛన్న చర్యలవల్లా కూడా ప్రభుత్వాలకు అలజడి కల్గిస్తూనే ఉన్నాడు. జార్జియా రాష్ట్రంలోని మూడు ముఖ్య పట్టణాలలోనూ, కార్మికసంఘ నిర్మాణాలలో స్టాలిన్ తీవ్రంగా కృషి చేశాడు. బాకూలో,నూనె పారిశ్రామిక కార్మికులచే మొదటిసారి పెద్దపెట్టున సమ్మె చేయించి యజమానులను రాజీ బేరాలకు తీసుకొని వచ్చి రష్యాలో పారిశ్రామిక ప్రప్రథమ కార్మిక విజయం సాధించాడు.

1905లో జరిగిన విప్లవం దెబ్బతిని పోవడంతో అప్పటి సోషలిస్టు పార్టీలో అనేక చీలికలు వచ్చాయి. లెనిన్ అనుయాయులు, అల్పసంఖ్యలో ఉన్నారు. స్టాలిన్ లెనిన్ అనుయాయుడుగా బోల్షివిక్కులలో చేరాడు. విప్లవం, ప్రజానమూహాలలో

ప్రచారంవల్ల బలం చేకూర్చుకొని సాయుధ బలసమేతంగా అధికారం కైవసం చేసుకోవాలన్న లెనిన్ విధానమే స్టాలిన్‌కూ నచ్చింది.

1914 లో ద్వితీయ ప్రపంచ యుద్ధారంభంతో, ఇర్కుటస్క్ ఎడారులలో అజ్ఞాతవాసంలో ఉన్న స్టాలిన్‌ను జారు ప్రభుత్వం యుద్ధానికి సైనికునిగా పంపించింది. 1917లో ఏప్రిల్‌లో రష్యాలో విప్లవప్రారంభంనాటికి స్టాలిన్ కార్మిక విప్లవ మూలస్థానమైన పెట్రోగ్రాడ్‌లో, బోల్షివిక్ పార్టీ నిర్మాణ కృషిలో ఉన్నాడు.

ఆ ప్రథమ విప్లవంతో అధికారం జారు చేతుల్లో నుంచి, మెన్షివిక్ పక్షానికి సంక్రమించింది. వీళ్ళు బోల్షివిక్‌లను అణచే ప్రయత్నంలో లెనిన్‌పై కేసులు పెట్టి, బోల్షివిక్ పార్టీపత్రిక ఆఫీసులను అధీనం చేసుకోటానికి ప్రయత్నించటంలో బోల్షివిక్ విప్లవం పది రోజులలో విపరీత ప్రాబల్యం అందుకొని రష్యన్ ప్రభుత్వాన్ని కైవసం చేసుకొంది.

కమ్యూనిస్టుపార్టీ నియంతృత్వంలో లెనిన్ ప్రజానేత అయాడు. లెనిన్ పక్షం విప్లవ రంగంలో కూడా అల్పసంఖ్యాకంగా ప్రారంభించి ప్రభుత్వం హస్తాదధీనం చేసుకోగల్గటంలో మొదటి మూడునాలు గేళ్లూ, దేశంలోని తదితరపక్షాలతో భీకరమైన అంతర్యుద్ధం సాగించుకొంటూ నిలదొక్కుకొని రావలసివచ్చింది. ఆ సమయంలో అనేక రాష్ట్రాలలో, తక్కిన పక్షాల నన్నిటినీ, నిశ్శేషంగా నిర్మూలించుకొని రావటంలోనే ఉక్కుమనిషి అన్నపేరు సార్థకం చేసుకొన్నాడు స్టాలిన్.

లెనిన్ అంతటి మహాప్రతిభుని అనంతరం, కమ్యూనిస్టుపార్టీ చోదకత్వంలో ఏపాటి మామూలువ్యక్తి అయినా, నామరూపాలు లేకుండా పోవలసినవాడే. కాని స్థిరచిత్తుడు, అచలధీరుడూ, ధీశాలీ, కార్యాకార్య వివేచనదక్షుడూ, అరిభయంకరుడూ, కావుననే స్టాలిన్ తన స్థానాన్ని, పార్టీలో, దేశంలో, ప్రపంచంలో కూడా, నానాటికీ ప్రముఖంగా చేసుకోగలిగాడు.

ద్వితీయ ప్రపంచ సంగ్రామాంతరంలో, స్టాలిన్‌యొక్క రాజనీతి, అపారప్రజ్ఞ, ప్రపంచ రాజకీయజ్ఞులకు విశేషంగా తెలిసివచ్చాయి. ఆతర్వాత ఈనాటివరకూ ప్రపంచ రాజకీయాలన్నిటికీ, స్టాలిన్ అభిమానమూ, స్టాలిన్ ద్వేషమూ, ఈ రెండే కీలకప్రాయాలై, ప్రపంచ సమరశాంతి గతులకు రెండింటికీ కూడా స్టాలినే కీలకపాత్రగా సర్వత్రా గణనకు వచ్చాడు. స్టాలిన్, మౌనము, సంభాషణలు, రెండూ కూడా ప్రపంచ రాజకీయజ్ఞులకు విపరీతభావ్య ప్రతిపాదకాలుగా భాసించే స్థితి వచ్చింది. ద్వితీయ ప్రపంచయుద్ధానంతరం ప్రపంచంలోకల్లా మహాశక్తివంతమైన స్థానం ఆక్రమించుకొంటూ రాగలిగాడు స్టాలిన్. ఈనెల, రెండవ తారీకు సోమవారం నాటిరాత్రి స్టాలిన్ మేధస్సులో సిరలు తెగిపక్షవాతంతో స్మృతి గోల్పోయాడు. గురువారం రాత్రి (మార్చి 5వ తారీఖున) 74 ఏట ఈ ప్రతిభామూర్తి ఇహలోకయాత్ర చాలించాడు.

విజయనగరసంగీతసంప్రదాయము

★

శ్రీ విస్సా అప్పారావు

ఉత్తర ఆంధ్రదేశమందలి విజయనగరము, బొబ్బిలి, మాడుగుల, పిఠాపురము సంస్థానములు సరస్వతీ పీఠములుగా చెన్నారుచుండెను. కవులు గాయకులు విశేష గౌరవ సన్మానములను పొందుచు, పోషింప బడుచుండిరి. విజయనగర సంస్థానమందు వీణ పెద గురాచార్యులవారు, దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులుగారు, కలికోట్ల కామరాజుగారు, వీణ వెంకటరమణదాసుగారు పేరుపొందిన సంగీత విద్వాంసులు. బొబ్బిలిలో నందిగాము వెంకన్నగారు, మాడుగులలో వాసా అప్పయ్య, సాంబయ్యగార్లు పిఠాపురమున తుమురాడ సంగమేశ్వరశాస్త్రిగారు పేరొందిన గాయకోత్తములు.

వీరందరిలోను పెద్దలు, పూజ్యులు, పూర్వులు వీణ పెదగురాచార్యులవారు. వీరు, మధ్వ బ్రాహ్మణులు. తంజాపూరునుండి సుమారు నూటఏబది ఏండ్ల నాడు వీరిని విజయనగర సంస్థానాధీశ్వరులు ఆహ్వానించి గౌరవించిరి. వీరు విజయనగరమున స్థిరపడి, వారి సంగీత సంప్రదాయమును నెలకొలిపి ఒక సంగీత విద్యాపీఠమును స్థాపించి, దానికి వారు ఆచార్యులైరి. ఈ సంప్రదాయమునే బొబ్బిలి, మాడుగుల సంస్థానములువారు కూడ అవలంబించిరి. వీణ పెదగురాచార్యులవారు గొప్ప వైణికులు. ఆకాలమందు సంగీత విద్వాంసులందరు వీణను బాగా సాధకముచేసినవారే. వీణాసాధకమున గాని నిశితమగు శ్రుతిజ్ఞానము కలుగదని ప్రాచీన సంగీతాచార్యులమతము.

అది నిజము. శ్రీ త్యాగరాజస్వామివారి గురువులైన శొంఠి వెంకటరమణయ్యగారు, త్యాగరాజస్వామి మాతామహులగు వీణకాళహస్తయ్యగారు ముత్తుస్వామి దీక్షితులువారు, వారి తండ్రిగారగు రామస్వామిదీక్షితులవారు, మొదలగు పేరొందిన సంగీత విద్వాంసులందరు వైణికవిద్వాంసులే. అందుచేత సాధారణముగా సంగీత సంప్రదాయమంతయు, వైణిక సంప్రదాయముగానే యుండెను. గీతములు, ప్రబంధములు, తానములు వాయించి వీణమీద సాధకము జరిపేవారు. వీణ పెదగురాచార్యులవారి మనుమలు చిన గురాచార్యులవారు. వారి కుమారులే మొన్న మొన్నటివరకు జీవించియున్న వీణ వెంకటరమణదాసుగారు. ఈ వెంకటరమణదాసుగారు వీణను అద్భుతముగా షట్కాలము వాయించేవారు వారి సాధకము నిరుపమానమైనది. ఒక మెట్టుమీదనే సప్తస్వరములను లాగిపట్టి ధ్వనింపజేయ గలిగినట్టి ప్రతిభావంతులు. సంగీత సాహిత్య విద్యాపోషకులని చిరకీర్తి సంపాదించిన ఆనంద గజపతి మహారాజులలగారు ఈ వెంకటరమణదాసుగారిని, దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులుగారిని గొప్పగా ఆదరించి, సంగీతకళను మిక్కిలి ప్రోత్సహించిరి.

విజయనగర మహారాజులైన నారాయణ గజపతి, విజయరామగజపతి కాశీలోకూడ తరుచు నివాసముచేసేవారు. అందుచేత వీణ పెదగురాచార్యులవారు, వారి తరువాతివారు కూడ ఔత్తరాహ సంగీత సంప్రదాయమును కూడ బాగుగా నెరిగినవారు. కర్ణాటక, హిందూస్థానీ సంగీతములను సమానముగా సాధకమును చేసియున్నారు. సితారుమీద కూడ నేర్పుగా వాయించెడివారు. గొప్ప హిందూపానీ విద్వాంసులు విజయనగరమందు, కొన్ని సంవత్సరములపాటునివాసముగా ఉండెడివారు. అందుచేత విజయనగర సంగీత సంప్రదాయమందు కర్ణాటక, హిందూస్థానీ పద్ధతులు రెండును కలవు.

ఇట్టి సంప్రదాయము నేడు బాగుగా క్షీణించినది. వాటి విషయమును దెలుపు ప్రాత వ్రాతపుస్తకములు కొన్ని కలవని తెలిసి విజయనగరము నేను వెళ్ళియుంటిని. శ్రీ పులిపాక ముకుందరావుగారి సహాయముతో వీణ వెంకటరమణదాసుగారి సోదరుని కుమారులను కలసితిని. వారిని, కొన్ని మాసములపాటు ఆశ్రయించి, నచ్చజెప్పగా వారిలో నొకరగు శ్రీ వీణ కృష్ణమూర్తిగారు తొమ్మిది సంగీత గ్రంథములను, వ్రాత ప్రతులను, దయతో ఇచ్చిరి.

మరియు దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులుగారి సంగీతగ్రంథములు రెంటిని వారి కుమారులగు శ్రీ దక్షిణామూర్తి, (అడ్వకేటు, విశాఖపట్టణము) నాకు దయతో ఇచ్చిరి. ఇందొక దానిలో కటకశాసనములు వ్రాయబడియున్నవి. చాలా అపురూపమును, అమూల్యమగు గ్రంథము. ఈ పదకొండు గ్రంథములయందుగల ముఖ్య విషయములను సంగ్రహముగా ఈ దిగువన పొందుపరచుచున్నాను.

1. గీతములు: సుమారు నూరు కర్ణాటక రాగములలోను ముప్పది హిందూస్థానీ రాగములలోను గీతములు వ్రాయబడియున్నవి. కర్ణాటక రాగములలోని గీతములలో ఏవో కొన్నిగాని తక్కిన వన్నియును నేడు వాడుకలో లేవు. పురందరదాసుచేత రచింపబడిన గీతము లాదియందు కలవు. తక్కిన వెన్నో వారు రచించినవి కావు. ఎవరు రచించిరో తెలియదు. కొన్ని కాశీపురాధీశ్వరుని మీద కొన్ని విజయనగర మహారాజుమీద అంకితము కలవి కలవు. అందుచేత పెదగురాచార్యులవారిచేతనే వ్రాయబడిన ట్లూహింపవలసియున్నది. అన్నియును కన్నడ భాషలోనే వ్రాయబడియున్నవి. ఈ గీతము లన్నిటికిని మూలమైన ఒక పాతప్రతి కలదు. అందుగల గీతములే తక్కిన పుస్తకములలో రాగమున కొక్క గీతము చొప్పున వ్రాయబడియున్నవి. వాటిలో సాహిత్యములు కన్నడభాషలో కాక సంస్కృతములో రచింపబడియున్నవి. పురందరదాసు గీతములు కూడ ఇట్లే సంస్కృతమున అనువాదము చేసి వ్రాయబడియున్నవి. ఇవి తరువాతవారిచేత వ్రాయబడినవని స్పష్టమగుచున్నది. మూల గ్రంథములు సుమారు నూరేండ్ల క్రిందట వ్రాయబడినట్లున్నది. తరువాతివి 80, 70 సంవత్సరములనాటివి. ఒక వ్రాత పుస్తకములో 16-8-1886 — అనగా 66 ఏండ్లకు పూర్వము — వ్రాసిన ఒక చీటీ ఉన్నది. అందుచేత ఈ వ్రాత ప్రతులన్నియును 70 ఏండ్లకు పూర్వము నాటివని చెప్పతగును. ఈ మూల గ్రంథమందు వ్రాసిన రెండువందల గీతములు ఈ దిగువను ఇచ్చిన పట్టికలోని 97 రాగములలో వ్రాయబడినవి.

1 మలహరి
2 మాళవగౌళ
3 బిళహరి
4 రేగుప్తి
5 మధ్యమావతి
6 పంతువరాళి
7 రెజ్జజ్జ
8 మారువా
9 గౌళిపంతు
10 కళ్యాణి
11 సావేరి
12 మాంజి
13 ఆనందభైరవి
14 సురటి
15 దరబారీ
16 మంగళకౌశిక
17 ముఖారి
18 ఫరజు
19 శేగడ
20 జుజావంతి
21 అఠాణా
22 భూపాళి
23 కురంజి
24 మధుమావతి
25 శుద్ధసావేరి
26 దేశాక్షి
27 దేవగాంధారి
28 నాట
29 గౌళ
30 శ్రీ
31 ఆరభి
32 నటనారాయణి
33 సామ
34 పూర్వగౌళ
35 నారాయణగౌళ
36 కాంభోజి
37 యరకలకాంభోజి
38 చంద్రికాభైరవి
39 కేదారగౌళ
40 నవరోజు
41 శుద్ధసారంగ
42 పున్నాగ
43 శంకరాభరణం
44 ఫాళీ
45 సింధుమేఘధ్వని
46 వసంతభైరవి
47 నాగధ్వని
48 రీతిగౌళ
49 పూర్వభైరవి
50 కన్నడగౌళ
51 మాళవశ్రీ
52 వేగవాహిని
53 గుండక్రియ
54 జయంతిశేయన
65 ఆంద్రదేశి
56 సారంగనాట
57 మణిరంగు
58 భైరవి
59 ఘంటారవం
60 నీలాంబరి
61 కన్నడ
62 నాటకురంజి
63 ధన్యాశి
64 ఛాయాగౌళ
65 ఉదయరవినాట
66 వేళావళి
67 ఆభోగి
68 శ్రీరంజని
69 శహానా
70 కాఫీ
71 హిందోళం
72 నాయకి

73 బలహంస
74 హుశేని
75 సైంధవి
76 పూర్వ
77 మేఘరంజి
78 నాదరామక్రియ
79 పూర్ణచంద్రిక
80 ఘూర్జరి
81 సౌరాష్ట్రి
82 వరాళి
83 సుమ్మకాంభోజి
84 పాండీ
85 ఆంధాళి
86 సాళగభైరవి
87 పూరీకళ్యాణి
88 పూర్ణపంచమ
89 వసంత
90 మనోరంజని
91 ఛాయాతరంగిణి
92 శ్రీకంఠిక
93 తోడి
94 పున్నాగవరాళి
95 శుద్ధ ధన్యాసి
96 నాగగాంధారం
97 హాయిరీ.

ఇందు ప్రతిమధ్యమ రాగములు నాలుగైదు కంటె లేవు. నేడు అపురూప రాగములగు పూర్వగౌళ, పూర్వ భైరవి, పూర్వ, ఆంధ్రదేశి, పాండీ, పూర్ణపంచమ, శ్రీకంఠిక, హాయిరీ మొదలగు రాగములలో గీతము లున్నవి. వాటినిబట్టి ఆ రాగ స్వరూపములను తెలిసికోవచ్చును.

ఈ రాగముల కన్నిటికి ఆరోహణ అవరోహణ స్వరములు ఇవ్వబడినవి. "అక్షరానికి పయిని వున్న చుక్క హెచ్చు స్వరం। కింద వున్న తగ్గ స్వరం" అని వ్రాయబడియున్నది. మరియు ఈ రాగములకు "ఆరోహణ అవరోహణ కళలకు స్వరాలు" అని వేరే ఇవ్వబడినవి. ఆరోహణ అవరోహణ స్వరములు, కొన్ని రాగములకు, నేటి పద్ధతినిబట్టి చాలా భేదముగా ఉన్నవి. కొన్ని ఉదాహరణముల నిచ్చుచున్నాను.

(1) రేగుప్తి :—సరిగ పధ
సధపగరి
కళాస్వరాలు
సరిగా రిగపా గధాప సధాప
గరీప గరిస

మోహనరాగము పేరు ఈ సాంప్రదాయములో లేదు. రేగుప్తియే మోహనగా ఇటీవల మార్పు చెందియుండును.

(2) నాదరామక్రియ :—స రి గామపధని
సనిధపధనిధపమపమగరిస

ఆరోహణలో తగ్గరిమధము, అవరోహణలో హెచ్చు రిమధము కలదు సనిధప అని అవరోహణలో కలదు.

కళస్వరాలు. సరిగామ పాధపమాపమగరిగా
మపధనిసా

(3) దరబారి :— సరిగామపధని
సనిధపమగమరిస
కళాస్వరాలు :-
సరిగామపధనీసనీధపమగారీస

పై రాగములలో కానడ లేదు, దర్బారు లేదు.

(4) కాఫి :— సరిగమపధని

ఈ ఉదాహరణములబట్టి నాటి విజయనగర సంగీత సంప్రదాయములో రాగము లే స్వరూపము దాల్చియున్నదీ వి పులముగా తెలిసికొనవచ్చునని స్పష్టమగును. రాగస్వరూపము కాలక్రమేణ మారుచు వచ్చినది. సుబ్బరామదీక్షితులవారిచ్చిన రాగలక్షణ వివరములు, త్యాగరాజస్వామివారి ముఖ్యశిష్యులలో నొకరగు వీణకుప్పయ్యగారి కుమాళ్లు తిరువత్తియూరు త్యాగయ్యగారు 'పల్లవి స్వరకల్పవల్లిలో' 1890 లో ప్రచురించిన 54 రాగలక్షణముల వివరములు, నేడు పాఠములోనున్న కృతులలో కానవసు రాగలక్షణములు ఈ వ్రాతగ్రంథములయందలి లక్షణములు సరిచూచి వ్యత్యాసములను పరిశీలించి ఒక పరిపూర్ణమగు రాగలక్షణ పరిణామస్వరూపమును నిర్ణయించవలసియున్నది.*

2. తానములు

దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులు గారి తాలూకు ఒక పుస్తకములో 104 రాగములకు తానములు వ్రాయబడియున్నవి. ఇది చాలా అపు

*వాలాజాపేట వ్రాతప్రతులను త్యాగయ్యగారి సంగీతసంప్రదాయ గ్రంథములు మధురలో గలవు. అందు ఒక తాళపత్ర గ్రంథమందు గీతములు కలవు. వాటినికూడ వీటితో సరి చూడవలసియున్నది.

రూపమైన గ్రంథము. ఈ 104 రాగములు ఈక్రింది పదునాలుగు మేళరాగములకు చెందినట్లు చెప్పబడినవి. కాంభోజి, నాట, శంకరాభరణము, తోడి, భైరవి, శ్రీ, ఆరభి, మాళవిగౌళ, గౌళ, పంతువరాళి, ఆనందభైరవి, శాళి, హుశేని, ముఖారి, భైరవి మేళమునకు శ్రీరాగము చెందినదనియు, హిందోళము, ఆంధాళీ, మణిరంగువంటిరాగములు శ్రీరాగ మేళమునకు చెందినవని, రామక్రియ, శుద్ధరామక్రియ, సింధురామక్రియ, భిన్నషడ్జరాగములు పంతువరాళి జన్యములని, శాళి మాళవగౌళజన్యమని, భూపాల రాగము శాళిజన్యమని, రీతిగౌళ హుశేనిమేళములోనిదని, వేళావళి ముఖారిమేళములోనిదని చెప్పబడియున్నది. దీనినిబట్టి జన్య జనకరాగములను పేర్కొనుటలో వెంకటముఖి మేళపద్ధతి వాడుకలో లేదని, రాగపాలికల ననుసరించి వ్యవహారము జరుపబడెనని తోచుచున్నది. మరియు గీతములు వ్రాయబడిన 97 రాగములలో సుమారు 40 రాగములకు—సాధారణముగా వాడుకలోనున్న రక్తిరాగములకు—తోడి, భైరవి, కళ్యాణి, మలహరి, బిళహరి, మధ్యమావతి, సావేరి, ఆనందభైరవి, సురటి, బేగడ, ముఖారి, శహానా మొదలగు రాగములకు—ఇందు తానములు వ్రాయబడలేదు. ఆ గీతముల విషయములో కూడ సామ యరకల కాంభోజి మేళమునకు, ఛాయా గౌళ, ఆరభి మేళమునకు చెందినవనుటచేత జన్యజనక రాగవ్యవహారము వెంకటముఖి మతానుసారముగా లేదని స్పష్టమగుచున్నది. ఈ 104 రాగములలో చాలావాటికి రాగలక్షణము లివ్వబడెను. కొన్నిచోట్ల ఆరభి రిషభము, శ్రీరాగ నిషాదధైవతము లని వ్రాసియుండుటచేత వ్యవహారమునకే ప్రాధాన్య మియ్యబడినట్లు కనబడుచున్నది. రాగలక్షణముల నిచ్చుటలో ఔడవ, షాడవ, ఔడవసంపూర్ణ, షాడవ సంపూర్ణ మొదలగు భేదములు చెప్పబడినవి. కాని వక్రములు పేర్కొనబడలేదు. శుద్ధస్వరములను వాడుకలో మతాంతరము కనబడుచున్నది. కాంభోజి శంకరాభరణ రాగములకు స, గ, మ, ప, లు శుద్ధ స్వరములని యున్నది. గౌళ, మాళవ గౌళరాగములు శుద్ధ మేళములని యున్నది. ఈ 104 రాగములలో ప్రతిమధ్యమ రాగములు ఒకటి, రెండుకంటె లేవు.

ప్రతిరాగముపైన 'వరాళిరాగతానాలు' అని తానాలు బహువచనములో ఉన్నది. ఒక్కొక్క ఆ వృత్తమునకు సంఖ్య ఇవ్వబడినది. మొత్తము పదిలో ఆ వృత్తములైన తరువాత మొత్తము పది తానములని కూడ వ్రాయబడినది. ఘనరాగములలో ఎక్కువ తానములున్నవి. వాటిలో రెండు విధములు గలవు జంత్రమోడీ, గాత్రమోడీ యని. జంత్రమోడీ తానములలో స్వరములు మాత్రమే కలవు. గాత్రమోడీ తానములలో స్వరము, దానిక్రింద తా, నమ్, నా, తమ్, తా, న, అ అను అక్షరములు వ్రాయబడినవి. ఉదాహరణకు.

ఆరభి. గాత్రమోడీ తానాలు:—

సాసనిధ| ధాపా| మామా| పాపా| మపధసనిధ|
తా నం న| తం నా| తా రీ| నంనా| తఅఅఅనంన|
సరిమగరిరిస| సనిధ| రిరిస| రిసనీసా| సా| ౧||
తఅనం నన| తం న| తం న| తంనాతం| నా|

ఆరభి—జంత్రమోడీ తానాలు:—

<u>అయుత్తం</u>

సాసని ధ| సరిమగరి| రిసనిధస| ధసరిరిస|
రి సనీస| స||

అక్షరముపైన ధ అని సున్నగుర్తులు కలవు. ఇవి విరామ గుర్తులు కావచ్చును.

తానములు ఒక క్రమానుసారముగా వేరువేరు భాగములుగా వ్రాయబడినవి. ఆయుత్తము, విడుపు, ముక్తాయి, ఉద్గ్రాహము, ముక్తాయి, సంచారి, ముక్తాయి, తాయం (తాయం) ముక్తాయి. ఉద్గ్రాహము తరువాత షడ్జమస్థాయి, అవరోహ, పంచ స్థాయి, ముక్తాయి, మకరిణి, తాయం, ముక్తాయి అని సక్రమంగా ఇవ్వబడినది. ఘనరాగములకు వాడుకలో గల రాగములకు ఆయుత్తము ముక్తాయి మాత్రమే ఇవ్వబడినవి. ఆరభి రాగమునకు ఇట్లు ఏడు తానము లివ్వబడి, తరువాత ప్రత్యాహార తానము (జంట స్వరములు కలది) ఒకటి, ముక్తాయి ఇవ్వబడి, తరువాత పదకొండు మట్టు విరామ తానములు, ముక్తాయితో సహా ఇవ్వబడినవి. మట్టు విరామ, తడి విరామ జోడు విరామ అను వివిధములగు విరామలు వాడుకలో కలవు. చాలా రాగములపైన-"ఛాయా తరంగిణీ కటాక్ష

తానాలు" అని వ్రాయబడియున్నది. వెంకటమఖి మొదలగు పూర్వసంప్రదాయము ననుసరించినవారు పాడు తానములకు కటకతానములని పేరని వాటికి ఆయత్తము, విడుపు, ముక్తాయి, రెండు, మూడురాగవర్ణములు లేక విడుపులు, ముక్తాయిలు, స్థాయి - ఆరోహి, అవరోహి, సంచారి, మకరిణి, ముక్తాయి" అను లక్షణములు కలవని సుబ్బరామదీక్షితులు సంప్రదాయ ప్రదర్శినిలో వ్రాసియున్నారు. పైన పేర్కొన్న తానములయందుకూడ ఈ లక్షణములే కలవు. ఇవి కాక చివరను తాయము, ముక్తాయికూడ ఇవ్వబడినవి. ఈ తాయ నిర్వచనము సంప్రదాయ ప్రదర్శనమునందు, ఇవ్వబడినది. ఇది సూక్ష్మముగా రాగాలాపనమంతను చేసి చూపు భాగమునీ తోచుచున్నది.

ఇట్టి తానములు పూర్వులు వీణమీదను, గాత్రముతోను సాధకముచేసి గురుకులవాసమున అభ్యసించుచుండెడివారు. అందుచేతను సంప్రదాయసిద్ధమగు రాగలక్షణమువారిచేతికి, గాత్రమునకు అలవడిపోవుచుండెను. ఇప్పుడట్టి శిక్షణపోయినది. ఈ తానముల నభ్యసించుట సన్నగిల్లినది. రాగసంప్రదాయము యథాయథలై పోవుచున్నది. ఇట్టి తానములను సాధారణవిద్వాంసులను వ్రాసి ఇవ్వమనిన వారిచేతకాదేమో యని కూడ తోచుచున్నది. ఇట్టి తానములుగల గ్రంథములు బహుసక్రులై పోయినవి. వీటిని ఉద్ధరించి సంప్రదాయసిద్ధమగు కర్ణాటక రాగలక్షణములకు జీవము పోయవలసిన అవసరమెంతైనా గలదు.

3. వివిధవిషయములు

పైన పేర్కొన్న గీతములు, తానములు అను ముఖ్యమైన విషయములుగాక ఇంకనెన్నో అపురూప విషయములు ఈ వ్రాత పుస్తకములయందు కలవు. వాటిని కొన్నింటిని క్లుప్తముగా పేర్కొనెదను.

(i) ప్రబంధము—ప్రాచీన గేయరచన లన్నియును ఈ ప్రబంధమును దానియొక్క వికారములే. వర్ణము, ఏల, హాయలీల, గజలీల, ద్విపది, వృత్తిము మొదలైనవన్నియు ఇందలి భాగములే. నేటి కృతులు దీని వికారములే.

ఆరు అంగములతోను, నాలుగు ధాతువులతోను స్వరసందర్భము కలదిగా, కూర్చబడిన నది ప్రబంధమని పూర్వులు నిర్వచించియున్నారు. ఇట్టి ప్రబంధములు పూర్వ రచనలు నేడు కనబడుట లేదు. ఇందు ప్రబంధ నాయకుని ధైర్య శౌర్యాది గుణ వర్ణనము, వారిని ఆ గుణములు కలవానిగా సంబోధించుట—అను సాహిత్యము దానికి తగిన స్వరము. తరువాత వివిధ వాద్యములయందు పుట్టు తక, తక, తుకు తుకు, ధింతే, ధింతకిణ, కిణ మొదలగు శబ్దములను ఇందుండును. అట్టి ప్రబంధ మొకటి మాత్రమే, ఈ పుస్తకములలో వ్రాయబడియున్నది.

"ప్రబంధం" శేసుప్తి రాగం......ధ్రువచాపు" అని. వరుసగా స్వరము, సాహిత్యము......కొద్దిగా శబ్దము ఇవ్వబడినవి. సాహిత్యము..."రఘు| భూషణ పట్టాభిరామ జయ||" అని ముగింపబడినది.

(ii) కాలుసాధక అడుగులకు శబ్దాలు. ఇవి నృత్యమున కుపయోగించునవి. 53 గలవు.

(iii) శబ్దదరువులు. ఏడు కలవు. ఇందు శబ్దము సాహిత్యము ఉండును.

(iv) జక్కిణీ దరువులు (2). ఇందు సాహిత్యము, స్వరము, శబ్దము కలదు. ఉదాహరణకు ఒకటి ఇచ్చుచున్నాను.

ఆనందభైరవి - ఆదితాళము

చక్కనిసామి రారా| యీజక్కిణి కృతికై కోరా | చక్కనరా | శ్రీపూసపాటి సీతారామరాజ దావరాథేయ || సాస్సారి సనిసీపా సనిసగగమా మగ మప మాపగరిసని తకిటఝం| తకఝం తకిటతక తాంతకిట ద్రిమికిట తకతక్క దధింగ్గింణ్ణతోం| స్వర సంగతులును శబ్దజాతియును సరసగతిజతులు సప్తతాళముల| జరగిన దరువులు, పంచ జక్కిణియు సిరు లమర వినికి చిత్తగింపదగు ||

(v) వివిధ తాళములలో కొణుగు శబ్దములు ఇవ్వబడినవి.

(vi) తెలుగు తాళాల లయకు సంజ్ఞలు. ఇందు పదునాలుగు తాళములకు సంజ్ఞ లివ్వబడినవి. ఉదాహరణకు రెండు వ్రాయుచున్నాను.

(*a*) ఆటతాళం - 14 అక్షరాల కాలం—

ప్రథమం లఘు। నాల్గు గురువులు। మళ్ళీ లఘు। నాల్గు గురువులు। మళ్ళీ లఘు। ఏక ప్లుతి। మళ్ళీ లఘు। ఏక ప్లుతి। సరీగా సారి గా మాపా॥

(*b*) నవగ్రహ తాళం - తొమ్మిది అక్షరాల కాలం.

ప్రథమం లఘు। మూడు గురువులు। మళ్ళీ లఘు। విరామం। మళ్ళీ రెండు లఘులు। విరామం। సరిగరిగ సరిగమ॥

(vii) హిందూస్థానీ సంగీత విషయము.

టుమ్రీలు, ఖేమాటాలు, టప్పాలు, భజనలు, హోరీలు, ధ్రుపదులు, ఖ్యాలులు, తరానాలు, రేఖ్తాలు, సాహిత్య, శబ్ద, స్వరములు కల ఒక చతురంగము, గజల్సు, బరామ, కవాలి, నాష్టకహార్స్య, సోహర్, హారతి మొదలైనవి చాల కలవు. హిందూస్థానీ తాళ లక్షణములు, తబలా వాయిద్యకుల కుపయుక్తములగు శబ్దములు. దోరలు 29 జాతులు కలవు.

ఒకరు, ఇద్దరు, ముగ్గురు, నలుగురు, పలువురు పాల్గొని నాట్యము చేయుట కుపయుక్తములగు పదునారు జాతి ట్యానులు - స్వరము, సాహిత్యము సహా కలవు.



చిన్న నవల

అల్పజీవి



శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

★

(గత సంచిక తరువాయి)

8

"ఇంత దురవస్థ ఎన్నడూ ఎరగను."

అనుకున్నాడు సుబ్బయ్య ఆరాత్రి వెంకట్రావుతో మాట్లాడివస్తూ.

వర్ణించ వీలులేనంతగా ఉంది అతని మనఃక్లేశం. తీరికూర్చొని అంతా పీకలమీదికి తెచ్చుకున్నానే అని దుఃఖించేడు.

అతనికి వెంకట్రావు మీద చాలా కోపం వచ్చింది.

పట్టూ పట్టూ మని ఒచ్చి నా గొంతుక మీద కూర్చున్నాడు అయిదు వందలు కావాలని.

"నీ దగ్గర అయిదువంద లుంటాయని రాశే దుస్తా" అన్నాడా కోజా.

నేను బీదవాణ్ణని నన్ను చూస్తే విరసన.

మరయితే నా దగ్గర కెందుకొచ్చాడో!

తను మహా అంత గొప్పవాడయితే అయిదు వందలకోసం నన్నడగడ మెందుకు?

ఇప్పు డిలా వట్టిచేతుల్తో పంపడ మెందుకు?

ఇవ్వలేనని చెప్పెయ్య కూడదూ?

అయినా, నాదే పొరపాటు! వెంకట్రావు అడగమనగానే నే వెళ్లి ఆమట్టుకి గవరయ్యని నే నడగెయ్యాలా?

అడిగినా, అతను ఇవ్వడం ఏంఖర్మం ఒచ్చింది!

బావుంది! అతని అవసరం ఉండి అతనిచ్చేడు.

బిల్సులో ఏమైనా సహాయం చేస్తానను కున్నాడు.

అమ్మబాబోయ్!!!

నే నతని కేమీ సాయం చెయ్యలేదు.

భగవంతుడి సాక్షిగా చెప్తున్నాను.

ఏ సాయమూ చెయ్యలేను.

కాని ఎవరు నమ్ముతారు?!!

చెయ్యకూడని పని డబ్బుపుచ్చుకొని చేసి వుంటారు.

'చెయ్యలేదు బాబూ,' అంటే అపనమ్మకంతో నవ్వుతారు.

హెడ్ క్లార్క్ అన్నమాటలకి మరొకడైతే కత్తితో పొడుచుకు చచ్చిపోయుండును.

సిగ్గూ లజ్జా లేని వెధవని కాబట్టి ఇలా బతికున్నాను.

ఇంతటితో అయిపోయిందా?

ఇంకా ఏముందో ముందుకి!!

నాకు భయంగా ఉంది.

మరేం ఫర్వాలేదని అవధా నన్నాడు.

కాని నాకు భయంగా ఉంది.

అవధానికి అన్ని భోగట్టాలూ తెలుస్తాయి.

అవధానికి అన్నీ తెలుసు.

అవును. అవధాని అనుభవం ఉన్నవాడు.

అలాంటి అవధాని అసరా ఇచ్చేడే!

మరేం ఫర్వాలేదని!

అందుచేత ఆఫీసులో మరే [illegible] ఉండేనను కుంటాను.

కాని, ఈ గవరయ్య!

గవరయ్యని నేం చెయ్యడం?

అయిదువందలు ఎక్కణ్ణించి తెచ్చేది? వెంకట్రావు ఇవ్వనట్టే. నిరాశ చేసుకోవలసిందే! మరయితే ఎలాగ?

అయిదువందలూ నే నివ్వకపోతే?......

గవరయ్య చంపేస్తాడు.

పీకమీద కాలు వేసి తొక్కేస్తాడు.

నల్లిని నలిపినట్టు నలిపేస్తాడు.

వెంకట్రావు సాయమిస్తే బావుండును.

నాలుగురోజులు పోతే ఇస్తానన్నాడు.

కాని, ఇవ్వడు!

ఇచ్చినా గవరయ్య ఆగుతాడో ఆగడో!

తల్చుకోడానికి భయంగా ఉంది.

గవరయ్య బాధ ఎలా వదుల్చుకోడం?

ఏంచారి దేవుడా! రక్షింపవా భగవంతుడా!

ఈ విపత్తు తప్పిపోతే,
దేవదేవా, జగన్నాథా
పూరీవస్తాను. నీకోసం.
రక్షించు. రక్షించు.

సుబ్బయ్యకి కొంత ధైర్యం వచ్చింది.
జగన్నాథస్వామి తప్పక రక్షిస్తాడు.
నాన్న అంటూ ఉండేవాడు కదా!
పూరీ జగన్నాథస్వామి కోరినవన్నీ ఇస్తాడని.
నాన్న చాలాసార్లు పూరీ వెళ్లివచ్చేడు.
ఏముంది? నేకూడా ఇట్టేవెళ్ళి అట్టేరావచ్చు.
జగన్నాథా! రక్షింపవా?
ఒకసారే కాదు. మరోసారికూడా వస్తాను.
నేను. కమల, క్రిష్ణుడు.
ముగ్గురంకూడా తలలిచ్చేస్తాం!

సావిత్రికూడా వేణి ఇచ్చేస్తే బావుండును. కాని ఇవ్వదు.

"నీ వేణి ఇస్తేనే నీ భర్త ఆపద తప్పుతుంది" అని సాక్షాత్తు జగన్నాథస్వామి వచ్చి చెప్పినా ఇవ్వదు.

కాని, భగవంతుడా! నేనూ నా పిల్లలూ వస్తాం.

ఎలాగైనా కాపాడు, నన్ను కాపాడు.
మెల్లిగా నడుస్తున్నాడు సుబ్బయ్య.
అతనికి ఇంటికి వెళ్లాలని లేదు.
గోడలమధ్య గదుల్లో ఒంటరిగా కూర్చోవాలి.

ఇంకా గాభరాగా ఉంటుంది.

"ఏమలా ఉన్నారు?" అని అడగనైనా అడగదు సావిత్రి.

నేను బతికున్నా ఒకటే చచ్చినా ఒకటే దానికి.

ఈపాటికి కమలా క్రిష్ణుడూ పడుక్కొనుంటారు,

నిశ్చింతగా, హాయిగా.

నే నిన్ని కష్టాల్లో ఉన్నానని తెలీదు వాళ్లకి.

తెలుస్తే, పాపం, కమల బెంగ పెట్టుకొంటుంది.

ఒట్టి పత్తిగాలం పిల్ల.
రాత్రిల్లా ఏడుస్తూ కూర్చుంటుంది.
అదేడుస్తే నాకు కష్టంగా ఉంటుంది.
సుబ్బయ్య కళ్లు చెమ్మగిల్లేయి.
కారిన కన్నీరు తుడుచుకున్నాడు.
ఆడదానికన్నా అధ్వానం నేను.
'ఏం సుబ్బయ్యా, ఎందుకలా ఏడుస్తున్నావు?'
అని ఎవరైనా అడుగుతే ఏం చెప్పేది!

"సుబ్బయ్య ఆడదాన్లా ఏడుస్తున్నాడు" అని అంతా ఎగతాళిచేసి వెక్కిరింపుగా నవ్వుతారు.

కనికరం లేకుండా నవ్వుతారు.

లేదు. ముమ్మాటికీ లేదీ లోకంలో కనికరం.

అంతా అతి నిర్దాక్షిణ్యంగా ఉంటారు.

ఛీ! ఛీ! వెధవలోకం! వెధవ మనుష్యులు!

ప్రళయం వచ్చి అంతా అంతమైతే బావుంటుంది.

మనిషన్న ప్రతివాడూ నాశనం కావాలి.

అందరికన్నా ముందు గవరయ్య చావాలి.

మిగతా అంతా ఉన్నా ఫరవా లేదు.

గవరయ్య చచ్చిపోవాలి.

హాబ్బా!!

ఈ రాత్రే గవరయ్య చచ్చిపోతే ఎంతహాయిగా ఉంటుంది!!!

గవరయ్య ప్రాణాలు పోవాలి. ఎలా పోతుంది ప్రాణం?

ఏముంది? క్షణంలో పోవచ్చు.

ఎంతమంది చచ్చిపోలేదు, అకస్మాత్తుగా.

తెగ తాగే మనుష్యులకి గుండె ఆగిపోతుందంటారు.

గవరయ్య మస్తుగా తాగుతాడు.

ఏం? ఈ రాత్రి గుండె ఆగిపోయి చచ్చిపో కూడదూ!

చీకట్లో పాము కరవకూడదా!
ఇల్లు కూలి మీదపడికూడదా!
ఏ చెట్టుకో కారుకొట్టేసి తలబద్దలవకూడదా!
డబ్బుకోసం దొంగలు చంపకూడదా!
వెధవ ప్రాణం ఎంతసేపట్లో పోవాలి.

గవరయ్య ప్రాణం అన్నిటికంటే గొప్పది కాదు కదా!

గవరయ్య ప్రాణం పోయే సాధనాలగురించి ఆలోచించడంలో గవరయ్య ఎందుకు చచ్చిపోవాలని కోరుకున్నాడో మర్చేడు సుబ్బయ్య.

రాత్రి తొమ్మిది గంటలు దాటింది

చల్ల గాలికి మెల్ల మెల్లగా తెల్ల తెల్లటి మేఘాలు

ఆకాశంలో అక్కడక్కడ తేలూ పోతున్నాయి. చేతికందని చిరుమబ్బులపైపు చల్లటి చంద్రుడు తెల్లబోయి చూస్తున్నాడు. దూరంగా కన పడుతూన్న తోటలో కొబ్బరిచెట్లు బరువుగా తల లాడిస్తున్నాయి. నీలివెన్నెల్లో ఊరంతా నీలంగా అగుపిస్తోంది.

సుబ్బయ్య వంతెనమీదికి వచ్చేడు.

"ప్రకృతి ఎంత రమణీయంగా ఉంది!"

అని సుబ్బయ్య సాధారణంగా అనుకోడు.

కాని, ఆరాత్రి అక్కడికి వచ్చేక "ఆహా! ఇక్కడ ఎంత బావుంది!" అని ఆశ్చర్యపోయేడు.

వంతెనదగ్గర చల్లగా ఉంది. హాయిగా ఉంది. ప్రశాంతంగా ఉంది. సిమెంటు గట్లమీద దూర దూరంగా అక్కడక్కడ ఎవరో కూర్చున్నారు. అటూ ఇటూ తూగుతూ రెండెడ్లబండీ ఒకటి పోతోంది. సిమెంటు రోడ్డు పాలరాతి గచ్చులా కనిపిస్తోంది. దిగువని ఇసుక తిన్నెలు వెండి కుప్పల్లా మెరుస్తున్నాయి. పారుతోన్న పిల్లకాలువ కొన్ని చోట్ల తళతళలాడుతోంది. ఉత్తరాన్నుంచే నీలి పర్వతం ప్రాచీనకాలపు మృగంలా అలిసిపోయి పడు కొంది.

చల్లగా మెల్లగా ఆగి ఆగి పిల్లగాలి వీస్తోంది.

"ఇక్కడ హాయిగా ఉంది" అనుకొని వంతెన గట్టుమీద కూర్చున్నాడు సుబ్బయ్య, సిగరెట్టు తీసి ముట్టించేడు. నీలంగా మేఘంలా లేచిన పొగ వెన్నెల్లో కరిగిపోయింది.

ఇంటికి వెళ్లను. ఇలా ఇక్కడే కూర్చుంటాను.
స్వేచ్ఛగా ఉన్నా నిక్కడ.

రెండెడ్ల బండీ వంతెన దాటిపోయింది. ఆ వైపునుంచి పాటపాడుతూ ఎవరో సైకిలుమీద వస్తున్నారు. పాట దగ్గరపడి దూరమైపోయింది. ఇంకో వైపునుంచి రైలుకూత వినవచ్చింది.

"పడమటి బండీ కాబోలు వస్తోంది"

తూర్పునుంచి పడమటకీ, పడమటనుంచి తూర్పుకీ ఎవరెవరో ప్రయాణం చేస్తూనే ఉంటారు.

ఈ వూళ్ళో దిగుతారు. మరోచోట దిగుతారు. ఈ వూర్లో ఎక్కుతారు. ఇంకోచోట దిగుతారు.

ఎందరెందరో ఎన్నెన్ని చోట్లకో ప్రతిదినం ప్రతినిమిషం ప్రయాణం చేస్తూనే ఉంటారు.

ఎక్కడికీ వెళ్ళనివాణ్ణి నే నొక్కణ్ణే.

నేనుకూడా ఎక్కడికో అక్కడికి ఎందుకు పోకూడదు?

ఈమట్టుకి ఇలా ప్రయాణం అయిపోతే—

ఏక్ నిరంజన్‌గా ఎక్కడికో పోతే—

సుబ్బయ్య కనిపించడంలేదు తెలుసా? నిన్న రాత్రి వంతెనగట్టుమీద కూర్చున్నాట్ట. మరి పిక ల్లేదు, సూయీసైడ్ కేసో ఏమిటో! అవునవును. అంతే అయుండాలి.

ఎందుకు ఇలాటి పనిచేసేడు సుబ్బయ్య? పాపం రోజూ ఆవార కూర్చొనేవాడు, పాపం! హెడ్ క్లార్కు ఎంతో ఇన్‌సల్టింగా మాట్లాడేడు. తినేమిటో తన పనేమిటో. మాట్లాడిస్తేగాని మాట్లాడే వాడా! ఎంతో అమాయకుడు! ఈ రామస్వామిగాడే నొప్పించేడు! గవరయ్య ఏదో 'ట్రెజెన్' చేశాట్ట! నిజమే నంటావా?

మధ్యాహ్నం అంతా 'కేన్టీన్' లో కూర్చొని కాఫీతాగుతూ మాట్లాడుకుంటారు.

సరిగా పన్నెండు గంటలకి వస్తాడు గవరయ్య.

సుబ్బయ్య సీటు ఖాళీ!!

"ఏమయ్యేడు సుబ్బయ్య?"

ఇంకా మీకు తెలీదూ? నిన్న రాత్రినించీ కని పించలేదు. ఏమిటో? కాలవలో 'బాడీ' కోసం వెతుకుతున్నారు!

ఇంకెవణ్ణడుగుతాడు అయిదువందలు?
నా ఉసురంతా తగుల్తుంది.
నిజంగా ఎక్కడికైనా పోవాలనివుంది నాకు.
ఎక్కడికి పోవడం? ఎలా పోవడం?
పోతే నా పెళ్ళాం పిల్లల గతేమవుతుంది?!
పాపం, కమల ఏడుస్తుంది!

బెంగపెట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తుందే!!

వెక్కి వెక్కి ఏడ్చేడ్చి బెంగపెట్టుకొని చచ్చిపోతుందో ఏమిటో!

అబ్బే! లాభం లేదు.

ఇలా నే నీవూళ్ళో ఉండవలసిందే!

ఏదొచ్చినాసరే అనుభవించవలసిందే!

కంటికి కనిపించని తాళ్ళతో కాళ్ళూ చేతులూ కట్టేసినట్లయింది సుబ్బయ్యకి.

నిస్పృహతో అలా నే కూర్చున్నాడు.

వంతెనమీద చాలామంది మనుష్యులు నడుస్తున్నారు.

ఇంతమంది ఎక్కణ్ణించి వస్తున్నారు?

"వరలక్ష్మీ పాటలు బాగున్నాయిరా"

"అంజలీదేవి యాక్షనుమాత్రం"

ఓహో! సినీమానుంచి వస్తున్నారు.

ఊళ్ళో అంతా సినీమాలకి వెళ్తున్నారు.

నేనొక్కణ్ణే సినిమా చూడనివాణ్ణి.

చూసే దేముంది? నా బతుకే ఓ సినీమాలాగుంది.

చూడండి చూడండి "సుబ్బయ్య జీవితం"

ఆంధ్రప్రజానీకానికి అందజేసే చిత్రరాజం.

ఆంధ్ర చిత్రజగత్తులో, ఆంధ్ర 'సినీ' 'ఫీల్డు'లో విషాదగాథలు లేవుకదా అని విషాదంలో మునిగిపోయిన ఆంధ్రులకు సమర్పించే మా కానుక.

"సుబ్బయ్య జీవితం"

ఇదిరొక విషాదగాథ. మహత్తర సన్నివేశాలతో కూడుకొన్న రసమయ చిత్రం.

వేనవేల ప్రజలు చిత్రాన్ని చూచి ఏడ్చియేడ్చి ఇంటికిపోయి మూర్ఛపోయేరు.

వీళ్లంతా ఇంటికి పోతున్నారు.

'సుబ్బయ్య జీవితం' వీళ్లు చూడలేదు కాబట్టి ఇళ్ళకిపోయి మూర్ఛపోరు.

హాయిగా నిద్రపోతారు. కలలగనిరోదరు.

నేనుకూడా ఇంటికిపోతే బావుంటుందేమో.

గట్టు దిగుదామా, గట్టుమీద కూర్చునే ఉందామా అని తర్కిస్తున్నాడు సుబ్బయ్య.

"ఏమండీ సుబ్బయ్యగారూ ఇక్కడ కూర్చున్నారేం?"

అన్నా దావిడే ఎదురుగా నిల్చొని నవ్వుతూ.

రావడం చూడలేదు. ఆగడం చూడలేదు.

ఎవరీవిడ?

ఎవరా? 'ఎవరీవిడ' అని చూస్తూ ముంగిలా మాట్లాడకుండా చూస్తూ కూర్చుంటావా? మొద్దా!

ఈవిడ ఆవిడే!

ఆవిడే ఈవిడ!

నల్లచీరావిడ!

నల్లచీరావిడ నల్లచీర కట్టుకొంది.

నీలివెన్నెల్లో నల్లటి వలువుచీర వెనక ఆవిడ తెల్లగా మెరుస్తోంది.

నల్లటిచీర వెనక తెల్లటి జాకెట్టు పాలనురుగులా పొంగుతోంది.

తెల్లటి వెన్నెల్లో ఆవిడ నల్లటి కళ్ళతో చూస్తోంది.

మిలమిల మెరుస్తోన్న నల్లటి కళ్ళతో చూస్తూ తెల్లటిపళ్ళు కనపడేలా నవ్వుతోంది.

ఈవిడ మనుజకాంత కాదు.

ఈవిడ దేవతామూర్తి.

సుబ్బయ్యలో సంతోషం ఉప్పొంగి గట్లు తెంచుకొంది.

"ఏమండీ సుబ్బయ్యగారూ! ఇక్కడ కూర్చున్నారేం?"

ఎందుకూర్చున్నాను? ఎవరికోసం కూర్చున్నాను?

ఎందుకోసం? ఎవరికోసం?

నీకోసం! నీకోసం!

నీకొరకే ఎదురుచూస్తూ కూర్చున్నాను.

గాలిచేత ఎవరో కబురు పంపించేరు.

"అక్కడ కూర్చో! ఆవిడ వస్తుంది!"

వస్తావని ఎవరో వార్త తీసుకు వచ్చేరు.

అందుచేత నీగురించి నిరీక్షిస్తూ ఇక్కడ ఆసీనుడనైయున్నాను దేవీ!

"మీరు కన్పిస్తారుకదా అని మీకోసం కూర్చున్నానండి"

"ఏంగట్టివారండీ" అన్నా దావిడ నవ్వుతూ;

నవ్వుతూ అని, అన్నాక నవ్వింది.

కిలకిల కలకల జలజల జిలజిల నవ్వింది.

ఆ నవ్వుకి వెన్నెల సిగ్గు పడింది.

స్వర్గంలో దేవేంద్రసింహాసనంమీద కూర్చున్నవాడు సుబ్బయ్య.

ఆమెకూడా ఆ సింహాసనం ఎక్కింది.

వంతెనగట్టుమీద ఆవిడకూడా కూర్చొంది.

ఆవిడ దూరంగా కూర్చోలేదు.

సుబ్బయ్య ఎడంగా జరగలేదు.

"నే నిలా వస్తానని కలగానేరా?"

"ఆఁ"

"అయితే నాక్కూడా కలొచ్చింది"

"ఏఁవిఁటది?"

"మీరిలా అబద్ధాలాడతారని"

అసందర్భంగా ఉన్నట్టినీ, అర్థం లేనట్టినీ, నవ్వదగనిదినీ, అయిన ఆమాటకి ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఇంతరాత్రి అయాక మీ రెక్కణ్ణించి వస్తున్నారు?"

"సినీమా ఇప్పుడే విడిచేరు కాబట్టి ఇంతరాత్రయేక నేను వస్తున్నాను. కాని మీరు ఇంత రాత్రివేళ ఇంటికి వెళ్ళకుండా వంతెనగట్టుమీద కాసేరేం?"

"చెప్పేనుకదూ! మీకోసమే కాసుక్కూర్చున్నానని!"

నే నేనా? నేనే మాట్లాడుతున్నానా?

అతి స్వల్పంగా పరిచయం గల ఆడమనిషితో ఇలా పరిహాసాలాడుతున్నది నే నేనా?

"పోనిస్తురూ! సుబ్బయ్యగారూ! ... హాస్యానికేం గాని...అలా..."

"నా పేరు సుబ్బయ్యని ఎలా తెలిసింది మీకు?"

"ఎలా తెలిసిందో చెప్పుకోండి చూద్దాం"

"ఏమో!"

"చెప్పలేరా?"

"ఊహుఁ"

"ఆమాత్రం చెప్పలేరా! మీ అమ్మాయి కమల నా స్టూడెంటు గదండీ"

ఈ నిర్భాగ్యుడి పేరు తెలుసుకోవాలనే కుతూహలం ఈవిడకి ఎందుకు కలిగిందో! ఆశ్చర్యం!!

"అయితే మా అమ్మాయినడిగేరా నాగురించి?"

ఆవిడ సిగ్గుపడ్డాది.

"ఎందు కడిగేరు?"

ఆవిడ ఇంకా సిగ్గుపడ్డాది.

ఆవిడ అలా సిగ్గుపడ్డందుకు సుబ్బయ్యకి సంతోషం ఆశ్చర్యం కలిగి ఒక్కసారిగా ఆవిడయందు ఆదరణ, అభిమానం, అనురాగం, ప్రేమ, వాంఛ వగైరా వగైరాలన్నీ కలిగేయి.

"కానయితే, మీ పేరు చెప్పేరు కారేం నాతో?"

అందుకు జవాబుగా "తెలుసునండి మీసంగతి తెలుసు" అన్నా దావిడ తలా కళ్ళూ పోగ్గా తిప్పుతూ.

"ఏమిటి తెలుసు?..."

"నా పేరు మనోరమని మీరు తెలుసుకొనీ తెలియనట్టుగా నటిస్తున్నారనీ..."

"అయితే మీ పేరు మనోరమా?"

మొగవాళ్ళని ఆకర్షించడానికి స్త్రీలకి భగవంతుడు ప్రసాదించిన నేర్పంతా ప్రదర్శించిం దావిడ తలఊపడంలో.

కొంచెం సిగ్గు అభినయిస్తూ, తల ఆడిస్తూనే కిందికి దించింది. కొస్త పెదవులు కదల్చి నవ్వింది. ఒక్కరవ పెంకెతనంగా వాలుచూపు వారచూపు చూసింది. జారని పైట సర్దుకొంది.

"ఏం! నిజంగా ఇంతవరకూ నా పేరెరగరా మీరు?"

నా పేరు కమల నడిగి తెలుసుకున్నాది. అలాగే ఆమెపేరు నే తెలుసుకున్నానని అనుకొంటోంది.

"ఎరక్కేమి!"

అయితే మరి మళ్లీ నన్నెందుకూ అడిగేరు?"

"మీ నోటంట వింటే మధురంగా ఉంటుందని"

ఈరీతిగా, ఇంతసులభంగా నేను — సుబ్బయ్యని — నే నేనా మాట్లాడుతున్నాను??!!!

"అబ్బ! ఎంత గట్టివారండీ!"

అని తిప్పుకొంటూ తియ్యగా అన్నాదావిడ.

నేనా గట్టివాణ్ణి?? నేను గట్టివాడినా??

సుబ్బయ్యకి నవ్వొచ్చింది.

సుబ్బయ్య గట్టివాడంటే అనేకులు నవ్వుతారు. వేళాకోళంగా నవ్వుతారు.

సావిత్రి, వెంకట్రావు, అవధాని, రామస్వామి, ఎదటింటి మాస్టరు, పక్కింటి సూపర్ వైజరు అంతా నవ్వుతారు.

—మర్చిపోయేను—గవరయ్య నవ్వుతాడు.

గవరయ్య! గవరయ్య!

గవరయ్యతో ఉన్న తగాయిదా అంతా నెత్తిమీద పెట్టుకొని ఈవిడతో ఇలా ఎలా మాట్లాడగలుగుతున్నాను?

ఆశ్చర్యం! ఆశ్చర్యం!

"......అలా దీనంగా కూర్చున్నారేమండీ?"

"ఎవరు?"

"మీరు"

"ఏమిటన్నారునే?"

"అబ్బ! నామాట వింటేనా మీరు? ఇందాట్లానే వచ్చినప్పటికి ఎందుకలా దీనంగా ఉన్నారు? అలా అంత దీనంగా కూర్చోడం చూసి జాలేసిందన్నండీ నాకు"

జాలి! జాలి! జాలి!

ఈ విశాల విశ్వంలో సుబ్బయ్యని చూసి జాలిపడేవ్యక్తి సుబ్బయ్యే,

ఇంతవరకూ!

కాని, ఇప్పుడు—

ఈవిడకి నన్ను చూసి జాలి కలిగిందట!!

జాలి!!!

ఎంత చక్కటిమాట! ఎంత తియ్యటిమాట!

ఎంత చక్కటి తియ్యటి మనిషి ఎంత చక్కగా తియ్యగా అన్నాదామాట!!

ఎంత నిర్భాగ్యుడిగురించి అన్నాదామాట!!

ఆవిడ అలా అనగానే సుబ్బయ్యకి తన దురవస్థలన్నీ తలపుకివచ్చి ఒక్కసారిగా దుఃఖం కమ్ముకొచ్చింది.

దుఃఖం కమ్ముకు రావడంతో నోటమాట పోయింది. కంటనీరు నిండింది.

నీరునిండిన నయనాల్లోకి ఆమె విసీలనయనాలు జాలితో చూసేయి.

అతనికి దూరంగాలేని ఆవిడ అతనికి దగ్గరగా జరిగింది. అతని చెయ్యి చేతులోకి లాక్కుంది.

"అయ్యయ్యో! ఏమండీ సుబ్బయ్యగారూ, అలా వున్నారు?? ఒంట్లో బాగులేదా? ఏమొచ్చిందీ? మాట్లాడరేం??"

ఆమెని ఒక్కసారిగా కౌగలించుకొని, తన హృదయానికి హత్తుకొని, లోకంలో అందరి హృదయాలూ కరిగేలా ఏడవాలనిపించిందతనికి.

అలా చెయ్యలేక ఆమె చేతిలోంచి చెయ్యి తీసుకొని కళ్ళు తుడుచుకున్నాడు. తన చేతిని ఆమె పట్టుకున్నందుకు ఆశ్చర్యపడ్డం మర్చిపోయేడు.

"నా సంగతంతా చెప్తే తెల్లారిపోతుందండీ. అదంతా ఓ పెద్దగాథ"

అతనికి ఇంకా దగ్గరగా వచ్చి అతనిభుజం చేత్తో ఊపుతూ అడిగిందావిడ :

"అయ్యో! అదంతా ఏమిటో నాతో చెప్పరా?"

నాతో కూడా చెప్పరా అనేభావంతో అడిగిరదామె, అందరికంటే సుబ్బయ్యకి తనే దగ్గర మనిషయినట్టు.

బాధలోనే సుఖంగా ఉంది అతనికి, ఆమె అలా దగ్గరకి వచ్చి భుజంమీద చెయ్యి వెయ్యడంతో.

పరిచయం చాలా తక్కువ గల పరాయి ఆడమనిషి, రాత్రిసమయంలో రోడ్డుపక్క వంతెనగట్టుమీద వెన్నెల్లో కూర్చొని వెచ్చగా దగ్గరగా వచ్చి భుజంమీద చెయ్యివేసి మాట్లాడ్డం అసందర్భంగా గాని, అసహజంగాగాని ఉన్నట్టు సుబ్బయ్యకి తోచలేదు.

సహజంగానూ, సమయోచితంగానూ ఉన్నట్టే తోచింది.

"చెప్పండీ" అన్నాది మనోరమ.

ఎవడు చెప్పకుండా ఉండగలడు?

ఉండబట్టలేక ఉన్నదంతా చెప్పేడు సుబ్బయ్య.

అంతకు క్రితం సుబ్బయ్యని రెండుసార్లే చూసి, అతనితో ఒక్కసారే మాట్లాడిన మనోరమ అతని జీవితంలో తెలుసుకోవలసినదంతా తెలుసుకొంది ఆరాత్రి.

"మిమ్మల్ని చూస్తే నాకు నిజంగా జాలి వేస్తోందండీ"

ఆమె కళ్ళంట నీరు జారినట్టనిపించింది

కాని అతను గమనించినట్టు లేదు.

ఆమెతో అంతా చెప్పడంతో అతనికి దుఃఖోపశమనం అయింది. గొప్ప 'రిలీఫ్' కలిగింది.

అంతా చెప్పి అతను ప్రశాంతంగా కూర్చున్నాడు.

అర్ధరాత్రి అయింది. వంతెనమీద అక్కడా అక్కడా కూర్చొన్న కొద్దిమందీ ఎక్కడికో ఎక్కడికో పోయేరు. మంచు కొంచెం పడ్డంచేత అంతటా చల్లగా ఉంది.

పద్దెనిమిదేళ్ళకుర్రవాడొకడు ఒకవైపునుంచి వస్తూ, సుబ్బయ్య మనోరమలవైపు చూస్తూ చూస్తూ వచ్చి పక్కకితిరిగిచూసి, వెనక్కి తిరిగితిరిగి చూస్తూ చూస్తూ వెళ్ళేడు.

ఈర్ష్యతో, క్యూరియాసిటీతో చూస్తున్నాడు. చూసుకొంటూ పోయేడు.

నన్ను చూసి ఈర్ష్యపడుతున్నాడు.

అని అనుకోవడంతో సుబ్బయ్యకి ఎంతో ఉత్సాహం కలిగింది.

తీరని కోరికల్తో బాధపడుతూ వెళ్లింటాడు.

ఆడా మొగా ఇలా కూర్చున్నప్పుడు నేనూ అలాగే చూసేవాణ్ని.

నేనూ ఇలా కూర్చోగలుగుతానని ఎన్నడైనా అనుకున్నానా?

కాని—

అర్ధరాత్రివరకూ ఈ పెంట్లో ఇలా కూర్చోడం బావుంటుందా?

హాయిగా ఉంది.

కాని, బావుంటుందా, అర్ధరాత్రివేళ!

"అర్ధరాత్రి అవుతూందండీ"

"అయ్యో! మీకు ఆలస్యం అయిందో ఏమిటో! ఇంతవరకూ కూర్చోపెట్టేశాను"

హార్దీ! అలా వుండాలి ఆడమనిషి మాట చమక్!

నా విధవగోడవలన్నీ వెళ్ళబోసుకొని, అనవసరంగా ప్రయాసపెట్టి, ఈమెని అర్ధరాత్రివరకు నే నాపేస్తి "కాదు! నావల్ల ఆలస్యం అయింది" అంటున్నాదీమె!

పాపం ఈవిడకి చాలా ఓపిక.

ఈవిడ చాలా మంచిమనిషి, పాపం.

ఈవిడది చాలా జాలిగుండె.

ఈవిడ పరులకష్టాల్ని చూసి సహించలేని మనిషి.

ఈవిడ సద్గుణాలరాశి.
ఈవిడ అందాలరాణి.
ఈవిడ నా పెన్నిధి.
ఈవిడ నా అదృష్టం.
హాబ్బబ్బా! హాయ్యారే! ఆహాహా! ఓహోహో!
ఎంత హాయిగా ఉంది!
ఎంత విచిత్రంగా ఉంది!

ఇదంతా జరుగుతోందా ? ఆహా! జరుగుతోంది.

అయితే ఇదంతా ఎలా జరుగుతోంది??!!
దేవా! జగన్నాథా!
దేవీ! మనోరమా!
"మనోరమా, మనోరమా"
సుబ్బయ్యేనా ఇలా పిల్చినది? ఎంత ఆశ్చర్యం!
మెల్లగా మెల్లగా, బరువుగా బరువుగా, వెచ్చగా వెచ్చగా ఆమె తల వాలింది అతని భుజం మీద.

వణుకుతూ వణుకుతూ అతని చేతులు చేరేయి ఆమెచుట్టూ.

కళ్ళు మూసుకున్నారు, అలానే. కళ్లు తెరిచి గట్టు దిగేరు అలానే. గట్టుదిగి నడుస్తున్నారు అలానే.

ఓయీ, సుబ్బయ్యా! నీవు జాగ్రదవస్థలో నే ఉంటివా?

ఉన్నాను. లేను.
ఇదియంతయు స్వప్నమా? సత్యమా?
స్వప్నంకాదు. సత్యంకాదు.
కానిచో ఇంకయ్యది?

సత్యమైన స్వప్నం. యథార్థమైన స్వప్నం. కలకాని కల. నిజమైన కల. కలగాని నిజం. నిజంగాని కలగాని కల. ఆహ! ఆహ! కల నిజమయినదా? లేక నిజమే కలగా మార్పు చెందినదా?

అబ్బబ్బ! ఈ చొప్పదంటు ప్రశ్నలు ఇప్పుడెందుకు?

క్షమించు. క్షమించు.

చెట్టపట్టాలు వేసుకొని సుఖంగా మమ్మల్ని ఇంటికిపోనివ్!

పొందు పొందు సుఖముగ నుండుడు.
దగ్గరగా నడుస్తూ మాట్లాడుకోనివ్!
సరేసరే.
చిలకపలుకులు చెప్పుకోనీ!
సరే సరే.
కష్టసుఖాలు ఒకరినొకరు తెలుసుకోనీ!
సరే సరే.
వెన్నెల్లో వెచ్చగా నడవనీ!
సరే సరే.
ఈ స్త్రీరత్నాన్ని అదిమిపట్టనీ!
సరే సరే, సరే సరే.
"మీ ఇల్లెక్కడ?"
ఆమె చెప్పింది.
"రండి అక్కడవరకూ కూడావస్తా"

"ఇంతవరకూ వచ్చేరుగద! ఇంకా ఎందుకు మీకు శ్రమ?"

"మీతోవస్తే నాకేశ్రమా ఉండదు"

"నామీద అభిమానంకొద్దీ అలా అంటున్నారు"

"నన్ను రావద్దంటున్నారు. నామీద మీకు... ఆ అభిమానం లేదా?"

"లేదు కాబట్టే మీతో ఇలా వస్తున్నాను"

చేతులకింద నడుంమీద ఆనందపారవశ్యంలో గట్టిగా నొక్కాయి అతని చేతులు.

నాలుగురోడ్ల జంక్షన్‌వద్దకి వచ్చేరు. మర్రిచెట్టు వెలుగునీడల్లో నిల్చున్నారు. జనం సంచారం లేని రోడ్డుమీద చంద్రుణ్ణి అడ్డుతూంటే మర్రిచెట్టునీడలో నిల్చున్నారు, ఎదురెదురుగా

"అదేనండీ, నేనుండే ఇల్లు"

"అయితే వెళ్తారా!"

జవాబు చెప్పకుండా దగ్గరగా వచ్చింది. దగ్గరగా వచ్చిన అందమైన ఆడమనిషిచుట్టూ చేతులు వెయ్యకే తప్పదు.

ఆకులనీడల్లో చీర వలువు కలిసింది. వెలుగు జాడల్లో కళ్లు మెరిసేయి. మధురమైన వాసన వేసింది. మత్తుగా ఉంది.

ఎన్నడూ ఆడదాన్ని ఎరగనివాళ్ళాగ ఆమెని కౌగలించుకున్నాడు బలంగా గాఢంగా.

ఆమె పెదవులు ఉన్నాయి వెచ్చగా, తడిగా, తియ్యగా.

వీపు ఆమెది ఉన్నాది గట్టిగా మెత్తగా.

ఉన్నాదా మెజాకెట్టు పాలనురుగుపొంగు మెత్తగా మెత్తగా.

మనోరమ ఉన్నది ఆమె అతిమధురంగా.

"నామాట విని ఇప్పుడు ఇంటికి రాకండి. అద్దెలవాళ్ళంతా లేస్తారు. అర్ధరాత్రి..."

గిర్ గిర్ గిర్ గిర్.

"రేపు సాయంకాలం రండి. ఏం?"

ఏమిటేమిటి?

"రేపు సాయంత్రం ఒస్తారుగా"

"తప్పకుండా"

వెనకవైపు నడుంమీదా మెడమీద చేతులు వేసి అతణ్ణి దగ్గరగా లాగి గట్టిగా అదుముకొంది.

ఆమె జుత్తు అతనికళ్ళల్లో పడుతోంది.

ఆమె కుడిబుగ్గ అతని చెంపని అనింది.

ఆమె గుండెలు అతనికి ఆనుకున్నాయి.

ఆమె వూపిరి అతని వూపిరితో వేడిగా కలిసింది.

"ఇంక నన్ను వెళ్ళనివ్వండి! మళ్ళీ రేపేగా కలుసుకుంటాం! ఏమంటారు?"

"సరే"

ఆవిడ వెళ్లింది.

సుబ్బయ్య నీరసంగా నిల్చున్నాడు. అతనికి మతి చెడినట్టుగా ఉంది. నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు.

"మనోరమా! మమనోరరమా!"

మనోరమ ఇంట్లోకి వెళిపోయింది.

"ఈవిడ అరితేరినమనిషి"

అనుకోలేదు సుబ్బయ్య.

9

మర్నాడు ఉదయం.

ఏడుగంట లయింది.

సుబ్బయ్య తల దిమ్మెక్కి బరువుగా ఉంది.

సావిత్రి వంటగదిలో ఉన్నాది. కమలా క్రిష్ణుడూ బడికి వెళ్ళడానికి అప్పుడే తయారవుతున్నారు.

వంటగదిలోంచి గిన్నెల చప్పుడూ, వీధిలోంచి వాహనాలు చేసే చప్పుడు వినిపిస్తున్నాయి.

గోడమీద గడియారం దీనంగా మాస్తోంది.

గదిలో మేజామీద మాసిన గుడ్డమీద పెట్టిన గ్లాసుమీద మూతిగా పెట్టిన పాతపుస్తకపు అంచులు దీనంగా వేళ్లాడుతున్నాయి.

మూడుకోళ్లు ఒకరీతిగా ఉన్న నాలుగోకాళ్ళ మంచంమీద చిరిగిన పరుపుమీద చిరగని దుప్పటిమీద చిరిగిన బనియను, చిరగని షెరాయీ వేసుకున్న సుబ్బయ్య దీనంగా కూర్చున్నాడు.

సుబ్బయ్య సంతోషంగా లేడు.

రాత్రి జరిగినదంతా అతని మనసుని కలచివేస్తోంది.

రాత్రి పొందిన సుఖం రాత్రితోనే పోయింది.

ఈ మనోరమ ఎవరు?

తల్చుకుంటే నాకు భయంగా ఉంది.

ఎటువంటి మనిషో, ఏమిటో!

నాగురించి అంతా ఆమెకి చెప్పేశాను.

ఆమెగురించి నాకు తెలిసినదేమిటి?

ఆమెది ఏలూరు. ఆమె ఇక్కడ స్కూల్లో టీచరు.

అంతే తెలుసు నాకు.

అంతే తెలుస్తేనేం? ఇంకా ఏం తెలియాలి నీకు?

నిన్న రాత్రిలాంటి అనుభవం నీ జీవితంలో ఎన్నడైనా ఎరుగుదువా నువ్వు??

నిన్న రాత్రి, నిన్న నిన్న, నిన్న రాత్రి నిన్ను స్వర్గంలోకి, వైకుంఠంలోకి, కైలాసంలోకి ఇంకా ఇత్యాదుల్లోకి తీసుకుపోయింది కదా ఆవిడ!!!

అందు కామెకి యావజ్జీవం కృతజ్ఞుడివిగా ఉండక ఆమె తలపుకి వచ్చేసరికి బెదురుతూ భయపడుతూ—

"ఆవిడ మళ్ళీ కనిపించకపోతే బావుండును"
అనుకొంటున్నావా?

నీకు విశ్వాసం లేనేలేదు. నీకు సిగ్గూ లేదా?

ఉంది. నాకు భయంగా ఉంది నాకు పెళ్లాం పిల్లలూ ఉన్నారు.

నా ఇంటికివచ్చి నా పీకలమీద ఆవిడ కూర్చుంటేనే నేం చేసేది?

నువ్వు పిరికిపందవి. కృతఘ్నుడివి.

ఏదో ఉద్యోగం చేస్తూ నలుగుర్లోనూ గౌరవంగా మర్యాదాగా కాలక్షేపం చేస్తూంటే ఈవిడ నన్ను నలుగుర్లోనూ......

నీ గౌరవ మర్యాదలు ఏడ్చినట్టే ఉన్నాయి.

ఈరోజు గవరయ్యవచ్చి గుమ్మంలో నిల్చొని, నిన్ను టకాయించి, బూతులుతిట్టి కేకలు వేసినప్పుడు అందరికీ తెలుస్తుంది నీ గౌరవం, నీ మర్యాదా.

అమ్మయ్యో! గవరయ్య సంగతే మర్చేను!

సుబ్బాయ్యకి గుండె దడపుట్టుకొచ్చింది. వీధిలోకి వచ్చేడు, ఇంట్లో సావిత్రి కొరకొరలాడుతోంది. ఎదటింట్లో మాస్టరు పరిస్థితి ప్రమాదంగా ఉంది. నిరాశచేసుకున్న అతని భార్య అందరి గుండెలూ కరిగేట్టు వెక్కి వెక్కి ఏడుస్తోంది. వీధిలో ఎర్రచీరమనిషి వెళిపోయుండాలి. లేడిపిల్లలు కనిపించలేదు.

"ఇవాళ కేదో చెడ్డరోజులా తోస్తోంది నాకు"
ఏం జరగనున్నదో ఏమిటో?
ఇవాళో రేపో గవరయ్య ఎర్రకళ్లతో వస్తాడు.
కోపంతో ఎర్రగా మండిపడతాడు.
ఎవరి దా కారు???
గవరయ్యో—!!! ???
క్షారు క్షారు!!!
బలికేను!
కాని గవరయ్యవస్తే ఏం చేసేది?
చేసే దేముంది? పోతాను.
ఆఁ! పోతాను!

మనోరమ దగ్గరికి పోతాను!

మనోరమ నాకు అండగా నిల్చొంటుంది.

అక్కడకే పోతాను. వళ్లో తలపెట్టుకు పడుక్కుంటాను.

నాకే భయమూ రానివ్వదు మనోరమ.

హబ్బ్బ! గత రాత్రి! హబ్బ్బ!

ఎంత హాయిగా ఉంది! ఆమె సాయం ఎంత మక్కువతో ఉంది! ఆమె ఎంత మధురంగా ఉంది!

మనోరమ దగ్గరికిపోతాను.

ఇందాట్లా......

నేనో వెధవని! పరమ దుర్మార్గుణ్ణి!

ఇందాట్లా ఎంతటి దురాలోచన్లు వచ్చేయి!!

నాది పాపిష్టి మనసు. ఎంత అమాయకురాలి గురించి ఎంత అన్యాయంగా తలచేను!

అయినా ఈరోజు బాగులేదు.

అంతా చెడ్డగా ఉండేట్టుంది.

అని సుబ్బయ్య ఆలోచిస్తూ ఉండగా పోతన్న వచ్చేడు.

కొత్తకుస్తులు వేసుకున్నాడు పోతన్న. తెల్లటి వంకీ పాగాచుట్టేడు. నోట్లో పొడుగాటి చుట్టతో తాజాగా వచ్చి.

"దండాలు బాబూ" అన్నాడు.

అప్పుడే పంపించేడు మనిషిని. స్వయంగా రాలేదు. అదీ కొంత నయమే.

"ఏం పోతన్నా, ఏమిటి విశేషాలు?"

"ఏం లేవు బాబూ" అన్నాడు అరుగుమీద కూర్చున్న పోతన్న.

"ఏమంటారు మీ గవరయ్య"

ఆరిపోతూన్న చుట్టని బాగా దమ్ములాగి ఆరిపోకుండా చేసేడు గవరయ్య.

"ఇప్పుడు ఖాళీగా ఉన్నానండి"
"అది కాదోయ్! మీ గవరయ్య......"
"ఏం చేస్తున్నాడో తెలీదండి నాకు"
"ఏం?"
"వాడి కొలువుకి దండం పెట్టి మానేశానండి"
సుబ్బయ్య కొంచెం కలవరపడ్డాడు.
"ఏమీ? ఏమీ?"
"మానేశానండి"
"ఎందుకు మానేశావు?"
"వాడికీ నాకూ సరిపడలేదండి"
"ఎందుచేత?"

"సరిపడలేదండి. అంతే!"

"సరేలే. కాని, ఎందుచేత సరిపడలేదూ అంట?"

"తత్వాలు వేరయిపోయాయండి."

"ఆఁహాఁ అందుకా?" అనేశాడే కాని సుబ్బయ్యకి గవరయ్య కొలువు అత నెందుకు చాలించుకున్నాడో అర్థం కాలేదు. "సరే! నాకెందుకు? చెప్పడానికి ఇతని కిష్టం లేనట్టుంది" అనుకున్నాడు.

"అయితే ఇహ ఏం చెయ్యదల్చుకున్నావ్"

పొగ వదుల్తూన్న పోతన్న కొంతసేపయాక చెప్పేడు.

"ఏదీ నిశ్చయం చెయ్యలేదండి. ఇంకా నిన్న నే కదా తిరుపొచ్చింది."

అయితే ఇద్దరికీ తిరుపొచ్చిందన్న మాట.

"ఎందుగురించోయ్! తిరుపొచ్చింది?"

పోతన్న చెప్పలేదు.

"ఏదో అయిపోయింది కదా బాబూ! మరి నన్నడక్కండి"

అడక్కండంటే అడక్కూడ దన్నమాటే!

"సరే పోనీ! కాని ఇంతికీ ఇప్పుడేం చెయ్యదల్చుకున్నావ్?"

"చెప్పేను కదా! ఏదీ నిశ్చయం చెయ్ లేదండి"

"అవునవును! సరే సరే"

పోతన్న చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు.

సుబ్బయ్య సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు.

ఎనిమిదిగంటలే అయినా ఎండ జాస్తిగా ఉంది. నీడపట్టున నడిచిపోతున్నారు వీధిలో జనం.

పక్క కిళ్ళీ దుకాణంవాడు "ప్రేమ" సినిమా లోని సరికొత్త పాటపాడుతున్నాడు.

ఎదటి కిళ్ళీ దుకాణంవాడు "పెళ్ళిచేసి చూడు" లో సరికొత్త గ్రామఫోన్ రికార్డు పెట్టేడు.

ఈడొచ్చిన పిల్ల అరటిపండు తింటూ రికార్డు వింటోంది.

ఈడురాని పిల్లడు బెంచీమీద కూర్చొని బీడీ కాలుస్తున్నాడు.

వీధిలో ఇప్పుడు అంతా మామూలుగానే ఉంది.

సుబ్బయ్యని మామూలు భయాలు పీడిస్తూనే ఉన్నాయి.

పని మానెయ్యనట్టు పోతన్న మామూలుగానే ఉన్నాడు.

"అయిదువందల సంగతి ఏం చేశారండీ బాబూ" అని అడిగేడు పోతన్న.

"అదేనోయ్ ఆలోచిస్తున్నాను"

పోతన్న 'ఫ్రీ' గా ఉన్నాడు. ఇహ ఇతన్తో 'ఫ్రీ' గా మాట్లాడవచ్చు.

"ఇప్పుడీపుట్టుకి అమాంతంగా గవరయ్యొస్తే ఏం చేస్తారు?"

ఏం చేస్తాను?

మనోరమ దగ్గరకి పారిపోతాను.

అటువంటి మనిషి లేదు మరింక.

నామీద ఈగని వాలనివ్వదు.

నేనో వెధవని కాబట్టి ఇందాట్లా అలా భయపడ్డాను.

ఎంతమంచి దెంత మంచిది!!

అక్కడికే పోతాను.

వెళ్ళగానే కౌగలించుకొని ముద్దెట్టుకొంటుంది.

వెంటనే వళ్ళో పడుక్కుంటాను.

అక్కడికే, ఆమె యింటికే పోతాను!

గవరయ్యొస్తే ఏంచేస్తాడు?

అయిదువందలూ ఇమ్మని అడుగుతాడు.

అడగనీ, పదిసార్లు, వందసార్లు, వెయ్యిసార్లు, లక్షసార్లు అడగనీ!

నిల్చున్నపాట్న అయిదువంద లివ్వగలనా?

నేనేం జమీందార్నా? కంట్రాక్టర్నా?

అంత సొమ్ము ఇచ్చుకోగల్నా?

ఇవ్వలేనే! ఇవ్వలేను!

ఇచ్చుకోలేక పోయినప్పుడు ఇవ్వకపోతే తప్పేముంది?

ఇవ్వలేను! ఇవ్వను!

ఇవ్వను!!!

గవరయ్య కబురు పంపిస్తే ఇవ్వనని చెప్తాను.

గవరయ్యొచ్చి అడుగుతే—

ఇవ్వనని చె...కనిపించకుండా పారిపోతాను.

ఆఫీసులో ఎలానూ అడగడు.

పైన నేను కనిపించను.

మనోరమ దగ్గరకి పోతాను.

పోయి పైటవెనక దాగుంటాను.

ఉంగరాల జుత్తులో ఇరుక్కుంటాను.

వళ్ళో పడుక్కుంటాను.

"గవరయ్యడుగుతే సొమ్మివ్వనని చెప్పెయ్యండీ"

పోతన్న కూడా అదే సలహా ఇస్తున్నాడు.

మంచిమాట చెప్పేడు.

మంచి సలహా ఇచ్చేడు.

శాబాస్! పోతన్నా!

"కాని, ఓయ్ పోతిన్నా! అలా అనేస్తే గవరయ్య ఏం చేస్తాడంటావు?"

పోతన్న నోట్లోంచి పొగపోయి పైకి వచ్చింది.

"ఏం చేస్తాడు? ఏదో ఒకటి చేస్తాడు. అలా భయపడితే మీలమీద ఇంకా కూర్చుంటాడు. సొమ్ము మళ్ళీ ఒస్తుందనే ఇచ్చేడా మొదట్లో! నే నెరగని సంగతా ఇదంతా!"

"అవునవును, బాగా చెప్పేవు."

"అంచేత భయపడక 'ఇవ్వన'ని గట్టిగా చెప్పెయ్యండి"

"అలాగే మరి, అలాగే చెప్తా"

"లేకపోతే ఈ శని మిమ్మల్ని వదల్దు మాసుకోండి"

అని చెప్పి పోతన్న లేచేడు.

"అప్పుడే వెళ్తావా!"

"చిత్తం"

"మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావు?"

"ఇలా వస్తా నే ఉంటాను బాబూ"

"కనిపిస్తా ఉండు స్మీ"

"కనిపించనా మరి"

అని నడిచేడు పోతన్న. నడుస్తా సందు మళ్ళి కనిపించకుండా పోయేడు.

అతను ఉన్నంతసేపూ సుబ్బయ్యకి ధైర్యంగా వుంది. భయం ఎరగని మనిషిలా కనిపిస్తావతను.

"ఈ మనిషి సాయంగా నిల్చుంటే మన కింకే భయమూ ఉండదు" అనేట్టు చేస్తాడు. అతను ఉన్నంతసేపూ ధైర్యంగానే ఉంది. అతను వెళ్లిన తరువాతకూడా కొంతసేపు ధైర్యంగానే ఉంది. కాని మరో పావుగంటకల్లా అనుమానం భయం తలలెత్తేయి.

"ఇవ్వకపోతే సరి" అని ఇప్పుడు అనుకోడం సులభమే!

అనుకోడం చాలా సులభం.

కాని—

పెద్దపులిలాగ బొద్దు మీసాల్తో ఎదురుగా గవరయ్య నిల్చున్నప్పుడు ఎలా చెప్పడం ఆ మాట!

ఎలాగో ఓలాగ కష్టపడి ఊపిరి బిగపట్టి చెప్పేస్తా ననుకోండి.

అంతటితో అయిపోలేదే!

అటుతరువాత?—

గవరయ్య ఊరుకుంటాడా?

తల్చుకుంటే గవరయ్య ఎంతటివాడైనా సరే భస్మం చెయ్యగలడు.

అందుచేత—

కొంతసేపు ఆలోచించేడు సుబ్బయ్య.

మరోక సిగరెట్టు కాల్చి పారేశాడు.

"సరే ఇలా చేద్దాం" అనుకున్నాడు.

పోతన్న చేత కబురు పంపిస్తాను.

నేను గవరయ్య ఎదటపడక్కర్లేదు.

"ఆయన సొమ్మివ్వట్టండి" అని పోతన్న వెళ్ళి చెప్పేస్తాడు.

పోతన్న ఎంతో మంచివాడు. నాకు ఆమాత్రం ఉపకారంచేసి పెట్టకపోడు.

కాని—

తరువాత గవరయ్యని ఎలా తప్పించుకోడం?

రోజూ ఆఫీసుకి వస్తాడు. కాని ఆఫీసులో ఎందుచేతనో ఎడంగా పిల్చి అయినా అడగలేదు నన్ను. ఇకమీదకూడా ఏమైనా వస్తుందేమోనని భయంకాబోలు. కాని ఇంటికి రాగలడు. ఇంటికి వచ్చి అల్లరిచేస్తే అప్పు డేంచెయ్యడం?

మనోరమ ఇంటికి పోతాను.

కాని—

గవరయ్య అక్కడికూడా వస్తే??

వస్తే ఇంకేమైనా వుందా!!!

మనోరమ హడిలిపోదూ!!!

అదిన్నీకూడా అల్లరిచేస్తే చేస్తాడు గవరయ్య.

ఏమిటి సాధనం?

సుబ్బయ్యకేమీ పాలుపోడంలేదు.

ఆఫీసుకి వేళవుతోందని కూడా అతను తెలుసుకోలేదు.

"ఏం బావా! ఆఫీసుకి టైమవుతూన్నట్టుందే" అన్నాడు వెంకట్రావు.

అతనలా అడిగేవరకూ అతను వచ్చినట్టుగా చూడలేదు సుబ్బయ్య.

"ఆ, ఇదిగో, వచ్చేవా! రా కూర్చో"

"కూర్చోడానికి 'టైమ్' లేదు, కాని, నువ్వింకా రాత్రిసంగతిగురించే ఆలోచిస్తున్నావు కదూ?"

"అవునోయ్. అవును మరి"

"ఆలోచనలన్నీ ఎత్తి కట్టేసి నే చెప్పినట్టూ చెయ్యి"

నువ్వు చెప్పినట్టూ చెయ్యబట్టే నా అవస్థ ఇంత మట్టుకొచ్చింది.

"ఏమిటె, నువ్వు చెయ్యమనేది?"

"గవరయ్యకి సొమ్మివ్వకు"

ఇలాటి సలహాలు నేనూ ఇవ్వగలను.

"నన్ను రోజూ అడుగుతున్నాడే"

"అడగనీ"

అడగనీ! సులువుగా అనేశావు. సొమ్ము నువ్వే పట్టుకుపోయేవు. కాని, తెచ్చినది నేను. అందుచేత నిన్నా నన్నా అడుగుతాడు? అడిగేది నిన్ను కాదు కాబట్టి అంత సులభంగా అనేశావు "అడగనీ" అని.

"అడుగుతున్నప్పుడు ఇవ్వనని ఎలా చెప్పడం?"

"నోటితో"

ఛీ! అనుకున్నాడు సుబ్బయ్య తన మనసులో.

ఛీ! ఈలోకంలో ఎవ్వరికీ ఉపకారం అన్నది చెయ్యకూడదు గాక చెయ్యకూడదు.

పోనీకదా అని ఈ మనిషికోసం నోరు విడిచి చెయ్యిచాచి సొమ్ము సంపాదించి తెచ్చి చేతుల్లో పోస్తే, తిరిగి ఆ సొమ్ము ఇవ్వడం మానేసి సిగరెట్టు కాలుస్తూ దర్జాగా "సొమ్ము ఎగ్గొట్టు" అని సలహా ఇస్తున్నాడు.

అంటే అర్థం?

డబ్బు కోసం గవరయ్య నన్ను జెయిల్లో కూర్చోబెట్టినా సరే.

ఇతను, ఈ వెంకట్రావు, నా బావమరిది.

వాడు ఆ సొమ్ము ఇవ్వడన్నమాట!

ఛీ! ఛీ!

"ఛీ! నీకు ధైర్యంలేదోయ్. నీతో ఏం చెప్పినా లాభం లేదు" అన్నాడు మౌనంగా కూర్చొన్న సుబ్బయ్యతో వెంకట్రావు వెళిపోతూ.

సుబ్బయ్యకి దుఃఖం వచ్చింది.

ఈ వెంకట్రావుకి సొమ్ము తిరిగి యిచ్చే ఉద్దేశం లేదు. వాడిగ్గర సొమ్ములేదు. అంతసొమ్ము వాడికెవరూ అప్పివ్వరు. ఇచ్చినా తిరువాత తీర్చుకోలేడు.

తెచ్చిన సొమ్ము తీరుస్తేనేగాని గవరయ్య ఊరుకోడు.

అహా! నుదుటిమీదరాత ఎవడు తప్పించగలడు? ఆరోజు వెంకట్రావు రాకముందు ఎంత హాయిగా ఉన్నాను! ఎంత సుఖంగా నిష్పూచీగా ఉన్నాను! ఈరోజున ఇలా పీకలమీద కత్తితో ఉంటానని కలలో అయినా అనుకున్నానా?

చేతులారా చేసుకొన్నదానికి ఫలితం అనుభవించాలి.

అనుభవించక తప్పదు.

అటు ఆఫీసులో చూస్తే రివర్సొచ్చింది.

హెడ్ క్లార్కు పెద్దపులిలాగ మీద పడిపోతున్నాడు.

హబ్బబ్బా! నరకంలో ఉన్నా ఇంతకంటే బావుంటుందేమో!

ఆరోజునపడ్డాను నరకకూపంలో!

ఇహ వేరే నరకం లేదనుకుంటాను!

ఇల్లొక నరకం! ఆఫీసొక నరకం! నా మనసంతా ఓ పెద్ద నరకం!

ఈ నరకంలో నే నెందుకిలా ఉండాలి? కారణం ఏమిటి?

ఏమో! ఎవడు చెప్పగలడు?

ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే ఇహ తెల్లారిపోతుంది.

ఇహ లేచి ఆఫీసుకి పోవాలి.

సుబ్బయ్య లేచి, ఇంట్లోకివెళ్లి కొంతసేపటికి వీధిలోకి వచ్చేడు.

పగలు పదిన్నరగంటలకి వీధిలో మామూలుగా ఎలా ఉంటుందో ఆరోజు అలానే ఉంది.

సుబ్బయ్య రోజూలాగే ఆఫీసుకి వెళ్తున్నాడు.

సుబ్బయ్యలాగ ఎండలో నడిచేవాళ్లు నడుస్తూనే ఉన్నారు. నడవనివాళ్ళు బళ్ళల్లో, రిక్షాల్లో, కార్లలో పోతూనే ఉన్నారు. అంతా మామూలుగానే కనిపిస్తున్నారు.

నేనుకూడా వాళ్ళకి మామూలుగా నే కనిపిస్తున్నానా?

అయివుంటుంది.

లేకపోతే వాళ్ళకేం తెలుస్తుంది? నేనెవరో వాళ్ళకేం తెలుస్తుంది?

సుబ్బయ్యనే మనిషి గవరయ్యనే మనిషికి అయిదువందలు ఇవ్వవలసి ఇవ్వలేక బాధపడుతున్నాడని ఈ రోడ్డుమీద పోతూన్నవాళ్ళకేం తెలుసు?

రిక్షాలో వెళ్తూన్నది మంగలేనా?

అవును మంగలే!

Barber, the great !

ఈ బార్బర్‌కి ఈ సుర్బయర్ సంగతి తెలుసా?

ఈ శార్బయ్యకి ఈ సుర్బయ్య సంగతి ఎలా తెలుస్తుంది?

నా శిరోభారమనుదీర్చ నా శిరోజములనుబట్టి చించి కత్తిరించి చెండాడినావే! కష్టించి ఒడలు వంచి నా మెడలు వంచి నా సుదీర్ఘ శిరోజముల త్రుంచినావే! గబ్బువాసనతో ఘర్మపూరిత ఘర్మ జలముల గబ్బువాసనతో నా నాసారంధ్రముల త్రేల్చినావే!

నాకింక పిచ్చెత్తుతుంది.

నాకు బాధగా ఉంది! ఎందుచేత? ఆ మంగలి వాడికి తలనొప్పిగా ఉందా? ఉంటే, ఎందుచేత? ఉండకపోతే, ఎందుచేత?

నా తలలోని బాధలు వాడి నొప్పిఉన్న, లేని, తలకి ఎందుకు తెలియవు?

తలా తలా అంత దగ్గరగావున్నా ఒకరి తల లోనిది ఇంకొకరికి ఎందుకు తెలియదు?

ఎందుచేత తెలియదు?

భగవంతుణ్ని అడగాలి!

అడగడానికి అతడున్నాడా లేదా?

ఈ ప్రశ్నకి జవాబెవర్నడగడం?

అతణ్ణే అడగాలి.

"ఏమయ్యో, సుబ్బన్నా!"

సుబ్బయ్య ఉలిక్కి పడ్డాడు.

ఉత్తరదిక్కుకి సుడ్లుపెట్టి, దక్షిణ దిక్కుకి ముఖం తిప్పి చూస్తూ వచ్చేడు అవధాని.

"నువ్వటోయ్! ఎవరో అనుకున్నాను"

"రామస్వామనుకున్నావేమిటి? అలా తుళ్ళి పడ్డావు?" అన్నాడు అవధాని నవ్వుతూ.

సుబ్బయ్యకెంతమాత్రం నవ్వు రాలేదు.

అవధానిమాత్రం అలా కొంతసేపు నవ్వుతూనే నడిచేడు.

నడుస్తూ నడుస్తూ నవ్వులేని సుబ్బయ్య ముఖంలోకి చూసేడు.

"ఏం సుబ్బన్నా, ముఖం వేలేశావ్?"

"నా మనసు బాగులేదోయ్!"

"రామస్వామి తీసిన దెబ్బ ఇంకా మాన్లేదుటోయ్"

అన్నాడు అవధాని కొంటెగా నవ్వుతూ.

"అవునవును. నీకు నవ్వుతాలుగా ఉండదా మరి"

"సరేలే. ఉడుక్కోకు. కాని సుబ్బన్నా ఓమాట. అడుగుతాను?"

"ఓ, అడుగు"

"గవరయ్యని ఆరోజు సొమ్ము అడిగేవు కదా ఎందుకడిగేవు?"

"వెంకట్రావు అడగమన్నాడోయ్! చెప్పేను కదూ నీతో"

"గవరయ్యనే ఎందు కడగమన్నాడో నీకు తెలుసా?"

తెతెతెతె లులులు లిలిలి.

"గవరయ్య బిల్సు నీదగ్గిర అప్పుడు ఉన్నాయి. అవునా?"

"అవునవున్లే"

"అందుచేతనే వెంకట్రావు గవరయ్య నడగమన్నాడని నీకు తెలుసు"

....

"అందుచేతనే అడిగేవు. అడగ్గలిగేవు గవరయ్యని"

"ఏమిటి?"

"డబ్బోయ్! డబ్బు!"

అవధాని ఇవాళ ఇలా ఈరీతిగా తారుమారుగా మాట్లాడుతున్నాడెందుచేత? వ్యాపారం పూర్తిగా మారింది ... హెడ్‌క్లార్కు ఉపదేశించేడా?... ఎవర్నీ నమ్మకూడదు...

"సొమ్ము నీకోసం అడగలేదు. నిజమే"

"నాకోసం కానే కాదోయ్!"

"అవును మీ బావమరిదికే ఇచ్చేవు"

"అవునోయ్! వెంకట్రావుకే ఇచ్చేను"

"కాని సొమ్ము గవరయ్య నీకేనా ఇచ్చేడు?"

"అవును"

"ఇవాళ మళ్లీ అడుగు. ఇస్తాడేమో చూద్దాం"

"ఇవాళెందుకిస్తాడు?"

"ఎందు కివ్వడు?"

బిల్సు నాదగ్గిర లేవు కాబట్టి.

"ఏం మాట్లాడవు? ఇవాళ నీచేతిలో వాడి బిల్సు లేవు. ఆరోజున ఉన్నాయి..."

అవును.

"...అందులో ఏదైనా సదుపాయం చేస్తావని వాడనుకున్నాడు..."

అవును.

"...అలాంటి ఆశ వాడికున్నాదని నీకు తెలుసు."

అవును.

"...అందుకనే వాణ్ణి అయిదువందల లడ గ్గలిగేవు..."

అవును.

"...నా జేబుద్దేశంతో సామ్మిచ్చేడో నీకు తెలుసు..."

అవును.

"...చూడూ! సుబ్బన్నా! మనం అను కున్నంత అమాయకులం కామోయ్ మనం, సుబ్బన్నా! వాడు వేసిన దొంగలెక్కలన్నీ మధ్య పర్చి వాడికి నువ్వు సదుపాయం ఎప్పుడూ చెయ్య దల్చుకోలేదు. నిజమే! కాని వాడు, పాపం, అదుద్దేశం తోటే, అంటే తెలుసుకదూ నీకు,..."

లంచం, లంచం, లంచం.

"...ఆదుద్దేశంతోటే పాపం అయిదువందలూ నీచేతుల్లో పోసేడని నీకు తెలుసు..."

అవునవును!

"కాని వాడి దొంగలెక్కలేవీ కప్పిపుచ్చ లేదే నేను!"

"కప్పిపుచ్చలేదు. నిజమే. అంటే, గవర్న మెంటుని దగా చెయ్యలేదు, నిజమే. చేసినదగా గవరయ్యని చేసేవు. అవునా?"

ఈ అవధాని నన్ను దగా చేసేట్టున్నాడు.

"నా డివ్వడమూ తప్పులేదు. నువ్వు పుచ్చు కోడమూ తప్పుకాదు. వాడి కొంచమైనా సదు పాయం—చెయ్యడాని కప్పుడే పీటు మారిందా యను—పోనీ సదుపాయం చెయ్యకపోయినా ఫరవా లేదు. కాని నువ్విలా పసవలా ఉంటేమాత్రం, సుబ్బన్నా, రామస్వామిగారే కాదు, అంతా హింసి స్తారు నిన్ను. చూసుకో!"

హింస! హింస!

ఇప్పుడు మాటల్తో హింసిస్తున్నావు నన్ను, నువ్వు; మాట్లాడకపోయినా హింసిస్తుంది సావిత్రి.

రామస్వామి రావణాసురుల్లాగ హింసి స్తున్నాడు.

అందర్నీ మించిపోయేడు, గవరయ్య.

హింస! హింస!

"పోనీ, నే నడగడం తప్పేనోయ్!"

"తప్పుకాదోయ్. అడగడం పుచ్చుకోడాల్లో ఏమీ తప్పులేదు"

"అలాకాక్కాదు, తప్పేఅనుకో. తప్పేఅనుకో. ఒప్పేఅనుకో, అడగడం అడిగేను. ఇవ్వడం అతను ఇచ్చేడు. ఇచ్చినప్పుడూ సొమ్ము మళ్ళీ నా దగ్గ ర్నుంచి పుచ్చుకుందా మనుకున్నాడా?"

"ఎలా అనుకుంటాడు?"

"కాని ఇప్పుడు చంపేస్తున్నాడోయ్"

"ఎందుకు?"

"అయిదువందలూ తిరిగి ఇచ్చెయ్యమని"

"ఏమిటీ??!! తిరిగి ఇమ్మంటున్నాడా?"

"అవునోయ్"

"'చిత్తం, చిత్తం, దాఖలు చేయించు కుంటాను' అనేశే ఉంటా పీపాటికి, అవునా?"

"అనక ఏంచేసేది?"

"నీలాటి చవటపెద్దమ్మ తప్పించి ఇంకెవడైనా అలా అంటాడా?"

"అనక తప్పింది కాదు"

"అనక తప్పింది కాదేం? ఎందుచేత? ఆడదాని కన్నా అర్థానం అవడంచేత! నీలాటి వెర్రివెధవ ఎక్కడా ఉండడనుకో! ఆ వెధవ, దబాయించడం బాగుంది. నువ్వు హాతోస్మి, హాతోస్మి, అనడం మరీ బాగుంది..."

"ఏం చెయ్యడం చెప్పూ మరి?"

"ఏం చెయ్యాలా? చెప్పు తీసుకొట్టాలి వాణ్ణి నిన్నూకూడాను."

'అదికాదోయ్, అవధానీ! కొంచెం శాంతిద్దూ! కేకలెందుకూ వెయ్యడం? నాకు నీ సలహా కావాలి. కేకలు కాదు"

"కేకలు వేస్తానా? ఇంకా వేస్తానా?"

"అబ్బ! నే చెప్పేది వినవోయ్ మరి"

"సరే చెప్పు"

సుబ్బయ్య చెప్పేడు.

"ఇహ ఇవాళో రేపో వచ్చి పీకలమీద కత్తిలా కూర్చుంటాడు" అని ముగించేడు.

అవధాని విన్నాడు.

విన్నాక 'అమ్మ! దొంగవెధవ అంత దౌర్జన్యం చెయ్యబోతున్నాడేం?' అన్నాడు.

"చేస్తున్నాడు"

"నాతో ఇదివరకే ఎందుకు చెప్పేవు కావు?"

"క్షమించు మరి, పొరపాటే అయింది. కాని నన్నిప్పుడు ఏం చెయ్యమంటావో చెప్పు!"

వెంకట్రావునీ, సుబ్బయ్యనీ, గవరయ్యనీ బూతులు తిట్టవిడిమ్మట సుబ్బయ్యకి సలహా ఇచ్చేడు అవధాని.

"వాడి కొక్క దమ్మిడీ ఇవ్వకు! ఇవ్వనని చెప్పెయ్! వాడేం చేస్తాడో నే చూస్తా. నీమీద దౌర్జన్యం చేస్తే ఆఫీసులో అందరిమీదా చేసినట్లే. అందుచేత "అయిదువందల్లోనూ ఒక్క కాణీ అయినా ఇచ్చేదిలేదు" అని చెప్పు కచ్చితంగా, నీకే 'ఢోకా' రాకుండా నే చూస్తా"

"అంతే నంటావా?"

"అంతే!"

సరే! అవధానికూడా ఇదే సలహా ఇస్తున్నాడు.

సరే! ఇదే బావుంది.

లేస్తూ నే అనుకున్నాను సొమ్మివ్వలేనని.

ఇవ్వకివ్వకని చెప్తున్నారు పోతన్నా, వెంకట్రావూ, అవధానీ.

ఇవ్వనని గవరయ్యతో చెప్పగలనా?

ఇదే వచ్చింది నాతో చిక్కు.

అయినా ఫరవాలేదు! అ చెప్తాను!

అవధాని ఆసరా ఉన్నాడు కదా!

అవధాని గట్టివాడు!

గవరయ్యని మింగెయ్యగలడు అమాంతంగా.

గవరయ్యొస్తే చెప్పేస్తాను!!!

10

ఆరోజు సాయంకాలం వీధిలో వేలజనంలో ఒకడుగా సుబ్బయ్య నడుస్తున్నాడు.

తొందర తొందరగా నడుస్తున్నాడు.

తేలిగ్గా తేలిపోతూ పోతున్నాడు.

మాంచి హుషారా ఉన్నాడు.

బహు సంతోషంగా ఉన్నాడు.

ఆర్యులారా! చెవులొగ్గి వినుడు!

Please lend me your ears.

వీనుల విందుగా నే చెప్పగా మీరు వినుడు!

—శ్రీరామ రామా! ఒక్క కాణీ ధర్మం ఇప్పించు తండ్రీ.

వినండి! వినండి!

—శ్రీరామ రామా! తండ్రీ! ఒక్క కాణీ...

Hcar! Hear!

—......దయ చేయించవా ప్రభూ!

రామరామ శ్రీ రామా రామా రామా రఘురామ

కాణీఅయినా ఇవ్వను యివ్వను ఆ నేశినాడండి!

ఢరా ఢీ—

అప్పుడా సుబ్బయ్య దొరవారు ఆసేవ
కాధమునితో ఇంకా ఏమని చెప్పి
నారండీ??

చాలా చెప్పినారండీ!!

"ఓరీ పోతురాజా! నీవుపోయి ఆగవిరిగాడితో
ఈరీతిగా చెప్పుమా—

'కాణీ దమ్మిడి టోలికూడా ఇవ్వడివ్వడంట
అట్టే అడిగేవంటే నీకూ మొట్టికాయలంట
తప్పవు తప్పవు తిట్లూ తన్నులు వారి
చేతి నీకు'"

ఓహో సుబ్బయ్యా!

ఆహాహా సుబ్బయ్యా!

ఎంతపని చేశావు?

మంచిపని చేసేవు!

—నేడే ఆఖరిదినం! ఇదే ఆఖరి తరుణం!

"ముగ్గురు యోధుల నే చిత్రరాజాన్ని......

యోధాగ్రేసరుడి వనిపించుకున్నావు.

ఆ నీచాధముడికి గుణపాఠం నేర్పేవు.

—హాల్లో న్యూస్ విన్నావా?

—ఏమిటా 'న్యూసు'?

ఏమిటా? నే చెప్తా మీరు వింటే!

కాని ఎలా చెప్పటం వీళ్ళందరితో?

సుబ్బయ్యా గవరయ్యల విచిత్ర వృత్తాంతం వీరందరికీ ఎలా తెలియజెయ్యటం?

—ఒరే; నా 'వేయి పడగలు' పుస్తకం ఏదిరా?

—'సారీ' రా బ్రదర్, ఒద్దంటూంటే వినకుండా మా అక్కయ్య ఢిల్లీ పట్టుకుపోయింది. నీతో చెప్దాం అనుకొంటూ......

అనుకొని అనుకొని ఆఖరికి చెప్పేశాను.

ఎంత సుమ్మగా, ఎంత ఫస్టుగా, ఎంత ధైర్యంగా ఎలా చెప్పేశాను??!!

అరగంట క్రితమే అంతా జరిగింది.

ఆఫీసునుంచి అప్పుడే ఇంటికి వచ్చేడు సుబ్బయ్య. వచ్చేసరికి అప్పటికప్పుడే పోతన్న వచ్చి

వీధి వరాండాలో కూర్చొని చుట్ట కాలుస్తున్నాడు. సుబ్బయ్య ఇంటికివచ్చి ఇంట్లోకి వెళ్ళేడు.

ఆ సమయంలో "సుబ్బయ్యగారూ" అని వీధి లోంచి ఎవరో పిల్చేరు.

పోతన్న ఇంట్లోకి వచ్చేడు.

"నువ్వేనా పిల్చేవు, పోతన్నా?"

"కాదండి—పోతురాజొచ్చేడు"

"పోతురాజెవరు?"

"గవరయ్య మనిషండి"

"సుబ్బయ్యగారూ"—గట్టిగా పిలుపు.

అల్లరి, దెబ్బలాట, తిట్లు, కొట్లు.

"సొమ్ముకోసం ఒచ్చేడు కాబోలోయ్ పోతన్నా!"

"లేకపోతే కులాసాగా ఉన్నారో లేదో కను క్కుందామని ఒచ్చేడనుకున్నారా?"

"ఏం చెయ్యడమోయ్, పోతన్నా!"

"ఇదెక్కడ వారండీ మీరు!! ఇంకా ఏం చెయ్యడమని చేతులు నులుపుకొంటూ కూర్చుంటా రేమిటి? ముందువెళ్ళి వాణ్ణి గెంటెయ్యక"

"పోతన్నా!"

"ఏమిటండీ?"

"పోతన్నా! నాకు భయం వేస్తోందోయ్!

"మాట చెప్పడానికే అలా భయపడితే ఎలా గండీ? ఇంతవరకూ ఎలా కాలక్షేపం చేసుకువస్తు న్నారో ఏమిటో ఆశ్చర్యంగా ఉంది. ఇప్పుడు కాని మరి నవిగేరంటే లాభం లేదు. ఇలారండి. నేను పక్కనుంటాను. మరేం ఫర్వాలేదు. సొమ్మివ్వనని చెప్పేసి పోతురాజుని తోలెయ్యండి."అని సుబ్బయ్య రెక్క పట్టుకున్నాడు పోతన్న.

పోతన్న వెనకాలలే వీథిలోకి వచ్చేడు సుబ్బయ్య.

సుబ్బయ్య తల తిరుగుతోంది.

ఎవరో ఏదో చెప్తున్నారు.

"......అడగమన్నారండి"

"ఎవరు?"

"గవరయ్యగారండి"

"ఏమని అడిగేరు"

"సొమ్మండి సొమ్ము అడుగుతున్నారండి"

"ఏం సొమ్ము?"

"మీ రిస్తారు పట్టుకురమ్మన్నారండి అయిదు వందలు"

నే నిస్తానని అనలేదే! (అబద్ధం! అబద్ధం!)

"వెంటనే ఇవ్వకపోతే తిడాఖా మాద్దువు గాని, అని చెప్పమన్నారండి"

సరే. కాని నేను ఇవ్వలేను, ఇవ్వను, ఇచ్చుకో లేను మరి.

"గవరయ్యగారి సంగతి మీకు తెలియవట్టుం దండి."

సుబ్బయ్య ఊరుకున్నాడు.

"గవరయ్య సంగతీ తెలుసు, నీసంగతీ తెలుసు. మరింక నోరుమూసుకొని నీదార్న నువ్వుపో" అన్నాడు పోతన్న.

"నీతో నేను మాట్లాళ్లేదు"

"కాని నేను నీతో మాట్లాడుతున్నాను. మరింక మాటలు మిగలక ఇంటికిఫో"

పోతన్న అరుగు దిగినట్టుంది.

పోతురాజు వెళిపోయినట్లుంది.

సుబ్బయ్య తల తిరుగుతున్నట్టుంది.

తిరగడం హెచ్చుతోంది. తగ్గుతోంది.

అంతా జరిగిపోయింది.

ఏది జరగడం అసంభవ మనుకున్నాడో అదే జరిగింది.

నిజంగా జరిగింది.

సుబ్బయ్య గవరయ్యని ధిక్కరించడం జరిగింది.

వచ్చినవాడు గవరయ్య మనిషే అనుకోండి.

పక్కనే పోతిన్న ఉన్నాడనుకోండి.

అయినా, చెప్పింది నేనే.

నానోటితో నేనే చెప్పేను.

మహాద్భుతం! పరమాశ్చర్యం!

నేనే! నేనే!

బలే! బలే!

—ఏయ్ పిల్లా! చల్లగా ఎల్తున్నావు! బండి కింద పడాలనుందేటి?

టకకట టక్ టక టకటక టక్ టక.

చల్లగా వెళ్ళేపిల్ల బండీవాడివైపు వేడిగా చూసింది.

—తప్పుకోండి బాబూ, తప్పుకోండి.

సుబ్బయ్య తప్పుకో నేది!?!!

నువ్వే తప్పుకో విధవా!

—ఏం సుబ్బయ్యా ఎక్కడికి వెళ్తున్నావ్?

ఇలా వెళ్తున్నాను—

—ఎక్కడికీ అంట!

ఎందుకో వీడికి? వీడికి నేనా జవాబిచ్చేది?

ఇదిగో ఇలా వెళ్తున్నాను. వస్తాను మరి—

నే నెక్కడకెళ్తే వీళ్ళకెందుకో!

నాఇష్టంవచ్చినచోటుకి వెళ్తాను.

ఎక్కడికి పడితే అక్కడికి.

ఎప్పుడు పడితే అప్పుడు.

ఇప్పుడు ఎంత వేళయింది చెప్మా?

ఆరున్నరయిందా?

అయివుంటుంది.

అయితే.

మనోరమ స్కూలునుంచి వస్తుందా?

ఇంటిదగ్గర ఉంటుందా?

సింగారించుకొని సిద్ధంగా ఉంటుందా?

నేను వచ్చేనని సంతోషిస్తుందా?

నన్ను కౌగలించుకొంటుందా?

నన్ను ముద్దులాడుతుందా?

వేగిరం వేగిరం.

జల్దీ, జల్దీ.

నడిచి లాభంలేదు.

ఏయ్ రిక్షా—

వేగిరం పద—

ఇది బావుంది.

సుబ్బయ్యకోసం ఒక సుందరాంగి

ఎదురుచూస్తోందని ఎవ రెరుగుదురు?

వెంకట్రావుకి తెలుసా? రామస్వామి ఎరుగునా? అవధాని ఊహించగలడా?

సుబ్బయ్య గట్టివాడు.

ఎలా సంపాదించేడో కాని మంచివాన్ని తెచ్చేడు.

మంచి పిట్టని పట్టేడు.

భేష్! భేష్!

భేషుగ్గా ఉంటుంది!

సుబ్బయ్య అదృష్టవంతుడు.

అపరా, అపరా.

తలుపు తెరిచేవుంది.

ఇంద డబ్బులు.

నాకోసమే...

మరి మాట్లాడక పోరా!

తలుపు నాకోసమే తెరిచి వుంచింది.

కాళ్ళు తేలిపోతున్నాయి.

కళ్ళు చెదిరిపోతున్నాయి.

గుండెలు ఆగిపోతున్నాయి.

హదిగో! హదిగో!

గుమ్మంలో గుమ్మంలో.

మనోరమ! మనోరమ!

తెల్లగా చీర! పచ్చగా రవిక!

చల్లగా చూపు! వెచ్చగా నవ్వు!

తెల్లగా పచ్చగా చల్లగా వేడిగా.

గుమ్మంలో నిల్చొన్న మనోరమ.

ఎవరికోసం నిల్చొని ఎదురుచూస్తోందో.

వారే వస్తున్నారు!

సుబ్బయ్యగారు వస్తున్నారు.

"మీకోసం చూసిచూసి కళ్లు కాయలు కాసిపోయాయండీ!"

హాదీ హాదీ హద్దదీ! హాఁఇదానిమ్మాట్లు! హల్లాళ్ళండ్డాళ్ళి!

"రండి లోపలికి రండి"

రానూ మరి! వస్తున్నా,

వెనక్కి తిరిగి ఇంట్లోకి దారి తీసింది.

నొక్కులు జుత్తులో మల్లెపువ్వులు మందహాసం చేస్తున్నాయి.

ఉల్లాసం కలిగిస్తున్నాయ్.

వనకాలిలే వెళ్ళేను.

పొడుగ్గా సన్నగా ఇరుగ్గా వాకిలి.

అటూ ఇటూ గదులు.

ఒక్కొక్క గదికి. ఒక్కొక్క ద్వారం, ఒక్కొక్క కిటికీ!

అటు పది ద్వారాలు. ఇటు పది కిటికీలు.

గదులనిండా గదు లద్దెకి తీసుకున్న ఆడవాళ్లు.

కొన్ని గదుల్లో ఆడవాళ్ళకి సంబంధించిన కబుర్లు చెప్తూన్న, కామంతో చూస్తూన్న మొగ వాళ్ళు.

వాకిట్లో ఆరవేసిన చీరలు, జాకెట్లు, రవికలు, బాడీలు, పరికిణీలు, తువ్వాళ్ళు, దుప్పట్లు, గలీబులు, గుడ్డలు, ఎన్నెన్నో.

ఇంటినిండా ఆడవాళ్ళు
గడబిడ గలగల
కలకల కిలకిల
కోలాహలం!
ఆడవాళ్ళ కోలాహలం!

కిటికీలలోంచి, గుమ్మాలనుంచి క్యూరియస్ గా చూపులు కిలకిల నవ్వులు.

ఎవరెవరు? మనోరమే! ఆహా!

కుడిచేతివైపు చివరిగది.

"ఇదే నాగది. లోనికి రండి"

గదిలోపల విద్యుద్దీపం వెలుగుతోంది.

వెలుగులో కనపడుతున్నవి:

పాట్టిముకాళ్ళ మంచం, మంచంమీద మెత్తటి పరుపు? పరుపుమీద తెల్లటిదుప్పటిమీద నల్లటి సిరా మచ్చ, నల్లటి మేజాకోళ్ళు, మేజామీద నీలిగుడ్డ, శకునశాస్త్రము, *What men Think*, రాజా పేదా, ఆంధ్ర వారపత్రిక, అంజలీదేవిబొమ్మ, కనిపించని పుస్తకాలు, ఆఫ్గన్ స్నో, పౌడర్ డబ్బా, "6 × 12" అద్దం, ఇంకా ఏవేవో మేజామీద. గోడనిఒక మేకు, మేకుకీ కిటికీకి కట్టిన తాడుమీద పూర్తిగా ఆరని బట్టలు. మంచంకింద రెండు ట్రంకు పెట్టెలు, గుమ్మంలో రెండు జతల చెప్పులు.

గదివెనక ఇంకొక చిన్నగది. అందులోకి వెళ్ళడానికి ఇందులోంచి ద్వారం, ద్వారంలోంచి కనిపించే ఇత్తడి, ఎల్యూమినియమ్ గిన్నెలు.

గదిలో గోడలకి రెండు బొమ్మల క్యాలెండర్లు, రెండు ఫ్రేం కట్టిన ఫోటోలు.

క్యాలెండర్లెవరివి?

ఒకటి: మహాత్మాగాంధీ; రెండు: నేతాజీబోస్ గాంధీగారి బొమ్మపైన ఒక బుక్ సెల్లర్స్.

నేతాజీబొమ్మమీద ఇంకొకబుక్ సెల్లర్ & స్టేషనర్స్ ఫోటోలు ఎవరివి?

ఒకటి: సన్నగా పల్చగా ఆరోజుల్లో ఉండే మనోరమ.

రెండు: లావుగా నిండుగా ఈరోజుల్లోఉండే మనోరమ.

గదిలో ఇద్దరూ నిల్చున్నారు.
ఒకరికళ్ళల్లోకి ఒకరు చూసుకున్నారు.

"ఇదా మీగది!"
"అవునండీ"
"ఆగదిలో వంట చేసుకుంటారా?"
"అవునండీ"
"ఆవతల ఏమిటుందది?"
"రండి చూద్దురుగాని".

ఎడంవైపు చివరిగదిలోంచి ఎవరో చూస్తున్నారు.

ముందు గదిలో దీపం ఆర్పేసి వంటగదిలోకి వెళ్ళింది మనోరమ.

వంటగదిలో పొందిగ్గా పేర్చిన గిన్నెలూ, సామాన్లూ లీలగా కనిపిస్తున్నాయి.

"పెరడు చూద్దురుగాని రండి"
వంటగదిలోంచి పెరట్లోకి వచ్చారు.
పది వాటాలవాళ్ళకీ పది పెరళ్ళు.
పెరట్లోకూడా వాటాకీ వాటాకీ మధ్యగోడ.
ఎవరిమట్టుకి వారికంతా ఇమ్ముగా ఉంది.
పెరడుకూడా ఇమ్ముగా బాగుంది.

పెరట్లో చంద్రకాంత మొక్కలు వరసగ్గా ఉన్నాయి.

వెల్తిగా వెలిగే చంద్రుడు ఆకాశంలో ఉన్నాలేనట్టుగా ఉన్నాడు.

అటువంటి చంద్రుడివైపు చూస్తున్నాయి తెల్ల చంద్రకాంతలు.

ఎర్ర చంద్రకాంతలుకూడా ఆ చంద్రుడివైపే చూస్తున్నాయి.

"చాలా బావున్నాదండీ మీ యిల్లు!"
"ఏదో! ఎలావున్నా చవగ్గా దొరికిందండీ!"
"ఆహా! ఎంత అద్దె?"
"పది"
"బావుందండీ"

"కొంచెం ఇరుగ్గా ఉన్నాదనుకోండి. కాని ఏంచేస్తాం?"

అని ఆవిడ వంగింది, చంద్రుడివైపు చూసే చంద్రకాంతలకోసం.

రెండు పువ్వులు తీసుకొని లేచింది.

రెండు వణుకుతూన్న చేతులు ఆమె భుజాల మీద వెనకనుంచి వాలేయి.

తలమాత్రం వెనక్కి తిప్పి ఆమె నవ్వింది.
తన వీపు అతని గుండెలకి ఆన్చింది.
బరువుగా బరువుగా, హాయిగా హాయిగా.

"వాసన చూడండీ. ఎంత బావుందో!"

కుడిచేత్తో చంద్రకాంతిల్ని అతని పెదవుల కాన్చింది.

ఎడంచేత్తో సిగలోని మల్లెపువ్వులు సర్దుకొంది.

మెడ కొంచెం తిప్పి వారగా చూస్తోంది. ఆమె కళ్ళల్లోంచి ఎన్నో భావాలు బైటకి వస్తున్నాయి చిలిపిగా అల్లరిచేస్తూ.

భుజాలమీంచి అతని చేతులు ఆమె నడుంకి రెండువైపులా జారేయి. చేతులకింద నడుం వెచ్చగా ఉంది. వేడిగా సువాసన వేస్తోం దామెకి.

ఘాటుగా లేకుండా మధురంగా ఉన్నాది చంద్రకాంతి పువ్వుల వాసన.

ఘాటుగావున్నా మధురంగా ఉన్నాది మల్లెపువ్వుల సువాసన.

"ఏం మనోరమా"

"ఏమండీ"

చంద్రకాంతిల్ని ఆమె సిగలో తురిమేడు.

సిగ వెనక్కి పోగా ఆమె ముఖం అతనివైపుకి తిరిగింది.

నవ్వబోయిన పెదవులమీద అతని కంపించే పెదవులు ఆనేయి, తడిగా వేడిగా.

బాగా చీకటి పడింది.

వెల్తిగా వెలిగే చంద్రుడు గర్వంగా చూస్తున్నాడు.

పెరట్లో చంద్రకాంతిలు జాలిగా చూస్తున్నాయి.

పక్కింట్లో ఎత్తుగా గుబురుగా ఎదిగిన అంటు మామిడిచెట్టు కదలకుండా నిద్రపోతోంది.

దానిపక్కనే వున్న కొబ్బరిచెట్టు ఆకులన్నీ ముణుచుకొని మాగన్నుతో చూస్తూ పడుక్కోండికి సిద్ధపడుతోంది.

ఎక్కడోకాని నూతులోంచి నీళ్లు తోడుతూన్న చప్పుడు అవుతోంది.

"శారదా! ఎక్కడున్నావే?" అని ఎక్కడో ఎవరో కేక వేసేరు.

పక్క వాటాలోంచి గాజుల చప్పుడు వినవస్తోంది.

పెదవులాన్చి ఆమెని బలంగా బంధించేడు.

పెరట్లో గోడకి అమర్చిన కొళాయిలోంచి నీటి బొట్లు రాల్తున్నాయి. కొళాయికి ఎడంగా పొట్లపాదు రాతిగోడని పట్టుకొని పైకి లేస్తోంది. పాత న్యూస్ పేపరు ఇసకలో దొర్లుతోంది. మూడు చామంతి మొక్కలు పూతకి సిద్ధంగా ఉన్నాయి. పువ్వులు పూయని గులాబిమొక్కలు రెండు, తొందరగా ఎదిగిపోదామని తాపత్రయపడుతున్నాయి.

తన జీవితంలో అంతకుముందు అస్థలం అతను చూడలేదు.

సరికొత్తగా అతని కథ.

సరికొత్తగాలో వయసులో వున్న ఆడమనిషిని కౌగలించుకొని ముద్దులాడ్డం అలవాటులేని మొగవాడికి గాభరాగా వుంటుంది.

సుబ్బయ్య గాభరా పడుతున్నాడు.

కాని అది ఆనందంవల్లనో, భయంచేతనో, కామోద్రేకం చేతనో, ఎందువల్లనో తెలియదతనికి.

గాభరాతో కళ్ళు మూసుకున్నాడు. కొంతసేపు అలానే ఉన్నాడు.

"గదిలోకి పోదాం రండీ" అన్నాది మనోరమ మెల్లిగా.

తక్కువకాలంలో ఎక్కువ చనవు చేసుకున్న ఆడమనిషి, యౌవ్వనవతి, తలలో మల్లెలూ, చంద్రకాంతిలూ తురుముకొని, కళ్ళల్లో చిలిపితనం పెట్టుకొని గదిలోకి రమ్మని ఆహ్వానిస్తే, ఇంకా అరి తేరని మొగవాడికి గాభరాగా ఉంటుంది.

సుబ్బయ్య ఆమె అలా అన్నందుకు సిగ్గుపడి, గాభరా పడి మొహమాట పడ్డాడు.

ఇద్దరూ వెళ్ళేరు ఇంట్లోకి.

వంటగదిలో చీకటి.

ముందుగదిలో చీకటి.

ఎదటివాటా చీకటిగదిలోంచి ఎవరో అంతసేపూ చూస్తూనే ఉన్నారు.

"కల్యాణికి వేరే పనే లేదు. అందరిగదుల్లోకీ చూస్తూనే ఉంటుంది అలా. అదేమిటో ఆ సరదా!" అన్నాది మనోరమ మెల్లిగా, చల్లగా తలుపులు వేస్తూ.

కన్నులు తెరచుకొని కల్యాణి చీకట్లోంచి చూస్తోంది.

చూడకుండా మనోరమ తలుపులు వేస్తోంది.

చీకటి గదిలో పరపురుషుడితో మనోరమ ఏంచేస్తోందో.

కంటితో చూడలేని కల్యాణి ఊహాదృష్టితో చూస్తోంది.

చూడలేక బాధ పడుతోంది.

ఊహించుకొని సంతోషిస్తోంది.

మనోరమ దగ్గరగా వస్తోంది.

దగ్గర దగ్గరగా సవ్వడి లేకుండా వస్తోంది.

గుండెలు కొట్టుకుంటున్నాయి.

జోరుజోరుగా చప్పుడు చేస్తున్నాయి.

మనోరమ వచ్చింది.

రాగలిగినంత దగ్గరగా వచ్చి వీలయినంత దగ్గరగా అతణ్ణి లాక్కుంది.

మొగవాడి మెడచుట్టూ ఆడదాని గాజుల చేతులు. వక్షంకింద గుండెల్ని వత్తుకుంటూ రవికలో కుక్కుకున్న ఎత్తుగుండెలు. సిగరెట్టు కాల్చే పెదవుల్ని నొక్కుతూ సిగరెట్టు కాల్చని మెత్తమెత్తటి పెదవులు. మెత్తమెత్తటి పెదవులవెనక గట్టిగట్టిగా పళ్ళు. కళ్ళల్లోకి కళ్ళు. పెదవులమీద పళ్లు. మెత్తగా గట్టిగా వళ్ళు.

ఆవిణ్ణి పట్టుకున్నాడతను.

అతణ్ణి పట్టుకు వేళ్లాడింది ఆమె.

తూలిపోతున్నాను! తూలిపోతున్నాను!

పడిపోతాను కాబోలు!

ఇంత బరువుగా ఉందేమిటి??!!

నాకన్నా భారంగా బలంగా ఉందే!!

నాకన్నా పెద్దది కాబోలు.

అబ్బ! నాకు నీరసంగా ఉంది.

ఇంత చీకటిగా ఇరుగ్గా ఉందేమిటి ఇక్కడ!

ఉక్క ఉక్క! చెమట చెమట!

ఈమనిషి పత్తునా, ఈమనిషి మోటుతనం, ఈ మనిషి సాహసంచూస్తే భయంగా ఉంది!

కిందని నిల్చొని చేతులు వదిలింది ఆవిడ.

హమ్మయ్యా!

వదిలిం దెలాగయితే నేం?

ఇంకేం చేస్తుందో? నన్నేం చెయ్యమంటుందో?

ఏంచెయ్యడానికీ నాకు మొహం తిరుగుతోంది.

బలవంత పెడుతుంది కాబోలు!

ఏందారి భగవంతుడా.

బైటకిపోవాలి! ఎలా పోవడం?

ఉక్కపోసేస్తోంది! చెమట! వెధవ చెమట!

రుమాలు మర్చిపోయేను.

శ్రీరామచంద్ర! ఇప్పుడేం చెయ్యడం?

వెర్రివెధవలా ఇలా నిల్చుండిపోయేనే!

నవ్వుతుంది కాబోలు, నవ్వుతూంది కాబోలు.

అయమ్మోయ్! తలవంపులు! సిగ్గుసిగ్గు!

"ఏమండీ సుబ్బయ్యగారూ"

సుబ్బయ్య గొంతుకలో ఏదో అడ్డుపడింది.

"ఏమండీ? అలా నిల్చుండిపోయారేం? పిలిస్తే పలకరు! నామీద కోపం వచ్చిందా?"

"అబ్బే! అబ్బే!"

"మరేమలా వున్నారు?"

"ఏమీ లేదు, మామూలుగానే ఉన్నానే... కొంచెం ఇక్కడ..."

అతని భుజంమీద చెయ్యివేసింది మనోరమ.

"అయ్యమ్మో! ఎలా చెమటపట్టేసిందో? కొంచెం విసరనా? అందులోనూ అంతదూరం నుంచి నడిచే వచ్చేరో ఏమోకూడా! ఎంతగా అలశారో యేమో! ఇంటికివస్తే కాఫీఅన్నా ఇవ్వకండా నేను......"

అంటూ లైటు వేసింది మనోరమ.

అతని నుదుటినుంచి శ్వేతబిందువులు రాలున్నాయి.

బట్టలన్నీ తడిసి ముద్దయేయి.

సుబ్బయ్యకి ఎందుకోగాని ఎంతో చిన్నతనం అనిపించింది.

ముఖం దించుకొని నిల్చుండిపోయాడు.

విసనకర్ర తీసుకువచ్చింది మనోరమ.

"ముందు మీరలా మంచంమీద కూర్చోండి"

కూర్చున్నాడు.

అతనికి విసురుతూనే విసన అతనిచేతికి అందిచ్చి" ఇదిలా తీసుకు విసురుకోండి. ఈలోపున అయిదునిమిషాల్లో కాఫీ చేసి తెస్తా" అన్నాది.

"ఒద్దొద్దు! కాఫీ అక్కర్లేదండీ"

"మీ రెప్పుడూ అలానే అంటారు" అన్నాది మనోరమ నవ్వి, అతని ముఖంమీదకి వంగి, అతని బుగ్గని తాకి.

స్టవ్ వెలిగించిన పదిహేన్నిమిషాల్లో కాఫీ తెయారయింది.

సుబ్బయ్యతలలో ఆలోచనలు అర్థంలేకుండా పరిగెడుతున్నాయి.

ఎందుకు వచ్చేను? ఏంచేస్తున్నాను? చేతకాని వాజమ్మలా కూర్చున్నాను...ఎవరీవిడ? నా భాగ్యదేవత! అవునా? అయితే "ఏల నింత భయము స్వామి" ఇక్కడ నేనిలా మంచంమీద కూర్చోడం అబద్ధమా

నిజమా? పరువు మెత్తగా ఉంది. మనోరమ బరువుగా ఉంది. ఆడమనిషి అంత బరువుగా ఉండకూడదు. తలుపులు వేసేఉన్నాయి. కల్యాణి చూస్తోందా? కల్యాణి బరువెంత? తలుపులు వేసుకున్నారెందుకంటే అంతా ఏమనుకుంటారో! ఏమో! కొంపతీసి... నేనేం తప్పుపని చేద్దామనిరాలేదే (పచ్చి అబద్ధం) మాటాడదామని వచ్చేను...మనసిచ్చి మాట్లాడేది మనోరమ ఒక్కర్తే. అందుచేత కష్టసుఖాలు చెప్పకుందామని వచ్చేను. ఈరోజుతో గవరయ్య బాధ తీరిందని చెప్దామని వచ్చేను......

"మనోరమా"

"ఇదిగోనండీ కాఫీ"

"థాంక్స్! కాని, మనోరమా! గవరయ్యబాధ వదిలింది!!!"

"ఓహో! నిన్నరాత్రి చెప్పేరు! ఆ గవరయ్యేనా?"

తనుకూడా మంచంమీదకూర్చుంటూ అడిగింది.

"ఆ! వాడే! వాడితో దమ్మిడీ ఇవ్వనని చెప్పేశాను."

అబద్ధం! నువ్వు వాడితో చెప్పలేదు. పోతురాజుతో చెప్పేవు. అందుకైనా భయపడ్డావు. పోతన్న లేకపోతే చెప్పే లేకపోనువాడివి.

"మంచిపని చేశారండీ, క్షేమగ్గా వుంది"

అతను కాఫీ తాగేడు.

ఆమె కాఫీ తాగింది.

రెండు గ్లాసులు మంచంకిందకి పోయేయి.

ఇద్దరు మనుష్యులు మంచంమీద కూర్చొనే వున్నారు.

వీవనతో అతనికి విసురుతోంది.

తనకి విసురుకొంటోంది.

అతని చెమట ఆరింది.

ఆతని గాభరా తగ్గింది.

"మనోరమా! నామీద నీకెందు కింత అభిమానం?"

"నాయందు మీకెందు కింత అభిమానమో ముందు మీరు చెప్పండి"

అని ఆవిడ నవ్వింది.

విద్యుద్దీపం వెలుగులో తెల్లగా మెరుస్తోంది. తెల్లగా నవ్వుతోంది. బుగ్గ చిల్లులు మనసు చలింపచేస్తున్నాయి. కట్టుకున్న తెల్లచీర ఇంకా తెల్లగా ఉండి పచ్చ రవికదగ్గర నీడపడి పక్కకి తప్పుకొంది.

పచ్చగా ఎత్తుగా, పచ్చగా పచ్చగా కళ్ళకి పచ్చగా......

"మనోరమా"

"ఏమండీ"

ఎంత హాయిగా ఎంత హాయిగా ఆడదానిమాట ఎంత హాయిగా, ఆడదానివళ్లు ఎంత హాయిగా ఆడదాని వాసన ఎంత హాయిగా హాయిగా ఆడదానిచీర ఎంత హాయిగా పచ్చగా పచ్చగా చెంపలకి వెచ్చగా వెచ్చగా.

ఆవిణ్ణి దగ్గరకి తీసుకున్నాడు.

ఇంటికి వెళ్లేటప్పుడు కొంతదూరం ఆమెకూడా వచ్చింది.

వెన్నెల వెన్నెల, పుచ్చపువ్వులా వెన్నెల. చేతుల్లో చెయ్యి చెయ్యి కలిపిన మనోరమ. మృదువుగా హాయిగా, వెన్నెల్లో చల్లటిగాలి హాయ్‌హాయ్ స్వర్గం స్వర్గం. స్వర్గంలా ఉంది.

ఇంకేం కావాలి నాకు!

విడిపోయేముందు "రేపు సాయంకాలం తప్పకుండా వస్తారుగా" అన్నాది మనోరమ.

"రాకుండా ఉండగలననుకున్నావా?"

"ఏమో" అన్నా దామె కొంటెగా.

చేతిలో ఉన్న చేతిని గట్టిగా నొక్కేడు.

"హాస్యానికేంగాని, రేపు సాయంకాలం రావడం మర్చిపోకండేం! మీతో ఓముఖ్య విషయం మాట్లాడాలి"

అన్నాది మనోరమ కొంచెం సీరియస్‌గా.

సుబ్బయ్యకి చలి వేసినట్లయింది.

ఒక్కక్షణం ఆగేక అన్నాడు.

"మర్చిపోను, వస్తాన్లే"

రాత్రి పదిగంటలయింది.

మనోరమ తెల్లచీరా పచ్చరవికా వెన్నెల్లో వెనక్కి వెనక్కి పోయేయి.

సుబ్బయ్య ముందు ముందుకి పోతున్నాడు.

ముఖ్యవిషయం! ముఖ్యవిషయ్యం!

ఆనంద డోలికల్లో వూగిన అతనిమనసు ముఖ్య విషయంగురించి ఆలోచించడంతో భారంగా కుంగిపోతోంది.

ముఖ్యవిషయం! ముఖ్యవిషయం!

పెళ్ళిచేసుకోమంటుందా???

రక్షించు రక్షించు భగవంతుడా!

కల్యాణి చూసింది. ఎంతోమంది చూసేరు.

ఇతనే! ఇతనే!

ఇతనే మా మనోరమని చీకటిగదిలోకి తీసుకు పోయేడు!

రక్షించు రక్షించు భగవంతుడా!

మొన్న కాక మొన్న చూసేను. నిన్న కాక నిన్న మాట్లాడేను.

అప్పుడే ఇవాళ......

నిన్న నే ఒప్పుకో లేది......

ఎటువంటి కారక్త రీకొంది!!

ముఖ్యవిషయం! ముఖ్యవిషయం!

డబ్బు! డబ్బు! డబ్బడుగుతుందేమో!

ఈవిడకీ నాకూ వున్న ముఖ్యవిషయా లేమిటి?

రేపు తప్పక డబ్బిమ్మని అడుగుతుంది.

ఇహ, రోజూ కనిపించినప్పుడల్లా డబ్బడుగు తుంది కాబోలు.

గవరయ్యకి ఇవ్వనక్కర్లేదని చెరకపోయి చెప్పేను.

వాడికి ఇవ్వనక్కర్లేదు కదా!

అందుచేత అయిదువందలూ నాకే ఇవ్వండి అంటుందో ఏమిటో?

చచ్చే నన్నమాటే.

రేపు మరి వెళ్లను.

రేపు సాయంకాలం మరి వెళ్ళను.

మనోరమకి మరి కనిపించను.

కనిపించే నంటే పీకేస్తుంది.

అయిన దేదో అయింది!

చాల్చాలు!!

కాని—

మనోరమకి నాయిల్లు ఎక్కడుందో తెలుసే!!

తిన్నగా ఇంటికి వచ్చేస్తే ఏంచేసేది??

సావిత్రి నన్నుకూడా ఇంట్లోంచి గెంటే స్తుంది.

హరి భగవంతుడా! ఏంచేసేది?

ఇహ బుద్ధి తెచ్చుకుంటాను.

దొంగతనం రంకుతనం చెయ్యొద్దని ఊరికే అన్నారా?

గొప్ప పొరపాటయిపోయింది.

చేతులు కాలేక ఆకులు పట్టుకోడం.

నా సొదంతా చెప్పుకొస్తున్నాను.

ఆమనిషి సంగతేమైనా అడిగేవా?

నేను బుద్ధిలేని వెధవని!

ఇప్పుడింక చేసేదేమీ లేదు.

ఇంటికిపోయి పడుకోడమే!

రేపుమాత్రం ఆవైపు కయినా వెళ్ళను.

ముఖ్యవిషయాలుట! ముఖ్యవిషయాలు!

జేగిరం ఇంటికిపోతాను!

చాలా ఆలస్యం అయినట్టుందే!

సావిత్రి ఏమంటుందో ఏమిటో?

ఏమనుకున్నా పైకిమాత్రం తేలదు!

ఈపాటికి పడుక్కుంటారు.

బాగా రాత్రయిందే!

వీధులన్నీ నిర్జనంగా ఉన్నాయ్!

ఒకానొక నిర్జనారణ్యములో ఒక పాంథుడు పోవుచుండగా......

నాకు భయంగా ఉంది.

పండ్లూడిపోయిన ముసలి టక్కరి పులి అతనిని చూచి......

వెన్నెల మసకమసక వెన్నెలగా మారిందేం?

ఓరీపాంథా! ఈ పసిడి కంకణమును గొని పోయి...

పక్కని రాళ్ళకుప్పలు. రోడ్డు బాగులేద!

రా దగ్గరకురా దీనిని గొనిపొమ్ము...

ఇలాటి రాళ్ళకుప్పమీదే ఆరోజు పడ్డాను.

అమ్మో నాకు భయంగా ఉంది.

అంత నా దుష్టశార్దూలముచే...

ముగ్గురు కొడుతున్నారు నాలుగో మనిషిని.

అమ్మో! అమ్మో!

నా పాంథుడు భక్షింపబడెను.

నాకు భయంగా ఉంది.

తలవంచుకొని ఇంటికి వస్తున్నాడు సుబ్బయ్య.

తన యింటికి కొంచెం ఎడంగా ఆగిన మోటారు కారువైపు చూడలేదతను.

ఇంటిగుమ్మందగ్గర సిగరెట్టు కాలుస్తున్న మని షిని సరిగ్గా చూడలేదు.

"ఏమండోయ్! మీరేనా సుబ్బయ్య"

"ఎవరూ? ఎవరెవరూ? నేనే నేనే నేనే"

"ఆహాఁ! మీరేనా?"

"అవునవును"

"అయితే చూడండీ బాబూ! చిన్నపనుంది ఇలా రండి!"

"పనుందా?"

"అవును"

"ఏమిటో చెప్పండి"

"చెప్తా! ఇలా రండి బాబూ!"

మనిషి బలంగా ఉన్నాడు. ఎత్తుగా జుత్తు. ఎత్తుగా మనిషి. పొట్టిగా నిక్కరు.

నాకు భయంగా ఉంది.

ఒకరాత్రి జనసంచారములేని వీధిలో పోము య్యనే వృద్ధుకు సుబ్బయ్యనే బాలకుని నడపించుకు పోవుచుండగా...

ఏ దేవుడో నాకు తెలియదే! మనిషి మాత్రీ రౌడీలా ఉన్నాడు!

అకస్మాత్తుగా అంధకారమును చీల్చుకొని...

"ఎవరు మీరు? ఏంపని?"

రక్కసులవంటి ముగ్గురు మానుసులు...

"ఇలా రండి బాబూ"

అతను ముందుకి నడుస్తున్నాడు.

నేను రానురాను. నాకు రావడానికి భయంగా ఉంది.

కాని నా పాదాలు ముందుకి పోతున్నాయే! వాటిమీద నాకు స్వాధీనం తప్పినట్టుంది.

"ఏం కావాలో చెప్పరయ్యా వేగిరం?"

అని అడగనా ?

"త్వరగా రండీ"

రానురాను. రా నేరాను.

"వస్తున్నా"

"లోపల కూర్చోండి"

ఇదేమిటిది?

...వచ్చి నిర్దయతో వారిని చావమోదిరి.

మోటారు కారా?

ఎక్కడో చూసే నే!

"కూర్చోండి బాబూ" తలుపు తెరిచేసు అతను.

కార్లోపల ఎవరు కూర్చున్నారు?

ఎర్రెర్రగా సిగరెట్లు వెలుగుతున్నాయే!


ఎర్రగావుందే ఈ కారు!!

"బాబోయ్! నే రాను! బాబోయ్!"

"ఎక్కడికి పోతావ్రా?"

గింయ్ఁ గింయ్ఁ గింయ్ఁ

సుబ్బయ్య కళ్ళు చీకట్లు కమ్మేయి.




తెల్లగా
ఉతుకబడినవి
ప్రకాశవంతముగా
ఉతుకబడినవి
ఇందుకు
సన్ లైట్
సబ్బే కారణము
బాదకుండగనే బట్టలను
తెల్లగాను, ప్రకాశవంత
ముగాను ఉతుకును!
SUNLIGHT SOAP
SUNLIGHT SOAP

కళాపూర్ణోదయ ప్రశంస

ఉపాఖ్యానములు

★

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

కళాపూర్ణోదయ కృతిపతి నంద్యాల కృష్ణ భూపతి 'ఒక్క మహాప్రబంధముఁ గను విచిత్ర సారస్య లీలాచిత్రింబగు దాని' సూరన్న చేత చేయించుకోదలచినాడు. అతని కోరిక ననుసరించి గానే సూరన్న కూడా 'అత్యపూర్వ కథా సంవిధాన వైచిత్రీ మహనీయంబు' గా కళాపూర్ణోదయం రచించాడు. కళాపూర్ణోదయం 'సారస్య లీలాచిత్ర' మయింది. కావడానికి సూరన్న కథాసంవిధానంలోని అపూర్వత అన్నది ప్రధాన కారణం. ఈ అపూర్వత అన్నది కార్యకారణ క్రమంలో కథను నడపడం, ప్రధానకథలో అవాంతరంగా వచ్చే ఉపాఖ్యానాలను కథాంగాలుగానే తీర్చడం అనే రెండు పద్ధతుల మూలంగా సాధింపబడ్డది. బ్రహ్మదేవుడు కూడా 'శ్రోతృజనాపేక్షానుసారంబుగఁ దత్తన్నిమిత్తోపాఖ్యానంబుల చేత విదితయై కొంత విస్తారంబు నొందఁగల దది చెప్పఁబడియెను ప్రధాన కథాభాగంబంతియు' అని సరస్వతీదేవితో చెప్పినాడు. అయితే యీ వుపాఖ్యానాలను వ్యర్థంగా కథను విస్తరింపచేయడానికి మాత్రం గాక ప్రధానకథ కంగభూతాలుగా వుండేలాగు వాటిని తీర్చడంలోనే వున్నది సూరన్న ప్రజ్ఞ అంతా.

ఉపాఖ్యానం అంటే ఆఖ్యానంకంటె కొంచెం చిన్నది అన్నమాట. అంటే ప్రధానకథలో ప్రసంగవశంగా చెప్పబడే అవాంతరకథ. భారతాదుల్లో యిలాంటి ఉపాఖ్యానాలు చాలావున్నవి. అయితే ఆ ఉపాఖ్యానా లన్నీ కూడా ప్రధానకథలో పరిమిత ప్రయోజనం మాత్రమే కలిగివుండడం భారతాదుల్లో మనం చూడవచ్చు. ఆ వుపాఖ్యానాలను వదిలిపెట్టి కప్పదాటు వేసి ఆయా గ్రంథాలను చదివినా మనకు ప్రధానకథను అర్థం చేసుకోవడంలో ఎలాంటి యిబ్బందీ వుండదు. కథ చిన్నగా సాగిపోతుంది. అయితే ఆ గ్రంథాల్లో ఆ వుపాఖ్యానాల ప్రయోజనం వేఱు. ప్రసంగవశాన రాకపోయినా ప్రసంగం కల్పించుకునిఅయినా ధర్మాభిరతిని కూర్చే కథను చేర్చడం అనేదే ఆ కవుల లక్ష్యం. ఆలక్ష్యం సాధించడానికే వాటి ప్రయోజనం. కళాపూర్ణోదయంలో వుపాఖ్యానా లలా కాదు. ఆ వుపాఖ్యానాలకు కథతో సంబంధం వున్నది. సంబంధం వుండడం మాత్రమే కాదు. ముందు కథ సాగడానికికూడా అవి చాలగా తోడ్పడడం విశేషం. ఈ వుపాఖ్యానాలు కూడా ఏవో అతుకు కలిపినట్లుగా కాకుండా గొలుసులో కొలుకులలాగే ఒకదానితో ఒకటి పెనవేసుకునివున్నట్లుగా రచింపబడడం అసాధారణ విషయం. కళాపూర్ణోదయకథకంతకూ గుండెకాయవంటిదైన సరస్వతీ చతుర్ముఖుల లీలాకేళిని తప్పించి యిక అందులోవున్న వుపాఖ్యానాలు నారదగానమాత్సర్యకథ, సుగాత్రీ శాలీనులకథ, స్వభావసిద్ధుని వృత్తాంతం, కల్యాసురుడి వృత్తాంతం, అలఘువ్రతుని చరిత్ర, సుగ్రహునికథ అన్నవి. ఇవి ప్రధానకథ కంగభూతా లెలా అవుతాయో, యివి కథ ముందుకు సాగడాని కుపకరించడంతో పాటు ఎలాంటి ప్రయోజనాలను సాధిస్తున్నవో చూదాం.

నారదగాన మాత్సర్యకథ కవితాదృష్టి కెంతో రమణీయమయిన దయినప్పటికీ కల్పనాదృష్టికి ప్రధానకథతో చక్కగా అతికినట్లు కనబడడం లేదనే ఆక్షేపం వున్నది. కాని కల్పనాదృష్టితో చూచినా ప్రధానకథ కీకథ యెంతో అవసరమన్న సంగతి ముందు వెనుకల కథ గమనిస్తే మనకు తెలుస్తుంది. నిజమేమో మనకు తెలియదు కాని యీ కథ చదివినప్పుడు సూరన్నకీ, యింకో విద్వత్కవికీ సంబంధించిన మాత్సర్యవృత్తాంతమే యిందులో యీ రూపంలో ప్రవేశించిందా అని మనకు తోచక పోదు. ఇదేదో స్వానుభవవృత్తమే కాని నిరాధార కల్పనం కాదు. స్వభావోక్తిని తిలదన్నుతూ పాత్రా

చిత్యంతో ముద్దులు మూటగట్టుతుండే యీ కథను- నారదుడే ద్వారకలో శ్రీకృష్ణుని దగ్గర గానవిద్యా పరిపూర్తి పొందినతరవాత మణికంధరుడికి హితం వుపదేశించి

'ఏనున్ వేగను యేఁగి నా
    పడినహా ట్లీడేర నాకంబులోఁ
గానీ కాంచనగర్భు కొల్వ
    నదుమం గానీ పురద్విట్సభం
గానీ తొల్లిటి విష్ణుదేవుకడ నె
    గానీ మదీయోల్లస
ద్గాన ప్రౌఢిని నాడుఁ బూని
    గెలుతున్ గర్వోన్నతున్ దుంబురున్'

అంటే మణికంధరుడు తుంబురుడియెడల నారదుడికి మాత్సర్యం కలగడానికి కారణం యేమనీ, అతణ్ణి జయించడానికి యేమేమి తంటాలుపడిందీ వివరించమనీ అడిగితే అందుకు సమాధానంగా స్వయంగా చెప్పకొన్నది. అసలు యీ నారదమణికంధరుల సంభాషణ సంతా మణిస్తంభుడు తనకు దూరదృష్టి, దూర శ్రవణశక్తి లున్నవని నమ్మించి కలభాషిణిని తీసుకునిపోయి మృగేంద్రవాహనకు బలియివ్వాలని ఆమెకు నమ్మకం పుట్టేందుకై చెప్పింది.

నారదుడు ద్వారకలో అన్నమాట ప్రకారం రంభకు సవతిపోరు ఘటిల్లవలసి వున్నది. అది ఘటిల్లడానికి మణికంధరుడు తపస్సు చేయడం, ఆ తపస్సుకు విఘ్నం కలిగించడంకోసమని దేవేంద్రుడు రంభను పంపడం జరగాలి. మణికంధరుడి తపస్సుకు అతడి తీర్థయాత్ర లవసరం. అతడికి తీర్థయాత్రలు పోవాలనే కోరిక కలగడానికి అతడు నారదుడివల్ల యీ నారదగానమాత్సర్యకథ వినడమే కారణం. నారదుడు తనగోడు వెళ్లబోసుకొన్న తరవాత మణికంధరుడు

'ఏ ఖేదయున్ లేక సదా
నివాసముగ వైకుంఠంబులో నుండి
యాపదియున్ విష్ణుని గొల్వఁ
గల్గెడు మహాసౌభాగ్య మెట్లబ్బెనో'

అని అడిగినాడు. అందుకు ఆయన వైకుంఠప్రాప్తికి ఉపాయాలు చెబుతూ అందులో

'విష్ణుసన్నిధి కళావిఖ్యాత వివిధ ది
వ్యక్షేత్ర తీర్థయాత్రాచరణము'ను ఒక ఉపాయంగా చెప్పినాడు. అందుమీదట మణికంధరుడు తీర్థయాత్రలకు బయలుదేరినాడు. కనక మణికంధరుడికి తీర్థయాత్రోద్దేశం కలగడానికి ముఖ్యకారణం అయిన యీ నారదగానమాత్సర్యకథ సప్రయోజనం కాక మరేమవుతుంది? అంతే కాక ప్రథమాశ్వాసంలో నారదుడు శ్రీకృష్ణుడిదగ్గర గానవిద్యాభ్యాసం చేయడం కోసమని ద్వారకకు అప్పుడప్పుడు వస్తుండినట్లు మనకు చెప్పబడింది. అంతలా గానవిద్య నేర్చుకోవాలిసిన అవసరం నారదుడికి ఎందువల్లయితే కలిగిందో తెలియజేయవలసిన బాధ్యత కవికి వుందికదా మరి? నారదగానమాత్సర్య కథ యిలాగు వెనక చెప్పిన కథాంశానికి వివరణరూపప్రయోజనం సాధిస్తానే ముందుకథ సాగడానికీ ప్రధానంగా వుపకరిస్తున్నది.

తరవాతది సుగాత్రీశాలీనుల కథ. ఈ కథవంటి కథ తెలుగులో 'నభూతో నభవిష్యతి' అంటే తప్పులేదు. కళాపూర్ణోదయంలో సూరనార్యుడి అమృతహస్త సంస్పర్శం చేత ఉజ్జీవితాలయిన కావ్యపాత్రలలో సుగాత్రీశాలీనులు మధురమూర్తులు! అందులో శాలీనుడు ఒక మధురప్రకృతి! సూరన్న కావ్యకళాసృష్టిలో అది ఒక సురుచిర సన్నివేశం! మనుచరిత్రలో 'వివిధాధ్వర నిర్మల ధర్మకర్మ దీక్షాపరతంత్రుఁడు' గా, 'అనుకూలవతి తన మనసులో వర్తించు కులకాంత సోమిదేవి'తో సంసారపథంగా కాలం వెళ్ళబోస్తూ అతిథిపూజాప్రవణుఁడుగా, అమరకాంతలే వలచి వయికోనివచ్చినా కన్నెత్తి కూడా చూడని ధార్మికుడుగా, పరకాంతాపరాఙ్ముఖుడుగా చిత్రించబడిన ప్రవరుడి ప్రకృతికీ, యిందులో శాలీనుడి ప్రకృతికీ చాలా భేదంవున్నది. అసలు ఆ పాత్రలసృష్టికి అస్థాపనకల్పులైన పెద్దన్న సూరన్నల దృక్పథాలే వేరు. పెద్దన్నది ధర్మదృష్టి! సూరన్నది కళాదృష్టి! సూరన్న కళాదృక్పథం యొక్క మూర్తిభావమే శాలీనుడు!

ఈ ఉపాఖ్యానంలో సుగాత్రి పతిశీలత ప్రవ్యక్తం కావడంతోపాటు శాలీనుడి మధుర ప్రకృతికూడా అడుగడుగునా గోచరిస్తానే వుంటుంది. శాలీనుడి మధురప్రకృతికి సుగాత్రి సాధనం. సుగాత్రి పతిశీలతకు శాలీనుడి మధుర ప్రకృతి ఒరగల్లు. సుగాత్రి పతిశీలత ప్రవ్యక్తం. శాలీనుడి మధురప్రకృతి మబ్బులో మెఱవుతీగ. ప్రవరుడు వయికోనివచ్చిన వరూధిని నొల్లని ధార్మిక తపస్వి అయితే శాలీనుడు కులకాంతయందే సహజ సౌందర్యాన్ని అభిలషించి తదనుభవం పడసిన కళాతపస్వి!. పెద్దన్న ప్రవరుడికి వయిచేయిగా ఒక పాత్రాన్ని సృష్టించాలనే తలపే సూరన్న చేత శాలీ

నుడి సృష్టిచేయించివుంటుంది. సాహిత్యాకాశంలో శాలీనుడి మధురప్రకృతి ఒక ధ్రువతార!

ఈ సుగాత్రీ శాలీనులకథ పాఠకులకే మాత్రమే కాక సూరన్నకుకూడా చాలా ప్రీతిపాత్రమయింది. సుగాత్రీ శాలీనుల మహత్త్వంతో దీని గొప్పదనాన్ని జతపఱచి యీ కథను సరస్వతీదేవే రచించినట్లు సూరన్న దీన్ని శ్లాఘించుకొన్నాడు. వేదగురుడు మణికంధరుడికి సుగాత్రీ శాలీనులకథ వినిపించి 'నాకు నద్దేవియు కలలోనవచ్చి యీ పుస్తకంబు నిత్యంబును ప్రాతఃకాలంబునఁ జదువుకొనుమని యిచ్చె. మఱియు నిప్పటం జగుడ వ్రాయ నేర్చిన వారికెల్ల నా రాత్రియంద యట్లు యిచ్చినది' అని నాడు. ఈ విధంగా సరస్వతే రచించినట్లుగా పొగడుకొన్న యీ కథకు ప్రసక్తి యేలాంటిదో, యిది ప్రధానకథలో సాధించే ప్రయోజనం ఎలాంటిదో తెలుసుకోవడం అప్రస్తుతం కాదు.

మృగేంద్రవాహనాలయం చేరుకున్న మణిస్తంభుడూ, కలభాషిణీ, మణికంధరుడూ ముగ్గురూ కూడా అంతకు పూర్వం మణికంధరుడి తపోవనంలో జరిగిన వృత్తాంతాన్ని ఎవరికి సంబంధించినవాన్ని వారు చెప్పుకున్నారు. అక్కడే దేవిఅనుగ్రహం వల్ల పడుచుతనం పొందిన సుముఖాసత్తికూడా వున్నది. కథంతా విని కలభాషిణి తపోవనంలో తన్ను పొందినవాడు మణికంధరుడే అని తెలుసుకుని అతడితోడి పొందు తన కిష్టమేనని చెపుతుంది. కాని తనకు నలకూబరుడి మీది వాంఛ బయటపడింది గదా! మణికంధరు డేమనుకుంటాడో! ఇదీ ఆమె సందేహం!

'ఇట్టిమాట లిప్పుడే నాడుకొనుటయు
ననుచితంబు, నారకనిత పలుకు
లిచ్చకంబు లనక యెవ్వరు నమ్మెద

రదియుఁ గాక దృష్ట మన్యవాంఛ' అని కలభాషిణి కటకటపడడం చూచాడు మణికంధరుడు. ఆమెని అనునయిస్తూ 'నలకూబరుడి రూపం చూచి మోజుపడ్డ నీకు యితరరూపం యేదీకూడా ప్రీతికరం కాక పోవడం ఆశ్చర్యం కాదు. పురుషుల్లో కూడా యిలాంటిగుణం వుండడం నే నెఱుగుదును' ఆ కథ చెబుతాను వినమని తాను ముందెప్పుడో మృగేంద్రవాహన అనుగ్రహంవల్ల పొందిన కవిత్వసంపదను చూపి శారదాపీఠంలో పండితులదగ్గర మెప్పుపొందా లని పోగా అక్కడ ఆ సందర్భంలో వేదగురుడి సమక్షంలో బ్రహ్మచారి దదిగా విన్న సుగాత్రీ శాలీనుల కథను కలభాషిణికి చెబుతాడు మణికంధరుడు. ఇదీ అసలు ప్రధానకథలో యీ కథకుందే ప్రసక్తి.

కథంతా చెప్పి కలభాషిణి యేదోవిధంగా సమాధానపఱచింతరవాత మణికంధరుడు

'నీ కులస్థాన వార్త గణించి చూడ
నా సుగాత్రి చరిత్రంబు నంతేసట్టు

నీ వెఱుఁగ కున్కి యెట్టు' లని అక్కడే వుండి కథను వింటూన్న సుముఖాసత్తిని ప్రశ్నించినాడు. అందు కామె 'ఏల యెఱుఁగ! నా సుగాత్రిన యే' నని నవ్వినది. అందరూ ఆశ్చర్యపడి శతతాళ దఘ్న హ్రదంలో వునికింతరవాత నువ్విలా బతికావు! నీ కథేమిటి? అంటే, ఆమె హ్రదంలో దూకడం మొదలుగా నాటివరకూ కల ఆమె వర్తనాన్నంతా వాళ్ళకు చెప్పి

'అమ్మృడ్కాని జాతిక
త్యమ్మున మతిగనియు నిట్టి దశనొందితి నేఁ
గ్రమ్మఱ బ్రదికి, యొకింతయు
నమ్మనుఁగునఁ గాంతుఁజేమి యయ్యెనొ యెఱుఁగన్'

అని కంటనీరు పెట్టింది. అందుమీఁదట మణిస్తంభుడు అందుకుని 'అతఁడ నే' నని తన్ను చూపుకొన్నాడు. తాను హ్రదంలో పడినప్పటినుండీ కల తన వృత్తాంతాన్నంతా చెప్పాడు. తరవాత మణిస్తంభుడి కత్తితో మణికంధరుడు కలభాషిణి కంఠం నఱికి తాను భృగుపాతం పొంది శాపఫలం అనుభవించడం కోసమని శ్రీశైలం బయలుదేరి వెళ్ళినాడు. ఇలా ముందు కథ సాగడానికి యీ చిన్నకథ ఉపకరిస్తూన్నది. ఈ కథలోని సుగాత్రీ శాలీనులే అవతారాంతరంలో సుముఖాసత్తీ మణిస్తంభు లవుతారు. ఈ యిద్దరూ సరస్వతిచేష్ట కారణంగా పరస్పరం రూపాలు మార్చుకుని క్రీడించినప్పుడే సుముఖాసత్తి గర్భవతి అవుతుంది. కళాపూర్ణుణ్ణి ప్రసవిస్తుంది. కళాపూర్ణోదయం, కళాపూర్ణుడూ లోకంలో వెలయడానికి కారకులయిన యీ సుగాత్రీ శాలీనుల కథ యీ కావ్యానికి ప్రాణం అనడంలో సందేహం లేదు. అయినా దీని ప్రాధాన్యాన్ని ముందుగా బయటపడనీయకుండా కలభాషిణీ మణికంధరుల సంభాషణలో ప్రసంగవశాత్తుగా వచ్చేటట్లు, కళాపూర్ణ జనన వృత్తాంతం యీ కథతో జతచేసి చెప్పకుండా తరవాత యెక్కడో పంచమాశ్వాసంలో గాని తెలియరాకుండేటట్లు కథ కూర్చిన సూరన్నప్రజ్ఞ అద్భుతమయినది!

సుగాత్రీ శాలీనుల కథ తరవాత యెన్నదగిన వుపాఖ్యానం సరస్వతీ చతుర్ముఖుల లీలాకేళిఘట్టం. ఇది కళాపూర్ణోదయ కథాశరీరానికి గుండెకాయ వంటిదని చెప్పవచ్చు. ఈ ఘట్టంలో జరిగిన విషయాల విస్తరణమే కావ్యకథావస్తువు. అందుచేతే దీనికి కథలో యెంత ప్రాధాన్యం వుంటో మనం తెలుసుకోవచ్చు. ఈ కథనుకూడా కవి మనకు నేరుగా చెప్పక మణిహార ప్రభావంచేత కళాపూర్ణుడి సభల్లో ఉయ్యాలలో పరుండబెట్టి వుండే మధురలాలస అనే రెండు నెలల శిశువుచేత చెప్పిస్తాడు. వారకుడు 'వలయం గల దది వలయుత్రోవలును గలుగు' అన్నది యథార్థ వచన మయ్యేట్టుగా మణిహార ప్రభావంచేత సర్వజ్ఞత్వం పొందిన శిశువు మధురలాలసమూలాన కళాపూర్ణోదయం లోకంలో వెలుస్తుంది. బ్రహ్మ చెప్పిన విధంగా ముందు సరస్వతీ చతుర్ముఖుల లీలాకేళి రహస్యవృత్తం వెలసి ఆతరవాత కళాపూర్ణోదయం వెలుస్తుంది.

స్వభావసిద్ధుడి చరిత్రంకూడా మధురలాలస మణిహార ప్రభావంచేత చెప్పిందే. కళాపూర్ణుడి జనన వృత్తాంతం తెలిపి అతను పుట్టగానే స్వభావసిద్ధు డతడి దగ్గిరికివచ్చి ఒకమణిని, విల్లుఅంబులను యిచ్చివాడని మధురలాలస చెప్పగా అలఘువ్రతుడు స్వభావసిద్ధు డెవరు? అతడా శరచాపాలను యివ్వడానికి కారణం యేమిటి? అని అడుగుతాడు. మధురలాలస అప్పుడు చెబుతుంది స్వభావసిద్ధుడి చరిత్రాన్ని. ఈ స్వభావసిద్ధుడి చరిత్రం మనకు రెండు విషయాలను ప్రధానంగా తెలుపుతున్నది. కళాపూర్ణుడికి స్వభావసిద్ధుడు శరచాపాలు, మణిశలాక యివ్వడానికి కారణం. అందు కేర్పడిన సందర్భం—సంబంధం ఒకటి. రెండవది మదాశయుడు కళాపూర్ణుడి సేవచేయడానికి గల కారణం. అందులో గల అంతర్యం.

తరవాతది శల్యాసుర వృత్తాంతం. రహస్యకథలోని అభినవకౌముది భూలోకకథలో కళాపూర్ణుడికి జ్యేష్ఠభార్య కావలసివున్నది. అందు కెన్నోవిధాలుగా కథలు కల్పింపవచ్చును గాని సూరన్న కల్పించిన శల్యాసుర కథవంటి కథ నెవ్వరూ కల్పింపలేరనే చెప్పొచ్చు. ఇందులో విషయమంతా ముఖ్యంగా మణికంధరుడు అవితథోద్యమమైన కత్తితో—అదీ మృగేంద్రవాహనాలయంనుండి అభినవకౌముది దేవి ప్రేరణవల్ల తెచ్చి తనచేతి కిచ్చినది—శల్యాసురుణ్ణి చంపి తాను చావడానికీ, ఉత్తరజన్మలో అభినవకౌముది అతడికి పట్టమహిషి కావడానికీ ప్రధానంగా ప్రయోజనపడుతున్నది.

ఇక అలఘువ్రతుడి చరిత్రం—కళాపూర్ణుడి కథ మధురలాలసచేత చెప్పించడానికి హేతుభూతమయింది. కనక ప్రధానకథకు చాలా అవసరమయిందీ, ప్రధానమయిందీను అలఘువ్రతు డన్ని విషయాలూ, అందలి విషయాలూ అడిగినట్టుగానే మదాశయుడి పురోహితులయిన ప్రథమాగమాదుల వుదంతం చెప్పమని మధురలాలస నడిగినాడు.

మధురలాలస

'వారి తెఱం గే మెఱిం గెదు

పౌరవుడా! వారు నీకు సత్పుత్రులు' అన్నది. అందరికీ ఆశ్చర్యం అయింది. అలఘువ్రతుడికే ఆశ్చర్యం వేసింది.

'పుణ్యశీలవతులం బో కార్చుకొన్నట్టి

నాకుం బుత్రులట నగవు కాదె' అని అన్నాడతడు. అప్పుడు కళాపూర్ణుడు ఆ బ్రాహ్మణుడి జన్మాదివర్తనలు తెలపమని అడిగితే మధురలాలస చెబుతుంది యీ కథ.

రహస్యకథలో - ప్రథమాగమాది పురోహితులతోను, రూపానుభూతి అనే భార్యతోను మదాశయుడు కళాపూర్ణుడి సేవచేయడం అనే విషయం భూలోకకథలో అలఘువ్రతుడి వృత్తాంతం యేర్పడడానికి కారణభూతమయింది. ఇందులో అన్నదాన వృత్తాంతమూ, అలఘువ్రతుడి భార్యల వృత్తాంతమూ కొంచెం హెచ్చుగా వున్నా ప్రధానకథ కది అరుచి మాత్రం కలిగించడం లేదు. అక్కడే ఆ-సందర్భంలోనే అయిన దివ్యమిథున ప్రసంగంకూడా అసంగతం కాదు.

తరవాతదీ కట్టకడపటిదీ సుగ్రహుడివృత్తాంతం. రహస్యకథలో సత్వదాత్ముడు కళాపూర్ణుడికి తన రాజ్యాన్ని అర్పించి అతడికి మంత్రి అయినట్లు చెప్పబడడమే భూలోకకథలో సుగ్రహుడి చరిత్ర వెలయడానికి కారణం. కళాపూర్ణుడి కథ భూలోకంలో వెలయడానికి ప్రధానసాధనమైన మణిహారవృత్తాంతం యీ సుగ్రహుడి కథలోనే వస్తుంది. మణిహార ప్రభావం యిప్పుడే సహేతుకంగా తెలుస్తుంది పాఠకలోకానికి. సుగ్రహుడి మణిహారలాభ వృత్తాంతం, బ్రాహ్మణవ్యథ కలగజేయడం మూలాన అతడు దాన్ని కోలుపోవడం, ఆత్మజ్ఞానంకూడా కోల్పోయి క్రమంగా కోలుకొంటూ అక్కడా అక్కడా తిరుగుతూ కాసారపురం చేరటం, అక్కడ రాజవరణంకోసమని పుష్పమాలికతో జనమధ్యంలోకి తోలబడిన పట్టపేనుగు ఇతడి కంఠంలో

పూలమాల వేయడం, ఇతడికి సత్వదాత్ముడనే పేరు కలగడం, రాజవడం అనే విషయాలతో కూడి యీ కథ రహస్యకథలోని సత్వదాత్ముడి విషయం భూలోకంలో వెలయడానికి హేతుభూతమయింది. ఈ కథ తెలియకపోతే మణిహారవృత్తాంతం తెలియదు, దాని ప్రభావం ఏమిటో, దాని చరిత్ర యేలాంటిదో తెలియబడకపోతే కావ్యం సంపూర్ణం కాదు. పూసల్లో దారంవలె వున్న మణిహారవృత్తాంతాన్ని తెలుపుతున్న యీ సుగ్రహుడి వృత్తాంతం కళాపూర్ణోదయ ప్రధానకథకు చాలా అవసరం. కావ్యకథను ఈ వుపాఖ్యానం సమగ్రం చేస్తూందనవచ్చు.

'అలఁతి యలఁతి తునియలుఁ గా

దల సంబంధించిన విధమున' కావ్యం వుండవలెనన్నాడు తిక్కన్న. ప్రధానకథకు అంగభూతాలుగా వుండే యీ చిన్న-చిన్న వుపాఖ్యానాలు ఖండఖండంగానే పయికి గోచరిస్తున్నా అఖండం అయిన కావ్యకథా వస్తువులో ఐక్యం అవుతూ సంపూర్ణత్వం పొంది సూరన్న ప్రతిభకూ, కల్పనా సామర్థ్యానికీ ప్రబలమైన నిదర్శనాలుగా వున్నాయి. కళాపూర్ణోదయంలోని వుపాఖ్యానాలు కావ్యకథాభవనం కూలిపోకుండా సుస్థిరంగా నిలిపే మూలస్తంభాలు! అతడి ప్రతిభను దిగ్దిగంతాలకు చాటే విజయకాహళులు!

సాంకేతికత

'గూటిలో చిలకేదిరా యీ

గూడు చిన్నబోయెరా' అని వేదాంతపరంగా బిచ్చగాళ్లు పాడే తత్త్వాలూ,

'అలుకేసుల పువ్వ తుమ్మెదా అది

మీలేన వాసనె తుమ్మెదా అది

మీలేన వాసనె తుమ్మెదా' అనే తుమ్మెద పదాలూ తెలుగువారికి కొత్తవి కావు. ఇటువంటి తత్త్వాలలోనూ, పదాలలోనూ కూడా సాధారణంగా అతిజటిలమైన వేదాంతవిషయాలను సులువుగా పామరులకు బోధపడేటట్టు చేయడానికి ప్రయత్నం జరిగింది. అంటే యిక్కడ కవి కానీండి, తత్త్వబోధకుఁడు కానీండి తాను లోకానికి అందచేయదలచుకొన్న సందేశాన్ని సూటిగా చెప్పకుండా మార్గాంతర సహాయంతో అది అనుమేయం అయ్యేట్టుగా చేశాడని చెప్పవచ్చు.

కవి క్రాంతదర్శి. భావుకుడైన కవి ప్రకృతిగతపదార్థాన్ని యథార్థరూపంతో కాక ఒక విలక్షణరూపంతో దర్శిస్తాడు. అలాగే అతడు తాను చెప్పదలచిన భావాన్ని కూడా సూటిగా కాక ఒక విలక్షణమైనరూపంతో తెలియచెయ్యడానికి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో ఆ విలక్షణతను సాధించడానికీ, కొన్ని కొన్ని సందర్భాల్లో తన భావం అనుమేయం అయ్యేటట్టుగా చేయడానికీ అతడు అవలంబించే విధానమే సాంకేతికత.

కవిత్వంలో యీ సాంకేతికవాదం అన్నది ఫ్రెంచి భాషాసాహిత్యంలో యిటీవలే అంటే కొంచెం యించుమించు 1870 ప్రాంతంలో బాగా ప్రచారంలోకి వచ్చింది. యథార్థవాదంతో మొగం మొత్తిపోయి విసుగెత్తిన భావుకలోకానికి తిరుగుబాటుగా యీ సాంకేతికవాదం అవలంబించి కవిత్వంలో ఒక రామణీయకాన్ని వెలయజేశారు ఆ సాంకేతికవాద ప్రవర్తకులు. బాండలేరు, రింబాండు, వెర్లేన్ మొదలయినవాళ్లు ఆవాద ప్రవర్తకులు. ఆంగ్ల సాహిత్యంలో యీ ఫ్రెంచి భాషా సాహిత్య ప్రభావంవల్లనే యీ సాంకేతికవాదం విరివిగా వ్యాప్తిలోకి వచ్చినా అంతకుముందు ఆసాహిత్యంలో సాంకేతికత అక్కడక్కడా మనకు చెదరులు చెదరులుగా కనిపిస్తుంది. స్పెన్సరు మహాకవి 'ఫేరీక్వీను,' 'మిల్లను' 'కోమస్' జాన్ బనియను 'పిల్‌గ్రిమ్సు ప్రోగ్రెస్సు,' కోలొరిడ్జి 'ఏన్‌షెంటు మారినర్', షెల్లీ 'ప్రొమిథియస్ అన్‌బౌండు' సాంకేతికతకు గొప్ప దృష్టాంతాలు.

ఆంగ్లసాహిత్య ప్రభావంవల్ల యిటీవల హిందీ సాహిత్యంలో యీ సాంకేతికవాదం బాగా వ్యాప్తిలోకి వచ్చింది. హిందీలో యీ సాంకేతికవాదాన్ని ఛాయావాదం అంటారు. మానవుడిలో వుండే చైతన్యానికి ప్రతీకం ఛాయ. ఆ ఛాయను ప్రకృతిలో చిత్రించడమే ఛాయావాదం. అదే సాంకేతికత. జయశంకర ప్రసాద్, సుమిత్రానందనపంతు, సూర్యకాంత త్రిపాఠీనిరాలా, మహాదేవి వర్మలు హిందీ సాహిత్యంలో సాంకేతికవాద ప్రవర్తకులు. ముఖ్యంగా సుమిత్రానందనపంతు 'జ్యోత్స్న' లో ఛాయావాదం స్ఫుటంగా కనిపిస్తుంది. మహమ్మదు జాయసీ 'పద్మావత్' లో ఛాయావాదం వేదాంత విషయ ప్రయోజనంకోసం అవలంబింపబడింది.

హిందీసాహిత్యంలో యీ ఛాయావాదం యిటీవలే అవతరించినా యిది భారతీయ సాహిత్యానికి

కొత్తది కాదు. మన వుపనిషత్తుల్లో కథలు సాంకేతికాలే. పోతే బుద్ధుడి ఉపదేశాల్లో కూడా సాంకేతికత వున్నది. సంస్కృత చాటువుల్లో అన్యాపదేశాలు యీ చాటువులే. ప్రబోధ చంద్రోదయ నాటకంలో కథ సాంకేతిక కథ కాక మరేమిటి?

ఇక పోతే తెలుగులోకూడా చాటువుల్లోనూ, వేమనపద్యాలలోనూ అక్కడక్కడా మనకుసాంకేతికత గోచరిస్తుంది. శ్రీనాథుని భృంగపందకం సాంకేతిక కవిత్వమే. అనువాద గ్రంథమైనా నందిమల్లయ్య, ఘంట సింగయ్యల ప్రబోధచంద్రోదయం సాంకేతిక కథా కావ్యమే! అయితే తెలుగులో యీ సాంకేతికత స్ఫుటంగా అద్భుతంగా ప్రతిభాసించే కావ్యం ఒక్క కళాపూర్ణోదయమే.

ప్రకృతి వస్తువులను మానవలక్షణాలతో పరిస్ఫురింపజేసి, మానవరూపాలతో కవిత్వంలో రూపొందిన ప్రకృతిపాత్రలతోడి కథాకల్పనం మూలాన ఒక రామణీయకాన్ని సంపాదించడంతో పాటు మానవ సమస్యలకి ఒక పరిష్కారమార్గం అనుమేయ మయ్యేట్టుగానో, అలాంటి ప్రయోజనం యేదీ లేకపోయినా మానవస్వభావాలని ప్రకృతి పాత్రలతో చిత్రించి ఒక రామణీయకాన్ని మాత్రం సాధించినా అది సాంకేతికతకు స్థూలంగా లక్షణం అవుతుంది. కళాపూర్ణోదయంలో సాంకేతికత యిందులో రెండో తీరుకు సంబంధించింది. నాలుగు వందలయేండ్లనాడు, కవితాపద్ధతులకు యిలాంటి నిర్వచనాలుకూడా వెలయనికాలంలో అద్భుతమైన సాంకేతిక కళాసృష్టి చేసిన సూరన్న ప్రతిభ, భావనాశక్తి నిజంగా ప్రశంసనీయం!

యథార్థవాదం (రియలిజమ్) సూటిగా నగ్నంగా విషయనివేదనంచేస్తే అదే విషయాన్ని మారాంతరాన సూటిగా కాకుండా చింతనాఫలితంగా అనుమేయ మయ్యేటట్టు చేస్తుంది సాంకేతికవాదం. కవితలో యీ వాదం వెలయడానికి పాతదారులకు మొగం మొత్తిపోవడం, కవితలోకి ఒక రామణీయకాన్ని తీసుకురావాలనే వాంఛ ప్రబలం కావడం రెండూకూడా ఒక విధంగా కారణాలు కావచ్చు. కళాపూర్ణోదయంలో పంచమాశ్వాసంలోని సరస్వతీ చతుర్ముఖుల లీలాకేళి ఘట్టం ఒక రమణీయ కల్పన! ఆ రామణీయకం సాంకేతికతావలంబన ఫలితం! ఆ సాంకేతికత యెలాంటిదో చూద్దాం.

బ్రహ్మదేవుడి ప్రాసాదం. దానిలో ఒక పెద్ద ఉద్యానవనం. ఆ ఉద్యానవనం మధ్య ఒక సరస్సు. అందులో ఒక ఎత్తయిన మణిస్తంభం వుంది. ఒక రోజు సరస్వతీ, చతుర్ముఖబ్రహ్మ యీ యిద్దరూ వుద్యానవనంలో విహరించి కొలనుగట్టుమీదకు వస్తారు. అక్కడ సంతాన తరువుకిందవున్న పూలపాన్పుమీద సరస్సువైపుగా తన నాలుగుముఖాలూ పెట్టి బ్రహ్మదేవుడు పండుకొన్నాడు. సరస్వతి అతడి కాళ్ళదగ్గర కూర్చుని అతడికి పాదసంవాహనం చేస్తున్నది. బ్రహ్మ మదనవికారంయెత్తి ఆమె ముఖాన్ని తనవైపుకు తిప్పుకొని ఆమె అధరోష్ఠం చుంబించబోతాడు. ఆ లీలకా సరస్వతి నవ్వి

'...............మేలు మే లెంతయు
నీ వింత లన్యాయ మింత తగునె
మీ మొగంబులు నాల్గు నీమాడ్కి నువ్విళు
లూరిన నేకాస్య నొకతె నేను
జాలుదు నే! యివి చాలించెదరొ మఱి
యేమైనఁ గలదొ!.........' అని మెడ

బిగించి ముఖం దూరంగాపెట్టి పెదవికి చెయ్యి అడ్డం పెట్టింది. బ్రహ్మ ఆమె తలను బలాత్కారంగా వంచి నాలుగుముఖాలతో అధరపానం చేశాడు. అప్పుడు ఒక నోటిలోని ఒక పల్లు ఆమె పెదవికి గట్టిగా నాటుకొన్నది. ఆ పీడనం కళాస్థానంలో కదలిక పుట్టిస్తే ఆమెకు సుఖోదయమయింది. అప్పుడు 'మదినిం బాసరింప మోహానంబై యుదయించె నొక్క మధురాంచిత శబ్దము కంఠసీమలోన్'. బ్రహ్మదేవుడు కావి తీవ్ర అనడంవల్ల కలిగిన సుఖావస్థను మరుగుపుచ్చడాని కని సరస్వతి 'యిదేమి సరసమబ్రహ్మ! పెదవి గంటుపడినది' అని కోపం నటించి మొగం అటు తిప్పి కాళ్లు ముడుచుకొని పండుకొన్నది. అప్పుడామె ముఖం సరస్సులో వుండే మణిస్తంభంలో ప్రతిఫలించింది. అక్కడే ఒక చెట్టుమీద వాళ్ళ పెంపుడు చిలక ఆ సమయంలో వుండి ఈ కథంతా చూస్తున్నది. కళాశాస్త్రంలో లక్షణాలను బట్టి సరస్వతికి సుఖోదయం కావడం చిలకే తెలుసుకున్నది. అప్పుడా బ్రహ్మ చిలకతో 'ఊబుసుపోదు, కథయొక్కటి చెప్పవుగా' అంటే చిలక 'మీరు చెప్పితే నేను వినవలసినదాన్ని' అన్నది. 'అలా అయితే విను' అని బ్రహ్మదేవుడు కథ చెప్పడం ప్రారంభించాడు.

'అనగా అనగా ఒక కాసారపురం. అందులో కళాపూర్ణుడు అనే రాజు ఉండేవాడు. అతడికి పుట్టుకతోకూడానే యౌవనం వచ్చింది. వెంటనే స్వభావుడు అనే సిద్ధుడు వచ్చి అతడికి దివ్యములయిన ధనుర్బాణాలను, ఒక మణిశిలాకను యిచ్చాడు.

'ఆమణిశిలాక యరుణమై యద్భుతంపు
రంగు గలిగిన యది యా మెఱుంగు రూపు
లక్షయము లాశిరాపన మతిను విజయ
గౌరవానికి సంప్రాప్తి కారణంబు'

అలా వుంటే మహాదాశియుడు అనే ఒకరాజు రూపానుభూతి అనే తనభార్యనూ, ధీరభావు డనే మంత్రినీ వెంటబెట్టుకొని కళాపూర్ణుడిమీదికి దండెత్తి వస్తే అప్పుడు కళాపూర్ణుడు విల్లు తొడిగి ధీరభావుణ్ణి దూరంగా తరిమి తనకు శరణాగతులయిన మదాశియ దంపతులను తనకు దాసులుగా చేసుకున్నాడు.

ఇలా చెబుతూవచ్చేసరికి సరస్వతి తమ శృంగారకేళీవిషయమే అది అని గ్రహించి 'చిలకా! ఆ కళాపూర్ణు డేమయినాడో, అతడి తలిదండ్రు లెవరో అడిగావే' అన్నది. అదీ అలానే అడిగింది. బ్రహ్మదేవుడు చెప్పడం ప్రారంభించాడు. 'కళాపూర్ణు డాతరువాత అభినవకౌముది అనే ఆవిడని వరించి పెళ్ళి చేసుకున్నాడు. అతడికితల్లి మణిస్తంభుఁడు. తండ్రి సుముఖాసత్తి...' అన్నాడు. ఇలా అనేసరికి సరస్వతి పకాలుమని నవ్వి అతణ్ణి కౌగలించుకొని 'యింతిలోనే యిన్ని తిప్పలా! ఎక్కట్లు లారాజా జనని మగదియూను, జనకు డాను వాడుగా' అని అతడి వీపు చఱచి నవ్వుతూ 'పైకథ చెప్పండి' అన్నది. ఆ లీలకు బ్రహ్మ సంతోషించి ఆమె పెదవిని చుంబించాడు. అప్పుడామె ఒకపల్లు మరల గట్టిగా నాటుకొన్నది. అందుల కామె కోపం నటించి తన చేతులతో అతడి నాలుగు ముఖాలను వెనక్కి తోలగనెట్టి 'తరవాతి కథ చెప్పండి' అన్నది. ఆ స్థితిలో పయ్యట తొలగి మెఱుగు లిప్పిన ఆమె వురోజాలను, లేకౌనును చూచి బ్రహ్మ మనసు పట్టలేక తిరిగీ మోవితీ పానివాడు. అందుకు వాణి యిదియెల్ల చేస్తుకొనా నృపు డేమి యయ్యెఁ గథ యేమతియుం'డని అడిగినది. బ్రహ్మదేవుడు తిరిగీ చెప్పడం ప్రారంభించాడు.

సత్త్వదాత్ముడు అనే మంత్రి అంగదేశంలో క్రముకకంఠోత్తరపురంలో తనకు పట్టం కట్టగా కళాపూర్ణుడు తనభార్యతోకూడా ఆనగరంలో సుఖంగా కాలక్షేపం చేస్తూ వుండినాడు. అతణ్ణి ఆశ్రయించి వుండిన మదాశియుడు ఆపురానికి బంగారుప్రాకారం గట్టించి రూపానుభూతి అనే తన భార్యతో కళాపూర్ణుణ్ణి సేవిస్తూవుండి అతడి మణిశిలాకనుచూచి దాని మహిమవలన 'మధురలాలస' అనే కూతుర్ని కన్నాడు. అతడికి నలుగురు పురోహితులు. ప్రథమాగముడు మొదలయిన ఆ నలుగురూ ఆ మణిని స్పృశిస్తూ ఆనందపరవశులయినారు. వాళ్ళలో ఒకడు ఆమణిని గట్టిగా నొక్కేసరికి కళాపూర్ణుడికి కోపం వచ్చి వాళ్ళను నలుగురినీ తోసివేసి మదాశియుడు కట్టించిన ప్రాకారం విరుగగొట్టించినాడు. ఆ తరవాత మదాశియుడు సకుటుంబంగా ఆపూరు విడిచి అంగదేశానికివచ్చి ఆ దేశమధ్యంలో కొంతకాలం వుండినాడు. అయితే ప్రయాణక్షోభవల్ల 'మధురలాలస' బాగా చిక్కిపోయింది. అంచేత కూతురి ఆరోగ్యంకోసమని మదాశియుడు తిరిగీ భార్యతోనూ, కూతురుతోనూ క్రముకకంఠోత్తరపురానికే వచ్చి తన కూతుర్ని తిరిగి కళాపూర్ణుడిదగ్గర చేర్చినాడు. వీళ్లు చేరుతోగానే ప్రథమాగముడు మొదలయిన మదాశియుడి పురోహితులుకూడా మెల్లమెల్లగా వచ్చి అక్కడ చేరుకుంటారు. మధురలాలస క్రమంగా పెరిగి పెద్దదై ఆరాజావల్ల యౌవనసుఖం అనుభవించింది.' ఇలా చెప్పి బ్రహ్మదేవుడు కథ ముగించాడు. అప్పుడు

'నిరవధిక ప్రేమోదయ
దురపహ్నవ కందళన్మృదుస్మితశోభా
సురుచిర కృత్రిమ రోష
స్ఫురణంబున బొమలు ముడుచుచున్'
సరస్వతి బ్రహ్మదేవుడితో
'అటు తెలఁ దొర! యెంతటి
మహాత్ముఁలు మీరలు నాదుమీఁదనా
కటకట! మీ వచోరచన
కౌశల మో భువనప్రపంచ సం
ఘటన ధురీణ' అన్నది.

అందుకు బ్రహ్మదేవుడు నవ్వి 'కామిని! యిందు దిప్పదేమిగాంచి యీ కీటుకు గతించి పల్కె వెలుఁగింపుము కల్గిన నాకు' అని అడిగాడు. సరస్వతి అందుకు,

చెల్లఁబో! మీ సేవ సేయుదు నింతమా
త్రము తెలుంగఁగ లేవ? ప్రాణనాథ!
యీదింటమాటలు నిట్టిభావంబుల
విధము నే నిచ్చినవిద్యలకద
యిప్పటి మనవృత్త మీకథ సర్వంబు
తడదముట్ల నేమి చెప్పెదరో యనుచు
నూరక యుండఁగ నుంటినంతియు నది
చెప్పెద వినవలసిన వినుండు
కొలకు కాపారపురముగాఁ బలికి యందుఁ
బొలుచు నా మోముదీప సంపూర్ణశశియు
నమరలంపునఁ బలికితి రపుడు దావిఁ
బ్రోటముగఁ గళాపూర్ణుఁ డబ్రాజ గాఁగ'

అని సరస్వతి బ్రహ్మదేవుడు చెప్పిన కథనంతా తమలీలకు సమన్వయించి చెప్పి 'యిది నిజమేకదా?' అని అతణ్ణి అడిగింది. బ్రహ్మదేవుడు నవ్వుతూ 'సత్యమే. అలా సమన్వయించే కథ అల్లి చెప్పాను' అన్నాడు. ఇది కళాపూర్ణోదయ కథకు మూలమయిన సరస్వతీ చతుర్ముఖుల లీలాకేళి కథ!

ఈ ఘట్టంలో బ్రహ్మదేవుడు సరస్వతికి తెలిపిన కథ అంతా సాంకేతిక కల్పనం. బ్రహ్మదేవుడా కథను చెబుతున్నప్పుడు తమ శృంగారవృత్తాన్నే అతడు చెబుతున్నాడని సరస్వతి గ్రహించినట్టుగానే ఆకథ చదువుతున్నప్పుడు మనకూ ఛాయగా ఆకథలో సరస్వతీ చతుర్ముఖుల శృంగారకేళీవృత్తం స్ఫురిస్తూంటుంది. అయితే యిందులో కౌమారపురము, కళాపూర్ణుడు, అభినవకౌముది, మధురలాలస, మరాకేయుడు, రూపానుభూతి, ధీరభావుడు, సత్త్వదాత్ముడు, స్వభావసిద్ధుడు, ధనుర్బాణములు, మణిశలాక, పసిడిప్రాకారం, అంగదేశం, క్రముకకంఠోత్తరపురం, అనే యీ పేర్లే కథలోని యీ ఛాయను స్ఫురింప జేయడానికి తోడ్పడుతూన్నది. కాని యిలాంటి ధ్వని సూచన యేదీ లేకుండా సాంకేతిక కల్పనం వుంటుంది. ఆంగ్లభాషలో విట్మన్ అనే అమెరికన్ కవి వ్రాసిన 'ఓ కాప్టెన్ మై కాప్టెన్' అనే లఘుపద్యకృతిలో యిలాంటి సూచన అంటే శబ్దశక్తి మూలధ్వని లేకపోయినా ఆ పద్యం అంతా చదివింతరవాత 'ఏమిటీ కథ? ఇందులో యేమైనా అంతరార్థం వుద్దేశించినాడా కవి!' అని కొంచెంసేపు దీక్షగా ఆలోచిస్తే 'అబ్రహాం లింకను' విషయం ఆ పద్యకృతివల్ల కవి అనుమేయం అయ్యేటట్టు చేశాడని స్పష్టంగా గోచరం కాక తప్పదు. 'ఏన్షెంటు మారినర్' లో కోలరిడ్జి డెత్, లైఫ్ ఇన్ డెత్ అనే రెండు పాత్రలు పడవకప్పుమీద పాచిక లాడుతున్నట్టూ అందులో లైఫ్ ఇన్ డెత్ జయించినట్టూ ఒక కల్పనం చేయడంమూలాన ఆల్బట్రాసు పక్షిని చంపిన మారినరుకు ఎలాంటిశిక్ష సముచితమయిందో పాఠకులకు అనుమేయమయ్యేటట్టు చేశాడు. ఇది సాంకేతికతలో ఒకరకం. పిల్ గ్రిమ్సు ప్రోగ్రెస్సులో క్రిస్టియన్ అనేవాడు మోక్షంకోసమని ప్రయాణం చేస్తుంటే దుర్గుణాలన్నీ మార్గమధ్యంలో అతణ్ణి మభ్యపెట్టాలని ప్రయత్నించేయటం, వాటికి లొంగకుండా క్రిస్టియన్ ఎలా గమ్యం చేరుకునేదీ చిత్రింపబడింది. ఇందులో మానవదుర్గుణాలకు మానవరూపం కల్పింపపడింది. క్రీస్తుమతానుయాయి మోక్షప్రాప్తికై చేసే జీవితం అనే ప్రయాణంలో దుర్గుణాలు అనే మోసగాళ్లు మభ్యపెట్టి మోసం చేయడానికి యెంత ప్రయత్నించినా వాళ్ళకు లొంగకుండా విశ్వాసంతోనే అతడు కృతార్థుడవుతాడు. అనే విషయం అనుమేయ మయ్యేటట్టు చేస్తున్నాడు కవి. షెల్లీ ప్రామిథియస్ అన్ బౌండులో మానవుడు స్వతంత్రవ్యక్తి. అతడికి వ్యక్తిస్వాతంత్ర్యంవున్నది. ప్రభుత్వం అతడి స్వాతంత్ర్యానికి అడ్డు నిలిచినప్పుడు అతడు యెదురుతిరుగుతాడు అనే విషయం మార్గాంతరాన సాంకేతిక కల్పనాసాధనంతో చిత్రింపబడింది. షెల్లీ వ్రాసిన యీ గ్రంథమే హిందీభాషలో సుమిత్రానందన పంతు 'జ్యోత్స్న'కు మూలమని చెప్పవచ్చు.

సాంకేతికత అన్నది ఒక విశాలమయిన కవితా సంకేతం. అది ఆయా కవుల కథావస్తువులనుబట్టీ, కథాసంవిధానపద్ధతినిబట్టీ ఆంగ్లభాషలోనే అనేక రూపాలతో వెలసి వుంది. దాన్ని తిరిగీ కొన్ని విభాగాలకింద విభాగించుకుని ఒక్కొక్కదానికీ ఒక్కొక్కవిధంగా లక్షణనిర్వచనం చేసుకున్నారు. ఈ విభాగాలకు పరస్పరం ఏదో అత్యల్పంగా మాత్రమే భేదం ఉంటూ అంతా ఒకటేగా మనకు గోచరిస్తూంటుంది. వాళ్ళల్లో అలిగొరీ వేఱు. సింబాలిజమ్ అంటే అలిగొరీ కాదంటారు ఆంగ్ల పండితులు.

మానవాతీతులయిన వ్యక్తులను, మానవ స్వభావాలతో, మానవలక్షణాలతో, మానవులకు సహజమయిన బలహీనతలతో చిత్రించి వారు మానవ వ్యక్తులుగానే మనశ్ఫలకంలో చిత్రితమయ్యేరీతిగా రచింపబడిన రచన సాంకేతికత అవుతుందని సాంకేతికతకు నేటి విమర్శకులు నిర్వచనం చెబుతారు. షేక్స్పియరు మిడ్ సమ్మరు నైట్సుడ్రీములో 'పక్' అనే ఫేరీ కల్పనం సాంకేతిక వ్యక్తికల్పనం అని అంటారు. అలాంటివ్యక్తే టెంపెస్టులో 'ఏరియల్.' విలియమ్ బ్లేకు పద్దెనిమిదవశతాబ్ది కవి. అతడి కవిత్వం సాంకేతికతాపూర్ణం అని అంటారు. అతడి 'టైగర్' అనే రచన అలాంటిది. అక్కడ పులి భగవంతుడి సృజనశక్తికి ప్రతీకంగానే ఉంటూనే సహజ జంతు లక్షణాలతో వున్నట్టు వర్ణింపబడింది. అలాంటిదే సాంకేతిక కవిత్వంగా యిప్పుడు విలిచి వుంది. ఆ నిర్వచనంతో ఆ లక్షణంతో చూచినప్పుడు మన కళాపూర్ణోదయంలోని కథ అలిగొరీయే అవుతుంది. కాని సింబాలిజమ్ — సాంకేతికత కాదు.

హిందీభాషాసాహిత్యంలోని సాంకేతిక రచనలతో చూచినా కళాపూర్ణోదయంలోని సాంకేతికతకూ, ఆ రచనలలోని సాంకేతికతకూ ఏదో కొంత తెలియరాని భేదం వుందని మనకు సూక్ష్మంగా ఆలోచిస్తే తెలుస్తుంది. స్థూలంగా చూచినప్పుడు మాత్రం రెంటిలోనూ ఒకేరకమయిన సాంకేతికత వున్నట్టే కనబడుతుంది. 'జ్యోత్స్న'లో మానవ సమస్యాచిత్రణం ప్రకృతిరంగస్థలంలో ప్రకృతి వస్తువులకు మానవరూప స్వభావకల్పనంద్వారా సాధింపబడ్డది. కళాపూర్ణోదయంలో ప్రకృతి వస్తువులకే మానవరూపకల్పనంద్వారా ఒక కథారూపం యిచ్చి ప్రకృతి కథాచిత్రణం చేయబడ్డది. ఇంచుకంత భేదం ఉన్నా అది వస్తువునుబట్టీ, కవి ప్రతిభనుబట్టీ యేర్పడిన భేదమే కానీ సాంకేతికత కాకపోవడం మాత్రం కాదనీ మనం గ్రహించవలసి వున్నది.

అనేక దృక్పథాలతో అపూర్వమూ, అద్వితీయమూగా చిత్రింపబడ్డ దొడ్డ గ్రంథం కళాపూర్ణోదయం. బూజుపట్టిన పాతదారులతో ప్రబంధాలు రచిస్తూండిన ప్రబంధ కవుల కాలం అనే చీకటి కోణానికి యితివృత్తంలో, వుపాఖ్యానాలకూర్పులో, సాంకేతిక శిల్పనిర్వహణలో క్రొత్త రామణీయకం తెచ్చి వెలుగుబాటను తీర్చి ప్రబంధయుగాన్ని ప్రకాశవంతం చేశాడు. తన చుట్టూవున్న లోకాన్ని ప్రకాశవంతం చేయడమే మహాకవి లక్ష్యం, కర్తవ్యమూను. 'కేవల కల్పనాకథలు కృత్రిమ రత్నము'లని యెవరో అన్నా అది కళాపూర్ణోదయానికి వర్తించదు. కళాపూర్ణోదయం ధగధగ మెరిసిపోయే ఒక జాతి రత్నం! సానదీరినకొద్దీ క్రొత్తక్రొత్త కాంతుల నీనుతుంది యీ జాతిరత్నం!



మహాత్యాగి

శ్రీ బెళ్లారి శ్రీనివాసమూర్తి.

నీస్వరూపమె నేడు కన్నెత్తి చూడ
గలము, నీబోధలే వినగలము తండ్రి
ఆమహాత్ముని యందు త్యాగైకమూర్తు
లయిన, మీజన్మముల హృదయములుమారి
జనత ప్రాచీన ధర్మవాసనల యందు,
స్మరణ గల్గించుకొని మనశ్శాంతి బొందె
చేత మలరించుకొని జ్ఞానసిద్ధి బొందె
ఓయి కాషాయవస్త్ర ధారీ, యపూర్వ
క్రమ రుద్రాక్షమాలికా క్రాంతలలిత
లలిత వక్షస్థలా, జటా రమ్యధారి
యేమి సౌందర్య మిమిడెనో యీ త్వదీయ
వదనమున మాయశోధరామ్యదుల హృదయ
మల్లనల్ల నాకర్షించె నద్భుతముగ
పార్వతీశ్వరులట్లు శోభల వెలార్చి
యెవరి కోసము బ్రతికి పోయితిరి మీరు
ఈ మహాత్యాగ శీలత యేవరించి
ఈయిహ సుఖానుభూతి రాహిత్యమెంచి
సుగతుడవు నీవు నీవచ శ్శభశోలలమి
సాంద్ర చంద్రాతపమ్ముగా సకల దిశల
గాఢ తమసముల్ తమయంత కదలిపోవె
నిరుపమాన ప్రభారాశి, నీ యపూర్వ
కరుణ మొక ప్రవాహంబుగ సురభిళములు
హృదయకేదారములు ఫలియించిపోవె
ఓయి మాయాసుతా భవదీయమూర్తి
భగవదంశముగాగ నీభరత ఖండ
మవిరతోత్ఫుల్ల కమలమై యలరుగాదె
ఓయి స్వేచ్ఛా విహంగమా నీయనూన
స్వైరభావంబు లాత్మల ప్రతిఫలింప
మాకు భవబంధములు దవ్వ మసలుగాదె
యాత్రికుని వోలెనే తెంచి యాత్రలోన
నలుప వలసిన కార్య సంచయము సల్పి
యాత్ర ముగియగ నెచ్చట కరిగినావొ
గౌతమా దీని మర్మంబు కానబడదు,
ఏను ముగియింతు నా ప్రభూ.యీనవీన
కావ్య ఖండంబు నీకొరకై జపించి,
నిలిచియుందువా ప్రేమ సంకలితమైన
మామక హృదంతరాశ్రమ సీమలోన

పరీక్ష

శ్రీమతి మాలతీ చందూర్

★

పొద్దుటే రైలు దిగి వచ్చాను. ఆయన ఆఫీసుకి వెళ్ళిపోయారు. పొద్దుటనుంచీ యిల్లు సర్దుకోడం, తుడిపించడం యిలాటివాటితో ఊపిరి పీల్చుకునేందుకు కూడా తీరిక లేకుండా అయింది. వచ్చినప్పటినుంచీ సత్యవతి వస్తుందేమో నని క్షణం క్షణం ఎదురుచూస్తూనే వున్నాను. ఒకటి రెండుసార్లు పనిపిల్లని వెళ్ళి పిల్చుకు రమ్మనమని, చెబుదామని నోటిదాకా వచ్చింది. యీ లోపల మరో ముఖ్యమైనపని కంటికి అవుపడటంతో, ఆమాట నోట్లోనే వుండిపోయింది.

నాలుగయింది. ముందు హాలూ పడకగదీ కాస్త నివాసయోగ్యం చేసేటప్పటికి. స్నానం చేసి, చీర మార్చుకున్నాను. ఇంటివారమ్మాయి మరకతం వచ్చింది. నేను జడ అల్లుకుంటుంటే కూచుని క్షేమ సమాచారాలు విచారించాక, "మీ సత్యవతి లేచిపోయింది," అంది మరకతం.

బిత్తరపోయాను ఆ వార్తవిని. కాని ఆశ్చర్యం కనపరచకుండా—"డబ్బున్న వాడితో నేనా?" అని ప్రశ్నించాను.

మరకతం నా ప్రశ్నకు తెల్లపోయి చూసింది. అవును, మరకతానికి ఆ ప్రశ్న ఎలా అర్థం అవుతుంది? పదివేలు కట్నం యిచ్చి వాళ్ళనాన్న యాభైవేల రూపాయల ఆస్తివున్న ఆసామిని భర్తగా తెచ్చాడు మరకతానికి. ముక్కులకీ, చెవులకీ ధగధగ మెరిసే రవ్వలు ధరించిన మరకతానికి, నూరురూపాయలకి తక్కువ ఖరీదుగల పట్టుచీర కట్టడం ఎరగని మరకతానికి, హరిదాసు పదిసార్లూ, చంద్రలేఖ అరడజనుసార్లూ చూసిన మరకతానికి, బంగారంతో నోళ్లునింపుకున్న మరకతానికి, నా ప్రశ్న వెనక వున్న ట్రాజెడీ, సత్యవతి జీవితంలోని ట్రాజెడీ ఎలా, అర్థం అవుతాయి? అసలు వాక్యమాత్రం అర్థం అయేదా సత్యవతి ఒక పశువ!

కిటికీలోంచి మబ్బులు కొండు కనపడుతున్నవి. మా మేడకన్నా ఎత్తైన మేడలూ, పిల్లలు ఎగరవేసే గాలిపటాలు కనపడుతున్నాయి మరకతం కుర్చీలో కూచుంది పచ్చని చెక్కిళ్ళమీద రవ్వల దుద్దులు ప్రతిబింబిస్తున్నాయి.

* * *

అయిదేళ్ళక్రితం ఒకానొక విచిత్రసంఘటన వల్ల సత్యవతిని నేను మొదటసారి పలకరించాను. అప్పటికి నేను మద్రాసు కాపరానికివచ్చి రెండుమూడు నెలలు అయింది. ఇల్లు దొరకని రోజుల్లో బ్రహ్మ ప్రయత్నంమీద జార్జిటవున్‌లోని యిరుకు సందుల్లో, ఒక మేడమీద భాగం దొరికింది మాకు. ఆయన ఆఫీసుకు వెళ్లాక, మధ్యాహ్నం వేళ చేసేపని లేక, కాలం గడవక, అలా డాబా ముందుకి వచ్చి, గంటలు గంటలు గడిపేదాన్ని. ఒక పక్క చిన్న టీషాపు, ఎదురుగుండా లాండ్రీ, సందుచివరని కార్పొరేషను స్కూలు పిల్లల రొద, రోడ్డుమ్మటపోయే అయిస్‌ఫ్రూట్ వాడి కేకలు—యివన్నీ ప్రతిరోజూ మధ్యాహ్నం నేను చూసేదృశ్యాలు, వినే శబ్దాలు.

సాయంత్రం అయిదింటికి వంటచేసేసి, స్నానం డ్రెస్సింగూ పూర్తి చేసుకుని అలా డాబాలో, ఆయనకోసం నిరీక్షిస్తూ నుల్చునేదాని. ఆయనవచ్చి పెద్ద మాట్లాడుతారని గాని, షికారుకో సినిమాకో తీసుకెళ్తారని గాని కాదు. ఊరికే నిల్చో

డంలో, కావ్యం లోకి చూడడంకన్న, ఆయన కోసం నిరీక్షించడంలో కాస్త కాలక్షేపం కనిపించేది. అయిదుగంటలకి నేను డాబాలో నిల్చుని, వచ్చిపోయే జనాన్ని చూస్తూండేదాన్ని. ప్రతినిత్యం అయిదూ అయేవేళ-సన్నగా పొడుగ్గా వున్న అమ్మాయి తలవంచుకు వెళ్ళేది. ఆయన కోసం చూస్తున్నట్టే, ఆ అమ్మాయి రాకను పరిశీలించడంకూడా నా దినకృత్యాల్లో ఒకటైపోయింది. ఆ అమ్మాయీ, ఆయనా ఏడెనిమిది నిముషాల తేడాలో వస్తూండేవారు. ఏరోజైనా, ఆయన ముందుగా యింటికొచ్చినా, ఆ అమ్మాయి ఆ సందు మ్మట వెళ్ళడం చూడనిదే నాకు లోపలికి వెళ్ళబుద్ధి అయేది కాదు.

ఆ అమ్మాయి మా సందులోంచి అంటే మా యిలుదాటాక నాలుగో యింటిని ఆనుకునివున్న చిన్న గల్లీలోకి, వెళ్ళిపోతూండేది రోజూ. ఒకరోజున తల్లో జాజుల దండ సద్దుకుంటూ, డాబాలోంచి కిందకు వంగిచూస్తున్నాను. గభాలున దండ జారి, ఆదారినే వెళ్తున్న అమ్మాయిమీద పడింది. ఆఅమ్మాయి వులిక్కిపడి పైకి చూసింది. నేను చిరునవ్వుతో పలకరిస్తూ కిందకి దిగాను. ఏంచెయ్యాలో తెలీక దండపుచ్చుకుని, వడిగోర్లుమీద నిల్చుండిపోయిన ఆ అమ్మాయి, నన్ను చూసి రెండడుగులు నావైపుగా వేసింది.

"పొరపాటునపడింది. ఏం అనుకోకండేం!"

"ఫరవాలేదులెండి," అంది తనూ నవ్వుతూ.

"తెలుగువారా మీరు?"

"అవును"

"చదువుకుంటున్నారా?"

"ఆ..."

ఆ మర్నాటినుంచి రోజూ మా యింటివద్ద ఆ అమ్మాయి తలెత్తి నవ్వడం, నేను చిరునవ్వుతో సమాధానం యివ్వడం-యిలా పదిరోజులు గడిచాయి.

ఆ రోజు ఆఫీసులో ఏదో టీపార్టీ వుందనీ, ఎనిమిదింటిదాకా రాననీ చెప్పివెళ్లారు. గడియారపుముల్లును పాకేసిందికాలం. అయిదింటికి ఆ అమ్మాయిని చూడంగానే, "ఆగండి" అని సౌంజ్ఞచేసి, కిందకి వెళ్లాను.

"లోపలికి రండి. కాసేపు కూచుని వెళ్దురుగాని," అన్నాను చెయ్యిపుచ్చుకుని.

"ఇంట్లో చెప్పలేదు. మరోసారి వస్తాను." అంది అక్కడే నుల్చుని.

"పది నిమిషాల్లో వెళ్ళిపోదురుగాని," అని చెయ్యిపుచ్చుకుని తీసుకొచ్చాను.

మనిషి సన్నగా పొడుగ్గావుంది. ముఖం సామాన్యంగా వుంది. చవకబారు చీరె, జాకెట్టూ వేసుకుంది. చెవులకీ చేతులకీ ఏమీ లేవు. మెళ్లో పండిసగడాల తావళం. చాలా భిడియంగా కూచుంది.

"ఏం చదువుతున్నారు?" అన్నాను, కాఫీ యిచ్చాక.

"ఫిఫ్త్ ఫారమ్" అంది.

"ఎక్కడుంటున్నారు?"

"యీపక్క-నాయర్ మెస్ యాల్లీలో. నాలుగో నెంబరు యింట్లో..."

"అప్పుడప్పుడు వస్తూవుండండి. ఎంతో బాగు. తమిళం రాదు నాకు," అన్నాను.

"శని ఆదివారాలు గాని తీరిక వుండదు. అప్పుడు కూడా హోమ్‌వర్క్ ఒకటుంటుంది యింట్లో కాస్త పని సాయం చెయ్యాలి. శనివారం సాయంత్రం వస్తాలెండి," అంది.

వీధిగుమ్మంలోకి వచ్చాక, పేరు అడిగాను. సత్యవతి అని చెప్పింది. 'మీ పేరేమిటి?' అని నన్ను అడిగింది.

* * *

శనివారం నాలుగ్గంటలవేళ వచ్చింది సత్యవతి. ఆయన యింట్లో లేరు. ఇద్దరం చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాము. సత్యవతి అఖండ తెలివితేటలున్న మనిషి కాదు. ప్రపంచజ్ఞానం వున్న మనిషి. మనసు కరిగించే దీనురాలు ఆమె.

"మీరు ఎదురుచూస్తూంటారని వచ్చాను. లేకపోతే మానేద్దామనుకున్నాను," అంది.

"ఏం, శెలవురోజున కూడా అంత పనేముంది నీకు?"

"హోమ్‌వర్క్ చేసుకోవాలి. వుత్తరోజుల్లో ఎలాగా వీలుండదు, శెలవురోజునన్నా వంట చెయ్యకపోతే మా బామ్మ వూరుకోదు.

"మీ యింట్లో చాలామంది వున్నారేమో—నువ్వే ఎందుకు వంట చెయ్యడం?"

"మా అక్కకి పిల్లలు, వదినకు పిల్లలు. మా పెద్దమ్మకు పార్శ్వపునెప్పి ఎప్పుడూ వుంటుంది. వుత్త రోజుల్లో అయితే వూరుకుంటారు. శెలవ రోజుల్లో కూడా..." అని ఆగిపోయింది.

"పొద్దున్న వంట కూడా నువ్వేనా?" అన్నాను.

"శని ఆదివారాలు నేనే చేస్తాను. మధ్యాహ్నం నేనూ వదినా కూచుని అప్పడాలు వత్తాము. యీ

సాయంత్రం మా అక్క వంట చేసేందుకు వస్తుంది. అయినా మా ముసలమ్మ వూరుకోదు," అంది మాట ఆపి.

కాసేపు వున్నాక, "మీరు మా యింటికోసారి రారాదూ? మా వాళ్ళనీ, యింటినీ చూద్దురుగాని. ముఖ్యంగా మా ముసలమ్మ మిమ్మల్ని చూస్తే నేను మీ యింటికి అప్పుడప్పుడొచ్చేందుకు కాస్త వీలుగా వుంటుంది. రేపు వస్తారా?" అంది వుత్సాహంగా.

వాళ్ళ ముసలమ్మ నన్నెందుకు చూడాలో నాకు అర్థం అవలేదు. సత్యవతినిబట్టి వాళ్ళవాళ్ళని చూడాలని నాకూ కుతూహలం కలిగింది.

మర్నాడు మధ్యాహ్నం ఆయన నిద్రపోతూంటే నేను సత్యవతి యింటికి పెత్తనానికి బయలుదేరాను.

వామన్ శివ్ యాలీ అంటే అనేక కాలనీ అనుకునేరు. అది కాలనీ కాదు, గల్లి. ఆ గల్లీలో ఆరిళ్లు వున్నాయి. అటువైపే గల్లీ మరో సందులోకి కలిసి, పేరులో గూడా మార్పు చెందుతుంది. ఆరిళ్లలో మొదటి రెండూ మొదలియార్లవి. మూడూ అయిదూ పాలవాళ్ళవి. ఈ రెంటికీ మధ్యనున్న నాలుగో యింట్లో వున్నారు సత్యవతీవాళ్ళు. ఆ యిల్లుగూడా మొదలియార్లదే. పైన యింటివాళ్ళున్నారు. కింద అద్దెలకి ఎనిమిది సంసారాలున్నాయి. ఒక్కొక్క సంసారానికీ కనీసం ఆరు మొదలు పదిదాకా మనుషుల సంఖ్య వుంటుంది. నాలుగోయింటి వెనకభాగంలోని రెండు గదులూ, కూటం - ఇది సత్యవతి గారి వాటా. ఆ గదులకి కిటికీలు లేవు. పైనమటుకు అద్దాలున్నాయి. ఆ అద్దాలమీద యింటివాళ్లు కూచోకపోతే, లేక బట్టలో, పీటలో వెయ్యకపోతే కాస్త వెల్తురు వస్తుంది; లేకపోతే చీకటి సుయ్యారం. ఇంటికి లైట్లు లేవు, బాత్ రూమ్ లేదు. ఒకే ఒక పంపు. ఒకే లావెట్రీ. కింద భాగంలో వున్న అందరికీ అదే మరుగుదొడ్డి.

ఇంటికి రెండువైపులావున్న పాలవాళ్ళ గొడ్ల సావిడిలోంచి యిరవైనాలుగు గంటలూ, దోమలూ, దుర్వాసనా వస్తూనే వుంటాయి. వీధిలో చేపపొలుసులూ, ముడుసులూ-యిలాంటి పదార్థాలు నిత్యం కనపడుతూనే వుంటాయి. వీధివాకిట్లో అరుగుమీద సత్యవతి నాన్నా, పెదనాన్నా కూచుని చుట్టపొగగుల్లా-మాసిపోయిన పేకముక్కల్తో పేకాడుకుంటున్నారు.

ఎనిమిదిళ్ళవాళ్ళ రొదమధ్యనుంచి సత్యవతీ వాళ్ల వాటాలోకి అడుగెట్టాను. కూటంలో ఒకమూల చింకిచాపమీద - ముసలావిడ పడుకుని ఏదో గొణుగుతూ కునుకుతీస్తోంది. మరోమూల సత్యవతి పెదమ్మగారు పార్శ్వపునొప్పితో-తలకిపట్టీ ఏదో వేసుకుని బాధపడ్తోంది. సత్యవతి వదినగారు సన్నగా పీలగా వుంది. ముఖం కళకళలాడుతున్నా, సరిఅయిన పోషణా ఆహారంలేక చిక్కిపోయినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. చంటిపిల్లను వడిలో వేసుకుని పాలిస్తోంది ఆమె. సత్యవతి అక్కగారు ఒకపక్కగా కూచునివుంది. సత్యవతి అక్కపిల్లలూ ఒదినపిల్లలూ కూటంలో ఒకమూలగా కూచుని, రాళ్ళూరప్పలూ పెట్టుకుని ఆడుకుంటున్నారు.

సత్యవతిఅప్పగారూ ఒదినగారూ నాతో యీమాటా ఆమాటా మాట్లాడారు. యిద్దరూ ప్రపంచజ్ఞానం తెలిసినవాళ్ళే. పక్కగదిలోంచి 'కాఫీ' అని కేకవినిపించింది. సత్యవతివదిన కాఫీ కలిపేందుకు లేచింది.

"మా అన్నయ్య కొలువుగదా అని నిద్రపోతున్నాడు. అదోగదీ, యీకూటం, వంటగది. యిదే మాయిల్లు" అంది సత్యవతి చిరునవ్వుతో. నేనూ నవ్వాను ఏమనాలో తెలీక.

ఇంట్లో పిల్లాపాపా - ముసలమ్మ దగ్గరనుంచి పాలుదాగే పిల్లదాకా - అందరూ కాఫీ సేవించారు. కాఫీతాగి, నేను యింక లేవబోయాను.

ఈలోపలే ముసలమ్మలేచి, తిట్లు అందుకుంది. నల్లమందు అయిపోయిందట. డబ్బులేక తేలేదన్న విషయం నాకు తెలియకుండా కప్పెడుదామని, ఎంతప్రయత్నించినా దాగలేదు. ముసలమ్మ తిట్లప్రవాహం ఒకపట్టాన ఆగేటట్టులేదు. ఆతిట్లు విననట్టు నేనూ నటించాను. వాళ్ళూ నటించారు, నేను లేచి శెలవుదీసుకువచ్చేశాను.

* * * *

మళ్లీ ఆదివారం మేమిద్దరం కూచుండగా సత్యవతే ఎత్తింది తనుయింటి ప్రస్తావన.

"చూశారుగా మాయిల్లు. అదీపద్ధతి. సంపాయించేది వాడొక్కడూ. తినేది పదిమంది. అందులో మాముసలమ్మ వుండేం-ప్రాణాలు తోడేస్తుంది."

"మీ అక్క పిల్లలు ఎదిగారుగా, ఆ అమ్మాయిగూడా ఏకుట్టుపనిలో, నేతపనిలో పాసవుతే యింత బాధ వుండదుగదా," అన్నాను. అప్పటికి నాకు సత్యవతీ, సత్యవతి అప్పగారూ వితంతువులని తెలిసింది.

"దానికి అత్తారిచ్చిన రెండెకరాల పొలం వుంది. అది చూసుకుని మహైశ్వర్యం వున్నట్టు మురిసిపోతుంది. యిక్కడ చెంబక్కడ పెట్టదు." అంది.

"మీ అన్నయ్య చెప్పరాదా గట్టిగా..."

"సరె—మా యింట్లో మగవాళ్లకి నోరుంటే బాగానే వుండును. కాటికి కాళ్ళు చాచుకున్న మా ముసలమ్మకి ఎంత నోరో—స్కూలునుంచి రావడం నోనియమం యిటూ అటూ అయితే—పది రంకెలు కడుతుంది. నిజంగా మా వదిననూ అన్నయ్యనూ చూస్తే నాకు చాలా జాలేస్తుంది..."

"నీ సంగతో—పోనీ మీ మావగారు ఏదన్నా సాయం చెయ్యరాదా?"

"సరే—మా మావగారికి నలభైరూపాయలు జీతం నా పెళ్లివేళకి. మా ఆయనకి చదువూ లేదు—సంపాదనా లేదు. ఏదో ఆడపిల్లల్ని దిరగడ చేసుకోవాలిగదా అని మావాళ్లు—మా అక్కనూ నాకూ—మొగవాళ్ళనంటూ వెతికి, పెళ్లి అయిందనిపించారు. నా పెళ్లికి ఏడాదిక్రితమే మా అత్తగారు చచ్చిపోయింది..."

"పోనీ, అక్కడే యింట్లో పనీపాటూ చూస్తూ, చదువుకుంటూవుంటే బాగుండేదేమో—యింతకంటే..."

"ఇంతకంటే అక్కడ మరీ ఘోరం. మా మావగారు ఒక మళయాళీదాన్ని తెచ్చిపెట్టుకున్నారు. యిప్పటి ఆవిడకు ముగ్గురు పిల్లలు. అక్కడుండి, యింట్లో వాళ్లందరికీ వండి వార్చి పెడుతూంటే, యింత అన్నంబెట్టి, ఏడాదికి రెండు చీరెలు యిస్తానని చెప్పారాయన..."

"బాగుంది. ఆస్తి లేదా?"

"ఆస్తి—లేకేమిటి? ఒక మళయాళీ ఆవిడా—ముగ్గురు పిల్లలు, వాళ్లకి రోగాలు, రోగాలకి మందులు. యిదంతా ఆస్తి కాదూ? ఇంకేమిటి కావాలి చెప్పండి?"

"అసలు నువ్వు కాపరానికి వెళ్లకుండానే అలను పోయాడా?"

"వెళ్లకేం? అన్ని లక్షణాలా అయాయి. నేను పురిటికి యిక్కడికి వచ్చినప్పుడే, కలరావచ్చి, మూడోరోజున ఆయనదారి ఆయను చూసుకున్నారు. కొడుకు దహనానికి కూడా డబ్బులేదని హడావుడి చేశాడు మా మావగారు. భర్త మరణంతర్వాత నాకు పుత్రశోకం అన్ని అనుభవాలు అయిపోయాయి," అని కఠినాతి కఠినంగా నవ్వింది సత్యవతి.

"అయితే మీ నాన్నా, పెదనాన్నా ఏంపని చెయ్యరా?"

"ఎందుకు చేస్తారు? వాళ్ళకి మొదటినుంచీ చీట్లాడటం, చుట్టలు కాలవడం—యీ రెండు పనులే తెలుసు. యివ్వాళ వాళ్లని వొళ్లొంచి పని చెయ్యమంటే ఏం చేస్తారు?"

"మరి సంసారం గడవడం ఎలా?"

"మా అన్నయ్యని బి. ఏ. దాకా చదివించారుగా. ఆ బి. ఏ. దాకా చదివించిన చదువే వాళ్ల పెట్టుబడి ఇప్పుడు వాడి నెత్తిన ఎక్కి అంతా తింటూ కూచున్నారు."

"మీ అన్నయ్యకు వుద్యోగం రాకమునుపో—"

"నాకు బుద్ధి తెలిసినప్పటినుంచీ, అంటే నాకు పెళ్ళయి అత్తారింటికెళ్లినప్పటినుంచీ నాకు సంపాయిస్తున్నాడు—వీళ్లు తింటున్నారు. మా వదిన చాకిరీకి, వాడి సంపాదనకీ, వీళ్ల తిండికి సరిపోతుంది. నాకు ఆరేళ్లు వచ్చినప్పటినుంచీ పాతచీట్ల పేకముక్కలూ, చుట్టపొగలూ, నల్లమందు—యివన్నీ అలవాటే మాయింట్లో. మా అన్న వుద్యోగంలో చేరేదాకా, వున్న ఆస్తిమీద అప్పుచేసుకుతింటూ, మా పెళ్ళిళ్లు చేశారు. ఇప్పుడు ఆస్తికి మించి అప్పులున్నాయి. నాకు గ్రాహ్యం తెలిసినప్పటినుంచీ—చీట్లపేక, నల్లమందు, చుట్ట పొగలు, గావు కేకలు అలవాటే," అంది సత్యవతి.

"ఆ పోయినవాడు ఎలాగా పోయాడు. వెంటనే నిన్ను స్కూల్లో చేర్పిస్తే యీపాటికి స్కూలుఫైనలు అయిపోయేది. నువ్వు మొదట్లో అశ్రద్ధ చెయ్యకుండా వుండాల్సింది."

"అసలు మొదట్లో ఆలోచించేందుకూ, అశ్రద్ధచేసేందుకూ సావకాశం వుంటేగా. మొగుడు చచ్చిన వితంతువునికదా—యింటికి రాగానే గరిట చేతికిచ్చారు. ఆ తర్వాత మూడేళ్లదాకా మా అక్కకీ, వదినకీ ఏటేటా కానుపులు. మా పెద్దమ్మకి పార్శ్వపునొప్పి మా బామ్మకి నల్లమందు. వాళ్లందరికీ వండి వార్చడంతో నాకు అసలు క్షణం తీరిక వుండేది కాదు. మా అక్క మొగుడు పోయాక అది గూడా యిక్కడే చేరింది, ఏదో బావుకు తిందామని. మా వదినకు కానుపు ఎడమయిందా ఏడు. అప్పుడు కాస్త ఆలోచించి, యీ వూబిలోంచి బయటపడ్డామని, మర్చిపోయిన ఎక్కాలూ తూకాలూ వల్లె వేయడం మొదలెట్టాను."

"ప్రయివేటు పెట్టుకోవలసింది"

"ఏదో పాపమెత చెప్పినట్టు—అసలుకే లేదు గాని...యింకా ప్రయివేటుట...వళ్లు విరిగేటట్టు చాకిరీచేసి—యిరవై ఏళ్లుదాటాక హెచ్చువేతలూ కూడికలూ చేస్తూ—నా పొట్ట నేను పోసుకుందామని తాపత్రయపడ్డామంటేనే, మా బామ్మ శాపనార్థాలు పెట్టేది. అలాటిది ప్రయివేటు కూడానా? అహెడ్ మిస్ట్రెస్ మంచిది కనక—థరడ్ ఫారమ్‌లో చేర్చుకుని—స్కాలర్ షిప్ యిప్పించింది. యింకొక్క రెండేళ్ళు కళ్ళు మూసుకుంటే మా కష్టాలు గట్టెక్కుతాయి," అంది సత్యవతి.

*　　*　　*　　*

రోజులు గడుస్తూండేవి. ఒకొక్క రోజున సత్యవతి స్కూలునుంచి నకనకలాడుతూ వచ్చేది. ఆ అమ్మాయి చాలా మొహమాటస్తురాలు. కాని ముఖం చూసి ఏదన్నా టిఫిన్ పెడితే, ఒకటి రెండుసార్లు అడిగించుకుని గాని తినేది కాదు. ఆకలితో మాడి పోతున్నాకూడా నోరు జాచి ఏమీ అడిగేది కాదు.

స్కూలుఫైనలు క్లాసులోకి వచ్చింది సత్యవతి. పరీక్షలు దగ్గిరకొస్తున్నాయి.

"బాగా చదువుకున్నావా? యీ పరీక్ష అయితే నువ్వు గట్టున పడ్డట్టే..."

"చదవడానికి చదువుతాను. అది బుర్రకు పట్టదమ్మా! ఒదినకు మళ్ళీ కడుపు, మనిషి తోస్తే పడే ట్టుంది. మొన్న కార్పొరేషన్ సెంటర్లో చూపిస్తే, బలానికి మందు కొనమని—ఆమెని నాలుగు అన్నని నాలుగు చివాట్లు వేసింది డాక్టరు. యివన్నీ యిలా వుంటే, చదువు ఏం బుర్రకెక్కుతుంది?"

"పోనీ మాయింటికొచ్చి చదువుకో. నేను ఖబుర్లేసుకుని, నీ చదువు పాడుచెయ్యనులే, నువ్వు హాల్లో చదువుకో ఆయన గదిలో పడుకుంటారు, మనిద్దరమూ హాలులో పడుకోవచ్చు."

"మా ముసలమ్మ యిప్పటికే యిలు ఒక ధరికి తెస్తోంది యింక రాత్రిళ్లు నేను యింట్లో పడుకోక పోతే, యిల్లుపీకి పందిరేస్తుంది," అంది సత్యవతి.

పరీక్షలు వారంరోజులున్నాయనగా సత్యవతి వదినగారి కడుపు పోయింది. లేడీడాక్టరు ఆ చాకిరీ, ఆ యిల్లూ మారకపోతే వాళ్ళ వొదినకు టి. బి. రావటం ఖాయమని చెప్పిందట.

"పోనీ మీ అన్న మీ వదినని పుట్టింటికి పంప రాదూ?"

"ఆమెకు ఎవరూ లేరు. ఇక యిక్కడ మా అక్కకూడా మీ బామ్మకున్నంత నోరు. అరిచి గీపెట్టినా యిక అది ఆ చెంబు అక్కడ పెట్టదు. మా ముసలమ్మ నల్లమందు ముద్దలు మింగడానికీ, రెండుసార్లూ వాయినం చెల్లించడానికీ తప్ప దేనికీ పనికిరాదు. మా పెద్దమ్మకి పార్శ్వశూల నొప్పి, నాకు పరీక్షలు ఎలా చెప్పండి, మాయిల్లు ఒక కూపం. అంతే. అందులోంచి విమోచన లేదు"—

"అయితే మీ వదిన సంగతి ఏంచేస్తారు?-"

"ఏంచేస్తాం? చేసేందుకు ఏమీ లేదు. అయినా ఆడవాళ్లం ఏం చెయ్యదల్చుకుంటేనుటుకు ఎల్లా? మా చేతుల్లో కానీ లేదాయను. అంతా అన్నయ్యవాళ్లే చూస్తారు......"

"మీ అన్నయ్య ఏదన్నా టానిక్కులూ, పాలూపళ్లు-యివన్నీ యిప్పిస్తారేమో..."

"మీ రింకా దొడ్డిదార్లో వున్నారు. మా వాళ్లు విచిత్రమైన మనుషులు. మా వదినకి టి. బి. వచ్చినా, ప్రాణం మీదికి వచ్చినా-మా అన్నయ్య మందులు కొనడు. 'ఎందుకు కొనవు?- లేకపోతే అవిడ చచ్చిపోతుంది,' అని నేను కల్పించుకుని చెబుతాననుకోండి-డబ్బులేదు అంటాడు వాడు."

"డబ్బులేదుఅంటే ఎట్లా? ఏదో ఒక ఖర్చు తగ్గించుకోవాలి. ఆరోగ్యంతర్వాత అన్నీని."

"మీరు ఏదో ఒక ఖర్చుని అంతదూరం పోతారు. రోజూ వాడు కాల్చే ఆ సిగరెట్లు, మా నాన్నగారూ కాల్చే ఆ చుట్టలూ, మా ముసలమ్మ నల్లమందూ, యింట్లో పిల్లా పాపా అంతా తాగే కాఫీలు మానేస్తే టానిక్కులకీ పళ్ళకీ రాదూఆడబ్బు! అసలు అక్కడదాకా ఎందుకు? ఆ వచ్చే నాటు యిరవై కాఫీలూ, సిగరెట్లూ, మాని తిండికే ఖర్చు చేసుకుంటే, యిల్లా అర్ధాకలితో మాడటాలూ, జబ్బులూ వుండవుగా!- అంతే మా యిల్లూ, మనుషులూ అంతే! విచారించి ఏం లాభంలేను," అంది నిస్పృహతో సత్యవతి.

నాకుకూడా నోటమాటరాలేదు. ఆ యిల్లూ, ఆ మనుషులు, ఆ అలవాట్లూ, ఆ దారిద్ర్యం-అదంతా ఒక మురిగిన కుడితితొట్టి. వాళ్లంతా అందులోని క్రిమి కీటకాదులు.

"పోనీ నువ్వయినా శ్రద్ధగా చదువు. పరీక్ష పాసయితే, ట్రయినింగ్ వెళ్ళవచ్చును."అన్నాను.

"చదువుతున్నా...కాని..."అంది సత్యవతి నిరుత్సాహంగా.

అనుకున్నట్టుగానే, సత్యవతి పరీక్ష తప్పింది ఆ ఏడు.

పరీక్ష పోయిన సత్యవతి కుమిలి కుమిలి

ఏడ్చింది. నాకు ఓదార్చడానికి మాటలు రాలేదు. పాపం! ఆ చదువుమీద పంచప్రాణాలు పెట్టుకుంది.

"ఏం చేస్తావు - నీ తప్పేమటు కేముంది! యింట్లో చాకిరీ, అందులో మీ వదిన జబ్బూ, అన్నీ కలిసి వచ్చాయి. మళ్ళీ ఏడుకి కూచుందువు గాని - యీలోపల ఏ కుట్టు పరీక్షకో వెళ్లి..." అన్నాను.

"నేను మళ్ళీ ఏడు గాదు, పదేళ్ళయినా ఆ పరీక్ష పాసవలేను చంటిపిల్ల ననుకుంటున్నారా? దగ్గిర దగ్గిర పాతికేళ్ళొస్తున్నాయి. అసలు యీ వయసులో చదువు ఎలా వంటబట్టుతుంది చెప్పండి? యింక ఆ స్కూలు ఫైనలు ఆశ వదులుకున్నాను. హయ్యర్ గ్రేడ్ ట్రయినింగ్‌కి అప్లయ్ చెయ్యమంది మా హెడ్‌మిస్ట్రెస్. నెలనెలా స్టయిపెండ్ గూడా వస్తుందిట," అంది సత్యవతి.

"అది గాదు, యింతా కష్టపడ్డావాయను — హయ్యరు కెందుకంట? పోనీ, ఏ సేవాసదనంలో వన్నా చేరగూడదా?"

"ఎవరు చేరిపిస్తారు? మా అన్నను రమ్మంటే, మా నాన్నతో చెబుతాడు. అది కాస్తా మా ముసలమ్మకి తెలుస్తుంది. మా ముసలమ్మ వీధి అరుగుమీద నుల్చొని 'లేచిపోతోంది' అని గావుకేక లేస్తుంది."

"పోనీ, నీఅంతట నువ్వే వెళ్లు."

"అలా వెళితే, గార్డియన్ సంతకం కావాలన్నారు. నేను నిజంగా విడో నని సర్టిఫికెట్ కావాలన్నారు; ఎవరో సాక్షులు కావాలన్నారు. పాపం — మా బామ్మకు రోజుకు యిరవైసార్లు నా ముఖంమీద వైధవ్యం తాండవంచేస్తూ కనిపిస్తుంది గాని, ఆ సేవాసదనం వాళ్ళకి సాక్షి సంతకాల్తో గాని కనిపించేటట్టు లేదు......" అని నిరాశతో నవ్వింది సత్యవతి.

"ట్రయినింగ్ స్కూలు ఎక్కడటా?" అని అడిగాను.

"ట్రిప్లికేన్‌లో వుందిట. నెలకి పన్నెండు రూపాయలు స్టయి ఫండ్ యిస్తారట. మూడు నెలల కొకసారిగాని స్టయిపెండ్ రాదు. ట్రిప్లికేన్‌కి వెళ్ళడం ఒకటే సమస్య" అంది కిటికీలోంచి మొహమాటంగా బయటకు చూస్తూ.

"ఏం?" అన్నాను అర్థంకాక.

"స్కూలయితే, మా యింటిదగ్గిర కాబట్టి నడిచి వెళ్ళేదాన్ని. ట్రిప్లికేన్ అంటే నడవడం వీల్లా - ట్రామ్ ఛార్జీ రాను లేదా - పోను లేదా. సీజన్ టికెట్టు అయినా కావాలి-" అంది యిబ్బందిగా.

"ఓస్. దానికేం. నే నిస్తాను. అందుకోసం నువ్వు ఆలోచించకు."

"స్టయిపెండ్ వచ్చాక, మళ్ళీ తిరిగి పుచ్చుకునే మాటయితే, మీదగ్గిర పుచ్చుకుంటా, లేకపోతే వద్దు," అంది సత్యవతి.

"అవన్నీ యిప్పుడెందుకు?"

"అలా కాదు. మీరు మాట యిస్తేనే - లేకపోతే నాకు బావుండదు," అంది సత్యవతి.

"సరే" అని ఒప్పుకున్నాను.

* * *

సత్యవతి ట్రయినింగ్ స్కూల్లో చేరింది. మొదటి రెండుమూడు రోజుల్లో ఆ అమ్మాయి అన్నంగానీ, టిఫిను గాని పట్టుకెళ్లడం లేదని గమనించాను.

"మధ్యాహ్నం ఏం తింటున్నావు? ఆకలి వెయ్యడంలేదా?" అని అడిగాను ఒకసాయంత్రం.

"అబ్బే - చిన్నపిల్లనా ఏమిటి ఆకలికి? అసలు వెధవముండ ఒకపూట భోజనంచేసి - యింకోపూట వుప్పుపిండి తినాలిట. అంతకుమించి తినటంవల్లనే, నేనిట్లా రోడ్లమ్మట తిరుగుతున్నానట. మామామ్మ నడిగండి చెపుతుంది." అంది సత్యవతి.

ఆ అమ్మాయికి యిబ్బందిగావుండే ప్రశ్నలకిగానీ, సమాధానం చెప్పటం యిష్టంలేని వాటికిగాని నవ్వుతాలుగా వాళ్ల మామ్మమీదికి తోసి తప్పించుకుంటూ వుండటం నేను చాలాసార్లు చూశాను. పొద్దుట ఎనిమిదిన్నరకి అన్నంతిని, సాయంత్రం ఆరింటిదాకా ఏమీ తినకుండా వుండటం ఎంత కష్టమో, అందులో చిన్నపిల్లలతో అరిచి పాఠాలు చెపుతూ వుండటం ఎంత కష్టమో వూహించుకుని చాలా బాధపడ్డాను.

అప్పటినుంచీ యీసాకూ, ఆసాకూ కల్పించి, ఏటిఫిన్నో పళ్లో స్కూల్లో తినేందుకు యిస్తుండేదాన్ని. రెండుమూడుసార్లు మా యింటినించి కారియర్ అన్నంతీసుకెళ్ళమని అడిగితే, ససేమిరా వద్దంది. అందుకని వూరుకునేదాన్ని. స్టయిఫండ్ రాగానే, నేనిచ్చిన డబ్బు, అణాపైసల్తో లెక్కగట్టియిచ్చి- మిగతా చిల్లరా రూపాయలూ వాళ్ళ వొదినకు తీసుకెళ్లి యిస్తూండేది.

మరీ చినిగి - ఎక్కువ కుట్లువున్న చీరెలు కట్టుకోడంచూసి, ఒకటి రెండుసార్లు. రెండు మూడు చీరెలు ప్రజంటుగా కొనిద్దామని ప్రయత్నించేశాను;

సత్యవతి తీసుకోవని నిర్మొహమాటంగా చెప్పింది. ఒకసారి కోపం వచ్చిందికూడాను.

"కొత్తచీరె కొంటే నాకొక్క దానితో నే తీరదు. మా వదిన యింటికంటే వాలికలు కట్టోంది. మా అక్కకి చీరెలు లేవు. మా పెద్దమ్మ తన పెళ్ళిలో పెట్టిన పట్టు చీరెను కట్టక చీరెలెంచి కట్టుకుంటోంది. మా ముసలమ్మ చిరిగిన పంచెలు అతుకేసి కట్టుకుంటోంది. మా అన్నయ్య చొక్కాలన్నీ భుజాలమీద చినిగినవే. యింక పిల్లలబట్టలు చెప్ప నక్కర్లేదు. అందుకని మా దరిద్రం రెండు చీరెల్తో తీరదు."

"వాళ్ళందరిసంగతి నాకనవసరం. నువ్వు క్లాసులకి వెళ్ళేదానివి. నీకు కొంత శుభ్రమయిన చీరె కావాలి. అందుకని అంటున్నాను. పోనీ నువ్వు సంపాయించి, నా అప్పు తీర్చుదువుగానిలే." అన్నాను ఆమెమనసు ఎరిగినదాన్ని కాబట్టి.

"మీ అప్పు నెబ్బుతో తీరిపోతుందా - అలా అనకండి. నేనొక్కదాన్నీ మంచిచీరెలు కట్టడం భావ్యం కాదు. యింక ఆగొడవ వదిలేద్దాం," అంది, సత్యవతి తడికళ్ళతో.

సత్యవతి మొదటి ఏడు కోర్సు పూర్తి అయిపోయింది. రెండోసంవత్సరం క్రిస్మస్ శెలవలు కూడా అయిపోయాయి. మార్చినెలలో ఆయన కేసో కలకత్తా వెళ్ళవలసిన పనివచ్చింది. మూడు నెలలు అక్కడే వుండాలి. ఏప్రిల్ — మే, జూన్ జూలై మొదటివారంలో గాని మద్రాసు రావటం పడదు. ఈ మూడు నెలలూ నన్ను పుట్టింట్లో వుంచుతానన్నారు.

మేము ఆ వూరునుంచి కదిలి వెళ్తున్నామని తెలియగానే సత్యవతి కుప్పలా కూలిపోయింది. ఒకటే ఏడ్చింది.

"ఇంట్లో ఎలావున్నా మిమ్మల్నీ, ఆ బడినీ చూసుకుని నా కష్టాలు మర్చిపోగల్గుతున్నాను. మీరెళ్ళిపోతున్నారు ఎల్లా?"

"వస్తే ఏం? మళ్లీ మూడు నెలల్లో వచ్చేస్తాను. యీలోపల నీపరీక్ష అయిపోతాయి. రిజల్ట్సుకూడా తెలుస్తాయి. యీ దగ్గిర్లోనే కార్పొరేషన్ స్కూలుకి అప్లయి చెయ్యి. దగ్గిర స్కూలయితే — టైము చాలా వుంటుంది. అప్పుడు స్కూలు ఫైనలు పూర్తి చెయ్యవచ్చును." అన్నాను ధైర్యం చెబుతూ.

"ఏమో — అసలు నా బతుకంతా చీకటిగా వుంది. మీరుగూడా వెళ్తున్నారు. ఏం చదువుతానో!"

"ఎందుకు దడవవు — నిక్షేపంలా చదివి పాసవుతావు. అధైర్యపడకు," అన్నాను హోల్డాలు కడుతూ.

పాపం! సత్యవతిని చూస్తే జాలేసింది. నిజానికి ఆ సమయంలో ఆ అమ్మాయిని వదిలి వెళ్ళాలని నాకు లేదు. అయినా వెళ్ళక తప్పదు. "మీరు కలకత్తా వెళ్ళండి. నేను యీ అమ్మాయికోసం యీ వూళ్లో వుండిపోతాను — పుట్టింటికి వెళ్ళను," అని నేను చెబితే, అర్థం చేసుకోకలిగిన వోపిక్కా, హృదయ వైశాల్యం మా ఆయనకు వున్నాయా? లేవు. కావున అది నాకు నిశ్చయంగా తెలుసు. అందుకే ప్రయత్నించడం అనవసరం. కాని సత్యవతి మొదటి నుంచీ అష్టకష్టాలు పడి, ఆయాసపడుతూ మెట్లన్నీ ఎక్కి అఖరిమెట్టుమీదవున్న సమయాన్న — నేను ఆ మెట్టు దాటేందుకు చేయూత నియ్యలేక పోయాను. ఎలా యిస్తాను? స్వతంత్రురాల్ని కాదు. చీరెలూ, నగలూ, ఇల్లూ — వీటన్నిటినీ నా ఇష్టాల మీద వదిలేస్తారు గాని — 'నా స్నేహితురాలికోసం వుండిపో' అనేటంతటి హృదయం మావారికి లేదు. అది నాకు తెలుసు. అందుకే నిస్సహాయంగా ఏడ్చే సత్యవతిని, నిరుపయోగమైన మాటల్తో వోదారుస్తూ కలకత్తా మెయిలు ఎక్కాను.

* * * *

వారానికొక వుత్తరం రాస్తూ, ప్రతి కవర్లో రిప్లయ్‌కోసం మరో స్టాంప్డ్ కవరు పెట్టేదాన్ని. ఆమె జవాబులు రాస్తూండేది. ప్రతి వుత్తరంలో అన్నీ మామూలేననీ, నేను లేకపోవడంవల్ల చాలా పిచ్చిగా వుందనీ రాస్తూండేది.

పరీక్షలలో బాగానే రాశాననీ, పాసవగల ధైర్యం వుందనీకూడా రాసింది వుత్తరాల్లో.

పరీక్షఫలితాలొచ్చాయి. అందులో సత్యవతి నెంబరు లేదు. ఆ రాత్రి నాకు నిద్దరపట్టలేదు. సత్యవతి ప్రయత్నానికి, భగవంతుడుకూడా ఎందుకు ఎదురవుతున్నాడని విచారించాను. పాపం! ఇంక ఆ అమ్మాయిగతేమిటి? మళ్ళీ గరిటేనా? ఆ యిల్లు, ఆ మురికి, జబ్బులు, నల్లమందు, చుటలు, దోమలు— వీటినుంచి నా సత్యవతికి విముక్తి లేదా?

ఆ మూడోనాడు వుత్తరం వచ్చింది.

"ఈసారికూడా వోడిపోయాను. అయిపోయింది. యింక చదవను. మా బామ్మ చెప్పినట్టు భగవంతుడు నా నొసట 'అంటలిప్పేలా' రాశాడు. అది అక్షరాలా నిజం మీరుగూడా లేరు. ఎవరితో చెప్పుకుని ఏడవను. మీ సత్యవతి,"

జవాబు ఏం రాయమనూ? సత్యవతిని ఎలా వోదార్చను ఏవేవో అర్థంలేనిమాటల్తో వోదారుస్తూ వుత్తరం రాశాను. అంతే, మళ్ళీ వుత్తరాలేమీ రాలేదు సత్యవతిదగ్గరనుంచి.

* * *

"ఏమిటి అంతదీర్ఘంగా ఆలోచిస్తున్నావు" అంది మురళీ.

"అబ్బే, ఏంలేదు." అంటూ తప్పించుకుని, రిబ్బను ముడివేసుకుంటుంటే, మేట్లమీద పోస్టుమెన్ కేక వినపడింది. వెళ్ళి వుత్తరం అందుకున్నాను. సత్యవతి దస్తూరి.

అవ్యక్తానందంతో తడబడుతూ కవరు చించాను.

"మీరు రేపుపొద్దున్న పూరువించి వస్తారు. అందుకే, మీరు వచ్చేటప్పటికి నా వుత్తరం మీకు అందాలని రాస్తున్నాను. మీ సత్యవతిగురించి వేరే ఎవరిద్వారానో వినకుండా, ఆమె నోటమ్మటే వినాలని రాస్తున్నాను. నే నిప్పుడు దండిజవంలో వున్నాను. ఆశ్చర్యంగా వుందా? అవును, నాకే ఆశ్చర్యంగా వుంది.

"నా జీవితంలో, అంటే పుట్టి బుద్ధెరిగాక యీనాడే చీరెలు, నావి, నా స్వంతం అనుకునేవి యిరవై వుండటం-యిదే మొదటిసారి. ఆ చీరెల దొంతర బీరువాలో మొట్టమొదటసారి పేర్చుకుని చూశాక, నాకు కన్నీళ్లు ఆగలేదు. అలా మీరు బీరువాలో పేర్చుకోడం చూశాను మొదటిసారి. అచ్చు అలానే పేర్చుకున్నాను. పేరుస్తున్నంతసేపూ మీరే మనసులో మెరుస్తున్నారు. ఇక్కడ నాకు 'నా స్వంతం' అని చెప్పుకునే యిల్లుంది. ఇంటిచుట్టూ చిన్నతోట. నా కోసం, నా సుఖంకోసం పాటుపడి, నా ఆనందంలో పాలుపంచుకునే మనిషి ఒకరున్నారు. 'వద్దమ్మండా-బోడిముండా-' అని తిట్టకుండా నన్ను ఒక మనిషికింద జమకట్టే మనిషి ఒకరున్నారు.

"మా సందులో మొదటియింట్లో వున్న మొదలియార్లు మీకు జ్ఞాపకం వున్నారా? ఆ మొదలియారుకి తమ్ముడో కాయన వున్నాడు. ఆయన భార్య పోయి అయిదేళ్ళయింది. అతనికి యాభైఏళ్లు; ఇద్దరు పిల్లలు. చాలారోజులనుంచీ ఆయన నావంక ఒకవిధంగా చూడటం కనిపెట్టాను. మీతో ఒకసారి చెబుదామనుకున్నాను, గాని చెప్పడానికి సిగ్గుపడటమే కాకుండా భయపడ్డాను. ఏం చెయ్యను చెప్పండి? మా అన్న పిల్లలు, అక్క పిల్లలూ ఎదుగుతున్నారు. చదువు లేవు, శుభ్రమయినబట్టా తిండీ లేదు. ముసలమ్మ ఏ నాటికీ చచ్చిపోదు; నల్లమందు కావాలంటుంది. ఒదినకు టి. బి. రాజసం భాయం. మళ్ళీ కడుపు ఒకటైపోయింది. మా నాన్నలు చుట్టలు మానరు. అన్నయ్య పేకగిల్లు మానడు. ఇంట్లో వాళ్లు కాఫీలు మానరు. మీరు చెప్పండి ఆ యింట్లో పుట్టినవాళ్ళకి అసలు విముక్తి అంటూ కలుగుతుందా? కలగదు. మృత్యువుకే కలుగదు.

"నేను పరీక్ష పాసయివుంటే; వీళ్ళని ఎదిరించి మరోచోట వుండి, కడుపునిండా తిని, వంటినిండా బట్టకట్టుకునే అవకాశం లభించేది. నాకా అవకాశం కలగదు. ఎందుకంటే నేను పరీక్షలు అవలేను. ఆ వాతావరణంలో నా బుర్రకి చదువు ఎక్కదు. యింక నేనేం చెయ్యాలి? గరిటపుచ్చుకుని టి. బి వదినకీ, నల్లమందు మామ్మకీ, రెండేకాల అక్కయ్యకీ, పార్శ్వపు నెప్పి పెద్దమ్మకీ చచ్చేదాకా చాకిరి చెయ్యాలి—అంతేనా? అదే నా జీవితానికి అర్థం? అందుకేనా నేను పుట్టింది?

"పుట్టినప్పటినుంచీ ఒక్క సుఖం ఎరగను. జీవితంలో ఏకొంత కాలమున్నా హాయిగా గడిపితే, అది మీదగ్గరే! అదిమటుకు మర్చిపోను. ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే— నే నెందుకు యీ పని చేశానో మీకు తెలియజెప్పేందుకు. నేను ఎవరికీ చెప్పక్కర్లేదు—మీ వొక్కరికే తప్ప. అందుకని రాస్తున్నాను.

"పరీక్ష తప్పిన వాలుగో రోజున ఎందుకో వీధులో నిల్చుంటే—ఆ మొదలియారు గారి తమ్ముడు ఒకచీటి నాచేతులో పెట్టి, గబగబ వెళ్ళిపోయాడు. విప్పి చూసుకుంటే ఏముందాలో అదే వుంది. కాని వ్రేమలేఖ కాక తన ఆస్తి వివరాలు రాస్తూ, తనను పెళ్ళిచేసుకోమని ప్రార్థించాడు.

"ఆ రాత్రంతా ముందు వెనకలు ఆలోచించాను. ఏమైనా, లేచిపోయి రమ్మనలేదుగా. పెళ్లి చేసుకుంటానంటున్నాడు. పెద్దవాడు కనక నే నన్ను చేసుకుంటానన్నాడు. లేకపోతే ఎవరికి కావాలి నేను? ఎక్కడయినా వంటేగా నేను చెయ్యగలిగేది! మావాళ్ళదగ్గిరయితే చాలీ చాలని తిండి. మరో యింట్లో వంటమనిషిగా కుదిరేందుకు పూర్తిగా వయసు మళ్లినదాన్ని కాకపోవడంవల్ల అనేక ఈతిబాధలు. ఎన్నిరకాల ఆలోచించినా, ఆయనని చేసుకోవడంవల్ల నాకు పోయిందేమీ కనిపించలేదు. అసలు ఏముంది కనక పోయేందుకు!

అందుకని ఆయనని పెళ్ళి చేసుకున్నాను. ఇద్దరు పిల్లలూ నన్ను ఎంతో ఆప్యాయంగా 'పిన్నీ' అని పిలుస్తున్నారు.

"నేను చేసిన పని తప్పంటారా? అయితే అన వచ్చు. కాని యిప్పుడు తృప్తిగా తిని, మంచిబట్టలు కట్టుకుంటున్నాను. నేనూ ఒక మనిషినని అనిపించు కుంటున్నాను. ఎవ రేమనుకున్నా, మీరు సత్యవతిని తప్పుబట్టరు. అందుక నే మిమ్మల్ని దిండివనానికి ఒక సారి రమ్మనమని ధైర్యంగా కోరుకున్నాను.

మీ సత్యవతి."

*   *   *

"ఏమిటా ఉత్తరం?" అంది మరకతం గుమ్మంలో నుల్చుని.

"ఆ ఏమీ లేదు. ఎవరో ఎరుగున్న వాళ్లు రాశారు," అన్నాను.

"మీ సత్యవతి ఎవరితో లేచిపోయిందో తెలుసా—ఆ బొంకు మొదలికూర్తో!" అంది మరకతం.

"అలాగా" అన్నాను. ఏదో ఒకటి అనాలిగా!

సినిమాకి వెళ్ళాలని తొందరపడుతూ వెళ్ళి పోయింది మరకతం.

నాకు సత్యవతిమీద కోపం రాలేదు. రూవారి నడిగి, వచ్చే నెలలో దిండివనం వెళ్తాను.



క్రుద్ధవ్యాఘ్రము ★ శ్రీ చెరుకుపల్లి జమదగ్నిశర్మగారు

జను పాంథునకు బ్రపంచమ్మెట్టు లట్టు లగమ్యమ్ముగాగ చీకట్లు గ్రమ్మి,
తనువిచ్చు జనకు గాదను వృతులట్లుగా స్కంధమ్ము మించి శాఖాళి బలిసి,
కాలిచి పాదము లొత్తి గొంతు నొక్కినయట్లు గింజ బ్రూనగుచు బిక్కిరిసి పెరిగి,
తలదూర్చి తదుపరి మొలదూర్చి తుదకు సర్వము తానె యయిన గుల్మములునిండి,
భూరుహమ్ములు గతమహా భారతాహవమ్మున కాలరుద్రు సేవకత బూని
కలియ బడినట్టి క్షత్రయోధుల విధానకొమ్మయుం గొమ్మ గ్రమ్మ కార్కొనలోన.

తిరుగాడున్ నటదుత్త మాంగ విచలద్దీర్ఘోరు శుండోద్భ్రమత్
ద్విరదంబుల్, మదకుంభి కుంభ దళనోద్వేలోగ్ర గర్జారవ
త్వర మాణాఖిల జంతుకోటి కృత భీతధ్వాన కంపా పరి
స్ఫుర దాధిక్య మహా మృగేంద్రములతో బోరాడు వ్యాఘ్రమ్ములున్

* * * * *

తనయొక పొట్ట నింపుకొన దవ్వని యెంచక దూర దేశముల్
పనివడి చుట్టి కాళ్లు బలపమ్ములు గట్టగ నెట్టకేల కు
ర్విని బడి సాగి మొక్క దయబిచ్చము పెట్టిన పెద్దవారి న
త్తిన చెయి పెట్టి వారిపయి దీర్పరియై యొకడుండె నొక్కెడన్.

ఓపిక లేమి యూతకయి యుంచిన దండమె యాశ్రయించి యు
ష్టాపదశైల శృంగముల డంబము పెంచిన వానిచేతిలో
దోపబడెన్ తదాజ్ఞలను ద్రోసెడివారల దండనమ్ముకై!
చూపిన కంట వ్రేలిడిన చొప్పున నా విధి నిర్ణయంబునన్.

పాడియై శ్వాసబిగించి గొంతుకకు ముప్పుందెచ్చి లోగుండెలున్
దడియం గట్టిగ బట్టి నెత్తురులు పిండం జేయు దగ్గుల్బల్
నడివాడై చెలికారమున్ నెఱపి నందుల్ చూచి లోలోపలన్.
సుడి గుండంబులు ద్రవ్వి చేసికొనె దాసుంగాగ దేశీయునిన్.

అల దేశీయుడు మంత్రబద్ధ భుజగంబై శీర్షమాడించి బు
స్సలు కొట్టున్; పృథులాయసాందు యుగళీ సంబద్ధ మత్తేభమ
ట్లిలపై గడ్డినిలాగి వాతెఱచి మోక్షేచ్ఛామతిన్ హస్తమున్
నిలుపున్ మింటికి; కాని కాలమని కస్సీర్కించు నెల్లప్పుడున్.

అడిచిన కల్లలాడి సవరమ్మ కతంబున మాన మెల్ల గో
ల్పడి విన తానుతుం డవుడు బాముల మోసినయట్టు లాతనిన్

మెడపయి నుండనిచ్చి మెలమెల్లగ ద్రిప్పును; పొట్ట నిండుగా
గుడువక స్వర్గలోకముల కోనల వెంబడి వాని యిచ్ఛనై!
ఆవిభు డాత్మరక్షకయి యాయుధ సంచయ మెంత లెంతలో
లావుగ మేనినిండ పదిలమ్ముగ గట్టి చరించు కాని, కా
లావధి దప్పినన్ కర రుహాంబులు ప్రాణభయమ్ము లంచు రా
బోవగ గత్తిరించు మును ముందుగనే తన బానిసీనికిన్.

తనకన్నన్ పదిరెట్లు బర్వయిన శత్రు శ్రేణితో గూను పెం
చిన యా బానిస మూపు మీదను సుఖాసీనుండునై యేదియో
యను మానమ్మున జిత్తె మెల్లపుడు రాపాడిన్ తదీయోరమున్
తన పాదద్వయి జుట్టి పట్టుకొని నిత్యమ్మేగు వాహ్యాళికై.

తనతో బాటుగ తోడి వాని సుఖపథ్యాగామిగా జూడనో
పని యాతం డొకనాడు రోజుబలె డంబం బొప్పగా దానవా
హనుడై మాయని వందె చీకటిని గమ్యస్థానమే లేక, దా
పున గన్పడ్డది సర్వమున్ తనది కాబోలంచు నూహించుచున్.

ప్రకటాంధం కరనైక హాతదటవీ ప్రాంతమ్మునన్ మార్గ ద
ర్శకుడై బానిస కాన వెట్టి యితడు త్సాహమ్ముతో నుండగా
ఒక మాతంగము దాకి యోసరిలి, వేఱొక్కండు భల్లూకము
త్సృకతం బట్టి పెనంగి క్రుద్ధమయి శార్దూలం బొకం డుద్ధతిన్.
ఘన నేత్రద్యుతు లర్ధయోజన సమాక్రాంతమ్ములై పర్వ, రే
గిన పెల్లాకటి మంట చూపులకు దాకీ తాకనట్లున్న క
ప్పని వృక్షమ్ముల యందు సైతమును జీవభ్రాంతి కల్పింప, ముం
దునకున్ దూకి యలబ్ధ వాంఛమెయి తోడ్తో రెగు క్రోధమ్ముతోన్.

వాలమ్మెత్తుచు నేల గొట్టుచును శుంపన్మూర్తియై లేచుచున్
వ్యాలోలమ్మయి గాండ్రు గాండ్రుమని బొబ్బల్ వెట్టుచున్ దంష్ట్రికా
భీలం బాస్యము విప్పిమూసి కను లుద్వేగించుచున్ భీషణ
వ్యాళస్ఫార ఫణాభ శాతనఖధుర్యం బంఘ్రిపై కెత్తుచున్.

ఆశారాక్షస చాప ముక్తమగు నాగాస్త్రమ్ము నా నుగ్రమై
యాశార్దూలము మర్త్య వాసనలు డాయన్ మీసలాడించి పే
రాసన్ దూకుచు వచ్చు చుండుటలు తా నల్లంతలో జూచి దా
నేసుం డాయుధ సంచయమ్ముగని నాకేమన్న ధైర్యమ్ముతోన్

బరువున మేనువంగ దనపాణి యుగమ్మును ముందుగాళ్లపై
దిరముగమోపి మ్రోలగని తీసిన పాదము పెట్టునంతలో
గిరగిర కన్నులుం దిరుగ గీడ్వడు బానిస వీపుదట్టి దు
ర్భరముగ నిక్కుచున్ ప్రభువు పల్కు విషమ్మును గ్రక్కు నాల్కతోన్.

'పదరా బానిస! ముందు దూకు మదె పైపై వచ్చె వ్యాఘ్రమ్ము, ని
ల్చెద వేరా! అడుగెత్త వేమిటిర! పేచీ పెట్టుచో నిన్ను జం
పెదరా! జాగ్రత! ఆలసించెదవు పాపీ! దూకురా! ఇంక త
ప్పదురా! దానిని జంపకున్న యెడ నా ప్రాణమ్ములన్ గ్రోలురా!

అనవిని బానిసీడు వినయమ్మున నిట్లను 'సామి! సామి! య
ట్లన నెటులౌను, నాకు నొక యాయుధమిచ్చి యొకింత సేపు మీ
రును దిగి శస్త్రముం గొనుడు, క్రోధముతో నిటవచ్చు వ్యాఘ్రమున్
దునుమగ బోద మిర్వురము, తొందఱగా నిటులిందు శస్త్రమున్'.

ఆమాటల్ విని యా ప్రభుండమిత కోపాటోప మేపారగా
'నేమీ శస్త్రము నీకు నీవలయునే! ఈకున్న నేమౌనురా!
'సామీ యంచును శస్త్రముం గొని ననుంజంపంగ నూహించెదో!
నీమాయల్ పనిసేయ నిచ్చటని వానిం గొట్టబోగా వెసన్.

శరవేగంబున నాలుగంగలకు దచ్ఛార్దూల మే తెంచుటన్
పరికింపన్ సమయమ్ము గాకునికి దీవ్రక్రోధ రూక్షాస్యుడై
యురమున్ చుట్టిన పాదముల్ సడలు నట్లుబ్బించి యుద్రిక్తుడై
ధర బోర్లంబడు నట్లు త్రోసె విభు గ్రుద్ధ వ్యాఘ్రమై దాసుడున్.

పడి మూర్ఛాగతుడై దురాత్మకుడు లేవన్ లేక యుండంగ, వెం
బడి శస్త్రమ్ముల నూడ లాగికొని పైపై వచ్చు వ్యాఘ్రమ్ముపై
బడియెన్, ద్రుంచెను మస్తకమ్ము, దుడుకాపన్ లేక దేహమ్ము బ
ల్వడిగా జీల్చెను సుస్థిరధైర్యమును వేళం బట్టి మేల్కాంచగన్.
అప్పటికి గూడ దేఱకున్నట్టి విభుని మోముపై నీరముం జల్లిపోయె నెటకో!
వ్యాఘ్ర నఖములు నూత్న సంపదలు గాగ తానుగా స్వేచ్ఛ పొందిన బానిసీడు.

మధ్యవర్తి

శ్రీపంతుల శ్రీరామశాస్త్రి

★

అసలు నా కిటువంటి మధ్యవర్తిత్వపు వ్యవహారం నెత్తిని వేసుకోడం అంటే సుతరామూ ఇష్టం లేదు. వీటివల్ల నికరమయిన ఫలితం అంటూ ఏమీ ఉండదు. ఒకవేళ ఏ కొంచెమో మంచి జరిగినప్పటికీ మధ్యవర్తి పొందగల మెప్పేమీ ఉండదు. ఉభయ పక్షాలకూ కలిగిన కష్టనష్టాలకు బాధ్యత, 'మంత్రిసాని గండం' అన్నట్లుగా మధ్యవర్తినెత్తిని పడుతుంది. అలాగని మధ్యవర్తిత్వం అంటేనే బెదిరే మనిషిని కాను నేను. అటో ఇటో లేక రెండువంకలనూ మనం కుదిర్చిన బేరానికి ఒప్పుకొని మన కష్టానికి యుక్తంచిత ప్రతిఫలం లభ్యమయే సావకాశాలున్న మధ్యవర్తిత్వం అంటే నాకేమీ అభ్యంతరం లేదు. కాని, ప్రస్తుతం నేను నడపబోయిన మధ్యవర్తిత్వంలో ప్రతిఫలం లేకపోవడమే కాదు. రయిలు ఖర్చులు సహితం కలిసివచ్చే సావకాశం లేదు.

ఇంత తెలిసీ అంగీకరించవలసివచ్చింది. కారణం అది ఇంట్లో వాళ్ళ స్వకీయమయిన పని కావడమే. మా మూడవ మరదలు పెళ్ళి సంబంధం నిశ్చయించేటప్పుడు నేను "అంతదూరపు సంబంధం, సుతరామూ మొగం ఎరగని సంబంధం ఎందుకు చేస్తా"రంటే నన్నందరూ దుయ్యబట్టేరు. నాకంటె ప్రయోజకుడయినవాడు తోడల్లుడు కావడానికి సహించలేక అలా అన్నానేమోననే ధ్వనికూడా వినిపించింది మావాళ్ళమాటల్లో. సరే, కానీ, నాకేం పోయిందని, "ఓ, మీకందరికీ యిష్టపడితే నాకేం, బాగా క్షేమంగా నచ్చింప"న్నాను. అయితే శెలవు లేకపోవడంవల్ల పెళ్ళికిమాత్రం వెళ్ళలేదు. నే ననుకొన్నట్టే అయింది. పెళ్ళిలో నానా రసాభాస జరిగినా "పెళ్ళి అనేది జరిగినప్పుడు, పదిమంది ఒకదగ్గర చేరక ఆమాత్రం మాటపట్టింపులు రాకపోతాయా, అంతమాత్రంలో మునిగిపోయిందేమిటి — పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ ఈడూ జోడూ రూపూ రేఖా ఇంతలా కుదరడమంటే నిజంగా దైవఘటనే" అనుకొన్నారు రెండువంకలా కావలసినవాళ్లు. కాని, చివరకు జరిగినదేమంటే, మధ్యను పెళ్ళిలో వచ్చిన తక్కిన బంధువుల తగాదాలు అంతరించిపోయేయి గాని, ఇంకా పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ ఏమిటె, భార్యా భర్తల నడుమ సామరస్యం గగనారవింద మయిపోయింది. మా శకుంతల అక్కడికి వెళ్ళి ఆ సమిష్టి కుటుంబంలో కాపురం చెయ్యలేదన్న సంగతి మొదటిసంవత్సరంలోనే రూఢిపడిపోయింది. అతను ఏమ్. ఏ. చదివాడు, కాని, థర్డు క్లాసులో పాసవడంవల్ల కావాలనుకొన్న లెక్చరరుపని లభించ లేదు; దొరకడానికి సావకాశం ఉన్న స్కూలు మాస్టరీ గుమస్తాగిరీవంటివి చెయ్యడం పరువుతక్కువ. ఇంతకి ఏమీ చెయ్యనక్కరలేకుండా గడిచిపోయే పాటి భూవసతి ఉంది. పల్లెటూళ్ళో బద్ధకంగా కూర్చోడం, పేకాడ్డం, స్థానిక రాజకీయాల్లో ప్రముఖుడుగా పాల్గొనడం అలవాటయిపోయినందున అతనికి ఎక్కడికి కదలడానికీ మనస్కరించలేదు. ఆ ఊళ్ళో ఉన్నంతకాలం నేను వెళ్ళనంటోంది మా శకుంతల. అంతే కాదు, అతని ప్రవర్తనమునుగురించి ఏవేవో అనుమానాలు.

మొదట్లో అనుమానాలకి ఆధారం ఉన్నా లేకపోయినా భార్య పుట్టింటికి వెళ్ళిపోయి, మొండికెత్తి రానని కూర్చున్న తరవాత అతనికి చాలా స్వేచ్ఛగా ఉన్నట్టనిపించింది. అదిచూసి వాళ్ళవాళ్ళు తమకు నచ్చిన ఇంకొక సంబంధం కుదిర్చి పెళ్ళి చేసేసేరు. ఒక ఏడాదిలో ఆ సంబంధానికి ఒక కొడుకుకూడా కలిగేడు. మావాళ్ళు, "ఆఁ, ఏదో బెదిరించడానికి అంటారుగాని అంత ధైర్యంగా మళ్ళీ పెళ్ళిచేస్తారా" అనుకొన్నారు. తరువాత బహుభార్యాత్వాన్ని నిరోధించ బిల్లు రాకపోతుందా అనుకొన్నారు. కాని, బిల్లు రాకముందే అక్కడ పిల్లవాడుకూడా కలిగేడు.

మామామగారు తాను గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నన్నాళ్ళు, రిటైరయిన తరువాత పెన్షను పుచ్చుకుంటూ హాయిగా నిర్విచారంగా గడపవలసిన కాలంగురించే కలలు కన్నారు. కాని పాపం రిటైరవడానికింకా ఒక ఏడాదియుండే హృద్రోగంవలన (అంటే డాక్టరుకు ఫలానా అని జబ్బు తేలకుండా) పోయారు. ఉద్యోగంలో ఉన్న మా పెద్దబావమరిదికి ఏడుగురు పిల్లలు. తన సంపాదన తనకే చాలడంలేదు. ఇక, చిన్నవాళ్ళ చదువులు పూర్తి కాలేదు. ఒక్కమారుగా ఇబ్బందులు తెలిసి వచ్చాయి. కాని, అది వరకు అలవాటయిన ఖర్చు వెచ్చాలు ఎంత ప్రయత్నించినా తగ్గడం లేదు. పూర్వం "చెట్టుకాయ చెట్టుకి బరువా, మా పిల్ల మాకేమీ ఎక్కువ కాదని" అన్నంత ధీమాగా మా అత్తగారు అనలేకపోతున్నది.

ఆయీపరిస్థితులను పురస్కరించుకొని మా అవిడ నాకు అంటగట్టినమధ్యవర్తిత్వం ఇది. ఇప్పటికయినా అతను వాళ్ళ ఊరు విడిచి ఉంటే వచ్చి ఉండడానికి అభ్యంతరం లేదు. లేనిపక్షంలో ఖర్చులనిమిత్తం నెలకొక యాభైరూపాయిలయినా పంపించాలి. ఇవీ మా అవిడ చెప్పిన షరతులు. అసలు మా అత్తగారి లెక్కప్రకారం నెలకు యాభైఏమిటి, వందయినా లేందే ఎలా సరిపోతుందని. నేను ఏమీ లేనికంటె నయంకదా అని, స్వతంత్రించి ముప్ఫైదాకా దిగేను. కాని అవతలివాళ్ళది ఒకటేమాట. "మే మేమయినా పొమ్మన్నామా గనకనా డబ్బిచ్చుకొందికి. కావాలంటే వచ్చి ఉండమనండి. అంతే కాని ఎత్తి డబ్బు ఒక దమ్మిడీ అయినా ఇచ్చేది లేదు. ఇక కోర్టులట తిరగడమే అంటూ వస్తే, ఏదో అంతు చూసేస్తాము. మా సంగతి ఈ ప్రాంతంలో ఎవళ్ళనడిగినా తెలుస్తుంది."

నేను చక్కగా పుల్లయ్య వేమవరంనుంచి తిరిగి వచ్చినట్లుగా తిరుగుముఖం పట్టేను. అయితే నాకూ పుల్లయ్యకూ ఒక్కటే భేదం. ఎందుకు వెళ్ళడమో తెలియకుండా వెళ్ళొచ్చాడు పుల్లయ్య; వెళ్ళినపని ఎలాగూ కాదని తెలిసి, వెళ్ళి వస్తున్నాను నేను.

గుంటూరు నుండి తిరుగుదలలో బెజవాడలో పూర్వ మిత్రులకోసం గాలించేను. ఒకడు ఇల్లుమార్చేడు. కొత్త ఇల్లు కనుక్కోడం సాధ్యమయింది కాదు. మరొకడికి ఆఊరునుండి బదిలీఅయిపోయింది. వేరొకడి ఇంటిదగ్గర "ఊళ్ళో లేరు, నాలుగురోజుల వరకూ రారనిచెప్పవే అమ్మాయి" అన్న కేక వినిపించి ఆ అమ్మాయి తలుపు తెరిచేలోపున నేను సందు మలుపు తిరిగిపోయేను.

కేవలం మిత్రులను చూడ్డంకోసం ఒకమారు బెజవాడ వెళ్ళాలనుకొని, వాళ్ళవల్ల రమ్మని పలుమార్లు ఆహ్వానాలు పొందిన నేను ఆ రాత్రికి ఏదో హోటలులో భోంచేసి పడుకోవలసిరావడంతో చాలా క్రుంగిపోయేను. ఇంతకీ ఇందులో పొరపాటేమయినా ఉంటే అది నాదేగాని ఇతరులది కాదు. నేను అక్కడ గుంటూరులో పనిఅయిపోయేక తిన్నగా ఇంటికివెళ్ళిపోవాలనుకొన్నవాణ్ణి ఇక్కడ దిగడమూ అదీ ఆఫీసులేని ఆదివారంనాడు. ఏమయితే నేం ఒక్కొక్కనాడు బయలుదేరిన వేళావిశేషంఅది.

రిక్షాలో స్టేషనుకివస్తున్నానేగాని మెయిలందుతుందనే నమ్మకం నా కంతమాత్రం లేదు. ఏమంటే నా ప్రయాణం మొదటినుండి అంతా అసందర్భంగానే జరుగుతూ వచ్చింది.

మెయిలందడమే కాదు, స్థలంకూడా సమృద్ధిగానే దొరికింది. అంటే మీదను రెండు పెట్టెలు కొంచెం అటూఇటూ సర్ది హోల్డాలు పరుచుకొందికీ, క్రిందను విశాలంగా చేరబడి కూర్చుందికీ జాగా దొరికింది. కాని అక్కడ పని సాధించలేకపోవడమూ, బెజవాడలో మిత్రులనుకూడా కలుసుకోలేకపోవడమూ కేవలం తన అసమర్థతవల్లనే యుద్ధంలో పరాజయంపొందిన సేనానాయకుడిలాగ రూపించసాగింది. నే నేదో చాలా తెలివితక్కువపని చేసివస్తున్నట్టనిపించింది కొన్ని దినపత్రికా వారపత్రికలు కూడా చదవాలనిపించలేదు. అయినా అంతకంటె చేసేపని ఏమీ లేదు గనుక ఊరికే తిరగవేస్తున్నాను.

నాకు రయిలు కదులుతూ ఉండగా ఎక్కేవాళ్ళంటే మా చెడ్డకోపం, వీళ్ళకు తమ ప్రాణం అంటే ఇంతమాత్రమయినా తీపిలేదేమా అని. మా స్నేహితుని తమ్ముడొకడు, చాలా వృద్ధిలోకి రావలసిన కుర్రవాడొకడు నేను చూస్తూఉండగానే నడుస్తున్న రయిల్లోకి ఎక్కబోయి కాలుజారిపడి, ఒక చెయ్యి కాలూ పోగొట్టుకొన్నాడు. అప్పటినుండి నాకు మరీ భయం, సకాలంలో రైలెక్కలేకపోతే ప్రయాణమయినా ఆపుకొంటాను గాని, నడుస్తున్న రైల్లోమాత్రం ఎక్కను.

అవాళ మాత్రం రయిలు నడుస్తూఉండగా తానెక్కి కూలివాడి నెత్తినున్న హోల్డాలు అందుకొన్న మనిషిని నేనే ప్రత్యుత్థానంచేసి పిలిచాను

నా ప్రక్కను కూర్చున్న తోటి ప్రయాణికులకు కష్టం తోచినాను.

అతను మరెవరో కాదు మా ఆప్తమిత్రుడు దీక్షితులే. క్లాసులో సహాధ్యాయి మాత్రమే కాదు, హాస్టలులో ఒకేగదిలో ఉండేవాళ్ళం. ఈ సుమారు రెండు దశాబ్దాల కాలంలోనూ మనిషి రవ్వంతయినా మారలేదు. వేషమూ అదే, చొక్కా, పంచె, ఒక్కటే అప్పుడు లేనిది కళ్ళజోడొకటుంది. చత్వారంకోసం పెట్టుకొన్నదే కావచ్చును, కాని, కేవలం ఫాషనుకోసం పెట్టుకొన్నా డనుకోడానికి వీలుగా అమిరింది ఇంకెందుకు, అదివరకు తెలిసి ఉండకపోతే పాతికేళ్ళకంటె ఎక్కువ ఉన్నాయంటే నమ్మలేకపోదును. నాలాగ అనారోగ్యం మూలంగా నలభైఏళ్ళకే బాగా ముసలికళ వచ్చిన వాళ్ళమాటకేమి, మా మిత్రులలో కొందరు బలంగా ఆరోగ్యంగా ఉన్నవాళ్ళు లేకపోలేదు. కాని, ఇంతలాగ వయస్సుతో సంబంధం లేకుండా శరీరాన్ని మార్పు చెందనివ్వకుండా నిలబెట్టగలిగిన వాళ్ళు మరెవరూ లేరు. పళ్ళుకూడా అప్పటిలాగే తెల్లగా స్వచ్ఛంగా ఉన్నాయి. నాయీ ఆలోచనంతా కొద్ది క్షణాలు మాత్రమే. అతను చటుక్కున నన్ను పోల్చుకోలేకపోయేడు: అంతలా మారిపోయే నన్న మాట.

సుమారు పదేళ్ళక్రితం ఒకమారిలాగే రైల్లో కలిసేము గాని నేను ఆ పక్క స్టేషనులోనే దిగవలసి రావడంవల్ల అయిదునిమిషాల కంటె ఎక్కువ మాట్లాడుకోడానికి వీలుచిక్కలేదు. అందుచేత మొట్టమొదట ప్రయాణం ఎంతవరకో కనుక్కొన్నాను. ఇంటికే అన్నాడు. అంటే శ్రీకాకుళం అన్నమాట. మరి బాధలేదు. సాయంకాలం విజయనగరం వచ్చేవరకూ కలిసిఉండవచ్చును.

మాట్లాడుకోవలసినవి ఎంతో ముఖ్యమయిన విషయాలున్నప్పుడు మొట్టమొదట ఏవేవో మామూలు సంగతులే—ఈ సంచి ఎంతకు కొన్నావనీ, వాచీ అప్పటిదేనా అనీ, రెయిలివాళ్ళ మామూలుగా వచ్చేలేటేనా లేక కాలకూనం ప్రకారం నడుస్తుందా అనీ—ఇటువంటివే వస్తాయి.

రయిలు బాగా వేగం అందుకోడంతో మా సంభాషణ దారిలోపడింది. నేను ముందు అతని ప్రయాణపు సంగతి కనుక్కొన్నాను. మొదటి సంగతి వేసవికాలం కోర్టులకి శెలవులుకదా అని బయిలుదేరేనన్నాడు. ఇక ఏడెనిమిదేళ్ళుగా ఇల్లూ వాకిలీ, తిండీ తిప్పలూ తిన్నగా లేక నానా అవస్థపడి ఇటీవలే సినీమారంగంలో కొస్త ముందుకి వచ్చిన నరసింహమూర్తి మరీ మరీ రమ్మన్నాడన్నాడు. ఇంతకీ, ఎక్కడయినా హోటలు భోజనమే కదా అని బయలుదేరేనన్నాడు. మొత్తానికి ఒక నెల్లాళ్ళు మద్రాసు బెంగుళూరు మొదలయిన ప్రదేశాలు పర్యటించి తిరిగివస్తున్నానన్నాడు. నేను అనకపోలేదు, నీకు అంతదూరం వెళ్ళడానికి వీలయిందిగాని మా ఊరొకమారు రావడానికి వీలయింది కాదుకదూ ఇన్ని సంవత్సరాలలోనూ అన్నాను.

వాడూ ఊరుకోలేదు. "ఎప్పుడంటే అప్పుడు వెళ్ళగలం అన్నంతదగ్గరగా ఉన్న ఊళ్ళువెళ్ళడమే కష్టం అనుకో. వెళ్ళడానికేమి పెద్ద అడ్డులేదుకదా అనుకొంటూనే ఎప్పుడూ వెళ్ళలేము, ఇంతకీ నువ్వు నాలో చూపిన లోటు నీలోనూ లేకపోలేదు కదూ. మీ అత్తవారి ఊరు బరంపురం వెళ్ళేదారిలోనే కదా, ఒక్కమారయినా దిగావా?" అన్నాడు.

నేనన్నాను: "పోనీ వెనకటిమాటకేం, ఇప్పుడిలా తిన్నగా విజయనగరంలో దిగి మా ఊరురా, అక్కడ ఒక నాలుగు రోజులున్నాక నేనెలాగూ బరంపురం వెళ్ళాలి. కలిసి బయలుదేరుదాం; మీ ఊళ్ళో నువ్వుండమన్నన్నాళ్ళుంటాను."

అతను మర్నాడే కోర్టులు తెరుస్తారనీ, తప్పకుండా వెళ్ళితీరవలసినపని ఉందనీ అన్నాడు. మరి బలవంతం చేసి లాభం లేదని నాకు తెలుసును.

కొంచెంసేపు తటపటాయించి "అయితే ఇంకా హోటలు భోజనాన్ని విడిచిపెట్టలేదన్న మాట?" అన్నాను.

వాడు తిన్నగా సమాధానం చెప్పలేదు. "ఇళ్ళలో భోంచేస్తున్న మీలో ఒక్కరయినా నాకంటె ఆరోగ్యంగా ఉన్నారా?" అన్నాడు.

"ఎలా ఉంటాం? మా కుటుంబాలకంతటికీ అయేపాటి ఖర్చు ఒక్క మనిషిక్రింద పెట్టుకొనే నీతో మేమెలాగు పోటీ చెయ్యగలం? చూడగా చూడగా నువ్వు మాతోనే కాదు, మా తరవాత తరం వాళ్ళతో కూడా పోటీ చేసేటట్టున్నావు"

"నేనేమో మీ అందరికంటె ఎక్కువగా తినేస్తున్నాననుకోకు. అయితే నా దినచర్యఅంతా ఒక క్రమబద్ధంగా నడుస్తుంది. సాయంకాలం ఎంత లేదన్నా ఆరేడుమైళ్ళు నడుస్తాను."

"ఇంటికి వచ్చేసరికి సంసారపు బాదరబందీ ఏదీ లేనివాడివి కాబట్టి హాయిగా షికార్లు కొడతావు. అందరికీ ఎలా కుదురుతుంది? బజారుపనో, మరొకటో, మరొకటో ఉండనే ఉంటుంది. పోనీ మామాట కేమి, నీతోటి స్త్రీపురుషులంతా మాత్రం నీపాటి ఆర్జిస్తున్న వాళ్ళు నీఅంత హాయిగా నిర్విచారంగా ఉండగలుగుతున్నారా?"

"హాయిగా ఉండడం అన్న దానిలోని తరతమ భేదాలను కొలిచేయంత్రం ఏదీ లేదుకదా. ఒక్కొక్కడికి ఒక్కొక్కటే ఆనందం. కొందరు, నువ్వు చెప్పిన బాదరబందీ అను, తాపత్రయం అను. అది లేకుండా ఒక్కక్షణం ఉండలేరు. మరి కొందరికి ఏపనీ లేకపోయినా ఎక్కువమందితో కలిసి ఉండడం, అప్రస్తుతం ఇతరులను గురించిన ఆలోచనలు చెయ్యడం అంటే కష్టంగా ఉంటుంది. అంతా అలవాటే. నువ్వు నాలుగురోజులపాటు ఇంట్లో మరెవ్వరూ లేకుండా ఒంటరిగా పడుకోగలవా? నాకు నా గదిలో మరొకమనిషుంటే నిద్ర పట్టకపోవడమే కాదు, పక్కగదిలో మనిషి కాస్త కదిలినా నిద్ర పట్టదు."

"అయితే పక్కగదిలో మనిషి అలికిడయితే నిద్రపట్టదన్న విషయం ఇటీవలే అనుభవపూర్వకంగా తెలుసుకొంటున్నావు కాబోలు. ఏం?"

"నీమాటలలో నిగూఢంగా ఉన్న ధ్వనియొక్క నిజస్వరూపం నాకు తెలియకపోయినా, నీకు మరేలాటి అపోహలు లేకుండా ఉండడానికి చెప్తున్నాను. నేను అప్పటికీ ఇప్పటికీ ఒక్కలాగే ఉన్నాను. మా బంట్రోతు రామస్వామి కింద సావడిలో పడుకొంటాడు. నేను మేడమీద పడుకొంటాను. అంతే."

"నీగురించి నాకేం అనుమానం లేదు కాని పక్కగదిలోని అలికిడిగురించే. లేక పక్క ఇంటిలోని అలికిడిగురించా నువ్వన్నది? ఏమో. ఆ మధ్యను నీగురించి చాలాచాలా విన్నానులే. అసలు దీక్షితులే మునపటి దీక్షితులు కాదని."

"మనుష్యులకి మార్పు సహజం. నాబోటివాడెవడో కాస్త మారకుండా ఉన్నట్టు కనిపిస్తే, ఎలాగోలాగు వాడూ మంచికో చెడుకో మారేదంటేనేగాని తృప్తిలేదు నీతోటివాళ్ళలో కొందరికి."

"మనం రైల్లో కదలకుండానే కూర్చున్నా, రైలు కదలడంవల్ల మనమూ కదులుతున్నట్లవుతున్నట్టే, మన చుట్టూ ఉన్న లోకం మారిపోతున్నప్పుడు మనం మారకుండా ఉన్నా మారినట్టే— ఒక కాలంలో, ఒక వాతావరణంలో ఒకరీతిగా కనబడినవి, కాలమూ, దేశమూ మారడంతో కొత్తగా కనిపించక తప్పదు."

"కనిపించేది లేదనే నీవంటి జగన్మిథ్యావాదితో మరి వాదించి లాభం లేదు. నేను నీ చిత్తంవచ్చినట్టు మారిపోయేను సరా?"

"ఇంతలోనే ఇంతకోపమా? అసలు నీకు నువ్వు బాగా మారిపోయేవంటే సంతోషమో, అక్కే లేదు, నాటికీ నేటికీ ఒక్కలాగున్నావంటే సంతోషమో నాకు తెలీకదూ! నీకు ఎలా కావాలంటే అలాగే ప్లేటు ఫిరాయించేవాణ్ణి."

"అంటే నా ముఖప్రీతికోసం తప్ప మాట్లాడ వన్నమాట"

"నీతో ఏదన్నా చిక్కు, సరేగాని, నీసంగీతం ఎంతవరకు వచ్చింది? అప్పుడు చదువుకూడా మానేసి వీణ సాధకం చేస్తూ కూర్చునేవాడివి."

"ఇప్పుడూ అప్పటి చదువులాటి అడ్డంకి ఏదైనా ఉంటే సాధకం బాగానే జరుగునేమో! నరసింహమూర్తి ఉన్నన్నాళ్లూ అదొక అవసరంగా తోచేది. ఇప్పుడూ రోజుకి ఒకగంటో అరగంటో పట్టుకొంటానుగాని మునపటి ఆ ఏకాగ్రత లేదు. ఇప్పుడు ఎక్కువభాగం రేడియో వినడంతో జరిగిపోతున్నది."

"చూశావా మరి, మారలేదంటావు, నువ్వు మారుతునే ఉన్నావు. ఊరికే అద్దంలో చూసుకొని మారలేదనుకొంటున్నావుగాని."

"నేను మారిపోయేనని సిద్ధాంతీకరించడంవల్ల నీకు కలిగేలాభ మేమిటో నాకర్థంకాదు."

"పోనీ, మరెందుకు, నువ్వు లేశమాత్రమైనా మారలేదని నేను ఒప్పుకొంటున్నానుగాని, చాలా మేర తిరిగి వచ్చావు; విశేషాలు చెప్పవూ. మన వాడు నరసింహమూర్తి ఇకనైనా అక్కడ స్థిరపడి నట్టేనా?"

అతను ఏదో చెప్పేడు, నేను విన్నానంటే విన్నానుగాని నా మనసంతా వేరేమార్గంలో సంచరించసాగింది. ఈనాడు ఇంత తేలికగా మాట్లాడగలుగుతున్నాము నేనూ దీక్షితులూ అతని ఒంటరి జీవితాన్ని గురించి. ఒకప్పుడు అందుకు కారణమైన పరిస్థితులు అతనిని ఎంతవరకు తీసుకొని వెళ్ళేయో తెలిసికూడా ఇప్పుడిలా మాట్లాడగలగడము చిత్రంగా తోచింది.

అతనికి కలిగినది కష్టంకాదని నే ననను గాని, దానిని మరొకడయితే అంతలా హృదయానికి

పట్టించుకొని, ఆత్మహత్యా ప్రయత్నంవరకూ వెళ్ళి ఉండడని నిశ్చయంగా చెప్పగలను. పెళ్ళయిన కొత్తలో, ప్రేమకవిత్వాన్ని పుస్తకాల్లోంచి జీవితంలోకి దిగుమతి చేద్దామనే ఉత్సాహపు పొంగు తగ్గకమునుపే భార్యావియోగం; అదీ మృతివలన కాదు, సర్వవిధాలా తనకంటె తక్కువవాడుగా కనిపించే మనిషితో లేచిపోవడంమూలంగా. ఎవరికయినా కష్టం కలిగించే విషయమే. అయితే మరొకమామూలు వ్యవహారసరణి తెలిసిన మనిషి అయితే, మొదట ఎంత విచారించినా, కొద్దిరోజుల్లో ఆప్తవర్గము చెప్పిన మాటలను కాదనలేక, చక్కగా మళ్ళీపెళ్ళి చేసుకొని నిక్షేపంగా సంసారం చేస్తూ ఉండి ఉండును. ఊఁహూ! దీక్షితులు పంథా అంతా వేరు. తాను మరి బ్రతికి ఏంప్రయోజనమని. తనకంటె అసమర్థుడూ అప్రయోజకుడూ అయినవాడు వేరెవడయినా యీ ప్రపంచంలో ఉంటాడా అని.

నేను అప్పట్లో ఒక్కక్షణమయినా విడిచిపెట్టకుండా చాయలా అనుసరించి, అతను చేసిన మూడు ఆత్మహత్యా ప్రయత్నాలను భంగపరచడంతో నిశ్చయంగా చెప్పేసేను మరి తాను అటువంటి ప్రయత్నం చెయ్యబోడని. అయితే మరి తనను మళ్ళీ పెళ్లి చేసుకోమనేవాళ్ళు మాత్రం తనను కేవలం బాధపెట్టే ఉద్దేశంతోనే అలా మాట్లాడుతారని తాననుకొంటాడని.

తనయెడల ప్రేమలేదని స్పష్టంగా తెలియజేసిన మనిషిని, తనను కాదని వేరొకనితో లేచి వెళ్ళిపోయిన మనిషిని ప్రేమించకుండా ఉండలేని మనుష్యులుంటారంటే అదివరకు నాకు నమ్మకం కలిగేది కాదు. నేను అన్యాపదేశంగా చాలామార్లు చెప్పి చూసేను. ఇప్పుడింతగా నువ్వు ప్రేమఅనేభావన కలగడానికి ప్రధానకారణమేమిటి? వివాహమే కదా! మరొక వివాహంలో మాత్రం అటువంటి ప్రేమ జనకమయిన శక్తి ఉండదా? శరీరానికి తగిలిన ఎంతలేసి గాయాలు మానిపోతున్నాయి కదా! కొత్త పరిసరాలూ వాతావరణం ఏర్పరిస్తే మనసుమాత్రం అందుకు అనుగుణంగా ఎందుకు మార్పుచెందదు? అసలు మన ప్రయత్నం అక్కరేలేదు; సంతతమూ అదేపనిగా సంస్మరిస్తూ కూర్చోకుండా ఉంటే చాలును, దానంతటదే కొత్తరుచులకూ వాసనలకూ అలవాటు పడుతుంది మనసు, మనజీవితాన్ని మనమే దుఃఖభాజనం చేసుకొని, ఎవరిమీదనో పగసాధించుతున్నామనుకోడం కంటె అవివేకం అంటూ ఉండదు.

ఇలా నేను చెప్పేవాటికి అతను తిరుగు జవాబు చెప్పేవాడుకాడు. ఎప్పుడయినా మాట్లాడినా "అవును, నిజమే, అంతేసుమా'' అనేవాడు. అంటే ఏమిటి, నేను చెప్పినమాటల్లోని నిజం లోకంలోని మరెవరికయినా వర్తిస్తుందిగాని తనకి వర్తించదని. తనది అన్ని పరిస్థితులకూ అతీతమయిన ఒక విపరీత స్థితి అని. తన విషయంలో మామూలు ఊహాలూ తర్కమూ కార్యకారణ సమన్వయమూ ఇవేవీ పని చెయ్యవని అతని ఉద్దేశం. లేకుంటే వాదించి ఉండేవాడే. వాదించే స్థితికంటూవస్తే, అప్పుడు కాకపోతే మరొకప్పుడయినా మామూలు ధోరణికి వచ్చునని నా ఆశ.

చివరికి తక్కిన వాళ్ళతోపాటు నేనూ లాభం లేదని విడిచిపెట్టేసేను. అంతే, మామూలుగా అందరికీ సామాన్యంగా తోచేవే — పరీక్షపోవడమూ, చిన్నదొంగతనంచేసి దొరికిపోవడమూ, చేసిన చీకటితప్పు బైటపడిపోవడమూ మొదలయినవి. కాని, ఇటువంటి కారణాలకే ఆత్మహత్యలు చేసుకొన్నవాళ్లే వేవులు లేకపోలేదు. మా దీక్షితులుకూడా ఆకోవలోనివాడే. అయితే మూడుమార్లు తన ప్రయత్నం విఫలం కావడంతో క్లయివునోరలాగ, ఆత్మహత్యాప్రయత్నం మాత్రం విరమించుకొన్నాడు కాని, కేవలం బాధను భరించడం అన్న లెక్కనుమాస్తే, ఒక్కమారుగా చచ్చిపోయినవాళ్ళ కంటె బ్రతికి అనుభవించేవాళ్ళదే ఎక్కువకష్టం అనిపిస్తుంది.

బి. యే. అనంతరం వాడు బి. యల్ చదివేడు, నేను చిన్నప్పుడు చదువుకొన్న స్కూల్లో ఒక ఏడాది మాష్టరీచేసి, యల్. టి., అయి బడిపంతులుగా స్థిరపడ్డాను. ఇలా విడిపోయినప్పటికీ కొన్నాళ్లపాటు విధిగా వారం పదిరోజుల కొకటిచొప్పున ఉత్తరాలు రాసుకొనేవాళ్ళం. క్రమంగా మా మధ్య ఉత్తరాలు స్తంభించిపోడానికి బాధ్యత నూటికి నూరుపాళ్ళు నాదే. వాడు రాసిరాసి ఎన్నటికీ జవాబు లేకపోడంతో విసిగి ఊరుకొనేవాడు. నేను ఎప్పుడో ఒక్కమారు మా ఉత్తరాల పరివర్తనయోగాన్ని సముద్ధరించవలసే ఉందంటూ ఒక పెద్దఉత్తరం రాయడమూ, వాడు తరవాత సక్రమంగా రాస్తూ ఉండడమూ నేను బద్ధకించి ఊరుకోడమూ జరిగేది. అసలు సంసారంలో దిగబడిపోయి, దైనికచర్యాచక్రాన్ని అణుమాత్రమయినా మార్పులేకుండా తిప్పుకొంటున్నవాడికి ఉత్తరం రాయవలసిన అవసరమూ కనబడదు. కనబడినా అదీ ఒక పెద్ద తప్పించుకోవలసిన బరువుగానే ఉంటుంది. అయినా మా పిల్లలు పుట్టినవెంటనే శుభలేఖలు రాసేను, పెద్దపిల్ల పెళ్ళికి

రానేను. వాడు రాలేదని మాత్రం ఏమీ అనుకోలేదు. వాడు ఆనాటినుండీ ఎవరింటికీ యేపెళ్ళికీ వెళ్ళడం లేదని తెలిసి వేరొకలా ఎలా అనుకోగలను? అయితే వాడు, నే నెన్నడూ ఊహించలేని పెద్దమొత్తాన్ని పెళ్ళికుమార్తెకి కట్నంగా పంపించాడు. వాడి సంసారమే తిన్నగా నిలబడిఉంటే? ఈ సరికి ఎంతలేసి పిల్లలు ఉందురో? వాడి మనస్సుకి ఎంత హాయిగా ఉండునో? అన్నరకంఆలోచనలు నన్ను ఆతరువాత చాలాకాలం పీడించాయి.

పక్కనే అతనుమనిషి ఉన్నాడుగాని మనసుకి మాత్రం ఏనాటివో చిత్రాలు కనిపించసాగాయి. ఇప్పుడతన్ని చూస్తే ఎవరికీ ఏమీ విచారించవలసినది కనబడదు. అంతేకాదు. సాంసారిక జీవితంలోని వడిదుడుకులకు తట్టుకోలేని సమయాల్లో బంధరహితమయిన అతని జీవితమే ఎంతో హాయనిపించడమూ వింతకాదు. అయినా గతం అంతా తల్చుకొంటే మాత్రం ఒక సహృదయుని, జీవితం రసహీనమైపోయిందే, ఆదర్శప్రాయుడయిన గృహస్థు కావలసిన ఒక సమర్థుడు తనవాళ్ళు అనుకొందికి ఎవ్వరూ లేకపోయేరే అన్న విచారం కలగక మానదు.

నా ఆలోచన ఇంకా తెమలనే లేదు. రైలాగింది. అతను చదువుతున్న పత్రికమూసి, పద, మరోకమారు కాఫీ తాగివద్దామన్నాడు.

మేము తిరిగి వచ్చేసరికి ఎవరో మా స్థలం ఆక్రమించుకోడంవల్ల మొదట కొంచెం ఘర్షణపడినా చివరికి సర్దుకొని, అదివరకు ఇద్దరికి సరిపడిన స్థలంలో నలుగురమూ కూర్చున్నాము. మరి నా వెనకటి దీక్షితులనుగురించిన ఆలోచనలూ లేవు; అతని పుస్తక పఠనమూ లేదు. మా స్థలాన్ని మాకు తిరుగా ఇచ్చిన పెద్దమనుష్యులిద్దరూ రాజకీయాలు అమోఘంగా చర్చిస్తున్నారన్న సంగతే మేము గుర్తించాము. తరవాత ఆ చర్చలో మేముకూడా మునిగిపోయేమన్న విషయం చాలాసేపటివరకూ స్ఫురించలేదు. రాజకీయాల్లో నాకూ దీక్షితులుకీ అభిప్రాయాలు కలియవన్నది మొదట్లోనే తేలిపోయింది. అసలు మేమిద్దరమూ వేడెక్కిపోయి కొట్టుకోకుండా కాపాడే బాధ్యతకూడా తమదిగా మాతోడి ప్రయాణీకులు భావించవలసినంత ధాటీగా సాగింది వాదధోరణి.

రైలు ఆగింది. ప్రక్కనున్న ఆయన కిల్లీలు సిగరెట్లు సరఫరా చెయ్యడంతో వాదన ఆగిపోయింది. మావాడు సిగరెట్టుపుచ్చుకొని నాకిచ్చేడు. కిల్లీకూడా వేసుకొన్నట్టులేదు. ఏంచేసేడో. ఈ మారు ప్రసంగం సినీమాలవంక తిరిగింది. నేనూ వాడూ కూడా మా అశక్తిని తెలిసినవాళ్ళంగనక కేవలం శ్రోతలుగా తయారై సుమారు ఆరునెల్లుగా సినీమాపత్రికల్లో వచ్చిన వాఙ్మయమంతటినీ ఆకర్షించేము. మాకు ఇంత స్వల్పవ్యవధిలో ఇంతటివిషయగ్రహణభాగ్యం కలిగించిన ఆ యువకులకు ఎంతయినా కృతజ్ఞులము.

గోదావరి బ్రిడ్జి దాటింది. గోదావరి స్టేషనులో మా దీక్షితులుకి తెలిసిన నల్లకోటాయన ఒకరు కనిపించేరు. బహుశః ఆయనా ప్లీడరే ననుకొంటాను. ఆయనా తుదివరకూ వస్తానన్నాడు.

నేను ఒక్కడినే రాజమండ్రిస్టేషనులో దిగేను. పుస్తకాలషాపులో చాలాసేపు గడిపి ఒక రెండు పుస్తకాలతో బైట పడ్డాను. ప్లాటుఫారంమీద ఎవ్వరూ తెలిసినవారు కనబడలేదు. బండిలో మావాడు, ఆనల్లకోటాయనతో తన్మయుడై మాట్లాడేస్తున్నాడు.

ఏమీతోచక ప్లాటుఫారం చివరివరకూ వెళ్లేను. టైము అట్టేలేదు. ఒకటో రెండో గంటలు కొట్టేరు. తొందరగా మా బండిదగ్గరకు తిరిగి వస్తూఉండగా "ఏమండీ పంతులుగారూ" అని కొంచెం వెనకనుండి ఆడగొంతు వినిపించింది. నడక ఒక్కమారు ఆగింది కాని నన్నెవరు పిలుస్తారని మళ్ళీ అడుగు వెయ్యబోతూఉంటే "మిమ్మల్నే" అన్న హెచ్చరిక వినిపించి వెనక్కి తిరిగేను. మరెవరూ కాదు కృష్ణవేణమ్మగారు. కాబట్టే ఆమాత్రం ధైర్యంగా పిలవడం జరిగింది. నేను చూడకపోయినందుకు క్షమాపణ చెప్పనియ్యకుండా ఆవిడ "ఇందాకా మీరిలా పుస్తకం పట్టుకొని వెళ్ళడం చూసేను. అయితే నేను చూసేసరికి మీరు వెనక తిరిగి ఉన్నారు. అయినా మీరే ననుకొన్నాను. ముందు బండిలో ఎక్కబోతారనుకొన్నాను. అక్కడ నిలబడి ఉండడం చూసి మళ్లీ ఇటువస్తే పిలుద్దామనుకొన్నాను. ఒక్కమారు రెండుకో ఇటుతిరిగేసరికల్లా మీరు దాటిపోయేరు."

"ఎక్కడ దాటిపోయేను? రమణమూర్తిగారున్నారా?"

"ఆఁ ఉన్నారు. ఇదుగో పడుక్కొన్నారు. రండి. ఒక్కరే వస్తున్నారా? వదినెగారూ వాళ్ళూ ఉన్నారా?"

"లేదండి, నే నొక్కణ్ణే గుంటూరు వెళ్లివస్తున్నాను. అమ్మాయిలు బాగున్నారా? ఏం చదువుతున్నారు?"

"ఇద్దరూ బి. యే చదువుతున్నారు. యమున సీనియరు. సరస్వతి జూనియరు. రండి. రైలుకూసింది. వచ్చేస్టేషనులో మీ పెట్టెలోకి వస్తారుగాని."

మీరు ఖర్చుపెట్టిన డబ్బుకు ఈవిధములుగా డాల్డా వనస్పతి పూర్తిగా లాభము గలుగజేయును

"నేనెల్లప్పుడు డాల్డాను ఎన్నుకొంటాను – అది గాలికూడ చొరవకుండ సీలుచేయబడిన డబ్బాలలో ఎల్లప్పుడు మిక్కిలి క్రొత్తగాను, శుద్ధముగాను, ఆరోగ్యకర ముగాను ఉండును."



బడికి వెళ్లు పిల్లలకు ప్రత్యేక ఆహారము అవసరమా?
ఉచిత సలహాకు ఇవ్వాళే లేక ఏ రోజైనను ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి :
ది డాల్డా అడ్వైసరీ సర్వీస్
పోస్టు బాక్సు నంబరు 353, బొంబాయి 1

గుణమునకు డాల్డా అసమానమైనది. అది తయారగునపుడు అన్నిదశలలోను చేతితో ముట్టుకొనబడదు. మిక్కిలి శుద్ధమైన పదార్థములనుండి అది తయారుచేయబడును. గాలికూడ చొరవకుండ సీలుచేయబడిన డబ్బాలో శుద్ధముగాను, క్రొత్తగాను, ఆరోగ్యకరముగాను డాల్డా మిమ్ములను ఎల్లప్పుడు చేరును. దానిని వాడుటవలన ఖర్చు మిక్కిలి తక్కువకూడ.



డాల్డా

10 పౌన్లు, 5 పౌన్లు, 2 పౌన్లు మరియు 1 పౌను టిన్నులలో దొరకును

HVM. 189-50 TL.

పామర్లకోటలో వాళ్ళు దిగి కాకినాడ వెళ్ళే బండిలో ఎక్కే వరకూ నేను వాళ్ళతోనే ఉన్నాను. కాకినాడలో మా చెల్లెలు గారూ వాళ్ళూ ఒకే ఇంట్లో అద్దెకుండేవాళ్ళు. అదీ పరిచయం. రమణమూర్తి ఫోటోలు తీసేవాడు. సైనుబోర్డులు రాసేవాడు. అంటే పేరు అతనికి; పని చాలా భాగం ఆమెది. ఎటువంటి చిలిపి మనిషి కూడా అపార్థం చేసుకొనడానికి వీలు లేకుండా వుండేది. ఆవిడ కలుపుగోలుతనం. ఇద్దరే ఆడపిల్లలు. వయసులో ఒక సంవత్సరం వర భేదం ఉన్నా ఒక్కలాగే కనిపించేవారు. ఒక్క పిల్లనే చూస్తే యమున ఎవరో సరస్వతి ఎవరో తెలిసేది కాదు. అందానికి లోటు లేకపోయినా అందుకు విభిన్నమైన ఆకర్షణ ఏదో కనిపించేది. ఇద్దరూ యిలా చక్కగా విన్న ప్రతి పాట పాడగలిగేవాళ్ళు. అయితే నేను చూసి అప్పుడే ఏడెనిమిదేళ్ళు కావస్తుంది. అప్పటికి పెద్దపిల్లకి పన్నెండేళ్ళకంటె ఎక్కువ వుండవు. ఇప్పటికి చాలా మారిపోయి ఉంటారు ఆకారంలోను అభిరుచులలోను. పాపం. అతను రమణమూర్తి క్షయతో బాగా కృశించి పోయేడు. సుమారు రెండు సంవత్సరాలయిందట. నా మటుకు నాకు చూస్తే మరి కొద్ది నెలలు నిలబడడం కూడా కష్టమనిపించింది. కాని, ఆవిడ ఇదే నయమంది. లోగడ ఇంతకంటె దుర్బలంగా ఉండేవాడట. కేవలం రోగి ముందు ధైర్యంగా ఉండడానికి అలా అందో, లేక నిజంగానే ఆవిడకు అలా అనిపించిందో గాని, నాకు మాత్రం మరి ఏమీ ఆశ ఉన్నట్టు కనిపించ లేదు.

ఆవిడ శానిటోరియమ్‌లోకంటె ఇంటిదగ్గరే బాగుంటుందని తీసుకొని వెళ్తున్నానన్నా నిజమైన కారణం ధనాభావ మనిపించింది. పాపం, ఎలా నెట్టుకొని వస్తున్నదో. ఇద్దరు పిల్లలు ఇంకా చదువుతున్నారు. వాళ్ళ ఖర్చులు, జబ్బు మనిషి ఖర్చులు. పూర్వం ఉండేపాటి కూడా ఆభరణాలు లేవు. అయినా మనిషి ఏమీ దిగులుపడినట్టుగా కనబడదు. ఒక్కొక్కరి స్వభావంలోని వైచిత్ర్యమేఅది; లోపల బడబానలం ప్రజ్వరిల్లుతున్నా పైకి ఆనందవీచికలు వెల్లివిరిసేలాగ ఉండగలరు

మా చెల్లెలు గారికి అక్కడనుంచి బదిలీ కావడంతో నాకు మరి వాళ్ళ భోగట్టా ఇన్నాళ్ళూ తెలియ లేదు. అయితే తెలిసినప్పుడు చేసి దేమిటి? తెచ్చిన జీతంతో దినవచ్చు మేరీతి తీర్చగలను అన్న సమస్య నానాటికీ బిగుసుకుపోతూ ఉంటే! నిజంగా ఇటువంటి పరిస్థితిలో నాది పెద్దసహాయం అనీ, అందువల్ల అవతలివాళ్ళ యిబ్బందులన్నీ తీరి తరించిపోతారని కాదు, కాని ఒక వందో రెండు వందలో ఇవ్వగలిగితే మన మానవత్వం మీద మనకే గౌరవం కలుగుతుంది.

నేను పామర్లకోటలో వాళ్ళను దిగబెట్టి వచ్చేసరికి మా వాడు నాకోసం చూస్తున్నాడు. ఆ రెండో క్లీనరు గారు పేపరు చదువుకొంటున్నారు.

ఇంతసేపూ ఎక్కడికి పరారీ అయిపోయేవన్న మా వాడి ప్రశ్నకి సమాధానంగా కృష్ణవేణమ్మగారి కబుర్లు చాలాసేపు చెప్పాను. అంతే కాదు, ఇంటికి వెళ్ళాక ఎలాగయినా వీలు చేసుకొని రెండు వందలు కాకపోతే అర్థ వందయినా పంపించాలనుకొంటున్నానన్న సంగతి కూడా చెప్పకుండా ఉండలేకపోయేను. వాడితో అన్నానుకదా, మాట నిలబెట్టుకొందామని యత్నిస్తానేమోనని ఆశ.

వాడు మాత్రం ఊరుకోలేదు. "పంపించడం మానేసి నువ్వు ఇబ్బందిపడడం నిశ్చయం; అంతకు మించి వాళ్లకు ఎంతలాభం ఉంటుందంటావు? ఆ జబ్బుకయే ఖర్చులగురించి నీకేమీ తెలియనట్టుంది. అయినా ఇన్నాళ్లు గడిపిన మనుష్యులు, ఇకముందు మాత్రం గడపలేరంటావా?"

నేను: "ఈ విషయంలో నేను అట్టే వాదించదలుచుకోలేదు! నిజమే. డబ్బు పంపడం నాకు ఇబ్బందే కాదు, మామూలు అవసరమున్న లెక్కను చూస్తే అసాధ్యమే. కాని, ఇవాళ ఆవిడను కలుసుకోకపోతే, ఆ జబ్బుమనిషిని చూసి ఉండకపోతే, ఏమీ లేదు. కాని, ప్రత్యక్షంగా చూసికూడా ఊరుకోడం ఒకవిధమైన అత్యాచారం నే. ఇక, నా చేసే సహాయం పూర్తిగా వాళ్ల అవసరాలను తీర్చలేదు కదా అని అసలే చెయ్యకుండా ఉండడం తప్పించుకొనే అమానుషమైన ఎత్తనిపిస్తుంది. పాపం, ఆ పిల్లల చదువులైనా పూర్తిఅయి ఉంటే ఇంత ఇబ్బంది లేకపోవును. ఎంత చక్కగా పాడేవారనుకొన్నావు! ఇటీవల రేడియోలో కూడా పాడుతున్నారట. ఈ వచ్చే పదిహేనవ తేదీని వాళ్ల ప్రోగ్రాము ఉందట. అయినా ఇప్పుడేదో మామూలుగా అందరూ పాడినట్టే ఉండి ఉంటుంది. అందులోనూ వాళ్లు పాడేది శాస్త్రీయ సంగీతంట"

"అదంటే అసలు నీకు తలనొప్పికదూ?"

"నిజమే, అయినా ఈమారు వినాలి. కొత్త అభిమానంతో వింటే ఎలా వినిపిస్తుందో?"

"ఎలా వినిపిస్తుందా? [illegible] పెట్టుకొని చూస్తే ఎలా కనిపిస్తుందో అలా వినిపిస్తుంది."

"పోనీలే ఎటువంటి అభిమానాల రంగద్దాలు లేని నిశితమైన వీక్షణం గల నీవంటి వాళ్లు కొందరుంటే చాలదా?"

"భోజనం మానుకొని కూర్చున్నావు. నామీద కోప్పడితే ఆకలి తీరుతుందా? సైలాగనీ, తిన్నన్ని గారెలు, కావలసినంత కాఫీ"

తరువాతి ప్రయాణం ఎటువంటి వాదోప వాదాలు లేకుండా సాఫీగా గడిచిపోయింది. నేను విజయనగరంలో దిగిపోయేను. వాడూ నాతో ప్లాటు ఫారంమీదకి వచ్చేడు. నేను పళ్ళు బేరం చేస్తుంటే ఏదో జ్ఞాపకం వచ్చినట్టు గబగబ బండివంకకు వెళ్ళేడు.

ఇంటికి వెళ్ళగానే తినడానికి బాగుంటా యని వాడికి కొక రెండు మామిడిపళ్ళు ఒక అనాసపండూ ఇచ్చేను. వాడు నామాటే వినిపించుకోకుండా ఏదో రాస్తున్నాడు.

రయిలు కదిలేముందు వాడు నా చేతికి, ఒక మడిచిన కాగితం ఇచ్చి "చెక్కిచ్చేను. ఇక్కడ ఆంధ్రాబేంకులో నాకు ఎకౌంటు ఉంది. నీకు కొంచెం చిక్కయినా రేపు ఉండి, ఇది మార్చి డబ్బు ఇన్స్యూరుచేసి పంపించు."

"ఎవరికి నీకేనా? అంతకంటె నువ్వే ఉండి మార్చుకోకూడదూ? అయినా నువ్వక్కడుండి ఇక్కడ ఎకౌంటేమిటి? అక్కడ బేంకు లేక పోయిందా?"

"ఉన్న ఊళ్ళోకంటె పై ఊళ్ళోనే మేలని వినకటికి నీలాటివాళ్లొకరు సలహా యిచ్చేరే. సరే నామాటకేమి. డబ్బు పంపించవలసింది నాకు కాదు, ఆవిడకు"

"ఆవిడా? ఎవరు?" నాకేమి వెంటనే స్ఫురించ లేదు."

"ఆవిడ కావేరమ్మ"

"కావేరమ్మకాదు కృష్ణవేణమ్మ ఆవిడపేరు. నిజంగా కావ్యశూరుడి లక్షణం ఇది. నాలాగ వట్టి కబుర్లతో మేడలుకట్టి ఏంలాభం? నువ్వుచేసిన మంచి పనుల్లోకల్లా..." రయిలు కూసింది.

వాడు ఏదో మరిచిపోయినట్టుగా రయిలు నడుస్తూ ఉండగా "నాసంగతి ఏమీ ఎత్తకుండా నువ్వు పంపినట్టే పంపాలిసుమా" అన్నాడు.

"నీ కిష్టంలేకపోతే అనామతుగా అయినా పంపిస్తాను గాని నా పేరు పెట్టుకొంటానా? అంత అక్రమకీర్తి కాంక్ష నాకులేదు." మాట చివరిభాగం, వాడి బండి దూరం అయిపోవడంవల్ల నాలో నే నే అనుకొన్నట్టయింది. అయినా మరెవరో కొందరు ప్రయాణీకులకు వినిపించి ఉంటుంది.

చెక్కు చూడక మునుపు వందకి తక్కువ ఉండదని అనుకొన్నాను. దీపం వెలుగులో రెండు కనిపించేసరికి రెండువందలనుకొన్నాను. కాని, ఏమిటి ఒక సున్నా గాని ఎక్కువ పడలేదుకదా? ఊహుఁ అక్షరాలా స్పష్టంగా రాసిఉంది. సందేహంలేదు. రెండు వేలే!! నిన్న నేను నమ్మలేకపోయాను. మళ్ళీ మళ్ళీ జాగ్రత్తగా చూసి చెక్కుమడిచి లోపలి జేబులో పెట్టుకొని, కూలిమనిషి నెత్తిని పెట్టె హోల్డాలు పెట్టి ఓవర్‌బ్రిడ్జి ఎక్కుతూ ఉంటే అప్పుడు స్ఫురించింది. దీక్షితులు భార్యపేరు కావేరి అని. వాడు కావేరి, దేవేరి అని ప్రాసమహా గొప్పగా కుదిరిందని అంటూ ఉండడం జ్ఞాపకం వచ్చింది.

నాకు తెలియదుగాని, ఇందాకా నేను చెప్తున్నంతసేపూ వాడికి తెలిసేఉంటుంది నేను కృష్ణవేణమ్మ అని అంటున్న మనిషెవరో. లేక కేవలం వాడు పొరపాటున, రెండూ నదులపేరే కాబట్టి, ఒకపేరుకి బదులు ఇంకొకటి అన్నాడేమో? ఏమయినా వాడుచేసిన సహాయం చాలా ఉచితమైనది. ఇందువల్ల బేంకులో ముప్ఫై నలభై వేలున్న వాడికి ఏమీ కష్టంలేదు, కాని వాళ్ళకు కలిగే సదుపాయము మాత్రం చాలా విలువయినది. కేవలం నా మాటలనుబట్టి తనకు ఏమీ తెలియకపోయినా కష్టదశలో ఉన్న ఒక కుటుంబానికి సహాయం చెయ్యడం గొప్పదే. కానీ, ఆవిడే నిజంగా అతని లేచిపోయిన భార్య అయిఉండి, ఆ సంగతి తెలిసికూడా వాడీరకంగా సహాయం చేసిఉంటే అది మరీ గొప్ప విషయం కాదూ?

ఊహుఁ సందేహం లేదు. నా చెల్లెలు కూడా ఒకటి రెండుసార్లు, "ఆవిడ పెదంతా చాలా పెదగాథ ఉందిలే అనడం జ్ఞాపకం. అయితే తగిన కుతూహలం లేక తెలుసుకోలేదు. అసలు, దీక్షితులు అక్కడ ఆమెను ప్లాటుఫారంమీద చూసేడేమో? చూస్తే మాత్రం, ఆవిడ మొదటినుండీ కృష్ణవేణమ్మే అయి ఉంటే?—ఏమయినా సరే, నా మిత్రుడి కవిత్వం అక్కడ కాకపోయినా ఇక్కడ ఈవిధంగా ఫలించవలసిన యోగం ఉంది కాబోలు. నా ప్రయాణం పూర్తిగా వ్యర్థం కాలేదు. నాకంతే చాలును.

తెనుగు ఛందము - దేశిరచన

★

శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మ

తెనుగునకు సహజమగు ఛందమేది అను ప్రశ్న తొలుత తేలికగా తోచినను, విచారించి ఆలోచించినచో ఎంతయు బలీయమైనది. ప్రాజ్ఞన్నయ యుగమందలి ఆంధ్రవాఙ్మయ స్వరూపము చాలవరకు విమర్శకుల యూహలమీదనే ఆధారపడి యుండుట వలనను, తరువాతి వాఙ్మయము సంస్కృతమునుండి ఎరవు తెచ్చుకొనిన వివిధవృత్తములతో కూడియుండుట చేతను పై ప్రశ్నకు సమాధానము అంత తేలిక కాదు.

ముద్రిత వాఙ్మయముపొంతపోక, ఉబుసుపోకకును ఉత్సాహమునకును చేలగట్టులను, జీవిత వ్యాపారమునకును పాడుకొనుచుండు జానపదుల గీతములను, పిచ్చుకుంటలయు బిచ్చగాండ్రయు పదములను, నవీన నాగరికత అంటని స్త్రీలపాటలను పరిశీలించినచో అవి యన్నియు ద్విపదలుగను వాని భేదములుగను చూపట్టును. ప్రాచీనాంధ్ర సారస్వతము కూడ చాలవరకు గేయరూపమై, పల్లెవారియు పాటగాండ్రయు హృత్కీలలపై ఉండియుండునని విమర్శకుల యూహయము. ఆ యున్నది జానపద గీత సరణినిబట్టి ఆలోచించినచో తొంబది తొమ్మిది పాళ్లు ద్విపద రూపమున నుండియుండునని గుర్తింప వీలగుచున్నది. ఇప్పటికి లభించిన తెనుగు శాసనములలో మొదటిదియు, క్రీ. శ. 770 ప్రాంతము లోనిదియు అగు అద్దంకి శాసనము:

"పట్టంబు గట్టిన ప్రథమంబు నేండు
బలగర్వ మొప్పంగ బైలేచిసేన."

ఆదిగా ద్విపద రచనలో నున్నది. తరువాతి వాఙ్మయములో చూపట్టెడి ఆటవెలది తేటగీతి మొదలగు దేశీయచ్ఛందములు చిన్న చిన్న మార్పులతో ద్విపదలుగా మారును.

"ఆంధ్రదేశమున దేశిరచన లంతగా కానరావు. తెనుగునకు తోడి భాషయగు ద్రవిడభాషలో దేశిరచన లెన్నేని గలవు. పూర్వులు పౌరాణికములైన ఆర్యకథలమీదను, సంస్కృత ఛందస్సుమీదను అభిమానము కలవారై దేశీయేతివృత్తమును దేశీయ ఛందమును దేశిభాషను చిదుగ్రొక్కిరి. నేడు మనము స్త్రీ పాటలని గేయరచనములని అనాదరముతో జూచు పదరచనముల వంటివే ద్రవిడభాషలోని ప్రౌఢకావ్యములందలి వృత్తములుగా నున్నవి. ఆంధ్రలోకము నాల్కలపై నాట్యమాడుచున్న పాటలు పదాలు మున్నగు దేశిరచనలు నాటికి తొంబదివంతులు ద్విపదలును తద్వికారములునై యున్నవి." బసవపురాణ పీఠికలోని పై వాక్యములు నా యూహను మరికొంత ఉజ్జీవింపజేసినవి. కాగా, సంస్కృతమునకు అనుష్టుప్ ఛందమువలె, ఆంధ్రమునకు ద్విపదచ్ఛందము ఆదియు సహజము అని నిర్ణయింప వీలగుచున్నది.

ఏ సారస్వతములోనైనను పద్యకవిత్వముకన్న పదకవిత్వమే ముందు పుట్టి పెరుగును. కాని, ఛందోవ్యాకరణాది నియమములు, ప్రౌఢమగు శైలి, ఇతివృత్తౌదార్యము, విజ్ఞానబోధకత్వము మున్నగు వివిధములైన కవితాంగములను సంతరించుకొని, పద్యకవిత్వము ప్రౌఢసాహిత్యమను పేరుతో నాగరక లోకమందు ప్రతిష్ఠ సంపాదించుకొనును. పదకవిత్వము ఎంత సహజమనోహరముగను నిరాడంబరముగను ఉన్నను ప్రౌఢవాఙ్మయములో ప్రవేశింపలేక, గాలిలోనే పుట్టి గాలిలోనే పెరుగుచు, పామరజనాశ్రయమై పుట్టుకబలిమినిబట్టి కొంతకాలము సజీవముగా ఉండును. ఇదే మన సారస్వతములో శుద్ధదేశికవిత్వ మనిపించుకొన్న శాఖ. దీనికి కూడ నాగరక లోకములో సారస్వత ప్రతిష్ఠ సంపాదించుటకు ప్రయత్నించినవారే ద్విపద కావ్యకర్తలు. వీరు చదువదగిన పద్యకవిత్వముపట్ల ఒక కంటిని, పాడదగిన పదకవిత్వముపైని రెండవ కంటినీ ఉంచి, ఉభయగుణములను ఏకము చేసి, జనసామాన్యమునకు కూడ ఆస్వాదనీయముగా నుండునట్లు పాకము చేసిన రసాయనమే ద్విపద కవిత్వము.

తెనుగున తొలుకొల్త దేశీయమైన రచన వెలయించిన మహానుభావుడు ద్విపదవాఙ్మయ గంగావతరణమునకు భగీరథుడనదగిన పాల్కురికి సోమనాథుడు. ఆకాలపు సంస్కృత పండితులు తీసడించినను లెక్కచేయక, "ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ—పూరిత సంస్కృత భూయిష్ఠ రచన" సర్వసామా

న్యము కాదనియు, జాను తెనుగు మిక్కిలి ప్రసన్నముగా నుండుననియు తెలచి, రెండే రెండు జాతి రత్నములు సావలుదీర్చి ఆంధ్ర సరస్వతి కర్పించినాడు. సులభమైన గణనియమము గలదవి ద్విపదను చిన్నచూపు చూడదగదనియు, సర్వసామాన్యము గుట దాని కొక విశేష గుణమనియు, తిద్దదన గద్యపద్యోదాత్తకృతులకు రవంతేని తీసిపోదనియు, కావ్యగౌరవమును పోషించునది దోషరాహిత్యమును గుణసాహిత్యమును గాని, ఛందఃప్రయాసాతిశయము కాదనియు తనకాలపు మార్గకవులను హెచ్చరించినాడు కూడ.

నాటినుండియు ద్విపదరచనల యందలి ప్రసన్నతను సార్వజనీనతను పలువు రాంధ్రకవులు పసికట్టిరి. పలుతెరగులగు దేశిరచనలు వెలయించి సోమనాథున కనుయాయులైరి. వారిలో కాలమునుబట్టియు కవితను బట్టియు తొలుత పేర్కొనదగినవాడు గోనబుద్దారెడ్డి. అమూలాగ్రము తేట తెనుగు రచనలో అవతరించిన ఈతని రామాయణము, నేటికిని కొన్ని ప్రాంతములందు నిత్యపారాయణ గ్రంథమైయున్నది. సోమనాథుడు నిర్మించిన ద్విపదవాఙ్మయ రంగములో ప్రధాన—అన్యతమ పాత్రలు వహించినవారు చిన్నన గౌరనలు. వీరి అష్టమహిషీ కల్యాణ హరిశ్చంద్రోపాఖ్యానములు తెలుగుతల్లికి వెలలేని సొమ్ములు. వీనియందలి పదసారళ్యము, సుప్రసన్నమగు శైలి, అతిశయోక్తులకు అభూత కల్పనలకు తావీయని రచన, పలువురను ద్విపదకావ్య రచనకు పురికొల్పినవి. కట్టా వరదరాజు 1 రామాయణము, తేకుమళ్ల రంగశాయి 2 ద్విపద భాగవతము, చెన్నభట్టారకుని 3 అభిమన్యు కల్యాణము మొదలగునవి ఈ జాతికి చెందిన దేశిరచనలే.

ఇవిగాక, సులభమగు శైలిలో, జాను తెనుగు కూర్పులో దేశియోగవృత్తములో పైవానికి తీసిపోకుండుటయే గాక, కొన్నిపట్ల వానికన్న మిన్నయనిపించుకొనదగిన ద్విపద రచన లెన్నియో ఇంతవరకును అముద్రితములై యున్నవి. వానిలో ప్రధానముగా పేర్కొనదగినది 'పల్నాటి వీరచరితము'. హైందవుల శౌర్యపరాక్రమ సాహసములను వెల్లడించుటకు మనకుగల పారిశ్వతి సాధనములలో ఆర్యులవాటి భారతగాథ యెట్టిదో, ఆంధ్రులవాటి పలనాటి వీరచరిత మట్టిది. దాని కిది తెనుగు ప్రతిబింబమన్నను అతిశయోక్తి కానేరదు. యుద్ధతంత్రముల తీరివి పనక భారతవీరులే మరల పలనాట నవతరించిరనియు, భారతగాథయే తెనుగు తీరు నలవరించుకొని ఆంధ్రావనిపై రూపాంతర మందినదనియు కొందరందురు. ఐన కావచ్చును. అట్లనుటలో వింతేమియు లేదు. ఏమన, రెంటిటను జ్ఞాతివైరము; అది కారణముగా అందు జూదము, ఇందు కోడిపందెము. పణముగా వనవాసము; ఇందును అందును గోగ్రహణము, అరణ్యవాసానంతరము ఉభయత్ర రాయబారములు, అవియు విఫలమగుట. కాగా రణసన్నాహములు.

బ్రహ్మనాయడు, ధర్మస్వరూపుడగు రెండవ అజాతశత్రువే. బాలచంద్రుని పాత్ర, మూడుమూర్తుల అభిమన్యునే తలపునకు దెచ్చును. మాంచాల, వీరాంగనయగు ఉత్తరయపరావతారము. నాయకురాలు దుర్యోధనను కపటతంత్రము నెరపుటలో శకునిని మించిపోయినది. ఈ మొదలగు ఉభయ సంవాదముగల విషయములను పాత్రలను పట్టిచూచినచో, పై యూహయు సరియైనదేమని వినుదీయ నక్కరలేదు.

ఏవం విధగుణమహితమైన వీరగాథకు గుంటూరు మండలమునందలి పలనాటి సీమ పుట్టినిల్లు. దీనిని తొలుత ద్విపద కావ్యముగా సంతరించిన మహానుభావుడు శ్రీనాథుడు. ఈతని రచన వెలసినతరువాతనే, పినమొల్లయ మున్నగువారు, ఆ గ్రంథమును ఊతగా గొని పద్యకావ్యములు వ్రాసిరి. పలనాటి భాగవతముగూడ వీని ననుసరించునదే. అసలు ఈ గ్రంథములు తలయెత్తుటకు పూర్వమునుండియు, అనగా ఆయా గాథలు ప్రవర్తిల్లిన నాటినుండియు, ఈ వీరగాథ, 'కోటమరాజుకథ', 'కోడిపందెము', 'బట్టు రాయబారము', 'బాలచంద్రుని యుద్ధము', ఆదిగా ఎన్నియో పేరులతో పాటలుగా పదములుగా తెనుగుపల్లెవారి నోట, నానాట నలుగుచు, ఆంధ్రదేశమున వ్యాప్తిలో నున్నది. ఉత్తరాంధ్రమున బొబ్బిలి పాట యెంత వ్యాపించియున్నదో, దక్షిణాంధ్రమున పలనాటి పదము అంత ప్రచారములో నున్నది. అట్లని, వారిది గాని, వీరది గాని యెరుగరని కాదు ఈ మాటలోని పరమార్థము. ఇది వానివాని విశేష ప్రచారమునుగూర్చి ఉగ్గడించుట మాత్రమే.

1. మద్రాసు గవర్నమెంటు ఓరియంటల్ లైబ్రరీ వారిచే ప్రకటితము.

2. 3. అముద్రితములు.

శ్రీనాథుని పలనాటి వీరచరిత్రములోని బాలచంద్రుని యుద్ధఘట్టమును కీ. శే. శ్రీ ఉమాకాంత విద్యాశేఖరులు చిరకాలము క్రిందట వెలయించిరి. అందు ఇరు తెగల రచనలు కలిసిపోవుటయే గాక తప్పులు కుప్పలుగా నిలిచిపోయినవి. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమునందు 'కాటమరాజు చరిత్ర,' 'బట్టురాయబారము,' 'ఎఱ్ఱగడ్డపాటి పోటాట,' అదిగా వేర్వేరు భాగములు కలవు. ఇవి తొలుత సరియైన ద్విపదరచనలో ఉండి, తరువాత పామరులకు పాటకుల నోళ్ళలోపడి చెడిపోయి యుండునని వ్రాతనుబట్టి తెలియుచున్నది. పైవానిలో కాటమరాజుచరిత్ర నిర్దుష్టముగను సరసరచనముతోను గలదు. పలనాటివీరచరితతో సంబంధించిన పైగ్రంథభాగములలో దేనిని పరికించినను 'ఆంధ్రము' 'ఆంధ్రత' అనునవి అనుపదమును పరిస్ఫురించుచుండును. ఇట్టి అమూల్యములగు దేశి రచనలెన్నియో తాళపత్రగ్రంథాలయములయందు మరుగుపడియున్నవి.

అటు తంజావూరి సరస్వతీ మహాలు నొక్కసారి దర్శించినచో, అచట ఎంతయో కాలమునుండి సురక్షితములైయున్న దేశిరచన లెన్నియో కన్నుల పండువుసేయును. తంజాపుర నాయకులు దేశిపాలనము ననుసరించియే గాక భాషాపోషణము నెడను దక్షిణనాయకులై ప్రసిద్ధికెక్కిరి. వారి ఆస్థానరంగములందు ఆంధ్ర సరస్వతి ద్విపదకావ్యములు, యక్షగానములు, పదరచనలు మొదలగు పలుతెరగులైన దేశివాఙ్మయ రూపమున అవతరించినది. వీనిలో ఏయొక గ్రంథమును పరిశీలించినను వెన్నెల తేటవంటి శైలి, దేశీయమగు ఇతివృత్తము, జాతీయమగు పదరచన పొడకట్టుచుండును. వీనిలో ముఖ్యముగా పేర్కొనదగిన పెద్దగ్రంథము ద్విపదభారతము. ఇది అపర కవిత్రయకర్తృకము. దీని జన్మస్థలము నెల్లూరు మండలము. ఏ మూడువందల యేండ్ల క్రిందటనో ఆంధ్రావనిపై పుట్టి పెరిగి, ఏ కారణముచేతనో దక్షిణదేశమునకు వలసపోయి, తంజావూరి సరస్వతీ మహాలులో అజ్ఞాతవాసము చేయుచున్న ఈ తెనుగు బిడ్డను, ఇటీవలనే ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు చేరదీసి సంస్కరించి ప్రకటించిరి. తక్కినవియు అచిరకాలములో వెలువడు భాగ్యము కలుగుగాక.

గ్రంథస్థములైన పై రచనలు గాక, తుమ్మెద పదములు, ప్రభాతి పదములు, ఏలపాటలు మున్నగు దేశీయవాఙ్మయ మెంతయో నాగరికప్రదేశములందు తావు లేక, తెలుగునాట పల్లెటూరి పామరజనుల నాల్కలయందు తలదాచుకొని యెట్లో కాలము గడపుచున్నది. వానికి రచయిత ప్రకృతియే; ఉత్సాహపూరితములగు పల్లెపడుచుల హృదయములే వాని ఆవాసములు; దేశీయములగు కేటతెనుగు పదముల కలయికయే వాని మూర్తి; తరచి చూచినచో వానియందలి భావములు ప్రతిపద మనోహరములు. ఇట్టి దేశీయమగు సారస్వతమంతయు గాలిలోనే పుట్టి గాలిలోనే పెరుగుచున్నది. ఎన్నియో వందల యేండ్లకు పూర్వము, అనగా మార్గకవిత తలయెత్తకమున్నే ఆంధ్రావనిపై ఆవిర్భవించి, నేటిదనుక దానితో సమానముగా పెంపొందుచున్న మన దేశివాఙ్మయములో ఇంతవరకు పదవవంతు గూడ ముద్రితము గాక నిగూఢముగా నిల్చిపోవుటచే ఆంధ్రవాఙ్మయమునకు రాదగిన పెంపు రాకుండుటయే గాక యొక భాగము చచ్చుపడినట్లున్నది.

అన్ని విధముల దేశీయత ఛిద్రపరచుకొనదగిన ఈ రోజులలో, ఏనాడో మన పూర్వులు సంపాదించియుంచిన దేశి వాఙ్మయమంతయు మూలముట్టుగా సేకరింపబడి తగిన సంస్కారముతో ప్రకటిత మగుట ఎంతయు ఆవశ్యకము.





నవల:

శాఫో

★

ఆల్ఫాంజ్ డాడె(ట్)

11

పరిస్థితి నెల్లా సరిదిద్దుకోవాలో ఏం చేయాలో ఇంకా ఏదీ అతను నిశ్చయం చేసుకో లేకముందే ఒకనాడు ప్రొద్దున్న ఆఫీసు కెళ్ళేటప్పటికి ఎవరో పెద్దమనిషి జీన్ కోసం అప్పుడే ప్రొద్దున్న రెండు మాట్లు వచ్చివెళ్ళినట్లు పారా జవాను కబురు చెప్పాడు. బల్లమీద విజిటింగ్ కార్డు కనిపించింది. జవాన్ వచ్చిన వ్యక్తివిషయం అతిగౌరవంగా మాట్లాడుతున్నాడు. కారణం కార్డు చూస్తే తెలిసింది.

> సి. గాసిన్ డి ఆర్మండీ
> రోన్ లోయ కృషికసంఘ అధ్యక్షుడు
> కేంద్రపరిశోధకసంఘ సభ్యుడు
> జిల్లా ప్రతినిధి-(ఇత్యాది)

పారిస్‌లో సిజేర్ బాబాయ్! పోకేలా జిల్లా ప్రతినిధి, కేంద్రపరిశోధక సంఘసభ్యుడూనా! ఆ ఆశ్చర్య విభ్రమావస్థలోనుంచి జీన్ తేరుకోనే లోపలే, సిజేర్ స్వయంగా ప్రత్యక్షమయాడు. అదే చామనఛాయ, ఆ పిల్లిగడ్డం, కళ్ళల్లో పట్టిసంతోషం మొగమంతా నవ్వులో ముడతలు, ఎప్పటి రూపంలోనే ఖులాసాగా ఉన్నాడు. ఎప్పుడూ వేసుకొనే పొట్టి జంపఖానా కోటు బదులు, బొజ్జను నిండుగా ఆవరిస్తూన్న లాంగ్ కోటు తొడుక్కొని, ఆ దుస్తుల్లో అసలు అధ్యక్షపదవి ఠీవితోనే కనబడుతున్నాడు.

పారిస్ ఎందు కొచ్చాడా? ఎందు కేమిటి, కొత్త ద్రాక్షతోటలముంపు సాగుపనికి "మోటార్ పంప్" కొందామని వచ్చాడు. ఆ "మోటార్"అన్న మాట అతిగంభీరంగా, తన ప్రతిష్ఠ పదిరెట్లు పెరిగిన ఠీవితో అంటున్నాడు. అదీకాకుండా మరో పని కూడా ఉంది. తమ మాగాణి కృషికసంఘ సభ్యులంతా, సంఘ అధ్యక్షుడుగా తన శిల్పవిగ్రహం, కమిటీ హాలులో పెట్టాలని పట్టుబడుతున్నారు. ఆ విగ్రహం చెక్కించేందుకనికూడా పారిస్ వచ్చాడు. అవి,కృతకవినయంతో మాటసాగించాడు. "చూశావ్, నన్ను మనరైతులంతా 'సంఘ అధ్యక్షుణ్ణి చేశారు కదూ! మరి మనముంపు సాగు పద్ధతి, దక్షిణాదిసంతా పాకిపోతుందిగా! అరే ఫ్రాంసు ద్రాక్షతోటలను, సేన, పోకేలాను, రక్షించగలగటం కలలోనైనా అనుకొనే సంగతేనా! వేపకాయంత వెఱ్ఱి ఉండటంకన్నా అదృష్టం లేదంటూనా, ఏమంటావ్"

అన్నిటికన్నా అతని ఈ ప్రయాణం ముఖ్యోద్దేశం, ఫానీ్ని నుంచి అతన్ని విడకొట్టడం. ఇదిఇల్లాగే మరీ వానుకుగా తయారవుతోందని, తనుకూడా కొస్త సాయం చేద్దామని వచ్చాడు. "నే చెప్తావిను. ఈవిషయాలలో నాకు బలే ప్రవేశం ఉంది. ఏంచెయ్యాలో అంతా నాకు తెలుసునుగా! కార్బొనేపీకి పెళ్ళి కుదిరి, పాత కొత్తా వదిలేద్దామనుకొన్నప్పుడు..." అంటూ ఆ కథ ప్రారంభించబోయి అంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్టు, ఆవిషయం ఆపి, కోటు విప్పుతూ, లోపలిజేబులోనుంచి బరువైన తోలుపర్సు బైటికి తీశాడు. "ముందిది నాదగ్గరనుంచి తీసుకో! ఔను డబ్బే—ఈ బాదరా ఓదిలిపోనీ ముందు" అని జీన్ వద్దనటం మొగమాటంగా భావిస్తూ "అహా! తీసుకో!ఊ! పుచ్చుకో! నీతండ్రి నాకు చేసినదానికి, కొడుకుకైనా కొంత ముట్టచెప్పాలని, నన్ను గర్వపడనియ్యవోయ్. ఏమైనా, దివోనీ నీకిమ్మని మరీ మరీ చెప్పింది. ఇక్కడి విషయాలన్నీ ఆవిడకు తెలిసాయి.

నువ్వు పెళ్ళిచేసుకో తలచావనీ, ఆ చెకిపె పిడికిలి నుంచి బైటపడుతున్నావని చాలా సంతోషిస్తోంది" అన్నాడు.

ఫాన్నీవల్ల అంతటి ఉపకారం పొందాక సిజేర్ ఆమెను స్మరించి, "ఆ చెకిపె పిడికిలినుంచి" అనటం, ఏమంత న్యాయంగా లేదని జీన్ కనిపించింది. జవాబు చెప్తూంటె ఆ వ్యగ్రత కంఠంలో ధ్వనిస్తోంది.

"పర్సు జేబులో పెట్టుబాబాయి. డబ్బు విషయాలు ఫాన్నీ లెక్కచెయ్యదని అందరికంటే నీకే బాగా తెలుసును కదా."

"ఔను నిజంగా, పాపం మంచిదేరా" అంటూ విషాదకంఠంతో, ఎవరో మృతబంధువును గూర్చి అంటున్నట్లుగా అన్నాడు సిజేర్ — అని తీవ్రంగా చేకన్ను చికిలిస్తూ, "అయినా డబ్బు నీ దగ్గిరే ఉంచు! ఈ పారిస్ టక్కుటమారాలలో ఈడబ్బు నా దగ్గిర ఉండటంకంటే నీదగ్గిర ఉంచటమే క్షేమం. అదీకాకుండా, ఆపెణ్ణి వదుల్చుకునేటప్పుడు, డబ్బు చాలా అవసరంకూడా" అన్నాడు.

అక్కడి కాపి, ఆకలితో సగం చచ్చిఉన్నానని చెప్పి, అసలు విషయం, ఆలోచించటానికి భోజనం చేస్తూ తీరుబడిగా చర్చించుకోటం మంచిదని, చెప్పాడు.

కూడి బోర్గాగ్న హోటలులో భోజనాలు సాగిస్తూ చర్చించుకొంటున్నారు. జీన్ కాస్త కాస్త కతుకుతున్నాడు. కడుపు బిగదీసుకుపోతున్నట్లుంది. సిజేర్ బాబాయి మెడక్రింద రుమాలు అమర్చుకొని రెండు చేతులా ఆరగిస్తూ నోట్లో ముద్దలతోనే అంత కంఠతకూ ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు.

"మరలో మనమాటరా, అబ్బాయి. ఈ విషయంలో నువ్వు మరీ అనవసరంగా బాధపడుతున్నావ్. మొదటి దెబ్బ చాలా ఘాటుగానే తగుల్తుందనీ, ఆ వదుల్చుకోటం అంతా పీడగా తయారవుతుందనీ, నాకూ తెలుసనుకో! అయినా నీకు నువ్వు చెయ్యలేనంటే, నువ్వేం మాట్లాడకు. అచ్చంగా కొగ్బజేసి చేసినట్లు చెయ్యి. పెళ్ళి ముహూర్తం అయేదాకా, లామోర్నాకు ఏవిషయం చెప్పకుండా ఉంచేశాడు."

అంటూ తనపూర్వస్నేహితుడు కొగ్బజేసి, లామోర్నాను ఎల్లా వదుల్చుకొందీ, తను ఎల్లా సాయం చేసిందీ అంతా వివరించసాగాడు. లామోర్నాలాంటి గయ్యాళిగంపతో వ్యవహరించాల్సి వచ్చినప్పుడు ఉచ్చనీచాలు పాటించకుండా, ఉపాయంవల్ల నెగ్గుకురావాలంటూ, మిత్రుని కృత్రిమ దర్యలనన్నిటినీ చెప్పి సమర్థించాడు.

ఆ పెళ్ళియిందువాడు సెలవురోజు. ఆవేళ సిజేర్, లామోర్నాను, పల్లెటి దిక్కుకు బోటు షికారు పోదామనీ, కొగ్బజేసి తర్వాత వచ్చి తమను కలుసుకొంటాడనీ మర్నాడు ముగ్గురూ కలిసి పారిస్ రావచ్చుననీ చెప్పి తీసుకెళ్లాడు. ఆసాయంత్రం నదిలో ఇద్దరూ ఈతలాడారు. ఆ అమ్మనిచూస్తే అప్పుడతనికి వలపుపుట్టుకొచ్చి చిలిపిచేష్టలు ప్రారంభించాడు. కాని లామోర్నా తీవ్రంగా అతన్ని వారించింది. రాత్రి భోజనాలు ముగించారు. కొగ్బజేసి రానందుకు లామోర్నా, రాత్రికి కొంచెం చిరాకు పడింది. ఆ రాత్రి సంతోషంగా గడుపుదామనుకొంది. పోనీ నేనున్నానుగా అంటూ సిజేర్ ఆమె నడుంచుట్టూ చేతులు వేశాడు. ఈమాటు లామోర్నా పకపకా పగలబడి నవ్వసాగింది. అతన్ని "అల్పకాయుడవంటూ" ఈసడించి నవ్వటం మొదలు పెట్టింది. సిజేర్ కోపం బిగబట్టుకోటం బ్రహ్మాండమయిపోయింది. "విశ్వస్త" అని అనేద్దామనే అనుకొన్నాడు. కాని బిగబట్టుకొన్నాడు. మర్నాడు ప్రొద్దున్న ఫలహారాలు చేస్తూంటే కూడా ఆమె ప్రియుడికోసం ఆత్రంతో చిరాకుగా ఉంది. కాలం గడిచిపోతోంది ఎంతసేపటికీ కొగ్బజేసి రాడు. చివరికి సిజేర్, తృప్తహాసంతో జేబులో గడియారం తీసి ప్రశాంతంగా అన్నాడు.

"మధ్యాహ్నం అయింది. అయిపోయిందన్న మాట."

"ఏమిటి అయింది"

"పెళ్ళి చేసుకొన్నాడు"

"ఎవరూ?"

"కొగ్బజేసి"

ఫటేల్!

"అబ్బ! ఏం దెబ్బ కొట్టిందిరా! గూబ కదిలిపోయింది! నా శృంగార జీవితంలో అంత దెబ్బ ఎప్పుడూ తినలేదనుకో. తర్వాత వెంటనే పారిస్ బయల్దేరాలని కూర్చుంది! కాని సాయంత్రం వాళ్ళింటికా కా రైలు లేదు. ఈలోపల అక్కడా పెళ్ళికొడుకు పెళ్ళాంతో కలిసి ఇటలీ ప్రయాణంలో ఉన్నాడు. అక్కడితో మళ్ళీ మండిపడి నామీద విరుచుకుపడింది. కలబడి నన్ను ఒళ్లంతా రక్కి, బరికి కొరికి, చివరికి చేతికందిన పళ్ళాలూ కప్పులూ అన్నీ మొహాన్న విసిరికొట్టింది. అక్కడినుంచి పత్రికలు

మూర్ఛలు మొదలెట్టింది. మనిషిని పట్టుకోటానికి అయినవారికి సాధ్యం కాలేదు. నేను ఒళ్లంతా రక్కులతో చైటపడి ఆకలి కడుపుతో, ఆ మండు టెండలో డాక్టరుకోసం పొరుగూరికి బయలుదేరాను. డాక్టరుతో తిరిగి హోటల్‌కు వచ్చేటప్పటికి చీకటి పడింది. హోటల్ సమీపిస్తూంటేనే పెద్ద కోలాహలం వినిపిస్తూంది. కొంపదీసి ఆత్మహత్య చేసుకొందా, లేక ఇతరుల నెవళ్లనన్నా హత్య చేసిందా అని భయపడ్డాను. లామోర్నా అల్లాంటి రకమే లే! కాని తీరా చూస్తే ఏమయింటంటావ్! హోటల్ అంతా లైట్లు వెలిగిపోతున్నాయి. లామోర్నా బాల్కనీలో నిలబడి, ఉల్లాసంతో గొంతెత్తి పాటలు పాడుతూంది. క్రింద రోడ్డుమీద జనం మూగి తాళం వేస్తూ హుషారిస్తున్నారు.

"విన్నావురా! కొద్దిరోజుల ప్రేమ వ్యవహారం అల్లా ఫైసలైపోయింది. అంతా ఒక్క దెబ్బని తేలికగా అయిందనటం లేదు. పది నెల్లు సంకెళ్లు తెంచుకోనే టప్పుడు కాస్త జాగ్రత్తపడక తప్పదు. కాని ఆ మోత అంతా నేను భరించాల్సి వచ్చింది. నువ్వు కావాలంటే, నీ విషయంలో కూడా భారమంతా నామీదే వేసుకొంటాను."

"లాభం లేదు, బాబాయి. ఫాన్నీ అల్లాంటి స్త్రీ కాదు."

"పోరా చెప్పావ్! దాన్ని నీకు మందర ఎందరు వదిలిపెట్టలేదూ" అంటూ చుట్ట ముట్టించాడు సిజేర్.

"ఔను! ఆ మాటా కొంత నిజమే."

కొన్ని నెలల క్రిందట ఏ విషయం తనను గాఢంగా బాధించిందో, అదే సంతోషంతో ఇవాళ అపరాగా తీసుకోదల్చుకొంటున్నాడు జీన్. అసలు, ఆ బాబాయి, ఆయన చెప్పిన వికట కథ అతనికి కొంత నిబ్బరం ఇయ్యసాగాయి. కాని, నెలల తరబడి అల్లా ఇద్దరు స్త్రీలనూ మోసం చేస్తూ గడపటం అతనికి చేతకాని విషయం. అయినా ఇప్పటికే వ్యవహారాన్ని చాలావరకు క్రమబద్ధం చేసుకొన్నాడు.

"ఔను మరిప్పుడు ఏం చెయ్యదలచుకొన్నావ్?"

జీన్ సందేహస్థితిలో కొట్టుకొంటున్నాడు. ఆ బాబాయి మాత్రం తీరుబడిగా గడ్డం నిమురుకొంటూ, వివిధ భంగిమలలో మొగంలో చిరునవ్వు అమర్చుకోటానికి ప్రయత్నిస్తూ, తల అటూ ఇటూ వంచి పరిశీలించుకొంటూ అద్దంముందు కూర్చుని యాదాలాపంగా అడిగిన ట్టడిగాడు.

"అతను ఉండేది ఇక్కడకు చాలదూరమా."

"ఎవరూ?"

"అతనే, ఆ శిల్పి, కౌడెల్ అంటూ చెప్పేవాడివి, అతనే. వాప్రతిమ చెక్కించాలిగా! ఇద్దరం ఉండగానే కాస్త కలిసివెళ్లి, అతను బొమ్మ చెక్కటానికి ఏం తీసుకొంటాడో కనుక్కుందా మనుకొన్నాను."

బాగా పేరు ప్రతిష్ఠలు సంపాదించాక కూడా, వస్తుతః దుబారామనిషి అయినప్పటికీ, కౌడెల్, పేరులోకి వస్తూన్న మొదటి వాళ్లలో పనిచేసిన నాటి, రూడి అవ్వాన్‌లోని తన స్టూడియో అట్టే పెట్టుకొన్నాడు. ఇద్దరూ కలిసి అక్కడికిపోతుండగా, ఈ శిల్పి ఎల్లాంటివాడో, కాస్తకేతైన వాడౌనో కాదో—ఎందుకంటే ప్రతిమ చాలా చక్కగా ఉండాలని కమిటీవాళ్ళంతా పట్టుపడుతున్నారు—శిల్పులలో కౌడెల్ అంతస్థు ఏమిటో, అన్నీ సిజేర్ వివరంగా అడుగుతున్నాడు.

"కౌడెల్ గనుక ఒప్పుకొంటే, బొమ్మ బాగుండటం విషయంలో నువ్వేం భయపడక్కర లేదు, బాబాయి! కౌడెల్, ఇన్స్టిట్యూట్ సభ్యుడు, "కమాండర్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్, గౌరవ బిరుదమూ, ఇంకోలక్ష విదేశప్రభుత్వాల బిరుదులూ, పతకాలూ కలవాడు."

పోకేలా కళ్లు విప్పారాయి. "మరి వీరు ఇద్దరూ స్నేహితులటరా?" అని ఆశ్చర్యంతో అడిగాడు.

"బాగా మంచిస్నేహితులమే!"

"ఆహా! ఏం, పట్నంరా పారిస్! భలే! ఎల్లాంటి ఎల్లాంటి వాళ్ళతో పరిచయాలు కలుస్తాయో!"

కౌడెల్, ఫాన్నీ పూర్వ ప్రేమికుడనీ, ఆమెద్వారానే తనకు కౌడెల్‌తో పరిచయం కల్గిందని చెప్పుకోటానికి జీన్‌కు మనస్కరించడం లేదు. కాని అబాబాయి ఆ మాత్రం గ్రహించినట్లుగానే అడుగుతున్నాడు.

"అయితే, కాసిలెట్‌లో మన ఇంట్లో శాఫో విగ్రహం చెక్కింది ఇతగాడేనా ఏమిటి! మరి నీ ప్రియురాలితో పరిచయం ఉందన్నమాటా! ఆ వ్యవహారంలో నీకు అతగాడూ సాయం చెయ్యొచ్చనుకొంటాను. ఈ బిరుదులు యివన్నీ ఆడవాళ్ళను ఇట్టే లొంగదీస్తాయోయ్."

జీన్ మాట్లాడలేదు. ఈ ప్రశ్నను ప్రేమికుని ప్రభావాన్ని కూడా కొంత ఉపయోగించుకొందామా అన్న సగం సగం ఆలోచన కూడా ముందు కలిగింది.

బాబాయి, నోటినిండా నవ్వుతూ అంటున్నాడు: "అన్నట్లు, ఆ విగ్రహం ఇప్పుడు మీ నాన్న గదిలో లేదు తెలుసా! నేను ఒకసారి పొరపాటున ఆ విగ్రహం నమూనా మనిషే నీ ప్రియురాలు అని నోరు జారి దిపోనీతో అన్నాను. ఇంక ఆ విగ్రహం అక్కడ ఉండకూడదని పట్టుబట్టింది. కౌన్సెల్ గారి పద్ధతులూ నీకు తెలుసుగా! తన నిత్య పరిసరాలలో, వ్యవహారాల్లో, ఏ చిన్న మార్పు వచ్చినా సహించక పెద్ద గందరగోళం చేసి వదలి పెడతాడాయన. అందుచేత ఆ బొమ్మ ఆయన అజలోకి రాకుండా అక్కడినించి తీసుకెళ్ళటంకూడా మహా కష్టమైన విషయమే అయింది. ఎల్లాగో మరో బొమ్మ, మాన్సీర్ డెగ్నాటి, అక్కడ పెట్టి, మెల్లిగా ఈ బొమ్మని తీసుకెళ్ళి పాత సామాను గదిలో పారేసింది. బొమ్మకూడా నెత్తిమీద సొట్టపడి, తంత్రులు తెగి, మారుమూలని, దుమ్ములో పొర్లాడుతూంది. అసలు దిపోనీకి ఆ మనిషంటే ఉన్న కోపంవల్లే, బొమ్మ దెబ్బ తిందిలే!"

రూడి అవ్వాన్స్ చేశాకొన్నారు. అక్కడంతా వీధ ఆర్టిస్టుల, శ్రమజీవుల, స్టూడియోలు వరుసగా పొడుగ్గా ఉన్నాయి. వాటికి దిగువను బజారునుంచి పిల్లల చదువులఘోష వినబడుతూంది. ఈ వీధిపేట దృశ్యం చూసేటప్పటికి, "మా గాడి పాదుకృషిక సంఘ అధ్యక్షుడు" గారు, ఇక్కడ ఏమంత పెద్ద శిల్పి నివసిస్తాడా అనుకొంటూ నీళ్లు గారుతున్నాడు. కాని కౌన్సెల్ స్టూడియో లోపల ప్రవేశించేటప్పటికి అతనికి మళ్ళీ ధైర్యం కలిగింది.

జీన్, తాను వచ్చిన పని కౌన్సెల్‌తో చెప్పేటప్పటికి కౌన్సెల్ ఒక్క ఉదుటున ఉరిమాడు. "చస్తే చెయ్యను. లక్ష ఫ్రాంకులు కాదు, కదా కోటి ఫ్రాంకులు ఇచ్చినా కూడా చెయ్యను."

అంతా చిందరవందరగా ఉన్న స్టూడియోలో, తక్తుమీద ఈడిగిలబడి పడుకొని ఉన్నాడు. ఆ ఉదుటున ఉరిమి అదాటున లేచి కూర్చుని మళ్లీ గర్జన సాగించాడు. "బొమ్మ చెక్కాలేం! ఔను! ఔనాను! కాని అటు చూడొద్దు! చూడు! అనుగో బొమ్మముక్కలు ముక్కలైపడి ఉంది చూశావా! గచ్చే శిల్పకళా పరిషత్ప్రదర్శనానికని నేను చెక్కుతూన్న బొమ్మ! ఇప్పుడే సుత్తితో ముక్కలు ముక్కలు చేసేశాను. ఇప్పుడు విగ్రహాలతో నేను చేస్తున్న పనల్లా అదే! ఎంత అందగాళ్లయినా, ఎంత ఆకర్షణీయ రూపులైనా, శ్రీయుతే..."

"గాసిన్ వడి ఆర్మండీ, అధ్యక్షుడు —" అంటూ తన సేదదీర్చుకొని తన బిరుదావళిని అన్నిటినీ ఏకరువు పెట్టటం ప్రారంభించాడు సిజేర్ బాబాయి.

కౌన్సెల్ అతని ధోరణి అక్కడికి త్రుంచేసి యువకునివంక తిరిగాడు.

"నావంక చూస్తున్నావ్ గాసిన్! నే నేమన్నా ముసిలా నయినట్లు కనబడుతున్నానా? చెప్పు" అని అడిగాడు.

నిజంగా కూడా, ఈ స్టూడియో మసక వెలుగులో మొగంలో ముడతలు, మచ్చలూ, మరీ గాట్లు పడ్డట్టు కనబడుతూ ముసిలిగానే కనబడుతున్నాడు. ఆ మొగం, కష్టజీవితంలో, తన్ను తను నలగకొట్టేసుకున్న వ్యక్తి మొగంలాగుంది. అసింహపు జూలుకూడా నేను కొగాకును పడిపోయి చిరుగుపట్టిన తివాచీ రూపంలోకి వచ్చేసింది. దవడలు ముడతలుపడి వదులుగా జారిపోతున్నాయి. మీసాలు దువ్వటం మానేశాడేమో, మాసిపోయిన లోహవర్ణంలో వున్నాయి. ఏ విషయమూ పట్టించుకోవలసిన పనేముంటతనికి? అతని మోడల్ కోసినార్డ్, అంతకుముందే అతన్ని వదిలి లేచిపోయింది. "ఔను భాయీ! నా విగ్రహాలు పోతపోసేవాడితో నే! వాడో మృగం, రాక్షసుడు. కాని వాడికి ఇరవై యేళ్ళు."

స్టూడియోలో అటూ ఇటూ తిరుగుతూ కాలికి అడ్డంవచ్చిన బల్లను తన్నుతూ, లోపల మండిపోతూ, విరసంగా అంటున్నాడు. అకస్మాత్తుగా అద్దం ముందు ఆగి, మొగం వికారంగా పెట్టుకొంటూ అద్దంలో తన ప్రతిబింబం చూసుకొంటున్నాడు. "నేను ఎంత అసహ్యంగా ఉన్నానో! ఎల్లా శిధిలమైందో రూపు! ముసలి ఆవులాగ నరాలు పైబడుతూ, మెడమట్టూ గంగడోలులా ముడతలూ నేనూ" అంటూ తన చేత్తో తన కంఠం లంకించుకొని విషాదకంఠంతో, నీరసంగా "ఇంకో ఏడాదికి ఈ రూపంకూడా లేదని దీనికోసం విచారించేస్థితి వస్తుంది" అన్నాడు.

సిజేర్ బాబాయి తెల్లబోయి కొయ్యబారినట్టయిపోయాడు. ఆస్థానశిల్పి హోదాలో మని షేమిటి, తన నీచ శృంగారాలను ఇల్లా బట్టబయలు చేసుకొంటూ ఈ వెత్తివాగుడేమిటి! మహామహా పరిషత్తులలో కూడా ఇల్లాంటి పత్రీవంగళాయి లున్నారన్నమాట!

అతని నీరసపడటానికి తనలో సానుభూతి హెచ్చుతూన్నకొద్దీ, సీజేర్‌కు ఈ మహాపురుషునియందు గౌరవం అంతంతగా తగ్గుకొంటూ వచ్చింది.

కౌఉజెల్, అకస్మాత్తుగా మళ్లీ శాంతుడయి, జీన్ ప్రక్కనే కూర్చుని స్నేహపూర్వకంగా నెమ్మదిగా కుశలప్రశ్న లడుగుతున్నాడు: "ఫానీ ఎల్లా ఉంది? ఇంకా ఫాబ్రిక్‌లోనే ఉన్నారా?"

"ఆ! పాపం ఫానీ! ఇంక మేం ఇద్దరం ఆట్టే కాలం కలిసి ఉండబోము."

"ఏం దేశం వెళ్ళిపోతున్నావా ఏమిటి?"

"ఔను! త్వరలోనే వెళ్తాను. వెళ్ళేముందే పెళ్లి చేసుకొంటున్నాను. ఆమెను వదిలేయాల్సి ఉంటుంది."

శిల్పి హాహ్హాహ్హా అని భీకరంగా నవ్వాడు. "భలే! భలే! నాకు భలే సంతోషపు కబురు చెప్పావ్! పగతీర్చుగా అబ్బాయ్, మా అందరి తరఫునా కూడా ఆ శెక్కిలిమీద కసిదీర్చుకోరా! వదిలేయ్, వాళ్లను మోసం చెయ్యి. ఏడ్పి మొత్తుకొనేలా చెయ్యి, ఎంత చేసినా, వాళ్ళు ఇతరులకు చేసిన హానికి, బదులు తీరదు!"

సీజేర్ బాబాయి విజయోత్సాహంతో అందుకొన్నాడు. "అద్దదీమాట! మాశావా! కౌఉజెల్ గారు నీలాగ ఏదో పెద్ద ప్రమాదమైనట్టు ఆలోచించటమే లేదు. అరె! ఏం, పిచ్చిపిల్లాడండి! తను వదిలేస్తే ఆవిడ ఆత్మహత్య చేసుకొంటుందని భయపడుతూ కూర్చున్నాడు."

ఆలీస్ డోరే ఆత్మహత్య తనలో కల్గించిన సంచలనాన్నంతా మనస్సు విప్పి చెప్తున్నాడు జీన్.

"దానికీ దీనికీ ఎక్కడా పోలికే లేదు" అంటూ ధీమాగా చెప్తున్నాడు కౌఉజెల్. "అది పట్టె మెత్తక రకం. చేతులు ముడుచుకొని, విషాదంగా కూర్చునే రకం. వంట్లో ప్రాణంలేని బొమ్మ. అపుడేదో తన కోసం చచ్చిపోయిందని డెషిలెట్ పొరపాటు పడ్డాడు. ఆ మనిషికి జీవితం అంటేనూ, జీవించటం అంటేనూ కూడా కేవలం విసుగుపుట్టి, ఆ నీరసంతో ఆత్మహత్య చేసుకొంది. శాఫో అల్లా కాదే! ఛా! తన్ను తను చంపుకోదే! అంత ఇంద్రియ వ్యామోహం గల ఆడది ఆత్మహత్య ఎందుకు చేసుకొంటుంది? చివరిదాకా, ఆ కామంలో అల్లా దహించుకుపోవలసిందే. "నిత్య యౌవను" లంటారుగ మాకు. ఆ రకం మనిషి శాఫో! వాళ్లి బ్రతుక్కు ఒక్కటే పంథా! బోసినోగా పడి, కనుబొమ్మలు రాలిపోయినా కూడా వాళ్ళు 'నిత్య యౌవనులే'. ఎందుకూ నావంక చూడు! నేను ఆత్మహత్య చేసుకొంటానా! ఎంత బాధ పడుతూన్నప్పటికీ, మళ్లీ ఎవతెనో చేరదీస్తానని నాకు తెలుసు కె! ఎప్పుడూ ఎవతో ఒకతె ఉండాలని నాకు తెలుసు! నీ ప్రియురాలూ నాలాగే చేస్తుంది. మునుపల్లా అల్లాగే చేసిందకూడా! అయితే మునుపటంత పడుచుది కాదు కనుక కొంచెం కష్టపడాల్సి వస్తుంది!"

సీజేర్ బాబాయి విజయగర్వాని కంతులేదు "మాశావా! ఇప్పటికైనా బాగా తెలిసొచ్చిందా!" అన్నాడు జీన్‌తో.

జీన్ ఏమాటా మాట్లాడలేదు కాని అతనిలో సందేహాలు తీరిపోయాయి మనస్సు ఒక నిశ్చయానికి వచ్చింది. వాళ్లు తిరిగి వెళ్ళిపోబోతూండగా, కౌఉజెల్ బల్లమీద దుమ్ము కొట్టుకొంటూన్న చిన్న ఫోటో తీసి, తుడిచి "ఇదిగో చూడు ఈ మనిషే" అని జీన్‌కు చూపించి, "అందంగా లేదూ, ఏం కాళ్లు! ఏం ఒళ్ళు!" అంటూన్నాడు.

అతని కళ్లు నిప్పుల్లా మెరిసిపోతున్నాయి. కంఠంలో ఉద్రేకం నిండిఉంది. కాని తన మోడెల్, కుసినార్డ్ పడుచు, ఫొటోగ్రాఫ్‌ను పుచ్చుకొన్న ఆ బండవేళ్లు మాత్రం, ముసలితనంతో వణికిపోతున్నాయి.

12

"ఎవరూ, నువ్వేనా! ఇంత పెందలాళే వచ్చేశావే!"

తోట చివరినుంచి నడిచి వస్తోంది. వడినిండా కోసిన ఆపిల్ పళ్ళు ఉన్నాయి. అతన్ని చూడగానే పీఠమెట్లదగ్గిరకు పరుగెత్తుకుంటూ వచ్చింది. అతని మొగంలో, చిరాకూ, బిగింపూ చూసి కొంత ఆత్రంతో అడుగుతూంది.

"ఏం జరిగింది! ఏమిటి?"

"అబ్బె! ఏంలేదు! ఏంలేదు. కొంచెం ఎండపడి వచ్చాను అంతే. కాస్తషికారుగా వెళ్ళాలంటే ఈఎండా, ఈగాలీ ఇంక వచ్చే కాలంలో ఇంత చక్కగా ఉండవనీ, ఈ చివరిరోజైనా మనఇద్దరమే ఇంకెవరూ లేకుండా, అడవిలోకి షికారు పోదామని వచ్చాను. ఏమంటావ్?"

"ఓ! భలే! భలే" అంటూ సంతోషంతో అర్చి గంతులు వేసింది. పట్టలేని ఆనందం వచ్చి

వచ్చేడల్లా, వీధులు తిరిగే పసిపిల్లలా అల్లా కేకలు వేయటం ఆమెకు అలవాటు.

ఇద్దరూ కలిసి షికారికి బయలుదేరి అప్పటికి నెలరోజులైంది. నవంబరంతా హోరుగాలులూ, జోరువానలూ, అయి, ఇంటిదగ్గిరే ఉండిపోయారు. పల్లెటి నివాసం అన్నివేళలా ఆనందకరం గాదు. ఒక్కొక్కప్పుడు గుహాలలో బ్రతుకుతూన్నట్లే ఉంటుంది.

రాత్రి భోజనాలకు హెట్టిమాలుకూడా వస్తారని వంటపనులు పురమాయించి తేముల్స్ కు వచ్చేసేందుకు లోపలికి పోయింది. ఆమెకోసం షికారు రోడ్డుమీద వేచిఉండి, ఆ నీరెండవెల్గులో వెచ్చగా కనిపిస్తున్న తనకుటీరాన్నీ, మధ్యమధ్య పచ్చిక మొలిచిన రోడ్డు రాళ్ళనూ, గచ్చునూ, తుది వీడ్కోలు తీసుకొంటున్నట్లు, శాశ్వతంగా వదిలిపోయే పరిసరాలను చివరిసారి చూపులతో కౌగలించుకొంటూన్నట్లుగా, చూస్తూ నిలుచున్నాడు.

భోజనాల గది కిటికీ తెరిచిఉంది. పంజరంలో బంగారు చిలకపలుకులు వినబడుతున్నాయి. ఆ కలకలంతో కలిసిపోతూ ఫాన్నీ వంట మనిషికి పురమాయిస్తున్న మాటలూ వినబడుతున్నాయి. "ఏం మర్చిపోకు — ఆరున్నరకే! తెలుసా విందులో ముందుగనే కోడి పులావ్ వడ్డించు. అరే, అన్నట్టు, ఇంకో టేబిల్ క్లాత్ ఇస్తాను. ఆగు."

ఆమె కంఠం, వంటఇంటిపాత్ర సామాను చప్పుళ్ళను మించి, వినబడుతూంది. ఆనందం వెల్లివిరుస్తూ, దూరానికికూడా స్పష్టంగా వినబడుతూంది. ఆ చిలకపాటకన్న ఎక్కువ స్థాయిలో ఆ నీరెండలో హాయిగా పాడుకొంటూ వస్తూంది.

తానో! ఇదంతా ఇంక రెండుగంటలకుమించి, నిలవబోదన్న ఎరుకతో, నిల్చున్నాడు. ఆమె ఈ పండుగసన్నాహాలు చూస్తూంటే, అతనికి గుండె నెత్తురోడుతున్నట్లయింది.

సరాసరి లోపలికిపోయి, అక్కడి కక్కడే అంతా ఆమెతో చెప్పేద్దామనుకొన్నాడు. కాని అరిచి కేకలు వేసి అల్లరి చేస్తుందేమో, ఇరుగూ పొరుగంతా మూగి పెద్ద రభస అయి ఊరంతా అల్లరి అయిపోతుందేమోనన్న భయం. ఒకసారి తెగించిందంటే, ఇంక ఆమె ఏంచేసున్నదీ ఆమెకే తెలియనంత అల్లరికి పోతుందని అతనికి బాగా తెలుసును. అందుచేత అడివిలోకి తీసుకపోవాలన్న మొదటి ఊహే సరి అయినదనుకొని ఆగాడు.

"ఇదుగో వచ్చేశా!"

గాలిలో తేలిపోతున్నట్లుగా సవ్వడి లేకుండా వచ్చి అతనిచేయి చేతిలోకి తీసికొని కదల్తూ హెట్టీ మాల ఇల్లుదాటేదాకా నిశ్శబ్దంగా నడవమని హెచ్చరించింది. ఒలింపి చూసి మేముకూడా వస్తామంటూ తమ ఏకాంతానికి భంగం కలిస్తుందేమోనని భయం. రైల్వే క్రిష్టింటినుంచి రోడ్డు మలుపు తిరిగి అడివిలోకి చేరేదాకా, ఆ అలజడితో నిశ్శబ్దంగానే కదిలింది.

సాయంత్రం ఎండ ప్రశాంతంగా, హాయిగా ఉంది. గాలిలో అంతటా ఒక పల్చని వెండితెర ఆవరించుకొన్నట్లు, ఎండ వెలుగు సన్నగా అంతటా చిమ్ముకొని, కొండ మిట్టపల్లాలను పట్టుకు సాగులాడుతున్నట్లుగా ఉంది. చెట్లకొమ్మల నిండా మిగిలిన ఆకులు బంగారువర్ణంలో ఉన్నాయి. చెట్ల చిటారుకొమ్మలను గిజిగాడుగూళ్ళు మెరుస్తున్నాయి. ఎక్కడో వడ్రంగి పిట్టలు చెట్లబెరడును టక్కు టక్కుమని ముక్కుతో కొట్టూ, కట్టెలవాళ్ళ గొడ్డలిపెట్లలవు జనాలులను అడవిలో ప్రతిధ్వనింపచేస్తూ ఉన్నాయి. ఎక్కడో ఒకపిట్ట ఎడతెగకుండా గొంతు చించుకొంటూ కూస్తూంది.

నెమ్మదిగా నడిచిపోతున్నారు అంతకుముందే వానలు కురిసి మెత్తపడిఉన్న నేలమీద వాళ్ల అడుగుజాడలు పడుతున్నాయి. బయల్దేరిన అడావిడిలో చెక్కిళ్ళు ఎరుపెక్కి, కళ్ళు తళతళలాడుతూ రొప్పుతూ వచ్చిందేమో, ఆమె కాస్త ఆగి, తలకు చుట్టిన పల్చని వోణీతీసి భుజాలమీదకు వేసుకొంది. ఆ జిలుగు వసనం, ఆమెకు రోజా ఇచ్చిన కానుక, — ఆ బ్రతుకు బ్రతికిన నాళ్ళవైభవానికి శేష చిహ్నంగా మిగిలిన విలువైనవస్తు. ఇప్పుడు ధరించిన ఉడుపులుమాత్రం అతిసామాన్యమైనవి. ఒక చౌక బారు నల్లసిల్కు గౌను, తొడుక్కుంది. నడుందగ్గిరా చేతులదగ్గిరా చీనీలు చీలి ఉంది. ఇప్పటి కప్పుడే ఆ గౌను మూడేళ్ళు మన్నింది అదివరకే. దోవలో బురదగుంట దాటటానికి గౌను మోకాళ్ళపైకి, తీసుకుంది. ఆమె బూట్సులుకూడా మడమలదగ్గిర బాగా అరిగిపోయి ఉన్నాయి.

ఈ అర్ధాకలిజీవితానికి ఎంత తేలికగా ఉల్లాసంతో తన్ను తాను అర్పించుకొంది! గత జీవితానికై ఏమాత్రం విచారించటం లేదు. ఇప్పటికష్టాలకు పల్లెత్తు మాట అనటం లేదు. సర్వభావాలూ, సర్వచింతలూ అతని క్షేమం, అతని సేవావిషయం ఆలోచించటంలోనే నిమగ్నమైపోయి, అతని ప్రక్కనే నడుస్తూ

రెండు చేతులూ అతనిబుజాన్ని పెనవేసుకొని, ఇల్లా పోతున్నప్పుడు ఆమె అనుభవించే హాయిని మించిన సంతోషం ఆమె కేదీ లేదు.

ఈ నీరెండలో, ఈ ప్రేమలో, అకస్మాత్తుగా నవయౌవని అయిపోయిన ఆమె వంక చూస్తూ, అంతటి ఉద్రిక్త, విఫల, దుఃఖభాజనమైన బ్రతుకు చవి చూచినమనిషి, ఇంతటి నిశ్చింతతో, హాయిగా స్వేచ్ఛగా ఉండగలదంటే, ఎంత అగ్నికైన తీవ్ర సహనశక్తులు ఆమెలో గలవో, ఎంతటి నిత్యస్రవంతి అయిన జీవనశక్తి ఆమనిషి చేతుల్లో ఇమిడిఉందో అని విస్తుపోతున్నాడు. ఇప్పటికీ, విషాదజీవితచిహ్నాలన్నీ మొగంలో దాగుంటుకొని నిలచినా, కొత్తసంతోషం ఉప్పొంగేటప్పటికి, అవన్నీ మాయమాయమైపోయి, నిత్యయౌవనంలో మొగం కలకళ విరాజిల్లుతుంది.

గలగలమనే ఎండుటాకుల్లో మోకరిల్లుతూ, అడివిమొక్కల ముళ్ళకాయలు తలలో చిక్కుకుంటూంటే క్రిందికి వంగి, కొత్తగా మొలుస్తున్న కుక్కగొడుగును చేత్తో తీసి చూపిస్తూ, "చూడు చూడు! అచ్చమైన కుక్కగొడుగిది. ఆ అందం చూశావా" అంటూ ఉల్లాసంతో చెప్పుకు పోతోంది.

అతనేమీ వినటంలేదు. ఎక్కడో ఆలోచిస్తున్నాడు. "ఇదేనా సమయం! ఇప్పుడే చెప్పెయ్యనా!" అని తటపట లాడుతున్నాడు. కాని చెప్పటానికి నోరు రావటంలేదు. ఆమె అతి ఉల్లాసంగా నవ్వుతోందో! లేక ఆ స్థలం అనువుగా లేదో! అడివి నట్టనడానికి దొవతీస్తూ తను చెయ్యబోయేపనిని గూర్చి ఆలోచించుకొంటున్నాడు.

బాటమలుపు తిరగ్గానే చెప్పుదామనుకొన్నాడు. ఇంతలో ఎదురుగా ఎవరో వస్తూ కనబడ్డారు. హోషి కార్న్. అక్కడి అడివి కాపలా జవాను. అప్పుడప్పుడు కలుసుకొన్నమనిషే. కొలనుప్రక్కనే ప్రభుత్వంవారు కాపలీకని కట్టించిన గుడిసెలో నివసిస్తూండేవాడు. ఆ గుడిసెలోనే అతని ఇద్దరుపిల్లలూ పెళ్లామూ, విషజ్వరాలతో మరణించారు. మొదటిబిడ్డ పోయినప్పుడు ఆ గుడిసె నివాసార్హం కాదనీ అక్కడ ఉండొద్దనీ డాక్టర్ సలహా ఇచ్చాడు. కాని డాక్టర్ల సర్టిఫికేట్లు, రికమెండేషన్లూ ఎన్ని ఉన్నా రెండేళ్ళ దాకా అత నక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరోమూడేళ్ళు అల్లాగే అక్కడే గడిచిపోయింది. ఈ లోపల కుటుంబం అంతా మృత్యువు పాలయింది. చివరికూతురు చిన్నపిల్ల ఒక్కతే తప్ప. చివరికెల్లాగో ఆపిల్లను పెట్టుకొని అడివి అంచుకు వచ్చి అక్కడ ఒకపాకలో నివాసం ఏర్పరుచుకొన్నాడు.

హోషి కార్న్ మొగంలో బ్రిటన్‌వాళ్ళ పల్లెటి మొరటుతనం కనబడ్తూంది. కళ్ళు నేటుగా, ధైర్యం ఉట్టిపడుతూ ఉంటాయి. నాగురు వెనుకకు జారి యూనిఫారం టోపీలో ఇమిడిపోయింది. ప్రభుభక్తి, స్వరాష్ట్రసక్తీ, రూపొందినట్లుగా ఉన్నాడు వ్యక్తి. ఒకభుజంనుంచి తుపాకీ వేలాడుతుంది. రెండోభుజం మీద తల ఆన్చి పసికూతురు పడుకొనిఉంది.

ఫానీ చిరునవ్వుతో అతన్ని పలకరిస్తూ "పాపకెల్లా ఉంది" అని అడిగింది. ఆ నాల్గేళ్ళ అమ్మాయి, జ్వరంతో పాలిపోయి, బక్క చిక్కి ఉంది. ఆమాటకు మెలుకువవచ్చి ఎఱ్ఱగా జ్యోతుల్లా అంచులు కట్టుకొన్న కళ్లు తెరిచి చూచింది.

ఆ కాపు నిట్టూర్చాడు. "ఏం నయం లేదు. నానా ప్రతీచోటకూ పిల్లనూ తీసుకుపోతున్నాను కాని ప్రయోజనం కనబడటం లేదు. తిండీ తినదు. ఏదీ కావాలన్న అపేక్ష లేదు. జబ్బు బాగా ముదిరిపోయింది. చూడండమ్మా! పూచికపుల్లకన్నా తేలికైపోయింది. ఎప్పుడో ఒకరోజున వాళ్ళందరిలాగే ఇది వెళ్ళిపోతుంది. అరి భగవంతుడా!"

పై అధికారుల అలసత్వం, క్రౌర్యం, ఉద్యోగజాడ్యాలకన్నిటికీ ఆ మనిషి చూపించిన ప్రతిఘటన, "భగవంతుడా!" అన్న ఆ చిన్నమాట ఒక్కటి మాత్రమే.

"వణుకుతోంది. చలేస్తోందేమో పాపం!"

"జ్వరంవల్లనండమ్మా"

"ఆగు. ఈ పైబట్ట కప్పుతాను" అంటూ తనపై మీద జిలుగువసనంతీసి, ఫానీ ఆపిల్లచుట్టూకప్పింది. "ఉంచు ఉంచు! ఫరవా లేదు. పిల్ల పెండ్లికూతురైనప్పుడు మేలిముసుగుగా ఉంటుంది" అన్నది

ఆ తండ్రి అతికష్టంగా విషాదహాస మొనర్చాడు. ఆపిల్ల అప్పుడే శవంలాగ జారగిలపడి మళ్ళీ నిద్రకు తలవాలుస్తూంది. ఆవదలిపోయిన చెయ్యి పట్టుకొని, దయాగలతల్లికి దణ్ణం పెట్టమని పిల్లచేత నమస్కారం చేయించి, "భగవాన్, భగవాన్" అని గొణుగుకుంటూ వెళ్ళిపోయాడు. అతని కాళ్ళ క్రింద ఎండు చితుకులు చిటపటలాడుతూ విరుగుతున్నాయి.

ఫానీ సంతోషం అంతా మాయమైంది. కష్టంలోగాని, సుఖంలోగాని, ఆత్రంతో, తను

ప్రేమిస్తున్న వ్యక్తి అంతర సాన్నిహిత్యాన్నపేక్షించే, కామినీ లలితప్రవృత్తితో, జీన్‌కు మరింత దగ్గరగా చేరి అతన్ని అంటిపెట్టుకొని నడుస్తూంది. "పాపం! ఎంత బేలగుండే మనిషో" అనుకొన్నాడు జీన్. కాని అభావం, తన నిశ్చయాని కేమీ అడ్డు తగలటం లేదు. కొండదోవ మలుపు తిరిగి ఇక్కడి నుంచే క్రిందికి దిగుతూంది. ఆవాకు ఐరీన్ బండీలో పోతుంటే వెంట్లవెంబడి చూసిం దిక్కడే. ప్రథమ దర్శనంనుంచే అతన్ని మంత్రముగ్ధుణ్ని గా చేసిన, అమూర మందహాసం కన్నులలో అడ్తూంది. ఆ తర్వాత పరిచయంలోకి వచ్చాక ఆమె తక్కిన గుణాలు మరింత మురిపించాయి. అనుకున్న పని చెయ్యకుండా చాలాకాలం ఆగా ననుకొన్నాడు. ఇవాళ మళ్ళీ గురువారం! "సరే ఇంక తేల్చెయ్యాలి" అనుకొన్నాడు. దగ్గరలో చిన్న పచ్చికబయలు కనబడింది. అటు నడిచాడు.

లోయ దిగువలో ఉన్న చిన్న పచ్చిక స్థలం చుట్టూ కొట్టేసిన చెట్లు, అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. అక్కడక్కడ మంటలు పెట్టిన బూడిదనేల కనబడుతూంది. కొమ్మల సందులలోనుంచి దిగువగా పరస్పన్నని మంచుతెరల ముసుగు లావరించుకొని కనబడుతూంది. ఒక్కనే, అడవి కాపరి వదిలిన పాడు గుడిసె. అక్కడినుంచి మళ్లీ కొండఎగువకు లేస్తూ, టేకుచెట్లు, సరకుచెట్లు దట్టంగా అలముకొని కనబడుతూంది.

జీన్ అకస్మాత్తుగా ఆగాడు. "ఇక్కడ కాసేపు కూర్చుంటే" అని అడిగాడు. కొట్టేసి, క్రిందఅడ్డంగా పడిఉన్న పురాతనపు టేకుచెట్టుమానుమీద ఇద్దరూ కూర్చున్నారు. చెట్టుకొమ్మలు ఎక్కడెక్కడుండేవో తెలుపుతున్నట్లు మాను పొడుగునా గొడ్డలి గంట్లు కనబడుతున్నాయి.

గాలిలో చిరుచెమ్మదనం, సన్నటి వెలుగు తళుకుతో గడ్డిపూల వాసనతోపాటు ఆవరించుకొన్నట్లుంది.

"ఇక్కడ ఎంత బాగుందో" అంటూ ఫాన్ని అతని బుజంమీదకు వ్రాలి, ముచ్చిలి గుంటను ముద్దు పెట్టుకోటానికన్నట్లు వెతుకుతూంది.

కొద్దిగా అవతలికి జరిగి ఆమె చెయ్యి చేత్తో పుచ్చుకొన్నాడు. అతని మొగం అకస్మాత్తుగా మారిపోయి మొగములోకి కరుకుదనం వచ్చేటప్పటికి అదుర్దాగా "ఏమిటి సంగతి! ఏంజరిగింది!" అంటూ అడిగింది.

"పాపం! నీకో చెడ్డవార్త చెప్పాల్సి వచ్చింది. నాబదులు ఇంకోడు హెడూన్ వెళ్ళాడని చెప్పాను చూడు, అతను తిరిగి వచ్చేశాడు..." అతికష్టంమీద గొంతుక రాచుకుపోయినట్లు మాట్లాడుతున్నాడు. ఆ కంఠం తనకి తనకే ఆశ్చర్యం కల్గిస్తూంది. కాని రామరాను మాట దృఢంగా వస్తూంది. చెప్పాలని కూర్చుకున్న కథ సాఫీగా చెప్పుకుపోతున్నాడు. ఆ వెళ్లిన అతనికి అక్కడ జబ్బుచేసి తిరిగి వచ్చేసాడు. జీన్‌ను మళ్ళీ అతనిస్థానంలో ఆ ఉద్యోగానికే నియమించారు. తను వెళ్లిపోవాలి.

నిజం చెప్పటంకన్నా ఇల్లా చెప్తేనే అంత క్రూరంగా ఉండదని భావించాడు.

ఏమీ అడ్డు పలకకుండా అతనిమాట చివరిదాకా వింది. మొగం పాలిపోయి తెల్లబారిపోయింది. కనురెప్ప వాల్చకుండా అతనివంక తేరి పార చూస్తూంది.

"ఎప్పుడు వెళ్తున్నావ్!" అని అడుగుతూ, తనచెయ్యి అతని చేతుల్లోంచి వెనక్కు లాగేసుకొంది.

"మరి—ఈ సాయంత్రమే — అదే రాత్రే" అన్నాడు. అని కృతకవిచారకంఠంతో—"మార్సెల్స్ చేరేముందు ఒకరోజు మా ఊళ్ళో ఇంటిదగ్గిర గడిపి పోతాను" అన్నాడు.

రౌద్రాకారంతో ఒక్క వుదుటున లేచింది. "చాల్చాల్లే! ఇంక అపు! ఎందుకీ అబద్ధాలు! చేతా వాతా కాకుండా! అసలు సంగతి, పెళ్లిచేసికోబోతున్నావ్. కాదా! మీవాళ్లు ఎన్నాళ్ళబట్టో పోరుతున్నారుగా పాపం! హుం! తమరిక్కడికి వెళ్ళకుండా ఇక్కడ నేనే గట్టిగా పట్టేసి ఉంచానని హడిలిపోతున్నారు, కాదూ! అక్కడికి వెళ్ళి ఏ టైఫాయిడో, మలేరియాయో తెచ్చుకోకుండా అపుతున్నాననేగా వాళ్లమంట! ఇప్పటికి వాళ్ళకళ్లు చల్లబడ్డాయనుకొంటా! ఆ పెళ్లికూతురు తమరికి పూర్తిగా నచ్చిందికదూ! ఉహూ! గురువారప్పూటల, తమర్ని అలంకరించి పంపుకొంటూ వచ్చాను! శుద్ధ మూర్ఖురాలనేకాదూ! ఏమంటావ్."

మహాఘోరంగా, విషాదకరంగా, పకపకా విరగబడి నవ్వసాగింది. ఆ నవ్వుతో నోరు వికారంగా తెరుచుకొంటూ, సగం విరిగిన ముందు పన్ను తొఱ్ఱి ఒకటి కనబడుతోంది. కొత్తగా విరిగి ఉండాలి. అంతకుముం దెప్పుడూ అతివా పన్ను విరగటంచూసి ఉండలేదు. ఆ తొఱ్ఱి, తీర్చి దిద్దినట్లున్న ఆమె ముత్యాల పలువరుస అందాన్నంతా పాడుచేసింది. ఆ పలువరుస అందానికామె చాల గర్వపడుతూండేది. వాడి, దెబ్బతినిపోయి, ప్రేలికళపడ్డ అమొగంలో,

ఆ పళ్ళమధ్య తొఱ్ఱి కనబడేటప్పటికి, గుండెల్లో బాకుపోటు తిన్నట్లయిం దతనికి.

“ఇదిగో కాస్త నామాట విను” ఆమెను చేతుల్లోపట్టి తనప్రక్క కేకూర్చోపెట్టాడు. “పోనీ, నిజమే, నేను పెళ్ళి చేసుకొంటున్నాను. మా నాన్న చాలా పట్టుబట్టారు. ఆ సంగతి నీకూ తెలుసుగా! అయినా, మనం ఎల్లాగా విడిపోదల్చుకొన్నప్పుడు, అందువల్ల నీకు వచ్చినబాధ ఏముంది?”

ఆ ఉగ్రకోపం అల్లాగే అట్టేపెట్టుకోదలచినట్లు అతని చేతులు విదిలించుకొంటూ ఛట్టున లేచి నిల్చొంది. “ఈమాట చెప్పేందుకే ననమాట, ఇంత అడివిమధ్యకు నన్ను లాక్కొని వచ్చింది. “ఏమైనా, అది అరిచి రాగా లెత్తిమొత్తుకొన్నా వినేందుకు ఇతరు లెవరూ ఉండరులే” అనుకొన్నావు కాదూ! అయితే మాడు. నే నసలు నోరు మెదపనైనా మెదపను తెలుసా! కంట నీటిచుక్కయినా పెట్టను. తమ ఇంతోటి మహాపురుషత్వపుపోత్తు, నాకూపూర్తిగా మొగం మొత్తింది. తమరు సుభ్రంగా పోవచ్చు. నాకు పోయిందేమీ లేదు. తమర్ని వెనక్కి పిలవాలని చిటికెనవేలు కదిల్చేదికూడా లేదు. తెలుసా! ఫో, నీ పెళ్ళాన్ని పెట్టుకొని సుభ్రంగా ఎడారిదేశాలకు పో. పెళ్ళాం! “నాచిన్నది” అంటారు కామా తమ నైపులా! ధిలే “చిన్నదే” అయుంటుంది. కొండముచ్చులాంటి మొగము అనుకుంటానేం! లేకపోతే కడిపెకు కదుపూ, అదీ, ఏ నెలో ఊరందరికీ తెలుస్తానే ఉంటుందిలే! నీలాంటి పిచ్చిపుల్లాయికి నీకన్న పిచ్చిపుల్లాయిలు వెదికి తెచ్చిన పిల్ల అంతకన్నా ఎల్లా ఉంటుంది!”

ఇంక తనను తను బిగ్గబట్టుకోలేకపోయింది. కెల్లున బూతులు తిడుతూ, రంకులుకడుతూ వాగిందే వాగుతూ తిట్లప్రవాహం దొర్లించేసింది. చివరికి ఆయాసంతో పిడికిళ్ళు బిగిస్తూ మొగంలో మొగంపెట్టి ద్వేషంతో, “పిరికిపంద—అబద్ధాలకోరు — పిరికిపంద” — అంటూ అన్నమాటే అంటూ మాటలు మొగాన ఊస్తోంది.

ఈమాటు శీన్ ఆమెధోరణి అడ్డుపెట్టకుండా, వింటూ కూర్చున్నాడు. ఆమెను ఆపటానికి కించిత్తైనా ప్రయత్నించటంలేదు. అసలు ఆమె ఈ ధోరణిలో ఇల్లా నీచంగా, అచ్చంగా మసిలి లిగ్రాండ్ కూతురిలాగా, పచ్చిగా, నీచంగా ప్రవర్తిస్తేనే అతని పని సులువనిపించింది. ఆమెను వదిలిపోవటంకూడా అంత క్రూరమైనట్లు మనస్సును బాధించదు.

బహుశాశ్య, ఆమెకూడా అతనిభావం పసిగట్టిందేమో, అకస్మాత్తుగా మూగవడిపోయి అతని పాదాలమీద కుప్పగా తిలవంచుకు పడిపోయింది. వెక్కిలు వెక్కిలుగా పెద్దఏడుపువచ్చి ఆమె వళ్లంతా వణికిపోతూంది. మధ్యమధ్య మూల్గుతూ, వెక్కిలు పెడుతూ వగిరుస్తున్న మాటలతో ఏడుస్తూంది.

“నన్ను క్షమించు! నన్ను దయచూడు! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నాకున్న సర్వస్వమూ నువ్వే! ప్రియతమా, ప్రాణమూర్తీ, ఈ బాధమాత్రం పెట్టకు. నన్ను వదిలి వెళ్ళవద్దు! నేను ఏమైపోతాను చెప్పు!”

ఎంత మనస్సు రాయిచేసుకొన్నా కదిలిపోతున్నాడు. అబ్బా! అసలు తను భయపడిన విషయమే ఇది. ఆమె కళ్లనీళ్ళు చూస్తుంటే అతనికి కళ్లనీళ్ళు నిండుతున్నాయి. కంట ఆ బిందువులు రాలకుండా తల వెనక్కు విదల్చుకొన్నాడు. ఏవో అర్థంలేని మాటలతో ఆమె కుపశమన మియ్యచూస్తున్నాడు. ఎన్ని చెప్పినా ఒకటే కారణం చెపుతున్నాడు “కాని ఎల్లాగా వెళ్ళిపోవాల్సినవాడనేకదా!...”

తన ఆశారేఖ లన్నిటినీ కూడకట్టుకొంటూ, సన్నగా కేకపెడ్తూ తన్ను తను కూడదీసుకొంటూ అంది. “ఆహా! నేనువద్దంటే నువ్వు వెళ్ళకుండా ఆగిపోయేవాడివే కదా!” ‘వద్దు కొన్నాళ్ళు అను. ఇంకొన్నాళ్లు నిన్ను నేను ప్రేమించనీ’ అని అడిగి ఉందును. ఆగిపోయేవాడివి. నేను నిన్ను ప్రేమించినలాంటి ప్రేమ ఏమనిషికైనా జీవితంలో రెండుమాట్లు లభిస్తుం దనుకొంటున్నావా! పెళ్లిచేసుకొనేందుకు నీకింకా కావలసినంత వ్యవధి ఉంది. నాలో జవసత్వాలు ఇంకెన్నాళ్ళో ఉండబోవు. త్వరలోనే నాపని చెల్లిపోతుంది. ఆతర్వాత మామూలుగానే ఇద్దరం తేలికగా ఎవరిదోవను వాళ్లం వెళ్ళిపోవచ్చు.”

అతను లేవబోయాడు. ఆమె చెప్పేదంతా వృథా అని అనేందుకు ఎల్లాగో శక్తి తెచ్చుకొన్నాడు. ఆమె అతని నడుం పట్టుకొని ఈడిగిల బడుతూ ఆ నేలబురదలో మోకాళ్ళమీద దేకుతూ అతన్ని మళ్ళీ కూలవేసింది. అతని కాళ్ళమధ్య మోకరిల్లుతోంది, ఆమె పెదవుల ఊపిరి అతని మొగమంతా తగులుతోంది. కళ్ళు కామంతో వెలుగుతున్నాయి. అరచేతులతో, బిగదీసుకుపోయిన అతని మొగాన్ని మెత్తగా నిమురుతూంది. అతని జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ సన్నగా దువ్వుతూంది. అతని పెదవులమీద మునివేళ్ళు సన్నగా కదలిస్తూంది. బూడిదై ఆరిపోతున్న తన ప్రేమాగ్నిని మళ్ళీ రాజేద్దామని, సర్వ

ప్రయత్నాలూ చేస్తూంది. తమ కాపురపు పూర్వ సౌభాగ్యాలవన్నిటినీ, రహస్యం చెపుతూన్నట్లుగా పెదవులతో సన్నగా పలికిస్తూ, ఆనాటి మేలుకొలుపులూ, ఆటవికపు దినాల అహోరాత్ర పరిరంభణానందాలూ, అన్నీ జ్ఞప్తికి తెస్తూంది. అసలు ఇకముందు తాను సమకూర్చగల సౌఖ్యంతో పోలిస్తే, అవి ఎందుకూ కొరగానట్లే కనబడతాయని చెప్తూంది. ఆమె కింకా ఎన్నో కామశాస్త్ర విశేషాలు తెలుసును. అవి అన్నీ కొత్తగా అతనికి చవిచూపిస్తానంటూంది.

క్షుద్ర వారాంగనల పడకటింటి గుమ్మాల వినబడే ఈ పలుకులన్నీ ఆమె పలుకుతూంటే, మొగాన మాత్రం పెద్ద పెద్ద కన్నీటిధారలు చెక్కిళ్ళ జారి రాలిపోతున్నాయి. మొగంలో అపరిమితమైన భీతి, ఆవేదనా, వ్యక్తమవుతూన్నాయి. దుస్స్వప్నమధ్యంలో తెలివితెచ్చుకొని లేస్తూన్నట్లుగా ఏడుస్తూ అరుస్తూంది. "అబ్బా! అల్లా చెయ్యకు!! నన్ను వదిలిపెట్టిపోతా నన్నమాట అబద్ధమని చెప్పు! చెప్పవా!" అని ఏడుస్తూ బ్రతిమాలుతూంది. వెక్కిళ్ళు పెడ్తూ, మూలుగుతూ, రక్షించమని ఆక్రోశిస్తూంది. అతను, చేత కత్తిబట్టుకొని చంపటానికి నిలబడితే, జాలిగా బ్రతిమాలుతూన్నట్లు బ్రతిమాలుతూంది.

ఆ ఘట్టం హంతకునకు, హంతురాలికీ కూడా ఒకే మాదిరి బాధాకరంగా ఉంది. ఆమె కోపానికి గాని బ్రతిమాలటానికి గాని, అతను ఎక్కువ భయపడటం లేదు. కాని అనిస్పృహకు జవాబు చెప్పలేకుండా ఉన్నాడు. అడవిఅంతా ప్రతిధ్వనింప చేస్తూ, ప్రాణాంతకమైన దెబ్బతిన్న, అడవిజంతు వరచినట్లు అరుస్తూ, మూల్గుతూంది. ఆ అరుపులు ఒక్కొక్కటీ, పై స్థాయికి పోయిపోయి, తిరిగి అవరోహణంలో, అస్తమయ సూర్య ప్రతిబింబంతో అరుణాంచితమైన సరోనిశ్చలతటంలో అంతరించి పోతున్నాయి. అకస్మాత్తుగా ఆమెను కౌగలించుకొని లేవదీసి, "వెర్రిమలే! ఊరుకో! వెళ్ళను" అనకుండా ఉండేందుకు నరనరాలు బిగబట్టుకొని, తన నూతన ప్రేమకలాప నవ్యజ్యోతిని గాఢంగా మనసులో నిలుపుకొంటూంటే నే గాని, గుండె దిటవుపడటం లేదు.

ఎంతసేపు ఇద్దరూ ఇల్లా పరస్పరం వేధించుకొంటూ ఉండిపోయారో! పశ్చిమదిశను సూర్యబింబం, అంతరిస్తూన్న సన్నని రేఖ మాత్రంగా మిగిలి అంతరించిపోయింది. సరస్సుతటం, అరుణవర్ణం వదిలి, నాపరాతి నల్లదనమందుకొంది. ఆనీటి గబ్బుపొగలు, చెరువుచుట్టూ బురదలోంచి, వెలువడుతూ పరిసరారణ్యంలోకి దొంగచాటుగా పాకిపోతున్నట్లున్నాయి. అంతకంతకూ సంజెచీకటి దట్టమై, తన మొగంకేసి తిప్పివపాలిపోయిన ఆమె మొగమూ, అంతులేని రోదన స్వరం ఆలాపిస్తూన్న ఆ తెరిచిన నోరూ, తప్ప అతని కింకేమీ కనబడటం లేదు. కాసేపటికి, చీకటి ఇనుమడించాక, ఆ ఏడుపు సన్నగించింది. ఇప్పుడు అనంతప్రశాంతిగా ప్రవహిస్తున్న కన్నీటిధారల పతనశబ్దం మాత్రమే వినబడుతూంది. పెను తుపాను అనంతరం వచ్చిన కుంభవృష్టిలా, ఉన్నాయి ఆ కన్నీళ్ళు. ఉండి, ఉండి పేగులు కదలించుకొంటూ నాభిమూలం నుంచి బయలుదేరి, గొంతులో నొక్కుకుపోతూ పెకల్చుకొని వస్తున్న "ఓ" అన్న భయంకరపు మూలుగు మాత్రం వినబడుతూంది. ఏదో భీకరదృశ్యం ఎంత నిగ్రహించినా పోకుండా, ఆమె కన్నుల ముందాడుతూంటే, ఆమె మాటి మాటికి దాన్ని తోసివేసుకొనేందుకు ప్రయత్నిస్తూన్నట్లుంది.

ఆ తర్వాత అన్నీ ఆగిపోయాయి! ఏమీ లేదు! అంతా అయిపోయింది. జీవధాతువు మరణించింది. ఒక చలిగాలి చెట్లకొమ్మలను కదలించుకొంటూ వాళ్ళవైపు విసిరి, ఎక్కడో దూరపు గడియారపు గంటలు వినిపించింది.

"రా పోదాం—రా—ఇక్కడ ఆగవద్దు." అంటూ మెల్లిగా ఆమెను లేవదీశాడు. పసిపిల్ల కన్న తేలికైపోయి, కదలిక లేని ముద్దగా అనిపించింది మనిషి. మధ్య మధ్య పెద్ద పెద్ద వెక్కిళ్ళు మాత్రం దేహాన్నంతా కంపించివేస్తున్నాయి. ఇంతటి ఘననిబ్బరం చూపించిన వీరపురుషుడంటే, భయగౌరవాలతో ముంచెత్తి బడిపోయినట్లయింది. అతనితో అడుగుల్లో అడుగులు వేసుకొంటూ. అతన్ని చెయ్యపట్టుకొనేందుకైనా ధైర్యంలేని పిరికితనంతో వెంటవస్తూ, మధ్య మధ్య రాళ్ళు రప్పలు తగిలి తూలిపడుతూ, మూర్తీభవించిన శోకదేవతై నిశ్శబ్దంగా వస్తూంది. ఆ కారుచీకటిలో, మంచుపు పసిమితనంతో, కనబడుతూన్న వట్టి నేలమాత్రమే దోవ కనుక్కొనేందుకు ఆధారంగా ఉంది. ఆ సమయంలో, దోవ తడుముకొంటూ, తబ్బిబ్బుగా పోతూన్న ఆ ఇద్దరినీ ఎవరన్నా చూస్తే, రోజంతా ఏ పొలం పనిలోనో శ్రమించి, ఇంటికి తిరిగిపోతూన్న కార్మిక దంపతులని అనుకొని ఉందురు.

అడివి చివరికొచ్చేటప్పటికి ఎట్టఎదుటగా, హోషి కార్న గుడిసెలో దీపం, తెరచిఉన్న తలుపులోంచి కనబడుతూంది. దీపపు వెలుగులో గుమ్మాని కడ్డంగా ఇద్దరు వ్యక్తుల ఛాయలు కనబడుతూన్నాయి.

"ఎవరు వారు! గాసిన్! మీరేనా!" అంటూ కాపరితో సహా కలిసి హెట్టీమా వాళ్ళకేసి వచ్చారు. జీన్, ఫాన్నీ ఇద్దరూ ఎంతకూ ఇంటికి రాకపోతే వాళ్ళకు అదుర్దా హెచ్చిందట. ముఖ్యంగా అడివి మధ్య నుంచి, పెద్ద పెద్ద గాండ్రింపులు వినబడేటప్పటికి వాళ్ళభయం మరింత ఇనుమడించింది. ఇప్పుడే హోషికార్న్ తుపాకి పుచ్చుకొని వాళ్లను వెదకాలని బయలుదేర బోతున్నాడు.

"దండాలు, బాబూ, అమ్మా దండమండి. పసిపిల్ల మీ రిచ్చిన గాలువ చూసుకొని ఎంతో మురిసిపోయిందనుకోండి! అది కప్పితే కాని పడుకొని నిద్రపోనేలేదు."

తాము ఇద్దరూ, తమ జంట జీవితంలో, చేయీ చేయీ కలుపుకొని నిలిచిచేసిన తుది కార్యం, మృత్యుగహ్వరంలో ఉన్న ఆ పసిపిల్లకి ఆ గాలువ ధర్మం చెయ్యటమే.

"మంచిది, సెలవు హోషికార్న్," అంటూ ముగ్గురూ కదిలి ఇంటిదోవ పట్టారు. అడివిలో అల్లా గాండ్రించిన మృగమేదో హెట్టీమాకు తేలనివిమర్శగానే మిగిలింది. "ఒకసారి బాగా దగ్గరగా వినబడేది. ఎవళ్ళో చంపుతూంటే చస్తూన్న జంతువు అరుస్తూన్నట్లుంది. అరే! మీకు వినబడకుండా ఎల్లా ఉన్నారు!"

ఇద్దరిలో ఎవరూ జవాబు చెప్పలేదు. ఇంటి బాటమీదికి వచ్చేటప్పటికి జీన్ కొంత సందేహిస్తూ తాత్సారం చేస్తూన్నాడు. "భోంచేసి వెళ్ళు! ఎల్లాగా ఈ రైలు తప్పిపోయింది కదా! తొమ్మిది గంటల రైలుకు వెళ్లవచ్చు" అంటూ దీనంగా, రహస్యంగా అతని చెవిలో ప్రతిమాలింది ఫాన్నీ.

వాళ్ళతోటే నడిచాడు. భయపడాల్సినదేముంది? ఇంతకుముందు జరిగినలాంటి ఘట్టం, ఎవళ్ళకీ రెండుసార్లు సంప్రాప్తం కాదు. అసలు ఆ చిన్న ఉపకారం చేకూర్చటంకంటే తను చేయాల్సిన మహత్కార్యం ఏమీ లేదు.

భోజనాల గది వెచ్చగా ఉంది. దీపం పెద్దగా వెలుగుతూంది. వంటమనిషి రసం అవీ అప్పుడే భోజనాల బల్లమీద అమర్చేసింది.

భోజనానికై తయారుగా రుమాలు ఒళ్ళో పరచుకొని తన స్థానంలో తాను కూర్చునిఉన్న హెట్టీమా పతి 'ఎప్పటికి తెమిలార్రా' అంటూంది అని "అరే, భగవాన్" అంటూ అదిరిపడి లేచింది.

ఫాన్నీ ముఖం, నిర్జీవంగా పాలిపోయిఉంది. కళ్ళువాచి, ఎఱ్ఱబడి, మనిషి ఒక్కసారి పదేళ్ళు ముసలిదైపోయినట్లు ఉంది. దుస్తులనిండా బురద, తలమీదకూడా బురదఉంది. పోలీసులు తరుముతూంటే అదరాబాదరాగా వంటిమీద బట్టదక్కకుండా పారిపోతూన్న వీధులుకాచే పడుపుకత్తె రూపంలో ఉంది.

ఆ గది వెలుతురులోకి వచ్చేటప్పటి అప్పటికే మండుతూన్న ఆమె కళ్లు మిరమిరలాడాయి. ఒక్కసారి గట్టిగా ఊపిరితీసుకొని తూలబడ్డది. గది వెచ్చదనం, ఇక్కడి పూర్వపరిస్థితులు మళ్ళీ మనిషిమీద పనిచేయసాగాయి. కన్నీళ్ళు మళ్ళీ కట్టతెగి ప్రవహించసాగాయి. వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ మాటలు అనలేక సగం సగం అంటూ మింగుతూ ఏడుస్తూంది. ఆ ఏడుపులో నుంచి "నన్ను వదిలేసిపోతున్నాడు! పెళ్ళి చేసుకోంటున్నాడు' అన్న మాటలు ఎల్లాగో తెలుసుకోగలిగారు.

అక్కడి ముగ్గురూ, వంటమనిషితో సహా, తెల్లబోయి ఒకళ్ళ మొగాలు ఒకళ్ళు చూసుకొని, గాసిన్ మొగంకేసి చూశారు.

"పదండి! ఏమయినా ముందు భోంచేద్దాం పట్టండి" అంటూ స్థూలకాయుడు హెట్టీమా అన్నాడు. అసలే అతనికి కోపం ముంచుకొచ్చినట్లు తెలుస్తూనే ఉంది.

హెట్టీమాలు భోజనాలు ప్రారంభించారు. ఫాన్నీ మొగం కడుక్కోటానికి పక్కగదిలోకి పోయివచ్చింది. తిరిగి వచ్చేటప్పటికి, ఆమె మొగం ఒత్తుగా పులిమిన పౌడరుతో ఆ లాంతరు వెలుగులో నీలంగా కనబడుతూంది. తెల్లని ఊలు డ్రెస్సింగ్ గౌను వేసుకొని వచ్చింది.

ఏవిమునుపైన మళ్లీ ఏం రభస జరుగుతుందో అన్న అదుర్దాతో, ముద్దలు నములుతూ మధ్యమధ్య ఫాన్నీ మొగంకేసి వంకచూపులు చూస్తున్నారు హెట్టీమాలు. కాని ఆమె శాంతంగా కూర్చుని నిండు ఆకలితో ఉన్నట్లు, పుష్టిగా భోజనం చెయ్యటం ప్రారంభించేటప్పటికి ఆశ్చర్యముగ్ధులైపోయారు. తన దుఃఖాన్ని, వేదనా భారాన్ని ముంచేసుకొనేందుకు చేతికందిన ప్రతివస్తువూ—రొట్టె, మాంసం, పండ్లు — అన్నీ నోటిలో కుక్కుకుంటూందా అన్నట్లు తింటూంది ఫాన్నీ - అల్లా తింటూనే కూర్చుంది....

ముందర ఎవరూ ఏ సంభాషణ ప్రారంభించటానికీ తటపటాయించారు. తిర్వాత రానురానూ సంభా

షణాలు సాగాయి. హోటేమా దంపతులకు తిండి, రుచులు ఈవిడ ఎక్కువ వేసెమో, వంట ఎల్లా ఉండాలో, ఏవస్తువు ఎల్లా వండితే బాగుంటుందో, పదార్థాల రుచులూ పచులూ కబుర్లు ప్రారంభించారు. కంచం, మంచం పొత్తే, కైలాసంగా గడుపుకొనే ఆ భార్యాభర్తలు, చక్కగా, విశ్వాసంతో, ఒకరినొకరు పూర్తిగా అర్థంచేసుకొంటూ, పరస్పరం పరిపించుకొంటూన్న వీక్షణాలు చూస్తూంటే! ఎవరికైనా, మనశ్శాంతి చేకూరక తప్పదు. ఒకళ్లనొకళ్లు వదిలిపోవాలన్న భావం వాళ్లకు కలనైనా రాదు. ఆ యిద్దరిమధ్య ఆమాపు జీన్ గమనించాడు. అగదిలో, పూర్వస్మృతులు, అలవాట్లు, అన్నీకూడా ఒక్కసారి ముంచెత్తినట్లయి, నీరసపడి, భుక్తాయాసభారంతో కూర్చున్నట్లు కూర్చుండిపోయాడు. ఫాన్నీ అతని ధోరణంతా చూస్తూనే ఉంది. అతని ప్రక్కనే చేరి ఆనుకొని అతని చేతులచుట్టూ తన చేయి వేసింది.

అతను అకస్మాత్తుగా "మాడు తొమ్మిదయింది. వెళ్లి వస్తాను. సెలవు ఉత్తరం వ్రాస్తా" అన్నాడు.

అని లేచి బైటికిపోయి రోడ్డుదాటి ఆచీకటిలో రైలురోడ్డు అడ్డుదోవ గేటుగడియతీయటానికి తడుముతాడుతున్నాడు. వెనకనుంచి రెండుచేతులు అతన్ని గట్టిగా కౌగిలించుకొన్నాయి. "అనేనుం ముద్దయినా పెట్టుకోవా" అని అడుగుతోంది.

ఆమెదేహం ఆవదులుగొనులోనుంచి వన్నంగా వెచ్చగాతగులుతూంది. ఆ వపుఃపరిమళం మళ్ళీ మత్తెక్కిస్తూంది. ఆమె తుదిముద్దు, రుచి అల్లాగే నోటి మీద మిగిలిపోయినట్లుంది. జ్వరం, కన్నీరూ అన్నిటి రుచీ ఆ ముద్దులో నోటిని నింపేస్తూంది. అతని నీరసం గ్రహించి "ఒక్క రాత్రి ఆగు. ఒక్కటే..." అని పెదవుల నిట్టూరుస్తూంది. రైలు పట్టాలప్రక్కనే రెక్క వాలింది. రైలు వచ్చేస్తోంది.

ఆమె పట్టు విదల్చుకొని పరుగులెడుతూ స్టేషనుకువచ్చి రైలులో పడటానికి తనకి శక్తి ఎలా వచ్చిందో అతనికి ఏనాటికీ అర్థమే కాలేదు. వెనకకు పరుగెత్తుతూన్న చెట్లవెనుక దీపాలను చూస్తూ తమ యింటికేసి రైలు కిటికీలోంచి చూస్తూన్నాడు. ఆ గేటుదగ్గిరే తెల్లనిరూపం కనబడుతూంది. "సెలవు! సెలవు!" అంటూ పీడ్కోలు పల్కుతూన్న ఆమె మాటలు గట్టిగా వినబడుతున్నాయి. ఆమె పలుకు వినబడి, అక్కడే నిలబడి చెయ్యి వీస్తూన్న ఆమె రూపాన్ని చూస్తూ, ఆ వంపుదగ్గిర రైలుక్రిందబడి చచ్చిపోతుందేమోనన్న అంతరంగిక భయంనుంచి విముక్తుడై, నెమ్మదిగా నిట్టూర్చాడు.

కిటికీలోంచి తమ ఇల్లు వెనక్కి వెనక్కి పడిపోతూంటటం చూశాడు. చివరికి అక్కడి దీపం వెల్తురుమినుకుమినుకుమంటూ కనబడటంకూడామానేసి మటుమాయమై పోయింది.

పారిస్...ఒకబండీ పిలిచి ఎక్కాడు. డాక్టరుగారింటికి వెళ్దామనుకొని ఇంతిలో బట్టలవంక చూసుకొన్నాడు. ఒళ్లంతా బాడి కొట్టుకొని ఉంది. తన పూర్వజీవితం అంతా, ఆమె ఇందాక పట్టుకు వేళ్లాడటంతో, తనవంటినిపట్టుకొని వేళ్లాడుతూ చేఉంది. "ఉహూ! ఇప్పుడు కాదు" అనుకున్నాడు. సరాసరి సిజెర్ బాబాయి దిగినహోటలుకే వెళ్లాడు.



గ్రంథ విమర్శనము

ఆధునిక విజ్ఞాన వికాసము

శేషభట్ట విశ్వనాథం, ఎం. ఏ. ప్రకాశకులు: రాజా రామేశ్వరరావు బహదుర్, వనపర్తి సంస్థానము. వెల: 3 రూపాయలు.

తెలుగులో నేటికాలపు శాస్త్రీయ విజ్ఞాన స్వరూపం సులభ శైలిలో సర్వులకు వివరించే గ్రంథాలు చాలా తక్కువ.

ఇటీవల కొంతమంది గ్రంథకర్తలు, వ్యాసకర్తలు ఈ విషయంలో శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు గాని తెలుగులో సాంకేతిక పదజాలం స్థిరపడకపోవడంవల్ల ఈ ప్రయత్నం ఇంకా ఒక దారిలో పడలేదు.

శ్రీ శేషభట్ల విశ్వనాథంగారీ గ్రంథంలో చలనము, వేడి, మొదలైన శాస్త్రీయ ప్రాథమిక విషయాలు మొదలుకొని, కాంతితరంగవాదము, సాపేక్ష సిద్ధాంతము మొదలైన గహన విషయాలు కూడా సామాన్య పాఠకుల కందుబాటులో ఉండే సులభ గ్రాంథిక శైలిలో వివరించారు.

ఇంతేగాక నేటిదాకా ఇంకా వివాద ధూళి రేగగొడుతున్న 'జీవం యంత్రమా?' 'పరిణామ వాదము' మొదలైన జీవశాస్త్రవివాదాలు, విషయాలు కూడా సంగ్రహంగా వివరించారు.

ఆపైన సామాన్య పౌరులు నిత్యజీవితంలో వాడుకునే టెలిఫోను, గ్రామఫోను, విద్యుద్దీపము మొదలైన ఆధునికావిష్కరణల ప్రారంభ పరిణామ చరిత్రలు కూడా వివరిస్తూ వాటి స్వరూప, స్వభావాలు పాఠకులకు చక్కగా విశదపరిచారు.

వనపర్తి సంస్థానాధిపతులు రాజా రామేశ్వర రావు బహదూర్ గారు ఆధునిక విజ్ఞాన వికాస విషయంలో ఏర్పరిచిన పోటీ రచనలలో ఈ గ్రంథానికి ఉత్తమ బహుమతి లభించినదని 'తొలిపలుకు' వ్రాసిన వారు ఉల్లేఖించారు.

వనపర్తి సంస్థానాధిపతులు విజ్ఞానవికాసానికి చేసిన సేవ బహుధా ప్రశంసనీయమైనది. వారింకా ఇటువంటి ఉత్తమ విజ్ఞాన గ్రంథ రచనకు తగిన దోహదం కల్పించగలరని ఆశిస్తున్నాము.

రచయిత ఈ గ్రంథంలో వాడిన పారిభాషిక పదాలకు కొన్నిటికి మాత్రమే వాక్యాలమధ్య ఆంగ్ల పదాలిచ్చారు. అలాగ కాకుండా పారిభాషిక పదాలకన్నిటికీ కలిపి చివర ఒక విస్తృతమైన ఆంగ్లాంధ్ర పారిభాషిక పదపట్టిక ఇచ్చివుంటే ఈ గ్రంథం ఇంకా పాఠకోపయోగకారిగా ఉండేది.

అలాగే కేవలం భౌతిక రాసాయనిక జీవశాస్త్ర విషయాలే కాక ఇంకా ఇతర శాస్త్రీయ విషయాలు కూడా సంగ్రహంగా ఇచ్చివుంటే ఈ గ్రంథానికింకా సమగ్రత వచ్చివుండేది.

ప్రకాశకులీ విషయాలు గమనించగలరని ఆశిస్తున్నాము. చిన్నదైనా, ఆధునిక విజ్ఞాన వికాసం అవగాహన చేసుకోదలిచిన వారందరికీ ఇది అత్యావశ్యకమైన గ్రంథము.

వ్యామోహము
[నాటకం]

వేదం వెంకటరాయశాస్త్రి. ప్రతులకు: వేదం వెంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్. 4, మల్లికేశ్వర గుడిసందు, లింగిచెట్టి వీధి, జి. టి. మదరాసు. వెల: పన్నెండు అణాలు.

ఇది సాంఘిక నాటకం. ఇందులో కుటుంబరావు అనే యువకుడు చిన్నతనంలో వివాహం చేసుకున్న సుశీలఅనే విద్యాసంస్కారం లేనిదనే కారణం చేత ఈసడించి బాలికను విడిచిపెట్టివేస్తాడు.

ఆమె క్రమంగా పెద్దదై చదువుకుని మిస్ పారిజాతం అనే క్రొత్త పేరుతో తీసుకుని నవనాగరక యువతి వేషం వేసుకుని కుటుంబరావున్న చోటికి వెళ్ళి అతన్ని హృదయాక్రాంతుణ్ణి చేసి రిజిష్టరీ వివాహం చేసుకుంటుంది. కుటుంబరావుకి ఒక్కసారిగా ఈ పన్నాగం అంతా బోధపడిపోతుంది. తన తెలివితక్కువకి పశ్చాత్తాపపడి చివరికి ఆమెను స్వీకరించడానికి అంగీకరిస్తాడు. కనుక నాటకం సుఖాం

తంగా ముగిసిపోతుంది. సంగ్రహంగా ఇదీ దీనిలో కథ.

రూపక కథాపరిణతి కూడా పైన చెప్పిన విధంగానే నడిచిపోతుంది. కథ ఈవిధంగా నడిచిపోవడం వల్ల పాత్రలలో ముందేమి జరుగుతుందో అనే తహతహా ఉంటే ఉండవచ్చునుగాని, పాఠకులకు గాని ప్రేక్షకులకు గాని అటువంటి తహతహ కలగదు. అలాగ కాకుండా సుశీలా కుటుంబరావుల ప్రేమ పంతో ఈ రూపకం ప్రారంభమై చివరికి పోనుపోను, పూర్వకథ వెల్లడిఅయిఉంటే ఇది ఇంకా బాగా రక్తికట్టి పాఠకులకు, ప్రేక్షకులకు, ఇంకా ఎక్కువగా ఔత్సుక్యం కలిగించి ఉండేది.

నాటక రచయిత సంభాషణలు నడిపించడంలో చక్కని చాకచక్యం ప్రదర్శించారు. ఈ సంభాషణలలో అంతటా భాష చాలా జాతీయంగాను, చురుకుగాను సాగిపోతుంది.

మధ్యమధ్యన ప్రవేశపెట్టిన హాస్య సంఘటనలు నాటక గమనానికి అడ్డుతగలకుండా హుషారుగా సాగిపోతాయి.

శ్రీ వేదం వెంకటరాయ శాస్త్రిగారికి నాటక రచనలోనే గాక నాటక ప్రదర్శనవిషయాలలో కూడా చక్కని అనుభవం ఉన్నట్టీ నాటకం ఋజువు చేస్తున్నది.

పరిణతమైన ఈ అనుభూతి క్రమంగా వీరి ఉత్తమ నాటకరచనకు దోహదం కలిగించగలదని ఆశిస్తున్నాను.

అరుంధతీ వసిష్ఠము

బులుసు వేంకటేశ్వరులు

[పద్యకావ్యము]

ఇది అరుంధతీ జననము, అరుంధతీ వసిష్ఠుల వివాహము, గార్హస్థ్య ధర్మము వర్ణించే మూడాశ్వాసాల పద్యకావ్యము.

రచయిత ఈ కావ్యం ప్రథమాశ్వాసంలో అరుంధతీ జనకులైన దేవహూతికర్దముల చరిత్ర వారి సంతానోత్పత్తి, అరుంధతీ జననము మొదలైన విషయాలన్నీ విపులంగా వర్ణించారు. అలాగ కాకుండా అరుంధతీ వివాహంతోనే ఈ కావ్యం ప్రారంభించిఉంటే ఆమె పాతివ్రత్య వర్ణనానికీ, తద్వారా అరుంధతీ వసిష్ఠమనే ఈకావ్య నామధేయానికి ఇంకా ఎక్కువ ఔచితి వచ్చిఉండేది.

ఈకావ్యంలో యీ క్రొత్తపద్యరచన ఇతఃపూర్వ ఈ రచయిత రచించిన రచనలన్నిటికన్నా ఉదాత్తమార్గంలో పడింది.

భాషాసౌష్ఠవమేగాక కథావస్తువుకూడా వీరి కవనానికొక విధమైన ఉన్నతికి కారణమయింది.

తృతీయాశ్వాసంలో వసిష్ఠుడు అరుంధతితో శిష్యునిగూర్చి చెప్పిన ఈ సూక్తులు వీరికవితాస్ఫూర్తికి చక్కని తార్కాణాలుగా స్వీకరింపవచ్చును.

"ఇతడొక శిష్యరత్నము
మహీస్థలి నొంటి పదంబుపైని ని
ల్చితపము వేయియేండ్లొనర
జేసెను సాధ్వి! యితండు భస్మసా
త్కృతు నొనరించి మన్మథుని
నీశ్వరుబోలి మహోగ్రనిష్ఠ ను
ప్రతియయి వెల్గు వీనిగతివారలు
మత్ప్రియ శిష్యులో సఖీ!

నియతాహారులు నిర్జితేంద్రియులు
    నిర్నిద్ర ప్రమోదాన్వితుల్
ప్రియకాంతామణి శిష్యరత్నములు
    నిర్లిప్తుల్ భవత్సేవకుల్
ప్రియపుత్రాగ్రణులట్లు వారికి
    లసత్ ప్రీతిన్ సుమృష్టాన్న ష
ట్క్రియ దుష్టింబోనరించు మండుము
    జగద్విఖ్యాతి నొప్పారుచున్"

గే య మా ల

చాళ్లేటి నృసింహశర్మ, ఆంధ్రాధ్యాపకులు, హైస్కూలు సిద్దిపేట. వెల ఒక రూపాయి.

ఇది రచయిత అప్పుడప్పుడు రచించిన ఖండ గేయకృతుల సంపుటి.

నేటికాలంలో గేయకవిత విస్తారంగానే వస్తున్నది. అయితే ఈ గేయ కారకులలో చాలామంది ప్రసిద్ధులయిన ఇద్దరు ముగ్గురు గేయ రచయితల మార్గం అనుసరించే వారేగాని స్వతంత్ర ధోరణిలో గేయాలు రచించేవారు చాలా తక్కువగా ఉన్నారు.

ఈ గేయ రచయిత తీసుకున్న వస్తువులో అంతగా నూతన మార్గం కనబడదుగాని రచనా విధానంలో వీరుకొన్ని కొన్ని చోట్ల తమ స్వతంత్ర ప్రతిపత్తి స్థాపించుకున్నారు:

వీరి మాధురీ ప్రధానఫణితి. గేయరచనలో చివరి పాదాలలో పదకమార్చడంవల్ల వీరిగేయాలకు ఒక విధమైన నైతన్యంవచ్చింది. 'ప్రాబతుకు' అనే ఈ క్రిందిగేయ భాగం దీనికి తార్కాణంగా తీసుతోవచ్చును.

'తొలికోడి కూసింది
చలిగాలి వీచింది
తల రొత్తి చూచింది
    తెలివిగ్గు మలెమొగ్గ.
చలికింత గిలిగింత
లెవరు పెట్టిరో గాని
వెకిలిగా నవ్వింది
    మొకమెంతో విప్పింది.
తన రోచులను చూచి,
చనువారు కనువారు
ఎనగారు తన కంచు
    మురిసింది మెరిసింది.
మలయంపు వల్లి ను
య్యల లూగి చెలరేగి,
లలితమ్ము తొలకాడ
    ఊబ్బింది ప్రబ్బింది
చిగురాకు చెరగు జీ
రాడ చోళిక వీడ,
వికట లాస్యముతోడ
    కొవ్వింది నవ్వింది.
గంధంపు దూతికల
సందేశముల నొందు
మధుపమ్ములకు విందు
    లొసగింది పొసగింది'

అని యీ గీతం ఇలాగే చివరిదాకా ఆహ్లాదకరంగా సాగిపోతుంది.

ఇలాంటి రచనా చాతుర్యంగల గీతికలే గేయమాలలో ఇంకా చాలగైదుపట్ల కనిపిస్తాయి.

ఈ ఉదాహృత గేయంలో రచయిత 'లాలిత్యం' అనే భావార్థకపదం వాడడానికి బదులు 'లలితమ్ము' అనే విశేషణార్థక పదం వాడారు. అయితే ఇలాంటి వ్యాకరణ స్ఖాలిత్యాలీ కావ్యంలో చాలా స్వల్పంగా ఉన్నాయి.

శ్రీ చాళ్లేటి నృసింహశర్మగారి గేయమాల తెలుగు గేయకవితారీతులు అవగాహన చేసుకు నేవారందరు పరిశీలించవలసిన ఖండికృతి.

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press No 7, Thambu Chetty Street, Madras, Editor: S. Sambhu Prasad.